# ప్రస్థానం

ఏప్రిల్ - జూన్ 2003

సమగ్ర సాహిత్యపత్రిక

వెల: రూ.10




సాహితీ ప్రవంతి

ప్రస్థానం
ఏప్రిల్-జూన్ 2003
సమగ్ర సాహిత్యపత్రిక
సంపుటి :1 సంచిక : 3

# మూడో సంచికతో మున్ముందుకు...

ఇది మూడో సంచిక. మామూలుగా అయితే ముచ్చటైన అని అంటుంటారు. కాని ముంచుకొచ్చిన సామ్రాజ్య వాద ప్రమాదం ముందు అలాటి అభివర్ణనకు ఆస్కారమే లేదు. ఆ ముప్పును తిప్పికొట్టడానికి సంధించిన అక్షరాయుధాలతో రూపొందిన సంచిక ఇది. మీడియా విస్తరించిన నేటి కాలంలో అన్ని వివరాలు, విశ్లేషణలు ఆలస్యంగా పొందుపరచడం కన్నా పెల్లుబికిన సామ్రాజ్య వాద వ్యతిరేక స్ఫూర్తిని ప్రతిబింబించడమే ముఖ్యమని భావించాము.

అమెరికా నుంచి ఆంధ్రప్రదేశ్‌లో పట్టణాల వరకూ కవితాగోష్టుల్లో వినిపించిన వాటిని మొత్తంగా ఇవ్వడం ఆచరణ సాధ్యం కాక కొన్ని చరణాలకే పరిమితం కావలసి వచ్చింది. ఒక విధంగా ఇది ప్రయోగమే. గత్యంతరం లేక చేపట్టిన ఈ పద్ధతిని సాహితీ మిత్రులు, పాఠకులు అర్థం చేసుకోగలరని మా నమ్మకం. ఇప్పటికీ అన్ని చోట్ల నుంచి వచ్చిన కవితలన్ని పొందుపరచడం సాధ్యం కాలేదు. మిగిలినవి కూడా భవిష్యత్తులో ఏదో మేరకు అందించేందుకు కృషి చేయగలమని మనవి.

ప్రస్థానం రెండవ సంచికకు కూడా మంచి ఆదరణ లభించింది. యుద్ధ వ్యతిరేక సందర్భం వల్ల ఇతరత్రా ఇవ్వాలనుకున్న కొన్ని అంశాలకు దీనిలో చోటు దొరకలేదు. లోగడ కథలు తగినన్ని రావడం లేదనే విమర్శను అధిగమించేందుకు ఈ సారి కొంత కృషి జరిగింది.కవితలు లెక్కకు మిక్కిలిగా వస్తున్నాయి. వీటిని సంక్షిప్తం చేయడం, ఎప్పటికప్పుడు కొందరైనా కొత్తవారికి అవకాశం ఇవ్వడం లాటి కొన్ని పద్ధతులను ముందు ముందు అనుసరించవలసి రావచ్చు. అయితే వ్యక్తిగత అనుభవాలు, అభిప్రాయాలు పంపడానికి సంబంధించి జరగాల్సింది చాలా వుంది. ప్రకటించిన శీర్షికలు బాగున్నాయని అందరూ మెచ్చుకున్నప్పటికీ వాటికి రాసి పంపడం లేదు. కొత్త-పాత, సీనియర్లు-జూనియర్లు తేడా లేకుండా ఈ అంశాలు ఎవరైనా రాయవచ్చు, రాయాలి కూడా. పాతదైనా తాజాదైనా సాహిత్య పఠనంలో అనుభవాలు, అభిప్రాయాలు, పాఠకుల ఆకాంక్షల గురించిన సమాచారం అందితేనే రచయితలు కవులు తమను తాము పరిశీలించుకోవడానికి, మెరుగుపరుచుకోవడానికి వీలు కలుగుతుంది.అలాటి ప్రజాస్వామిక చర్చ ప్రస్థానం ప్రాథమిక లక్ష్యాలలో ఒకటి. ఈ సంచికల్లో వచ్చే కథలు,కవితలు, వ్యాసాలతో సహా సాహిత్యానికి సంబంధించిన ఏ అంశంపైనైనా సవిమర్శకంగా రాయాలని పాఠకులను ఆహ్వానిస్తున్నాం.

ఈ సారి ప్రస్థానంలో సాహిత్య రంగ కార్యకలాపాల రేఖా చిత్రణ వుంది. పరస్పర అవగాహనకు ,పరిస్థితి తెలియడానికి ఈ విధమైన సమాచారం చాలా అవసరం.మీ ప్రాంతాల్లో జరిగే సాహిత్య కార్యక్రమాల విశేషాలు కూడా ఇదే విధంగా పంపించాలని కోరుతున్నాం.

ఈ సాహిత్య ప్రస్థానం ముందుకు సాగడానికి సదా మీ తోడ్పాటును అభ్యర్థిస్తున్నాం.

---

ముఖ చిత్రం : **అక్బర్**

లోపలి చిత్రాలు : **మోహన్, అక్బర్, చంద్ర, శ్రీరామ్, శివాజీ**

*సాహితీ స్రవంతి ప్రచురణ*

## ఈ సంచికలో...

అభినందనలు-అభిప్రాయాలు .......... 2
మీ ప్రస్థానం కోసం మీరేం చేయవచ్చు? .......... 3
దృక్పథం .......... 4
కవిత .......... 6
యుద్ధ కవితలు .......... 7
సారీజాఫర్ (కథ) ......... 12
మట్టిచేతులు (కవిత) ......... 18
కులాధిక్యతను తోసిపుచ్చిన
అన్నమయ్య ......... 19
కవిత ........ 22
సమాంతర సమీక్ష ........ 23
నా పరిశోధన ........ 28
యుద్ధం ఒక వాస్తవం (కవిత) ......... 31
పొడి నిజం (కథ) ........ 32
రిషా అలీ..నాగలక్ష్మి (కవిత) ........ 35
హోవార్డ్ ఫాస్ట్‌కు నివాళి ........ 36
సామాన్యుడి దిశగా సాంఘిక నాటకం ........ 38
వీళ్ళను కలిపిన వాళ్ళకి కోటిదండాలు ........ 39
విషధారలు (కవిత) ........ 40
ఖమ్మంజిల్లా సాహితీ స్రవంతి
4వ వార్షికోత్సవం ........ 40
నాలుగో సింహం (కథ) ......... 41
వసం(తాం)తం,
అక్షరమా-క్షమించు (కవిత) ........ 44
చేరా అభినందన ........ 45
నైట్‌మేర్ (కథ) ........ 46
జలపద్మవ్యూహం (కవిత) ........ 49
హైకూలు ........ 49
ఫెంగ్ సుఫెంగ్ నీతి కథలు ........ 50
కవిత ........ 52
సమీక్షాపర్వం ........ 53
సెల్సియస్ (కవిత) ........ 58
విధ్వంసం (కథ) ........ 60
డైరీ ........ 63

సంపాదకుడు
**తెలకపల్లి రవి**
ముద్రాపకులు, ప్రచురణకర్త
**వి. కృష్ణయ్య**
మేనేజర్
**కె. లక్ష్మయ్య**

అడ్రస్ : **ప్రస్థానం**
**1-1-187/1/2,**
**వివేక్‌నగర్, చిక్కడపల్లి,**
**హైదరాబాద్-500 020**
**ఫోన్లు : 27660013, 27635136**

# అభి నందనలు / ప్రాయాలు



మీరందించిన "ప్రస్థానం" రెండు సంచికలూ చదివాను. సంతోషం. మీ పత్రిక ప్రగతిశీల సాహిత్యానికి సమర్థవేదిక. పరిశోధనలకు ఉపకరించే వ్యాసాలున్నాయి. సగటు పాఠకులకు ఆసక్తిని రేకెత్తించే ఇతర రచనలూ ఉన్నాయి. సాహిత్యానికి సంబంధించిన అనేక ప్రక్రియలకు మీరు సముచిత స్థానం కలిగించారు. "ప్రస్థానం" చదివి పక్కన పెట్టేసే పత్రిక కాదు. విలువైన పుస్తకాలతోపాటు పదిలపరుచుకునే పత్రిక. చక్కని త్రైమాస పత్రిక వెలువరిస్తున్నందుకు మీకు నా అభినందనలు.

**– డాక్టర్ సి. నారాయణరెడ్డి, అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి.**

మంచి పత్రికలు తక్కువే అనుకుంటున్న సమయంలో సాహిత్య సంచికగా ప్రస్థానం రావడం గొప్ప ఆనందాన్ని కలిగించింది. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ప్రస్థానం పాఠక లోకానికి సమర్పిస్తున్న మీకు అభినందనలు

**– గంటేటి గౌరునాయుడు, రచయిత, కురుపాం, శ్రీకాకుళం**

ప్రస్థానం రెండో సంచిక చూశాను. చాలా రిచ్‌గా తీసుకొచ్చారు. "తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శ" లోతుల్లోకి వెళ్ళిరాసిన వ్యాసం. రచయిత యాకూబ్‌కు నా అభినందనలు. 'పరిశీలన' ఒక మంచి శీర్షిక. దాన్ని కొనసాగించండి.

**–నిర్మలానంద, వర్కింగ్ ఎడిటర్, ప్రజాసాహితి**

"ప్రస్థానం" సంచిక చదివాను. అడుగడుగునా శ్రద్ధ కనిపించింది. శీర్షికలు అన్నీ బాగున్నాయి. కథల సంఖ్య ఇంకా పెంచగలరు.

**–బి.వి.ఎన్. స్వామి, కరీంనగర్**

'

ప్రస్థానం' జనవరి–మార్చి సంచిక చూశాం. బాగుంది. వివిధ దేశాల్లోని సాహిత్యాన్ని పరిచయం చేస్తే బాగుంటుంది. అలాగే భారతీయ భాషల్లోని ప్రముఖుల జీవిత విశేషాలను పరిచయం చేయండి. ప్రస్తుతం చాలా చాలా తక్కువ సంఖ్యలో వున్న తెలుగు సాహిత్య పత్రికల్లో 'ప్రస్థానం' పెద్ద ఖాళీని పూర్తి చేయగలదని ఆశిస్తున్నాం. జిల్లా కేంద్రాల్లో 'పత్రిక' దొరికే ఏర్పాట్లు చేయగలరు.

**–ఎనిశెట్టి శంకర్, తుర్లపాటి లక్ష్మి, ద్వారకానగర్, నిజామాబాద్**

ఈ మధ్యనే 11.4.2003న "అరసం" సభలను వీక్షించాను. అప్పుడే "ప్రస్థానం" చదివాను. "సమగ్ర సాహిత్య పత్రిక" లభించే సరికి చాలా ఆనందించాను. తరువాత మిగిలిన రెండు ప్రస్థానాలు (అనగా ప్రస్థానం అక్టోబర్–డిసెంబర్, ప్రస్థానం మే 2002), గమనం, దర్పణం సేకరించి చదివాను. సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ ఉంటే ఏదో ఒక విధమైన అనుభూతికి లోనయ్యాను. ఆ అనుభూతి అనిర్వచనీయం.

**–అనిల్‌రెడ్డి, నారాయణగూడ, హైదరాబాద్**

'ప్రస్థానం' రెండవ సంచిక ఒక మిత్రుని దగ్గర ఆసాంతం చదివేశాను. మొదటి సంచిక చూడలేదనే మీమాంస నన్ను పట్టి పీడిస్తుంది. చాలా రోజులకు ఒక మంచి సాహిత్య పత్రిక మా ముందుకు వచ్చింది. చక్కగా తయారు చేసి మా ముందుకు తీసుకొస్తున్నందుకు వందనాలు.

కథలు తక్కువ, కవితలు ఎక్కువ వేస్తున్నారని ఒక పాఠకుడు అభిప్రాయపడ్డారు. అది తప్పు. ఒక కథ ప్రచురణ పేజీలకు 5, 6 కవితలు ప్రచురించవచ్చును. 'సమీక్షా పర్వం'లో ఒక వైపు పుస్తకాలు ముద్రిస్తున్నారు. మిగతా ఖాళీలో నానీలు, హైకూలు, మినీ కవితలు అక్కడ ప్రచురిస్తే ఎంతో బాగుంటుంది. మరిన్ని నూతన శీర్షికలతో మాసపత్రికగా వస్తే ఇంకా ఆనందంగా వుంటుంది.

**–గాదిరాజు రంగరాజు, చెరుకువాడ**

మీ కృషి అభినందనీయం. ఈ మధ్యకాలంలో సాహితీ ప్రపంచంలో కొంగొత్త పోకడలు వస్తున్నాయి. ఎన్నో గమనించదగిన పరిణామాలు కలుగుతున్నాయి. జనవరి–మార్చి ప్రస్థానం కొని చదివి చదివిస్తున్నాను. ఎన్నో ఎన్నో ఉపయోగ ఉపయుక్త విజ్ఞాన, సమీక్ష వ్యాసాలేగాక కవితలు కథలున్నాయి. ఈ మధ్య కాలంలో వచ్చిన సాహితీ పత్రికలలో అగ్రగామిగా కావాలని బీడు వారి పోతున్న సాహిత్య ప్రపంచంలో పది కాలాలపాటు సాహితీ స్రవంతి కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాను.

**–కొలనుపాక మురళీధరరావు, అడ్వకేట్, నల్గొండ**

ప్రస్థానం ఇప్పుడే ఒక మిత్రుడి ద్వారా చూశాను. ఎంతో బాగుంది. నాకెంతో నచ్చింది. అప్పటి భారతి స్థాయిని వుంది. మీ నేతృత్వంలో ప్రస్థానం నిరంతర ప్రస్థానం చేయాలని నా కోరిక.

**–కన్నెకంటి, దాచేపల్లి**

## ఒక వివరణ

'సమీక్షకూ సంకెళ్ళున్నాయి!' పేరుతో డా॥ నాళేశ్వరం శంకరం రాసిన పరిచయ వ్యాసం (ప్రస్థానం, జనవరి–మార్చి 2003) చదివాను. కాళోజీ 'నా గొడవ'పై వార్తలో నేను రాసిన సమీక్షను కూడా ఆయన ఈ వ్యాసంలో ప్రస్తావించారు. ఆ దయకు కృతజ్ఞుణ్ణి. కాని ఆయన రాసిన రెండు వాక్యాల గురించి మాత్రం నా వివరణ ఇవ్వకపోతే పాఠకులు పొరబడే అవకాశం ఉంది గనుక ఈ జాబు.

"పొరపాటు పడిన ఒకటి రెండు అంశాలన్నా ఉటంకిస్తే పాఠకుడు మరింతగా అర్థం చేసుకోవడానికి వీలేర్పడేది. తిరుపతి రావులో పొరపాటు యేముందో మరో మారు చదువుకోవాలి" అని శంకరం రాశారు.

వార్తలో నా సమీక్ష మరోసారి చదివితే, కాళోజీ కవిత్వంలో కవిత్వానికి ప్రాణమైన భావుకత చాలా స్వల్పమని తిరుపతిరావు అన్న మాటనూ, కాళోజీకీ కవిత్వానికీ ఏనాడూ సంబంధంలేదని రాచమల్లు రామచంద్రారెడ్డి అన్నమాటనూ నేను ఉటంకించానని శంకరం అర్థం చేసుకోవడానికి వీలేర్పడేది. తిరుపతిరావులో పొరపాటు లేదని అనుకోవడానికి శంకరంకు అన్ని హక్కులూ ఉన్నాయి. నేనన్నదల్లా "ముందుమాట రాస్తున్న పుస్తకంలోని కవిత్వాన్ని" ఆయన "అర్థం చేసుకోలేక" పోయాడని మాత్రమే.

అయినా రాస్తున్నది ఒక్క పేజీ మించని సమీక్ష గనుక, ఆ పొరపాట్లను "సోపపత్తికంగా ఖండించవలసిన అవసరం" ఉందని గుర్తిస్తూనే "ఈ సమీక్ష అంతవివరంగా సాగడం సాధ్యం కాదు" అని కూడా రాశాను.

**–ఎన్. వేణుగోపాల్, హైదరాబాద్.**

## అభి నందనలు ప్రాయాలు

మీరు తెస్తున్న సమగ్ర సాహిత్య సంచికలు రెండు కొని చదివాను. చాలా నచ్చాయి.

ముఖ్యంగా జనవరి–మార్చి 2003 సంచిక చదివి ఈ ఉత్తరం వ్రాయకుండా వుండలేకపోతున్నాను. జ్వాలాముఖిగారి ఇంటర్వ్యూ గురించి. నేను సాహిత్యాన్ని సీరియస్‌గా చదివే పాఠకురాలిగా, స్త్రీగా స్పందించి రాస్తున్నాను. జ్వాలాముఖిగారు, "నీలి కవితలు అని అప్పట్లో నేను చేసిన వాదనలు రుజువయ్యాయి – అలాంటి విమర్శలు నిజానికి ఆ వాదనలు పుట్టిన చోట వచ్చిన వాటినే నేను వుటంకించాను తప్ప కొత్తగా కనిపెట్టలేదు" అన్నారు.

ఆ వాదనలు నిజం అని ఎట్లా ఎవరు రుజువు చేశారో తెలుసుకోవాలని వుంది. బాధ్యతగల రచయితగా విమర్శకుడుగా జ్వాలాముఖిగారే చెప్పాలి. ఆయన రుజువు చేశారా లేక ఇంకెవరైనా రుజువు చేశారా? ఆ రుజువుని సకల సాహితీ ప్రపంచం అంగీకరించిందా అని. అంతేకాదు. జ్వాలాముఖిగారు అమెరికా వంటి దేశాలు స్వచ్ఛంద సంస్థలకి నిధులిచ్చి క్రింద జాతుల్నీ, స్త్రీలనీ రెచ్చగొట్టగా స్త్రీవాదం లాంటి వికృత వాదం పుట్టిందన్నారు. స్త్రీవాదానికొక చరిత్ర వుంది. రెండు శతాబ్దాల చరిత్ర స్త్రీలు కూడా మానవులేనని – మానవ హక్కులంటే స్త్రీల హక్కులు కూడానని మాట్లాడిన స్త్రీలకి ఏ స్వచ్ఛంద సంస్థలూ నిధులివ్వలేదే? ఓటు కోసం జైళ్ళకి వెళ్ళిన స్త్రీలకి కూడా ఎవరూ నిధులివ్వలేదు.

స్త్రీని వస్తువుగా, సేవికగా, భోగ్యంగా చూసే సంస్కృతి వున్నంత కాలం, కులం పేరుతో అవమానించడం, అణిచిపెట్టడం వున్నంత కాలం, ఎవరూ ఎవర్నీ రెచ్చగొట్టక్కర్లేదు. ఎవరి అంతరాత్మ వారిని రెచ్చగొడుతుంది. ఆత్మ గౌరవ వాదాలని వికృతవాదాలంటే ఆ సంస్కారాన్ని ఏమనాలి? దిగంబర కవులు వాడిన భాషని ఏ రకంగా అర్థం చేసుకోవాలి? పీడితులు ఐక్యం కావాలంటే ముందు పితృస్వామ్య భావజాలం, కుల, వర్ణ అసమానతలు తొలగిపోవాలి – అన్ని అసమానతలున్న సమాజంలో నిచ్చెన మెట్ల సంస్కృతిలో ముందు ఆలోచించవలసింది ఏమిటి? సామ్రాజ్యవాదానికి ఎవరికి వారే బాధితులని వారి రచనలే తెలుపుతున్నాయి – ఆర్థిక శాస్త్రాన్ని – సాహిత్యాన్ని కూడా ప్రభావితం చేస్తున్న స్త్రీవాదాన్ని వికృత వాదం అనడం కూడా రుజువు అయిందంటారా? జ్వాలాముఖిగారూ చెప్పండి.

**-సి.హెచ్. అనూరాధ, విజయవాడ**

అసలే సాహిత్య పత్రికలు కనిపించకుండా పోతున్న ఈ రోజుల్లో 'ప్రస్థానం' పత్రికను సమగ్రంగా సాహిత్యానికే పరిమితం చేస్తూ వెలువరించడం అభినందించ తగిన విషయం. 'ప్రగతిశీల రచనలతో' ప్రారంభ సంచికని అర్థవంతంగానూ మరెంతో సమర్థవంతంగానూ తీర్చిదిద్దిన మీకు సారధ్య నిపుణులకు ప్రత్యేక అభినందనలు 'అరసం, విరసం, ప్రస్తుతం' సాహిత్య పత్రికలు భావవ్యాప్తి వ్యాసాలు, దేశభక్తి (టుమ్రీ), కాగుబొత్త కథ, కవితలు ఆలోచింపచేసేవిగా ఉన్నాయి.

**– సంపతి బాల్‌రెడ్డి, టీచర్, ముస్తాబాద**

"ప్రస్థానం" రెండు సంచికలూ చాలా బాగున్నాయి. తెలుగు నాట "భారతి" సాహిత్య పత్రిక సాహిత్యరంగంలో చేసిన కృషి మర్చిపోలేనిది. భారతి అంతర్థానమైనాక మళ్ళీ అలాంటి సాహిత్య పత్రిక రాలేదు. ఆ బాటలో కొన్ని పత్రికలు కృషి చేసినా పూర్తి కాలం మనలేదు "సాహిత్య" పత్రికలు కావడంవల్లనే.

ప్రస్థానం పత్రికను, మీ సంపాదకత్వంలో చూశాక మళ్ళీ భారతి బతికొచ్చినంత ఆనందం కల్గింది. కవితలు, వ్యాసాలు, సమీక్షలు, ఇతర సమాచారం సాహితీ ప్రియులకు మృష్టాన్న భోజనంలా వుంది.

**– వసుధ, ఏలమ్రు.**



**2003 మార్చి 21న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ప్రముఖ రచయిత బోయ జంగయ్యకు డి.లిట్ గౌరవ పురస్కారం అందిస్తున్న గవర్నర్ సూర్జిత్‌సింగ్ బర్నాలా**

**(రచయితలు, సాహిత్యకారులు తమకు సంబంధించిన ప్రముఖ ఘట్టాలు, ముఖ్యమైన ఫొటోలు పంపితే పరిశీలించి ప్రచురించగలం)**

## మీ 'ప్రస్థానం' కోసం మీరేం చేయవచ్చు?

చాలా మంది సాహితీ మిత్రులు శ్రేయోభిలాషులు "ప్రస్థానం" ను అభినందిస్తున్నారు. అందులో పాటిస్తున్న ప్రమాణాలను, అందిస్తున్న రచనలను హర్షిస్తున్నారు. అదే సమయంలో దాని పురోగమనానికి తమ వంతు సహకారం అందించగలమని కూడా భరోసా ఇస్తున్నారు. ఇదెంతైనా సంతోషించవలసిన విషయం. నిజంగానే ప్రస్థానం నిర్వహణాపరంగా మీ నుంచి అనేక విధాల సహకారం కోరుతున్నది.

- మీ పట్టణంలో, సంస్థలో సాహితీ మిత్రులందరికీ ప్రస్థానం అందేలా చూడడం. ధర అందుబాటులో వుంది గనక కాపీలు తెప్పించుకొని స్వచ్ఛందంగా దాన్ని పంపిణీ బాధ్యత స్వీకరించడం.
- మీరు గాని, మీ మిత్రులు గాని ప్రచురించిన పుస్తకాల తాలూకూ అడ్వర్టయిజ్‌మెంట్ ఇవ్వవచ్చు. రు.300 నామమాత్రపు ధరకు మీ పుస్తకం కవర్; మీ ఫోటో ప్రచురించవచ్చు. ఎక్కువ పుస్తకాలు వేసిన వారు అర పేజి, ఫుల్ పేజి కూడా కన్సెషన్ రేటుపై అడ్వర్టయిజ్ చేసుకోవచ్చు. ఇది మీ ప్రచారం కోసమే గాక సాహిత్య పత్రిక ప్రయోజనానికి కూడా సహాయపడుతుంది.
- మీ వ్యక్తిగత వ్యాపార సంస్థలు లేదా విద్యా సంస్థలు , శాఖల ద్వారా అడ్వర్టయిజ్‌మెంట్లు లభించడానికి తోడ్పడవచ్చు. రాష్ట్రం నలుమూలలకూ వెళ్లడమే కాక ప్రవాసాంధ్రులు కూడా చూస్తున్న ప్రస్థానం అడ్వర్టయిజర్లకు మంచి ప్రచార సాధనం. సాహితీ మిత్రులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి పత్రిక ఆర్థిక పుష్టికి తోడ్పడాలని విజ్ఞప్తి.

# దృక్పథం

తెలకపల్లి రవి

## F ప్రత్యక్షం.ప్రత్యక్షరం..

## F కవితలు...కవి సమ్మేళనాలు...

సామ్రాజ్యవాదానికి ఫాసిజానికి వ్యతిరేకంగా సాహిత్య రంగంలో ఐక్యసంఘటన నిర్మించే విషయం తరచూ ప్రస్తావనకు వస్తోంది.ఇటీవల హైదరాబాదులో అరసం జాతీయ మహాసభల ప్రసంగాలలోనూ ఆ మాట వినవచ్చింది.తర్వాత "ఆంధ్ర జ్యోతి" ఈ రచయితతో సహా పలువురి అభిప్రాయాలు సేకరించి "కోటి విభేదాలు– కోరస్ పాడగలరా?" అనే శీర్షికన ప్రచురించింది. అభిప్రాయాలు వెల్లడించిన వారిలో విరసం ఐక్య సంఘటన కోసం పట్టు విడుపులకు తాము సిద్దంగా వున్నట్టు చెప్పింది.అరసం అందుకు చొరవ తీసుకోగలమని ప్రకటించింది. జనసాహితి అంగీకృత అంశాలపై స్పష్టత అవసరాన్ని నొక్కి చెప్పింది. ఇక జయధీర్ తిరుమల రావు విరసంకు అరసంకు మధ్య గతంలో వున్న సమస్యలను ప్రత్యేకంగా పేర్కొన్నారు.

వాస్తవానికి గత ఒకటి రెండు సంవత్సరాలలోనూ వివిధ ప్రగతిశీల స్రవంతులు కలసి కార్యక్రమాలు నిర్వహించడం బాగా పెరిగింది.ఒక దశలో క్షుద్ర సాహిత్యం , వ్యాపార ధోరణులు పెరిగి సామాజిక స్పృహ అనే భావననే అపహాస్యం చేసే స్థితి వచ్చింది. మలి దశలో విభిన్న అస్తిత్వ వాదనల మధ్య విశాల ఐక్య కృషి మరుగున పడి పోయింది.అరసం, విరసం ప్రస్తుతం. (ప్రస్థానం అక్టోబర్–డిసెంబర్) అనే వ్యాసంలో హరి పురుషోత్తమ రావు ఈ పరిణామక్రమాన్ని విశ్లేషించారు. "సాహిత్యసంఘాలు– ధోరణులు" సంకలనంలో కూడా ఇందుకు సంబంధించిన చారిత్రిక పత్రాలు లభిస్తాయి.

ఈ నేపధ్యంలోనే ప్రపంచీకరణ, మతోన్మాదం, టెర్రరిజంలను వ్యతిరేకించే సాహిత్య కారుల ఐక్యకృషికి సాహితీ స్రవంతి చొరవ తీసుకుంది. 2002లో జరిగిన జనకవనం ఈ దిశలో ఒక ముందడుగు అని అందరూ అభినందించారు. ఆ సభలో అన్ని అభిప్రాయాలు గల వారూ పాల్గొన్నారు.తర్వాత కాలంలో గుజరాత్‌గాయం కూడా ఒక విశాల ప్రాతిపదికన జరిగింది. తిరిగి ఇటీవల ఆసియా సోషల్ ఫోరం సభల సందర్భంలోనూ సాహిత్యకార్యక్రమం జరిగింది. అరసం, సాహితీ స్రవంతి, జన సాహితి వంటివి పాలుపంచుకున్న ఫోరం సభలను విరసం తీవ్రంగా వ్యతిరేకించింది. ఇరాక్‌పై అమెరికా దాడికి వ్యతిరేకంగానూ సాహిత్య సాంస్కృతిక సంఘాల అధ్వర్యంలో ప్రత్యేకంగా మరో కార్యక్రమం జరిగింది. ఐక్య సంఘటనపై ప్రస్తుత చర్చకు పూర్వరంగమిది.

ఏమైనా రాజకీయాలలో ఐక్యసంఘటనలను,సాహిత్య రంగంలో ఐక్యకృషిని ఒకే విధంగా చూడలేము. గతంలోని అనుభవాలను, ఆయా సంఘాల వైఖరులను పరిగణనలోకి తీసుకోకుండా సార్వత్రిక సంఘటన నిర్మించడమూ సాధ్యం కాదు. సాహిత్యానికి రాజకీయాలకు గల సంబంధం శాస్త్రీయ దృక్పధం గలవారు క్షణమైనా విస్మరించరు. కాని సాహిత్యం నిర్వహించవలసిన కర్తవ్యాల తీరు తెన్నులు వేరు. కేవలం రాజకీయ అవసరాల కోసం సాహిత్యరంగాన్ని వేదికగా చేసుకోవాలనుకోవడం వాంఛనీయం కాదు.అది ఆ రంగంలో నెరవేరవలసిన విశాల కర్తవ్యాలకు విఘాతం కూడా కావచ్చు. ఈ రెండు రంగాల పరస్పర సంబంధాన్ని సవ్యంగా అర్థం చేసుకోలేక పోయిన అనేక సాహిత్య సంస్థలు తర్వాత తమను తాము విమర్శించుకోకతప్పలేదు. ఎవరైనా కొన్ని ప్రత్యేక పరిస్థితులలో రాజకీయ అవసరాలకు వేదికగా సాహిత్య రంగాన్ని వాడుకోవాలని అనుకోవచ్చు. అయితే అవసరాల కోసం ఆశించే అలాటి ఐక్యతను చారిత్రిక ఆవశ్యకతగా చిత్రించడం చెల్లుబాటు కాదు.మతోన్మాదం, సామ్రాజ్యవాదం రెండింటిని ఖండించడంలో గాని, పోటా వంటి నిరంకుశ చట్టాలను నిరసించడంలో గాని ఎవరైనా కలసి పోరాడవచ్చు.కాని ప్రజాస్వామ్య ఉద్యమాలను విచ్ఛిన్నం చేసి, దోపిడివర్గాలకు, సామ్రాజ్యవాదులకు సాకులు సమకూర్చే టెర్రరిజాన్ని,నిరసించవలసిన బాధ్యతను కూడా ప్రజాస్వామికచైతన్యం గల రచయితలు గుర్తిస్తున్నారు. సాహిత్యంలో ఐక్య కృషికి ఈ సముచిత ప్రాతిపదిక లేకపోతే అదిఎవరో కొందరి తాత్కాలిక అవసరాలకు ఉపయోగించే పాచిక అవుతుంది.సహజంగానే ఆలోచనా పరులు అందుకు అంగీకరించలేరు.

సాహిత్య రంగం రాజకీయ కర్తవ్యాలకు ఎలా దోహదపడాలనేది అంతకంటే కీలకమైన సమస్య. ఇంతకు ముందు చెప్పినట్టు సాహిత్యరంగం సృజనాత్మకంగా రాజకీయచైతన్యం పెంచడానికి దోహదపడాలి. వ్యక్తిగతంగానూ రచయితలు తమ చైతన్యాన్ని బట్టి ప్రత్యక్ష పాత్ర పోషించవచ్చు. ఏదైనా ప్రత్యేక సందర్భంలో మిగిలిన ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నా ప్రధానంగా సాహిత్య కారులు, కళాకారుల కర్తవ్యం సృజనశీలంగా వుంటుంది. తమ రచనలతో అత్యధికులను ప్రభావితం చేయాలి,ప్రేరేపించాలి. ప్రతిభావంతులైన తోటి రచయితలను, మేధావులను ఆలోచింపచేసి, ఆశయాలవైపు ఆకర్షించాలి. ఎవరి రాజకీయాలేమైనప్పటికి ఈ విధమైన విశాల దృష్టి వుండకపోతే – వామపక్ష భావాలు గల వారినే గమనంలో వుంచుకుని అంతా వాళ్లతోనే అయిపోతుందనుకుంటే పొరబాటు. భారీ

ప్రణాళికలతో సంఘటనలు ఏర్పాటు చేసుకుని అంతకంటే వేగంగా విడిపోయే కంటే విశాల ప్రాతిపదికగల వేదికలనుంచి పని చేయడం మంచిది. ప్రతి సందర్భంలో సంఘాల జాబితా పెట్టుకుని దామాషా ప్రాతినిధ్యంలా వ్యవహరించే కంటే ఆయా రచయితలు,కవులకు భాగస్వామ్యం కల్పించవచ్చు. సంఘాలకు ప్రాతినిధ్యం అనేదే కొలబద్ద అయితే అప్పుడు ఎవరికీ అనుబంధం కాని వ్యక్తులకు పాల్గొనే అవకాశమే వుండకపోవచ్చు. దేశంలో వామపక్ష ప్రగతిశీల భావాలు ఎంతగానో విస్తరించవలసిన అవసరం వుండగా ఒక తరహా సంఘాలనే దృష్టిలో పెట్టుకుంటామంటే మిగిలిన వారు ఏమయ్యేట్టు? అరసం సభల్లో వరవరరావు సూచించినట్లు కమ్యూనిస్టులే ఐక్య సంఘటనలు జయప్రదం చేయగలరనుకున్నా అందుకు మార్గం వారిలో వారు ఐక్యం కావటమా? లేక దూరంగా వున్న వారిని కూడా చేరువ చేసుకోగల పరిభాష, పద్ధతి అనుసరించడమా? ఇవన్నీ ప్రశ్నలు.

1930 ల నాటి ఫాసిస్టు వ్యతిరేక సంఘటన అనుభవాలను యధాతథంగా అనువర్తింప చేస్తే నేడు అటు సామ్రాజ్యవాదం ఇటు దేశీయంగా కాషాయపు నీలినీడలు దట్టంగా పరుచుకున్న పరిస్థితిని ఎదుర్కోగలమా? ప్రపంచ శాంతికి పెట్టని కోటగా సోషలిస్టు సోవియట్ యూనియన్ నిలబడిన స్థితి నాటిదైతే ఏకధ్రువ ప్రపంచంగా అమెరికన్ సామ్రాజ్యవాదం చెలరేగిపోతున్న స్థితి ఈనాడుంది. నవ స్వతంత్ర దేశాలు అంతకంతకూ నిలదొక్కుకుంటూ ప్రగతిశీల శక్తులవైపు నడచిన స్థితి నాడుంటే సామ్రాజ్యవాద పద ఘట్టనలో నలిగిపోతున్న దురవస్థ నేడుంది.నాటి ఫాసిస్టు వ్యతిరేక సంఘటన నుంచి స్ఫూర్తి పొందడం వేరు. ఈ ప్రధాన వ్యత్యాసాలను గమనించకుండా దాన్నే మక్కీకి మక్కీగా అనుసరిస్తామనడం వేరు. పట్టువిడుపులు ఏ ప్రజా రంగానికైనా వుండాల్సిందే. అయితే అవి చారిత్రిక అవసరాలకు అనుగుణంగా వుండాలే గాని స్వీయావసరాల ప్రకారం కాదు.

నేటి సంక్లిష్ట పరిస్థితులలో సాహిత్యకారులపై వున్న కర్తవ్యం ప్రత్యక్ష కార్యాచరణకు మించిన ప్రత్యక్షర కార్యాచరణ. సాంస్కృతిక కాలుష్యం పెరుగుతున్న దృష్ట్యా అది మరింత కీలకావసరమవుతుంది. ఇవన్నీ గుర్తించకుండా పరిమిత. రాజకీయపరిభాషతో పిలుపులిచ్చినా సాధించేది వుండదు, సార్థకతా వుండదు.

D D D

"అన్నా, జనకవనం తర్వాతే ఇలాటి కార్యక్రమాలకు మంచి వాతావరణం వచ్చింది" అన్నారు గద్దర్, ఒక వేదికపై కలసినప్పుడు. గతంలో కంటే ఇప్పుడు కవిసమ్మేళనాలను సీరియస్‌గా తీసుకుంటున్నారని సాహితీ మిత్రుడు వర్ఖుల శివకుమార్ ఉగాదినాడు అన్నారు. ఇలాటి అభిప్రాయాలు తరచూ వినిపిస్తున్నాయి.

నిజమే, జనకవనానికి ముందు కూడా జనులూ వున్నారు. కవనాలూ వున్నాయి. కాని సాహిత్య రంగంలో కొన్ని కొత్త కదలికలకు సమీకరణలకు జనకవనం దోహదపడిందని అందరూ అంగీకరించారు. తర్వాత గుజరాత్ గాయం. ఆ పైన అమెరికా యుద్ధ వ్యతిరేక ఉద్యమం ఇవన్నీ సాహిత్య రంగంలో క్రియాశీలత పెంచాయి. ప్రస్థానం కూడా ఇందుకు తనవంతు దోహదం చేస్తోంది.

అదే సమయంలో ఇటీవల ఒక విమర్శ కూడా వినిపిస్తోంది." ఏమిటీ కవిసమ్మేళనాలు? ఎందుకు ఉపయోగపడుతున్నాయి? వచ్చే వారంతా తమ కవిత్వం వినిపించాలని తపించడం తప్ప సాహిత్యం గురించి ఆలోచిస్తున్నారా? అసలు వాళ్లు రాసేది కవిత్వమేనా?"

ఒకటికి రెండు సార్లు విన్న తర్వాత ఈ వ్యాఖ్యలను తేలిగ్గా తీసేయకూడదని స్పష్టమైంది. అవి యాదృచ్ఛికంగా వచ్చే అభిప్రాయాలు కాదు. సాహిత్యకారుల్లో– అందులోనూ ప్రగతిశీల దృక్పథం కలవారిలోనూ వున్న అస్పష్టతను ఇవి ప్రతిబింబిస్తున్నాయి. కవిత్వం కావచ్చు, మరే సాహిత్య(ప్రక్రియ అయినా కావచ్చు. దానికి ఒక ప్రయోజనం వుంటుంది. అది సందర్భాన్ని బట్టి మారవచ్చు కూడా.

కవిత్వం విషయానికొస్తే ప్రక్రియా పరంగా దానికి కొన్ని సౌలభ్యాలున్నాయి. తక్షణం స్పందించి రాయడానికి, పదిమందికి వినిపించడానికి , తమ ఆవేశాన్ని వివిధ స్థాయిలలో వారికి బదలాయించడానికి కవిత్వం మంచి సాధనం. అయోధ్య సమస్య నుంచి అమెరికా దాడి దాకా దేన్నయినా కొద్దిలోనే ఖండించడం కవిత్వంలో సాధ్యం. అదే ఇతివృత్తం కథలో చెప్పడం అంతసులభం కాదు, చెప్పినా అంతమంది చదివి వెంటనే ఇతరులతో పంచుకోవడం సాధ్యమూ కాదు. కవితకే ఆ సదుపాయం వుంటుంది.

నిరసన ప్రదర్శనలో నినాదాల ద్వారా అమెరికాను ఖండించవచ్చు. సభలో ఉపన్యాసాలు చేయవచ్చు. పత్రికలలో లేఖలూ రాయొచ్చు. శక్తి అవకాశం వుంటే వ్యాసాలూ, కథలూ రాయొచ్చు. ప్రజాకళారూపాల ద్వారా దాన్ని బహిర్గతం చేయొచ్చు. ఈ వరసలోనే ఎవరైనా తమ భావాలను చేతనైన రీతిలో కవిత్వం కట్టి వినిపించవచ్చు. అదంతా గొప్పది కాకపోవచ్చు. చాలా కవితల్లో ఎక్కడో ఒక చోట స్పార్క్ వుండకపోదు. దానికే శ్రోతలు స్పందించుతారు. ఆ మాటకొస్తే ఎంత గొప్ప కవులైనా అంతా గొప్ప కవిత్వమే రాసిన దాఖలాలు లేవు. సినిమా కవులైనా భావ కవులైనా దేశానికి ప్రజలకూ సంబంధించిన విషయాలు రాయాల్సి వచ్చే సరికి కదలండి, ఉరకండి అంటూ రాయడం గమనిస్తాం. దుర్మార్గాన్ని ఖండించడానికి నిశితమైన భాషను వాడటమూ చూస్తాం.పోతనలాటి సాత్విక కవి కూడా ఇమ్మనుజేశ్వరాధములు, కూళలు వంటి పదాలు వాడాడు.శ్రీశ్రీ దొంగలంజకొడుకులసలే మసలే ధూర్తలోకం అని మండిపడ్డాడు. ఇది ముదిరి ఒక దశలో దిగంబర కవిత్వ రూపం తీసుకుంది. సామాజిక రూపం ధరించింది. ఆ పైన విరసం దశలోనూ శ్రీశ్రీ యే గోడ్డళ్లతో నరకాలిరా, కొడవళ్లతో తరగాలిరా అని రాసిన సందర్భాలున్నాయి. జ్వాలాముఖి వంటి కవి ముష్టిఘాతాలను పిక్చరెస్క్‌గా వర్ణించిన వైపరీత్యాలూ వున్నాయి. దళిత కవిత్వంలోనూ ఇలాటి సందర్భాలు తారసపడతాయి. తమాషా ఏమంటే చారిత్రిక నేపధ్యంపేరిటగాని, రాజకీయ అనుబంధాన్ని బట్టిగాని దీనంతటిని సానుభూతిగా అర్థం చేసుకోవాలని చెప్పే వారే నేటి యువకవులు రాసే కవితల పట్ల ఎక్కడ లేని చిన్నచూపు ప్రదర్శిస్తారు. ఈ యువకవులు( సీనియర్లు కూడా) రాసేదంతా కవితా ప్రమాణాల రీత్యా(అలాటి అఖండ ప్రమాణాలంటూ వుంటే) అద్భుతమైనదనడం ఎంత పొరబాటో మొత్తం అధ్వాన్నమైనదని అవమానించడం అంతకంటే తప్పు.మరీ ముఖ్యంగా తక్షణాంశాలపై ఎక్కడికక్కడ స్పందించి రాసే తరుణంలో పునరుక్తులు వుంటాయి. నినాదాలూ వుంటాయి. చప్పటి భాగాలూ వుండొచ్చు. ఇక్కడ

ప్రధానాంశం వారి మానవతా పూరితమైన చైతన్య వంతమైన స్పందన  తప్ప కేవలం కవితాగుణాలు కాదు. బాగా రాయగలిగిన వారెటూ రాస్తారు. ఆశక్తి లేని వారి నిరసన మరెలాతెల్పేట్టు? ప్రథమ  శ్రేణి కవులు గాక ఇతరులు రాయడానికి అనర్హులా? వారి అవగాహన పెంచే కృషి చేయవలసిందేగాని అప్పటివరకూ  వారిని సమ్మేళనాల్లో పాల్గొనవద్దని  బహిష్కరించే హక్కు    అధికారం ఎవరికైనా వున్నాయా? అలా ఆలోచించడం ప్రజాస్వామికమా? ఎక్కువ మంది రాయకుండా వైవిధ్యం వస్తుందా?

ప్రస్థానం తొలి సంచికలోనే రాసినట్టు వైయక్తిక అనుభూతులు,  ఆత్మాశ్రయత్వంలో మునిగితేలే కవుల స్వీయ దు:ఖం గొప్పకవిత్వం అయిపోయి పదిమంది గురించి ప్రతిస్పందించే ఈ కవిత్వం – అందులోనూ యువకవులు నవకవులు రాసేది పనికిమాలిన కవిత్వం అయిపోతుందా? ప్రతిభా వంతులమని అనుకునే కొందరు అనాలోచితంగా చేసే ఈ వ్యాఖ్యలు సాహిత్య రంగంలో ఓ విధమైన దొంతరలు పెంచడానికే దోహదపడతాయి.సాహిత్యంలో   భాషలో ప్రజాస్వామీకరణ రాకుండా ప్రజాస్వామ్యం పరిపూర్ణం కాదంటాడు గురజాడ. 21 శతాబ్దిలోనైనా మనం ఆ పాటి  వాస్తవిక దృష్టి ప్రదర్శించనవసరం లేదా? ఇన్ని వందల మంది ప్రజాకవిత్వం రచించడం నిస్సందేహంగా మనకు  గర్వకారణం. దాన్ని  కవిత్వం అనడం  ఇష్టంలేకపోతే మరేపేరైనా పెట్టండి.

ఇంత చర్చకూ  కారణమేమంటే కవి సమ్మేళనాలను మనం సీరియస్‌గా  తీసుకోవాలని  గుర్తించడానికే. సీరియస్‌గా తీసుకోవడమంటే వచ్చిన వారి కవితలు శ్రద్ధగా వినడం,  మంచి చెడ్డలు ఓపిగ్గా విశ్లేషించడం, ఏ కాస్త నవ్యత వున్నా ప్రోత్సహించడం జరగాలి.వాటిని అక్కడికక్కడే చీల్చి చెండాడ్డం కాక తర్వాత వివరించాలి. ఎలా రాయాలో చెప్పాలి. ఉదాహరణలు ఇవ్వాలి. ఆ కర్తవ్యం ప్రగతిశీల సాహిత్య  విమర్శకులు తప్ప ఇంకెవరు చేసేట్టు? ప్రతిభావంతులు ఎవరో ముందే గుర్తించే మంత్ర దండాలు ఎక్కడా వుండవు. వేయి పూవులు వికసించనివ్వండి అనే నినాదంలో విలక్షణత  తెలిసి కూడా కవి సమ్మేళనాలను చిన్నచూపు చూడటం సమంజసం కాదని సహృదయ సాహితీ మిత్రులు గమనించడం అవసరం. ఉర్దూ కవుల ముషాయిరాల వలె కవి సమ్మేళనాలను సజీవంగా తీర్చిదిద్దుకుంటే మరింత ఉత్సాహంగా వారు రాయగలుగుతారు. కావాలంటే ఈ విషయంలోనూ నూతన  ప్రయోగాలు చేయడానికి ఎవరికి అభ్యంతరముండనవసరంలేదు. కేవలం కవి సమ్మేళనాల్లో మునిగి తక్కిన సాహిత్య రూపాలను చర్చను నిర్లక్ష్యం చేయడమూ తగదు. దేని విలువ దానిది; దేని స్థానం దానిది.

V

# కవిత

## టైగ్రిస్ - యూఫ్రటీస్ నదుల సాక్షిగా!

**నిఖిలేశ్వర్**

బాబిలోనియా నాగరికతపై
ఆధిపత్యనాదం
మరణమృదంగం మోగించింది
ఇప్పుడే చరిత్రమలుపులో
ఆయుధ సంపత్తి వున్నవాడే
ప్రపంచ రాజకీయ చదరంగంలో
పావుల్ని కదుపుతున్నాడు
ఏకధృవ అంకుల్‌సామ్ సామ్రాజ్యవాదం
కన్నెర్ర చేయగానే
క్లష్టర్ బాంబులతో
అరబ్బు పెట్రోలు భగ్గుమన్నది
స్వాభిమానంతో
నిన్నటిదాకా ప్రతిఘటించిన
ఇరాకీ సాహసప్రతీక సద్దాంను
చుక్కలగీతల జెండా చుట్టి
నేలకూల్చినా
కీలు బొమ్మ ప్రభుత్వం తప్ప
"మిషన్ ఇరాకీ ఫ్రీడమ్"
స్వేచ్ఛకు అర్థం  లేదు...
అరబ్బుల చరిత్రలో
మానవరోదనను లిఖించిన



ఇబన్ బటూటా
కాలగర్భంలో మిగిలేవున్నాడు
నీరు పోసి నారుపెంచిన
టైగ్రిస్ నదిని
దైవదత్తంగా భావించిన
బగ్దాద్ పౌరుల వేల సం.ల వారసత్వం
ఫాసిస్టు బుష్ సేనలో ఆధీనంలో!
స్వదేశంలోనే
రెడ్ ఇండియన్ల రక్తంతో
స్నానమాడిన యాంకీ సంస్కృతిలో
ఆనాడే సామ్రాజ్యవాదానికి బీజం పడింది!
ఇరాకీ కవి జమీల్ జహావీ
తన దేశ భవిష్యత్తును చూసి
ఎపుడో నిర్వేదంతో స్పందించిన మాటలు
"ఏ నేల ఇసుకపై నువ్వు పుట్టి పెరిగావో
అక్కడ శిథిలాలు కబళిస్తున్న చోట
నువ్వు శిలగా మారిపోగా ఇక శోకమెందుకు?"
యూఫ్రటిస్–టైగ్రీస్ నదుల సాక్షిగా
ఇపుడు బగ్దాద్ పరాధీనమైనా
ప్రజల స్వయం నిర్ణయాధికారమనే
మహోద్యమం ఎదుట
ఎంతటి ఆయుధ సంపత్తియైనా
మోకరిల్లక తప్పదు!!

## యుద్ధ తీవ్రతకి ఒక అర్థం

-పసునూరి రవీందర్

నాశనానికి రెండు ముఖాలు
ఒకటి యుద్ధోన్మాదం, రెండోది మతోన్మాదం
అధికారం... అన్వేషణ...
అహంకారం... ఆక్రమణ... ఆధిపత్యం
ఇవేవీ రాజ్యాల్ని కూల్చగలవేమో గాని
నాశనమైన ఒక నగరాన్ని కూడ నిర్మించలేవు.
శవాలపైన పైసలేరుకునే
చమురు రాజకీయాలు
కొండను తవ్వి ఎలుకను పట్టే
ఘనకార్యాలతోనే గర్విస్తున్నది

## ఆటవిక న్యాయం

- ఎం.ఎ. రహమాన్

వేల యేళ్ళ నా సంస్కృతి ముందు
వాని ఆటవిక సంస్కృతి ఏ మాత్రం
వాడే మానవ రక్తాన్ని రుచి మరిగిన
ఇనుపడేగ
ఇందరి రక్తాన్ని బలి పెట్టి పెట్రోల్
పోగు చేసుకోవాలనుకుంటున్న వాడు
ఆ మంటల్లోనే బలైపోడా
కొలంబస్... నువ్వు పుట్టకున్నా
బాగుండేది...?
ఇప్పుడు నన్నో సందేహం
పట్టి పీడిస్తుంది
ఇంతకూ ప్రపంచపు ఉగ్రవాది
బిన్‌లాడెనా.. జార్జిబుష్షా?

## దగాపడిన దౌత్యం

-శిల్పా జగదీష్

ప్రపంచ దేశాల శాంతికూటాలన్నీ
ఒక్కొక్కటిగా కూలిపోతూంటే
నిరాయుధీకరణాలన్ని నిన్నటి స్వప్నాలౌతుంటే
మూడవ ప్రపంచ యుద్ధం
మా ముంగిట్లోకి వచ్చేసింది
ఇక నీతో మాకు పనేలేదు
ఈ ప్రపంచమే ఒక స్మశానవాటిక
కాటికాపరితో ఇక పనేముంటుంది

## మేమూ బాధితులతో!

-మహాలక్ష్మి

ప్రపంచ పెత్తనాన్ని చాటుకునే యద్ధంలో
చమురు కోసం సాగే పోరులో
బలిమి బాధితులు ఎందరో... మరెందరో
అందులో మేమున్నాం... మేమున్నాం

## ఐరాస గొంతు నులమకు

-పర్స సత్యనారాయణ

బూచోడా బుష్షూ
ఐరాస గొంతు నులమకు
హెర్ హిట్లర్ దారి నడవకు
కాదంటే సైనైడ్ గుళికే
ఔతుంది కడకు గతి నీకు

## ఎడారి

-గాలింకి ఆనందబాబు

ప్రపంచ స్వాతంత్ర్య స్వప్నం!
చెల్లా చెదురై పోతుంది!
ప్రపంచ మానవాళి అంతా
ఎడారిమయమై పోతుంది!



## దుమ్మలగొండి దాడి

- గేరా

ఇంటి నిండా 'పెంటగను'ల్ని నింపుకొన్న
ఓ దుమ్మలగొండి
విముక్తి పేరుతో విధ్వంసం
ప్రక్షాళన వంకతో కక్షసాధిస్తోంది
దుమ్మలగొండి దాడిలో అమాయకపు ఒంటెలు
హాహాకారాలు చేస్తూ ఆహుతైపోతున్నాయి
ఒయాసిస్సులన్నీ
రక్తసరస్సులే
ఇసుక పర్రల నిండా
కన్నీటి ఊటలే!

## క్విట్ ద ఎర్త్!

-డా॥ రాపోలు సుదర్శన్

నీ దుష్టకూటమి దౌష్ట్యానికి
ప్రాణాలొదిలిన ప్రజల సాక్షిగా
తెగిన అవయవాల శరీరాల సాక్షిగా
చెబుతున్నా!
జనం నిప్పుకణికల్రా!
నిప్పుతో చెలగాటమాడ్తున్నావ్!!
ఇసుక రేణువులు సహకరిస్తే
భవనమై నీకు నీడనిస్తుంది
తిరగబడిందా
తుఫానై నిన్ను కప్పేస్తుంది
ధర్మయుద్ధం పేరుతో
ఎవరినిరా వంచిస్తావ్!
అది నీ ఆత్మవంచనే!!
దుష్టకూటమి యుద్ధోన్మాదులారా!
మిమ్మల్ని ఈ భూగోళం
విడిచి పొమ్మంటున్నాం!!!

## రక్తసిక్తం

-వేంపల్లె షరీఫ్

ప్రసవం కోసం నెలలు నిండని ఆ తల్లుల
అవస్థలు చూడు
రక్తమంటే తెలీని పసిపిల్లలు రక్తసిక్తం అవుతున్న
వైనం చూడు
ఇనుపడేగల రెక్కల నీడలో తల్లడిల్లుతున్న
ప్రాణులను చూడు
చెల్లాచెదురై పరిగెడుతున్న రక్తబంధాలను
పరికించి చూడు
హే... భగవాన్! కాపాడు!
ఏ రాగద్వేషాలతో సంబంధం ఉందని వారికీ
పెనుముప్పు?
హే.. భగవాన్!కాపాడు!
ఇనుప డేగల రెక్కలను విరిచేయి!
డాలర్ నోట్ల కోరలను పెరికివేయి!!
హే... భగవాన్! కాపాడు!

## అనకొండ

- కొండానాయక్

ఇదిగో
ఇదిగో
తెల్లభవనం
పెరట్లోంచి
అనకొండ
నోరు తెర్చింది

## అరచేతికి పండ్లు మొలిస్తే...

-ఆచార్య రావికంటి వసునందన్

కాళ్ళు విరిగిన మానవత్వం
రెక్కలు చాపిన దానవత్వం
యుద్ధం...
దుర్విదగ్ధత అగ్రస్థానానికి పునాదిగా
రెచ్చిపోయే పిచ్చి పైశాచికత్వాన్ని
చరిత్ర క్షమించదు
మంచి పనులెన్నో చేసిన
సముచిత నైజాన్ని తుంగలో తొక్కి
కొంచెపుతనం నెత్తికెక్కించి
శివంతొక్కిస్తుంది యుద్ధోన్మాదం
ఉన్మాదం కాదు అది మదం

## కా'రణం'

-దేశాయిపేట చంద్రశేఖర్

కారణమేదైనా సరే కావలసింది రణమే
కారణంలేకున్నా కావలసింది రణమే
బస్రా చమురు క్షేత్రాలేకాదు
భారతీయవంటకమైనా యుద్ధ కారణంగావచ్చు
దాని లక్ష్యం కాదొక్కటే ఇరాక్
ప్రపంచమా బహుపరాక్, బహుపరాక్

## శాంతి గమ్యానికి-హింస రహదారి

-తన్నీరు సురేష్

ఎండ వేడికి నీళ్ళు కోరిన ఆకాశానికి
తెగిపడిన తలల రక్తం ఆవిరి దొరికింది
ఖర్జూరాలిస్తుందని ఎదురు చూసిన ఎడారి
పగిలిన గుండెల ముక్కలను చూపింది
ఏ వ్యక్తికీ ఏ శక్తికీ జరిగిన యుద్ధం
ఏ పాపం ఎరుగని వాళ్ళకు

## చితిమంటలు

-రత్నమ్మ

బాంబుల వర్షం, నిప్పుకణికలూ
స్వేచ్ఛకు వేసే నిచ్చెనలట
శవాల గుట్టలు, ఆకలికేకలు
ప్రజాస్వామ్యం నిలిపే పునాదులట
ఇరాకీయుల ఆరవి చితిమంటలు
ప్రపంచదేశాల మనుగడనే సవాళ్ళు

## స్మశానం

- జి. వెంకటరామయ్య

భూమి బాంబుల;

సంగ్రామానికి
జనించినది
ఒక స్మశానం
ఫిరంగుల శబ్దమే
సంగీతపు వాద్యంలా
మానవ రోదనే
పాప్ గీతంలా
ఆనందిస్తున్నది
స్మశానం
గుండె పగిలితే
ఆనందిస్తూ
చావని వారిని చూచి
బాధపడుతూ
గోల చేస్తున్నది
స్మశానం



## అసలే బూషాడు..ఆపై

-ఎస్.ఎం.డి. ఇనాయతుల్లా

అమెరికాలో బయల్దేరి బాగ్దాదుచేరిన బంకర్
మా పెట్రోలు బంకులో పేలింది.
దెబ్బకు నా జీవితం బండి చక్రాలు తడబడినాయి
బస్రాలో, నసీరియాలో చమురు బావి మండింది.
దెబ్బకు వంటింట్లో మా తిరగమాత మాడింది
మీ జీవ రసాయనాలు పాడుగానూ
మా కంది పప్పులో ఉప్పులో
జీవంలేదు, రసాయనంలేదు
మొత్తం కషాయమైపోయింది
అసలే బూషాడు
ఆపై ఆముదం తాగాడు
ఆయుధం పూనాడు
కసిగా పసి కూనల్నీ, విరిసీ విరియని
పూ మొగ్గల్నీ, ముక్కు పచ్చలారని బుగ్గల్నీ
చిదిమి పారేశాడు, నిస్సిగ్గుగా వికృత హాసం
చేశాడు.

## మారణాయుధం

- నూకపంగు వెంకయ్య

చంటిపాపల కనుపాపలలో
ఆవిష్కరింపబడని స్వప్నాలన్నీ
అక్కడ ఇసుకలో కూరుకుపోతాయి
ఒక పక్క కంఠాన్ని తెగ్గోసి
మరోపక్క కుట్లేస్తుంటాడు వాడు
చిన్నారి నవ్వుల పువ్వులపై
బాంబుల వర్షం కురిపించేది వాడే
బ్లిక్సుకు కనిపించని
మారణాయుధాల్ని వెతికి తీస్తానంటూ
ప్రపంచం ముందు వాడే
ఓ మారణాయుధమయ్యాడు

## డాలరు ఆశ...

-అక్కెనపల్లి ఈశ్వరాచారి

అమెరికా డాలరు ఆశ
ఆధిపత్యం
ఒకర్ని మించి పోవాలని
ఇంకొకర్ని అణగద్రొక్కడమే
అమెరికా డాలరుకున్న ఆశ
శ్వేతభవనం యుద్ధమేఘాల్ని రగిలిస్తూ
ఆ ముస్లిం దేశానికి యమపాశమైంది
అదిగో ఆ బుషోడే పెద్ద టెర్రరిస్ట్

## అరచేతుల్లో శాంతిపుష్పం

-డా॥ రూప్ కుమార్

తీండ్రింపుల యుద్ధమేఘాలు
మూసిన కనురెప్పల వెనుక
కళ్ళు తెరవనీయకుండా
పడగ విప్పిన సర్పవలయం కనుబొమ్మల చుట్టూ
అంధుడి తడుములాటలా
కాళ్లూ, చేతులూ
మనసు పొరలన్నీ

రాలుతున్న సీతాకోకల రెక్కలు
బిచ్చపు బొచ్చెల్లా
పార్కుల్లో, రోడ్లమీదా, వీధుల వెంబడి

అరచేతులు ఆయుధాలై
ఇనుప డేగలని దునుమాడాలి
చేతి రుమాళ్ళు ధవళపావురాల్లా ఎగరాలి

## యుద్ధ భయంలేని స్వేచ్ఛ కావాలి!

-రాధేయ

ఇతిహాసపు చీకటి కోణాలన్నీ
రక్తసిక్త అనుభవాలే కదా!
మానవజాతి చరిత్రను
తుపాకులతో కాలరాస్తే,
బాంబులతో హోరెత్తిస్తే
ఛిద్రశిథిలాల మధ్యకు
నాగరికత నడిచి వస్తుందా!
బూడిద కుప్పల మీద
మానవత్వం మొలకెత్తుతుందా?
కూల్చివేత భాష మాత్రమే తెల్సిన
నరహంతకుడికి,
ఆనవాళ్ళే గుర్తు పట్టలేని
ఆత్మబంధువుల రోదన అర్థమౌతుందా!
శవాలమీద నడిచే సామ్రాజ్యవాదికి
తల్లులు, పిల్లలు, వృద్ధులు ఎందరు ఛస్తేనేం
అధికార దాహమేతన సర్వస్వం కాదా?

## ప్రకృతి-వికృతి

- వసుధ

ఎలుకలను వెంటాడుతోంది పిల్లి
పిల్లిని వేటాడుతోంది కుక్క
అది ప్రకృతి..
ఇరాక్‌పై అమెరికా పైశాచిక దాడి!
అడుగడుగునా మారణహోమం!
ఇది వికృతి

## సద్దాంపై యుద్ధం

-జి. శుభాకరరావు

శ్వేద సౌధమిచ్చిన అధికారమదంతో కదనం
బ్లెయిరు సహకారంతో కర్రపెత్తనం
బండబారిన మొండిగుండెల కండకావరం
దిక్కులు పెక్కటిల్లేలా భీకర రణఘోషల
బీషణాలు
బీభత్స పుద్విగ్నతలతో రక్తతర్పణాలు
క్షణక్షణం ఇరాకీ క్షితిపై
చితిమంటలు-విషబాణాలు
క్షుద్రుల యుద్ధోన్మాద ప్రకోపంతో ప్రయోగాలు
అమాయకుల మరణాలు
క్షిపణుల రాక్షస సమరనాదాలు
ఆకాశంలో యినుప విహంగాల విహారాలు,
దీనులపై ప్రహారాలు

## పీనుగుల దిబ్బైనాక...

- విజయ బండారు

క్షిపణులతో క్షమాపణలు
చెప్పించగలవు
కానీ,
ఫిరంగులతో ప్రపంచ
శాంతిని
స్థాపించలేవు
చమురు కొఱకు
ప్రపంచాన్ని
బలిపీఠంపై బంధిస్తావా?
విశ్వమంతా పీనుగల దిబ్బైనాక
వికటాట్టహసంతో
శాంతిబావుటా ఎగరవేయగలవా?



ARTIST KATHE KOLLWITZ

## విడ్డూరం!

-మందపాటి సత్యనారాయణరెడ్డి

ఉగ్రవాదాన్ని నలిపేస్తానంటూ
యుద్ధోన్మాదం ఉరిమి చూస్తుంటే
జవాన్లు జనావాసాలపై బాంబులేస్తుంటే
పసిపిల్లలు... కదు వృద్ధులు...
కుమిలి కూలిపోతుంటే
గాంధి తాత మనుమలంగా
మనం శాంతి జపం చేస్తూ...
మౌనంగా వీక్షిస్తూ...
నిర్లిప్తంగా నిట్టూర్చడం
విడ్డూరంగా లేదా...?

## గురివిందపూసా!?

-రవిశ్రీ

ఊ అంటే చాలు
ఉరుముకొచ్చే అణ్వాయుధాలను
కుప్పకుప్పలుగా తయారు చేసి
అణుపరీక్షల నిషేధమంటూ
గద్దితినే ఓ శ్రీమంత రాజ్యమా!
శాంతి గురించి మాట్లాడేహక్కు
నిజంగా నీకెక్కడిది చెప్పు?

నీతి నీలోమిగిలివుంటే
నీ నీతులితరులాచరించాలంటే
కుప్పకుప్పల అణ్వాయుధాల్ని పాతిపెట్టి
నీల గగనంలోకి శాంతిపావురాల్ని విడిచి పెట్టి
నీతలమాసిన సంస్కరణల ఒప్పందాల్ని
తగలబెట్టి
సమసమాజం వైపు చూపుల కిరణాల నెక్కుపెట్టి
నీ నడ్డిక్రింద నలుపు తొలగించుకో
అందాక, ఒత్తిళ్ళ మాట ఎత్తకు
నీపొత్తిళ్ళ నా కలంవేటు తెచ్చుకోకు.

## అధర్మయుద్ధం

-పుప్పాల మట్టయ్య

శకలాలుగా కూలుతున్న బి.52, స్టెల్త్‌లు,
క్రూయిజ్‌లు
పెళ్లలు పెళ్లలుగా రాలుతున్న శవాల గుట్టలు
నెత్తుటితో చిత్తడయిన ఇసుక దొంతరలు
పీలికలై ఎగిరిపడ్డ మానవఖండాలు
కట్టలు తెంచుకున్న ఇసుక కన్నీళ్ల సుడులు
శిథిలమైన జీవన సౌధాలమధ్య
రక్తసంబంధాలను పోగు చేసుకుంటున్న వృద్ధులు
తల్లికోసం తడారిన చిట్టిపెదాల వెదుకులాట
సగం తెగిన అవయవాల హాహాకారాలు
వెల్లువెత్తిన నిరసనోద్యమాల హోరు
ఇది యుద్ధ ముఖచిత్రం

యుద్ధోన్మాది కంట్లోకారం కొట్టి కన్నీళ్లను
తుడిచినట్లు
శవాల గుట్టలపై రొట్టెముక్కలు వెదజల్లడం
వాడికి అలవాటే,
కూల్చేసి పునర్నిర్మిస్తాననడం వాడికి కొత్తేంకాదు
ఇసుక బురదల్లో కూరుకుపోతున్న పసిప్రాణాలు
రేపు వాడి విధ్వంసం కోసం
కేంద్రీకృతమవుతున్న మందుపాతరలే
అదిగో అక్కడో తెగిపడిన చిట్టి చేయి పిడికిలి
బిగిస్తోంది
చమురు కోసం రక్తతర్పణ చేస్తున్న వాని
శ్వేతసౌధపు పునాదులను ధ్వంసం చేయడానికి



హైదరాబాద్



అనంతపురం

## శాంతిగానం

**-డిఎస్‌వి. ఛాయామణి**

యుద్ధమనే చిన్నిమాట
ఆయుధాల పెనుమూట
వేల మంది అమాయకుల
బలిగొను దెయ్యపు పాట
ఒక్కరి స్వార్థపు యోచన
భావిని నాశం చేసే రచన
సాగుతున్న రణహోమం
మానవ జాతికి గ్రహణం

## శకలాలు

**- గుంపుల ప్రభాకర్**

ఆ ఎడారిలో కనిపించేది
ఇసుక రేణువులు కాదు
తలలు పగిలి
తునాతునకలైన దేహాలు
ధరించిన దుస్తులు
రక్తంలో తడిసిపోయి
రెపరెపలాడుతున్నై
ఆ వసంతానికి
ఇదంతా
అమెరికా పెట్టిన
భిక్ష!!

## కొమ్మల మొర

**- ఒబ్బిని**

తేట తెలుగులో తిట్టాలంటే
వెలిగే పొయ్యిల మీద నీళ్ళు జల్లి ఆర్పే రకం,
కాపురాలు కూల్చే రకం ఈ అమెరికాది!
బుష్ అంటే తెలుగులో తుప్పని అర్థం
ఓ ముళ్ళ తుప్ప అమెరికా!
మా తెలుగునాట పల్లెల్లోకి
ఓసారి వచ్చిచూడ
తిట్టిన తిట్టు తిట్టకుండా నీ టోపీ ఎగరగొడతారు
నీ దాష్టీకం మట్టుబెడతారు

## ఓ సుదీర్ఘ కాళరాత్రి తర్వాత..

**-గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ**

రక్తం ఘనీభవించిన
'టైగ్రిస్' నది సాక్షిగా
రాబందులు పహారా కాస్తున్నాయి
'బాగ్దాద్'.. 'బస్రా'లిప్పుడు
అమానుష అహంకారం చిమ్మిన
విషానికి చిహ్నాలు!
శిథిలమైన గుండెలతో...
బరువైన జ్ఞాపకాలతో...
పాకుడు బండల మీది నడకలు
ఇరాకీ జీవితాలు
జీవచ్ఛవాలకు
మైపూతల పునర్నిర్మాణం జరగబోతోంది....?




## 'జంగ్‌బందీకే ఖిలాఫ్ ఆవాజ్‌దో...'

**- తిరునగరి శ్రీనివాస్**

బలిపశువులై శిక్షను అనుభవించాలి!
మానవ నాగరికతానదులు పూలరెక్కలు
తొడుక్కుని ప్రవహిస్తాయి
యుద్ధోన్మాదుల యుద్ధం అంతరిస్తుంది!
మానవనాగరికతపై చెరగని మచ్చ యుద్ధం!
జంగ్‌బంద్‌కరో
జంగ్‌బందీకే ఖిలాఫ్ ఆవాజ్‌దో
హమారా సారా జంగ్ నహీ అమన్‌హై!

## ఎడారి డేగ

**-ఎస్. రఘు**

చిన్నప్పటి మన కథల్లో
బూచాడంటే
చిన్నపిల్లల నెత్తుకెళ్ళేవాడని అర్థం
ఇప్పటి మన గాయాల్లో
బూచాడంటే బుష్షోడే
మానవాళిని సజీవ దహనం చేసే
సామ్రాజ్యవాద రక్తపిశాచి వీడే!

నాగరికతా పుణ్యక్షేత్రాల్లో
ఎందుకీ బాంబుల విస్ఫోటనాలు
చమురు నెత్తురుల మిశ్రమద్రావపు
అత్యతినాగరిక యుద్ధదాహోన్మాది
మానవ జీవన మధురిమల్ని దోచుకుంటున్న
ప్రజాస్వామ్యపు ముసుగేసుకున్న బందిపోటు
చరిత్రపొరల్లో కుళ్ళిపోయిన
నియంతల కళేబరాల పక్కన
చోటు వెతుక్కుంటున్న సంకీర్ణకాటికాపరి

ఇప్పుడీ యుద్ధాన్ని ఎదుర్కోకపోతే
శ్వేతవధ్యశిలపై భూగోళం
మన దేశంలో మనం పరాయివాళ్ళంగా
మన ఇంట్లో మనం శరణార్థులుగా
మిగిలిపోతాం
ఇక ప్రతి మనిషి ఇసుకతుఫానై
శ్వేతవర్ణ సామ్రాజ్యాన్ని ముట్టడిద్దాం

## శాంతిగీత

**- తాళ్ళపల్లి నాగిరెడ్డి**

ఐక్యత-భద్రతా సమితులు
ఐరావతం మ్రింగిన వెలగపండ్లా?
ఎండమావులా!! 'వీటో' పావులా?
విప్పారిన మానవ పరిమళాన్ని
అస్వాదించి ఆపండీ దురాక్రమణలు
ఆలకించండీ! సందేశ శాంతిప్రవచనాలు

# నెత్తుటి వాన

-జి.వి. కరుణాకర్

గ్లిజరిన్ ఎంతపూసుకొన్నా
ఇక కన్నీళ్ళురావు...!!
కడుపు కోతలొద్దు
కాందిశీకుల భూములొద్దు
తన్నుకొంటుంది
తెల్లోడు, తురకోడు కాబట్టి
తలస్సలు దూర్చొద్దు
ఎల్ అండ్ టి సిమెంట్ షిప్
ఆంధ్రాకు డెలివరీ అయితే చాలు

గోరుముద్దల తల్లిప్రేమ
ఉగ్గుపాలతో ఎకె-47
ఆపరేషన్‌ని పిల్లలకి పంచిపెడుతుంది

మమతాప్యాయతల్లో
నడవాల్సిన పసితనం
పగ ప్రతీకారాల్లోకి పరిగెత్తుతుంది.

కాలిన చర్మం
నెత్తుటి పుండు
కన్నీళ్ళతడి
కడుపుకోత
ఆకలికేక
తడారిన గొంతుల
బాధ...
ప్రపంచంలో
ఎవడికైనా ఒక్కటి కాదా?

కాలిన కంకర్లో
ఎంత పొర్లి పొర్లి ఏడ్చినా
సుత్తి సేనవతో చేతులు
పగలగొట్టుకొన్నా
కన్నీళ్ళు రావు
ఇక కురిసేది
నెత్తుటి వాన...

# అంకుల్ శామ్ నీ కథ వింటావా!

-నల్లూరి రుక్మిణి

ఊహ తెలియని రోజుల్లో
చదివిన చరిత్ర పాఠాలు గుర్తుకొస్తున్నాయి

అంకుల్ శామ్
నీ హీన చరిత్ర పొడవునా-నీకెన్ని గుణపాఠాలు
గెలుపు వోటముల గురించెందుకుగాని
నీ ప్రతియద్ధ ప్రయత్నం
నీకెంత చేదు అనుభవాల్ని మిగిల్చిందీ
నీ పేరు నిన్న హిట్లర్ కావచ్చు
ముసోలినీ కావచ్చు
అంతకన్నా ముందు యింకేమైనా కావచ్చు
ఇవాళ నీ పేరు జార్జిబుష్
'ప్రపంచ శత్రువు' నీకు పర్యాయపదం
హాయి నేలమీద సాగించే నీ యుద్ధ వ్యూహంలో
ఈసారి ఇరాక్ చమురు బావులు ప్రజ్వరిల్లి
తప్పక నిన్ను నిలువునా బూడిద చేస్తాయి



# దురాశకాదుకదా!

-ఎలమర్తి రమణయ్య

ప్రపంచపు కాన్వాసుపై
వర్ణచిత్రం వేస్తున్నది
రణరక్కసి
నీలిరంగు దాటి వేసి
నేలరంగు నెరుపు చేస్తున్నది
రక్తపిపాసి
చిత్రవిచిత్రంగా చిత్రిస్తున్న
వర్ణచిత్రంలో అంతా ముసిరిన మబ్బులు
అయినా వర్షించడంలేదు
తరచుగా ఆకాశం నిండా
మిరుమిట్లు గొలిపే వెలుగులు
కానీ కావవి మెరుపులు
నిశీధి నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ
నింగీనేల వ్యాపించాయి భీకర శబ్దాలు
రాలినవి పిడుగులుకావు
వాన కురుస్తోంది
ఆకాశం నుండి మాత్రంకాదు
కానీ నేల తడిసి ఎర్రనౌతోంది
వర్ణచిత్రంలో ఒక చోట
ముదురు ఎరుపురంగైతే
మరో చోట లేత ఎర్ర గులాబీరంగు
బీభత్స దృశ్యాన్ని చిత్రిస్తున్న
ఆ ముఖంలో విజయగర్వం
పెదాలపై వికటాట్టహాసం
ఒక్కసారిగా ఉలిక్కిపడ్డా
భయంకరమైన ఆవర్ణ చిత్రం చూసీ
కాన్వాసులో క్రమంగా
కనుమరుగౌతున్న తెలుపు చూసీ
బిక్కుబిక్కుమంటున్న శాంతికపోతాన్ని చూచి
శాంతి పావరాన్ని సేదదీరిచి
దాని రెక్కల్లోని బాగాన్ని తీసి
అది స్వేచ్ఛగా ఎగిరే దృశ్యం చూడాలని
మనసు ఆశపడుతున్నది-ఇది దురాశకాదు కదా!

---

# శ్మశాన సంగీతం

-బాణాల శ్రీనివాసరావు

దాహమేస్తే సముద్రాల్నితాగి
భూగోళాన్ని క్షణాల్లో
మరుభూమిగా మార్చేది యుద్ధం
ఎడారుల్లో మానవ మొక్కల్ని మొలిపించి
రక్తహరితాన్ని చప్పరించేది యుద్ధం
ఆకాశం గుండెల్లో అణుబాంబుల్ని పేల్చి
ప్రపంచాన్ని అశ్రువుల్లో ముంచేది యుద్ధం
శాంతి వచనాలను ఒంటినిండా పులుముకొని
రక్తంతో కడుపు నింపుకునేది యుద్ధం

భయానికి బిగుసుకున్న శరీరాలు
ఆవేదనల వాగుల్లో కొట్టుకుపోయే శవాలు
ఎదురు చూపుల కన్నుల్లో దిగే
నిరాశల బాకులు

భయంచెట్టుకు ఉరేసుకునే
భవిష్యత్ ఆశలు...

పగలంతా శత్రువుల శరీరాల్లోకి తూటాల్ని
దూర్చిన యూనిఫారాలు
రాత్రిళ్ళు చీకటి ఇసుకలో తలల్ని దూర్చిన ఉష్ట్ర
పక్షులు

బాధ్యతల చొక్కాల్ని తొడుక్కొని ఆలోచన్ల
గుండెల్ని పెట్టుకోవటం
మర్చిపోయే సైనికయంత్రాలు

పెంచిన ప్రేమలు, అర్ధాంగినులు, ప్రతి రూపాలు
ప్రతిక్షణం
మనసు తెరమీద కదలాడినా కళ్ళల్లోంచి శత్రు
శిబిరాల మీద
కోపాగ్ని మిసైళ్ళను చిమ్మే మానవ బాంబులు
బంధాలకు దూరమైన రక్షణ యంత్రాల్లో
క్షణక్షణానికి పేలే అర్థంకాని ఆవేదనలు

అప్పుడు...
ఆకాశం కొమ్మకి నల్లగా పూసే చంద్రుడు
ప్రపంచమంతా వినిపించే శ్మశాన సంగీతం

## కథ

ఓల్గా

# సారీ జాఫర్




*ఆదివారం ఉదయం పేపర్ ఆమూలాగ్రం చదవకపోతే ఇక ఆ రోజు ఏదీ ఆనందించలేడు రామారావు. ఆలస్యంగా నిద్ర లేవటం పేపరంతా చదవటం ఈ రెండే రామారావుకి విలాసాలు. వాటిని కూడా భరించలేదు పార్వతి.*

*"బజారుకెళ్ళిరా. తర్వాత చదువుదువుగానీ, మాంసం దుకాణంలో మంచి లేత దంతా అందరూ కొనుక్కు పొయ్యే దాకా ఆ పేపర్ ఒదలవు. ప్రతి సారీ ఆ ముదురుది ఒండలేక తినలేకా చస్తున్నాం."*

పేపర్ చదువు తున్నంత సేపూ వంటింట్లోంచి ఆ నేపథ్య సంగీతం కూడా రామారావుకి అలవాటే.

పేపరంతా చదివి నగరంలో ఈనాడు దగ్గరికి వచ్చాడు. ఏవో సభలు సమావేశాల సమాచారం. అవి కూడా ఒదలడు.

"యుద్ధ వ్యతిరేక ప్రదర్శన. టాంక్ బండ్ మీద"

'వెళ్తే బాగుండు'

అలా ఈ మధ్య ప్రతి రోజూ ఏదో ఒకదాని గురించి అనుకుంటూనే ఉన్నాడు. కానీ ఏదో వెనక్కు లాగుతుంది.

ఇప్పుడా! పాతిక సంవత్సరాల నుంచీ అంతే. పిల్లలు పుట్టకముందు నయం. పుస్తకాలు చదివేశాడు. ఎప్పుడన్నా సభలకూ సమావేశాలకూ వెళ్ళేవాడు. పిల్లలిద్దరూ పుట్టాక ఇక అసలు తీరిక లేదు రామారావుకి. అంతా వాళ్ళే లాగేసుకున్నారు.

తన ఇద్దరు కొడుకుల్నీ చూసుకుని వాళ్ళ కోసమూ తన కోసమూ కూడా గర్వపడతాడు రామారావు. పెద్ద కొడుకు మూడేళ్ళ క్రితం ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని అమెరికా వెళ్ళిపోయాడు. సంవత్సరం క్రితం వచ్చి పెళ్ళి చేసుకుని భార్యను కూడా తీసుకెళ్ళాడు. రెండో కొడుకు ఇంజనీరింగ్ చివరి సంవత్సరం. ఆరునెలల్లో అతనూ అన్నదారే పడతాడు. వాళ్ళీ దశకు రావటానికి రామారావూ పార్వతీ పడిన కష్టం అంతా ఇంతా కాదు.

రామారావు ఎస్.ఎస్.ఎల్.సి.తో చదువు ఆపేసినా కొడుకుల్ని కోరిన చదువు చదివించాడు. దాని కోసం తన ఇష్టాలూ కోరికలూ అన్నీ త్యాగం చేశాడు. కొన్ని సంవత్సరాలపాటు ఉదయం ఏడింటి నుంచీ రాత్రి పదింటి వరకూ విశ్రాంతి లేకుండా పని చేశాడు. చేసే ఉద్యోగం కాక పది చిన్న ఉద్యోగాలు చేశాడు. పార్వతి కూడా ఒక ప్రైవేటు కంపెనీలో చిన్న ఉద్యోగం చేసింది. కొడుకులకు ఏ లోటూ రాకూడదు. ఇద్దరి ధ్యేయమూ ఒకటే.

పిల్లలిద్దరికీ మంచి భోజనం. కోరిన బట్టలు. నగరంలోకెల్లా మంచి విద్యాలయాల్లో సీట్లు.

పెద్దకొడుకు అమెరికా వెళ్ళాక కాస్త ఊపిరి పీల్చుకున్నారు. పార్వతి ఉద్యోగం మానేసింది. చిన్నకొడుకు కూడా అమెరికా వెళ్ళాక తనూ వి.ఆర్.ఎస్. తీసుకుందామని చూస్తున్నాడు రామారావు.

ఇన్నాళ్ళ తర్వాత చుట్టూ చూస్తే ప్రపంచం చాలా

మారినట్లుంది. చిన్నప్పుడు తను చదివిన పుస్తకాలన్నీ పాతవైనట్లు. తన ఆఫీసులో కొత్తగా చేరిన యువకుడొకడు. ఐనా అతనొచ్చి ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉంటాడు. "ఆ సాగర్ ఇవాళ ఈ యుద్ధ వ్యతిరేక ప్రదర్శనకు వెళ్తాడు." అనుకున్నాడు రామారావు.

"సరే–మన చేతుల్తో మనం చెడు చేయటంలేదు. అదే గొప్ప సంగతి ఈ పాడు ప్రపంచంలో. మంచి చేసే అవకాశం ఉంటే చేస్తాం. లేకపోతే లేదు." అనుకుంటూ తన ఆత్మను శాంతింప చేసుకుంటూ ఉండగా పార్వతి వచ్చి చేతిలో పేపర్ లాగేసింది.

రామారావు లేచి వెళ్ళబోతుండగా ఫోన్ మోగింది. వంటింట్లోకి వెళ్ళబోతున్న పార్వతి నెత్తికొట్టుకుంది. ఆ ఫోన్ త్వరగా ముగించమని సైగలతో చెప్పే ప్రయత్నం చేస్తూ ఎదురుగా నుంచుంది.

రామారావు ముఖం క్రమంగా సంతోషంతో ఎరుపెక్కి విశాలం కావటం చూసి సైగలు ఆపింది.

"జాఫరాలీ–వస్తున్నాడు. వాళ్ళమ్మాయితో. ఇక్కడ ఉద్యోగమ యిందట." ముక్కలు ముక్కలుగా సంతోషాన్ని పంచాడు.

"ఎప్పటి జాఫరాలీ–ఇప్పుడు జ్ఞాపకం ఒచ్చామటనా?" పార్వతి కూడా సంతోష పడింది.

రామారావు మనసులో ఆనందం ఊటబావిలోంచి నీరూరినట్లు ఊరుతోంది. పదిహేనేళ్ళపైనే అయింది జాఫరాలీని చూసి. కరీంనగర్‌కీ హైదరాబాద్‌కీ మధ్య దూరం రెండొందల మైళ్ళు అనుకుంటాంగానీ పదిహేనేళ్ళ పైగా ఉంది అనుకున్నాడు.

"రేపు ఉదయం ఒస్తున్నాడు. వాళ్ళమ్మాయి నసీమాకు ఇక్కడే ఉద్యోగం దొరికిందట. ఇవాళ్ళ మాంసం ఒండొద్దు. రేపు చికెన్, మటన్ బిర్యానీ – నీ ఇష్టం – ఏమేం సరుకులు కావాలో చెప్పు. ఇవాళే తెచ్చేస్తా" ఉత్సాహంతో పొంగిపోతున్నాడు రామారావు.

D D D

రామారావు పదిహేడేళ్ళ వయసులో హైదరాబాద్ వచ్చాడు. ఆ తారీకు కూడా అతనికి బాగా గుర్తు. 1964 నవంబర్ నాలుగో తారీకున రైలు దిగాడు. ఉద్యోగం వెతుక్కుంటూ ఆరు నెలలు హైదరాబాదంతా చెడ తిరిగాడు. ఉద్యోగం వెతుక్కుంటూ అనటం కంటే హైదరాబాద్‌ను కనుగొంటూ అనటం సరిగా ఉంటుందేమో. తెనాలి పక్కనున్న పల్లెటూరి నుంచి వచ్చిన అతనికి హైదరాబాద్‌లో అంతా వింతే. అందువల్లే బస్సు కూడా ఎక్కకుండా హైదరాబాద్ సందుగొందులన్నీ సర్వే చేసే ఉద్యోగాన్ని ఎవరూ ఇవ్వకుండానే దిగ్విజయంగా చేశాడు.

అదుగో అప్పుడే జాఫరాలీ పరిచయమయ్యాడు. ఆ రోజుల్లో రామారావుకి ప్రతి ఆదివారం అబిడ్స్ వెళ్ళటానికే తెల్లవారేది. అబిడ్స్‌లో ఆదివారం పెద్ద ఎత్తున జరిగే పాతపుస్తకాల అమ్మకాల మహోత్సవం. ఔను. అది రామారావుకి ఉత్సవం లాగే ఉండేది.

ఆ ఉత్సవపు ఊరేగింపులో తనను తానొక రాజకుమారుడిగా భావించుకుంటూ నడిచేవాడు. పుస్తకాల పేర్లు చదవటమే ఆనందంగా ఉండేది. వాటిని తాకుతుంటే ఇక చెప్పనక్కర్లేదు. స్వంతం చేసుకున్నాడా పెద్ద నిధి దొరికినట్లే. సాయంత్రం వరకూ అక్కడే ఆ వీధుల్లోనే సర్వం మరిచిపోయి తిరిగేవాడు. దొరకని ఉద్యోగపు చింత దొరికిన పుస్తకంతో తీరిపోయేది. పాత పుస్తకం పట్టుకుని ఒస్తున్న రామారావుని చూసి అప్పాయింట్‌మెంట్ ఆర్డరుతో ఒస్తున్నాడనుకునేవాడు రామారావు మేనమామ. వాళ్ళింటో ఉండే ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు.

అలా అబిడ్స్ వీధుల్లో నడుస్తున్న రామారావు 1965 ఫిబ్రవరి 26వ తారీకున హఠాత్తుగా ఒకచోట ఆగిపోయాడు. పాత పుస్తకాల దుకాణమే అది. అక్కడొక పుస్తకం చేతులెత్తి పిలుస్తోంది. కళ్ళు మెరుస్తుండగా ఆ పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. "అమీనా–గుడిపాటి వెంకటచలం." అట్టమీది అక్షరాలను ఆప్యాయంగా తడిమాడు.

ఈ పుస్తకం గురించి అతని మిత్రుడొకడు తెగ చెప్పాడు. ఆ పుస్తకం చదవకుండా చలం రచనలెన్ని చదివినా వృధా అన్నాడు. చదవలేదని రామారావు పశ్చాత్తాప పడుతున్న కొద్దీ రెచ్చిపోయి అమీనాను ఆకాశానికి ఎత్తాడు. ఇప్పుడు ఆకాశం నుంచి చందమామ దిగివచ్చి చేతుల్లో వాలితే ఎట్లా ఉంటుందో అట్లా వుంది రామారావుకి.

ఈ పుస్తకం కొనక తప్పదు. జేబులో పావలా బైటి కురకటానికి తొందరపడుతోంది.

"ఈ పుస్తకం ఎంత" ముందు అలవాటుగా తెలుగులో అడిగి నాలుక కరుచుకుని హిందీలో అడగటానికి మాటలు కూడదీసుకుంటుండగా దుకాణంలో యువకుడు "ఆరణా" అన్నాడు.

"తెలుగు అర్థమవుతుందా" అంటూ జేబులు తడివి చూసుకుంటే పావలా బిళ్ళా, పది పైసల బిళ్ళా తప్ప మరేమీ దొరకలేదు.

"చారనాకివ్వొచ్చు. చిన్న పుస్తకమేగా" అన్నాడు. బేరాలు చెయ్యటం రామారావుకి బాగానే వచ్చు.

"చిన్న పుస్తకమా? చలం. వెంకట చలం. తెనాలి, బెజవాడ వెళ్ళి అడుగు తెలుస్తుంది. వెంకట చలం పేరు విన్నావా? ఆ చలం పుస్తకం అది. చిన్న పుస్తకం, పెద్ద పుస్తకం అంటూ మాట్లాడకు" గద్దించాడా యువకుడు.



ఆ యువకుడికి తెలుగు తెలియటమే కాకుండా చలం తెలిసినందుకు రామారావు పొంగిపోయాడు. జేబులోంచి రెండు నాణాలూ తీసి ఇంతే ఉంది. ఉంటే రెండు రూపాయలైనా ఇచ్చేవాడిని. చలం పుస్తకాలు చాలా ఉన్నాయి. నా దగ్గర. ఇది లేదు. ఒదల్లేక అడిగా" ఇప్పుడు పరేషాన్ అవటం ఆ యువకుడి వంతయింది.

"సరే తీస్కో" అంటూ అందించాడు. పావలానే తీసుకున్నాడు. "నీ పేరేంటి" అడిగాడు రామారావు

"జాఫరాలీ"

ఒకరి గురించి ఒకరు తెలుసుకున్న ఆ ఘడియ ఎలాంటిదోగాని ఇక ప్రతాదివారమూ జాఫరాలీ, రామారావు కలవటం తప్పలేదు. ఉర్దూ అక్షరమ్ముక్క రాని రామారావుకి జాఫరాలీ ఉర్దూ నేర్పాడు. జాఫరాలీకి ఒచ్చిన తెలుగుకి రామారావు మెరుగులు దిద్దాడు. ఉర్దూ కవిత్వం చదవకపోతే బతకటం దండగ అని జాఫరాలీ– శ్రీశ్రీ, చలాన్ని చదవకపోతే జాఫరాలి హుస్సేన్‌సాగర్‌లో పడి చచ్చిపోవచ్చని రామారావూ బీరాలు పలుక్కున్నారు. ఇద్దరూ బతకాలనే తీర్మానించుకుని బతికారు. ఒక ఆదివారం రాత్రి రామారావు జాఫరాలీ వెంట వాళ్ళింటికి వెళ్ళాడు. వాళ్ళ నాన్న మంచానపడి ఉన్నాడు. అమ్మ ఆరోగ్యంగానే ఉండి ఇంటి భారమంతా మోస్తోంది. వాళ్ళ వివరాలన్నీ షషతాజీ బేగమే చెప్పింది. ఖమ్మం నుంచి దాదాపు ఇరవై ఏళ్ళ క్రితం హైదరాబాద్ ఒచ్చిన కుటుంబం వాళ్ళది. యూనియన్ సైన్యాలొచ్చిన ఏడాదికి వచ్చామని మధ్యలో కల్పించుకుని చెప్పాడు తండ్రి. ఆయన పాత పుస్తకాల వ్యాపారం చిన్నగా మొదలెట్టి పెద్దది చేసి మంచాన పడ్డాడు. నలుగురక్కల తర్వాత పుట్టిన జాఫరాలీ అంటే వాళ్ళకు ప్రాణం అని జాఫరాలీ వంక వాళ్ళు చూసే చూపుల్లోనే అర్థమవుతుంది. నలుగురక్కలకూ పెళ్ళిళ్ళయ్యాయి. వాళ్ళు ఖమ్మం, వరంగల్లు జిల్లాల్లో ఉంటున్నారు. జాఫరాలీకి ఇక్కడ పెద్ద బంధుబలగం కూడా లేదు.

జాఫరాలీ వాళ్ళమ్మ ఒండిన మాంసంకూర రుచి రామారావు అంతకు ముందెరగడు. ప్రతాదివారం భోజనానికి వస్తానని చెప్పాడు. నిజంగానే రెండేళ్ళపాటు ప్రతాదివారం వెళ్ళాడు. రంజాన్ సమయంలో

చెప్పనే అక్కర్లేదు. తిన్నంత హలీమ్.

ఇద్దరూ కడుపునిండా తిని వాళ్ళింటి వెనకున్న జానెడు చోట్లో సర్దుకునే వారు. ఆకాశం కింద పడుకుని నక్షత్రాలు చూస్తూ పాటలు పాడుకునే వాళ్ళు.

యవ్వనం, కవిత్వం, చందమామ, నక్షత్రాలు కావాల్సిందేమిటి? ఏ రెండింటి దాకానో తెలుగు హిందీ సినిమా పాటలూ, ఉర్దూ గజల్స్ తెలుగు కవిత్వమూ పాడుకునీ పాడుకునీ అలసి నిద్రపోయేవాళ్ళు. 1970లో రామారావుకి పెళ్ళయ్యే దాకా ఇదే వరస. ఆ తర్వాత ఆదివారం రాత్రులు కట్ అయ్యాయి. తర్వాత రెండేళ్ళకు జాఫరాలీ పెళ్ళయింది.

పార్వతీ, ఫాతిమా కూడా స్నేహితులయ్యారు. పెళ్ళయ్యాక స్నేహితులిద్దరికీ బాధ్యతలు పెరిగాయి. రామారావు ఉద్యోగంలో ప్రమోషన్ల కోసం ప్రైవేటుగా డిగ్రీ చదవటం, డిపార్ట్‌మెంట్ పరీక్షలు రాయటం వీటిలో పడితే జాఫర్ వ్యాపారాన్ని పెంచే పనిలో పడ్డాడు. ఇద్దరికీ పిల్లలు పుట్టుకొచ్చారు. వాళ్ళ చదువులూ, సంధ్యలూ, పెద్దవాళ్ళ జబ్బులు, మందులు, ఆస్పత్రులూ, మరణాలు కాలం పరిగెత్తుతూ పోయింది.

మధ్యమధ్యలో మిత్రులను కలపటానికి రంజాను, బక్రీదు, దసరా, దీపావళీ వచ్చి పోతుండేవి.

జాఫరాలీకి నలుగురు ఆడపిల్లలు. రామారావు ఉద్యోగంలో పైకి పోతున్నాడు. జాఫరాలీ వ్యాపారం కుంగిపోతోంది. రామారావుని ఏనాడూ అప్పడగని జాఫర్ అతనికి పెద్ద సాయం చేశాడు. మెహదీపట్నంలో తనకు తెలిసిన వాళ్ళు తమ ఇంటిని కారుచౌకగా అమ్ముతుంటే అది రామారావు కొనేలా చేశాడు. అదే సమయంలో తన చిన్న ఇల్లు అమ్ముకుని అద్దె ఇంట్లోకి మారాడు.



కలిసిరాని వ్యాపారం ఒదిలేసి, హైదరాబాద్ ఒదిలేసి, కరీంనగర్‌లో తన బావ పెట్టే ఫర్నీచర్ షాపులో భాగం కలిసి వెళ్ళిపోయాడు. అక్కడికి వెళ్ళేముందు జాఫర్ కుటుంబాన్ని పిల్చి మంచి విందు చేశాడు రామారావు. చాలా రోజుల తర్వాత స్నేహితులిద్దరూ డాబా మీద చేరి పాత రోజులు నెమరేసుకుంటూ, పాతపాటలు పాడుకుంటూ గడిపారు. ఫాతిమా, పార్వతులను మీ వల్లే మా పాటలు ఆగిపోయాయని సరదాగా నిందించారు.

నిద్రపోతున్న పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించారు. జాఫరాలీ కరీంనగర్ వెళ్ళాక ఇక వెనక్కు తిరిగి చూడలేదు. కాగితాలతో కలిసిరాని అదృష్టం కలపముక్కలతో వచ్చింది. ఇల్లు కట్టాడు. ముగ్గురాడపిల్లల పెళ్ళిళ్ళు చేశాడు. నాలుగో అమ్మాయి నసీమాను మాత్రం చదివించాడు.

ఆ అమ్మాయి బి.కాం. పాసై బ్యాంకు పరీక్షలు రాసి చిన్న ఉద్యోగం సంపాదించుకుంది. నసీమాను ఉద్యోగంలో చేర్చటానికి ఇరవై ఏళ్ళ తర్వాత రామారావు దగ్గరికి వస్తున్నాడు జాఫరాలీ.

ఆదివారం అంతా పార్వతీ రామారావులు జాఫరాలీ గురించే మాట్లాడుకున్నారు. ముఖ్యంగా తమ ప్రేమ వివాహానికి పెద్దలను ఒప్పించి రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళి చేయించటంలో జాఫరాలీ చూపిన చాకచక్యాన్ని తల్చుకుని సంతోషించారు. సోమవారం ఉదయాన్నే జాఫరాలీ రానే వచ్చాడు. నల్లని బురఖాలో తెల్లని చంద్రబింబంలా నసీమా కూడా ఒచ్చింది. కుశల ప్రశ్నలయ్యాక పార్వతి వంటలో పడింది. ఉదయం ఫలహారానికి గారెలు, కోడికూరా తయారవుతున్నాయి. ఇంతలో రెండో కొడుకు వినయ్ గబగబా వచ్చాడు ''అమ్మా–వాళ్ళెవరూ మనింటికెందుకొచ్చారు'' అంటూ, అతని ముఖంలో ఏదో చికాకు.

“జాఫర్ మామయ్యరా. మర్చిపోయావు. చిన్నప్పుడు నీకు మాంసంలో ఎముకుల్లోంచి గుజ్జెలా తియ్యాలో నేర్పాడే ఆ మామయ్య” పార్వతి హుషారుగా చెప్పింది. వినయ్ ముఖం చిట్లించాడు.

మర్చిపొయ్యావు. నువ్వప్పుడు చిన్న వెధవ్వి. ఐదారేళ్ళుంటాయేమో. ఆ తర్వాత వాళ్ళు కరీంనగర్ వెళ్ళిపోయారు.”

“సరే– ఇప్పుడెందుకు ఒచ్చారు?”

“అదేంట్రా ఎందుకొచ్చారేంటి. ఇన్నాళ్ళకు ఒచ్చారు. నసీమాకు ఉద్యోగం. మన పక్కవీధిలో ఉన్న బ్యాంకులో చేర్చటానికి జాఫర్ మామయ్య వచ్చాడు.” కొడుకు తీరు అర్థం కాక కాస్త అయోమయంగా చూసింది పార్వతి.

“ఈ హైదరాబాద్‌లో వాళ్ళకు ముస్లిం బంధువులుగానీ, స్నేహితులుగానీ లేరా? మనింటికెందుకొచ్చారు?

పార్వతికి నోటమాట రాలేదు. కొడుకు ఉద్దేశం అర్థం కానూలేదు.

“ఇప్పుడు మనింటికొస్తే నీకేమైంది?”

“నాకిష్టం లేదు. ముస్లింలు మనింట్లో ఉండటమేంటి?”

కొడుకు ముఖం వంక ఆశ్చర్యంతో చూసింది.

“ఎన్నాళ్ళుంటారు?”

“ఏమో” బలహీనంగా అంది.

“తొందరగా పంపించండి. మా ఫ్రెండ్స్ చూస్తే బాగుండదు. అయినా నాన్నకు ముస్లిం స్నేహితులేంటి?” విసురుగా వెళ్ళిపోయాడు. పార్వతికి లోపల్నించి పెద్ద దడ పుట్టుకొచ్చింది. అప్పటికప్పుడు రామారావుతో ఈ సంగతి చెప్పాలనిపించిందిగానీ ఎలాగో అణచుకొని గారెలు ఒండటంలో పడింది.

ఫలహారాలయ్యాక జాఫరాలీ, నసీమా బ్యాంకుకు వెళ్ళారు.

రామారావు ఒస్తానంటే ఒద్దన్నారు.

రామారావు ఆ రోజు శలవు పెట్టాడు. ఫలహారం బరువై మత్తుగా ఉంది. కళ్ళు మూతలు పడుతుండగా పార్వతి ఎప్పుడు రామారావు ఒంటరిగా చిక్కుతాడా అని చూస్తుందేమో హడావుడిగా వచ్చింది.

“మనవాడేమంటున్నాడో తెలుసా?”

“లేదే–”

నాతో వాళ్ళిద్దర్నీ తొందరగా పంపిచెయ్యండి. ముస్లింలంటే నాకిష్టంలేదు. నాన్నకీ ముస్లిం స్నేహితులేంటి అన్నాడు.” పార్వతి గబగబా చెప్పేసి బరువు దించుకుంది.

రామారావుకి ఓ క్షణం ఏమీ అర్థం కాలేదు. అర్థమయ్యాక గుండె దడదడ లాడింది. ఆ దడ తగ్గించుకుంటూ “ఏడ్చాడు వెధవ” అన్నాడు.

“అదేంటి వాడలా ఎందుకన్నాడు'' పార్వతి అశాంతి తగ్గటంలేదు.

“ఒళ్ళు పొగరెక్కి”

“వాడికి ముస్లిమంటే పడదెందుకు? క్రికెట్ మ్యాచ్‌లో పాకిస్తాన్ వాళ్ళను ఎంత బాగా ఆడినా తిడతాడు” పార్వతి కొడుకు నేపథ్యాన్ని ఇప్పటి ప్రవర్తనతో పోల్చి చూసుకుంటుంది.

రామారావుకి పడదుగానీ పార్వతికి క్రికెట్ అంటే ఆసక్తే. కొడుకుల్తో కలిసి చూస్తుంది. ఆటగాళ్ళందర్లోకీ ఆవిడకు వసీం అక్రం అంటే ఇష్టం. ఆవిడ ఆ ముక్క బహిరంగంగా అన్న రోజున వినయ్ పెద్ద యుద్ధమే చేశాడు. తల్లి తన అభిమానాన్ని మార్చుకోవాల్సిందేనని పట్టుబట్టాడు.

"ఏమోరా నాకిష్టం. బాగా ఆడతాడు. పైగా అమీర్‌లా ఉంటాడు" అంది పార్వతి.

"అమీరా? అతనెవరూ? అమీర్ ఖానా?" తనకు తెలియని వ్యక్తి తల్లికి తెలియటం, పైగా ఇష్టమవటం, అతనిలా ఉంటాడని వసీం అక్రంను ఇష్టపడటం – వినయ్‌కి వెర్రెత్తింది.

"అమీరంటే మైదానంలో హీరోలే. మైదానమంటే చలం నవల."

తల్లికున్న పుస్తకాల పిచ్చ వినయ్‌కి తెలుసు. అతనికి తెలుగు రాదు. మంచి చదువుకోసం తెలుగు చెప్పని బళ్ళలో చదివించారు. తనకు తెలిసే అవకాశం కూడా లేని ఆ అమీర్ నేం చెయ్యాలో తెలియక పళ్ళు నూరుకుని ఊరుకున్నాడు. కానీ ఆ విషయంలో తల్లీ కొడుకులిద్దరూ గొడవపడే వాళ్ళే. పార్వతి దాన్ని సరదాగా తీసుకునేది. అదేదో క్రికెట్ పిచ్చ అనుకుంది గానీ తన కొడుక్కి మతపిచ్చ అనుకోలేదు.

దేశంలో పెచ్చు పెరుగుతున్న మతోన్మాదం సరాసరి తన ఇంట్లోకే వచ్చి తిష్ట వేస్తుందని రామారావు ఒక్కనాటికీ అనుకోలేదు. కొడుకు మనసు ఎట్లా పని చేస్తోందో ఇన్నాళ్ళుగా కనుక్కోలేకపోయినందుకు ఆయనలో ఆందోళన మొదలయింది. ఆ ఆందోళనలో ఉండగానే జాఫరాలీ వచ్చాడు. నసీమా డ్యూటీలో చేరిపోయింది. జాఫరాలీని చూస్తే రామారావుకి ప్రేమ పొంగింది. కొడుకు మీద కోపం పెరిగింది. సాయంత్రం జాఫరాలీకీ కొడుక్కీ స్నేహం కుదిర్చి వీడి విముఖత పోగొట్టాలనుకున్నాడు. చిన్న వెధవ. ఏ చెడు సావాసాలో పట్టి ఉంటాడు. మరీ ఈ క్రికెట్టు జనాల్ని పాడు చేస్తోంది అనుకుని ఆ విషయం అంతటితో ఒదిలేశాడు. జాఫరాలీతో మంచీ చెడ్డా మాట్లాడుతూ కూచుని భోజనాలు కానిచ్చారు. ఇద్దరూ నిద్రపోయి లేచేసరికి నసీమా వచ్చేసింది. పార్వతితో గలగలా కబుర్లు చెబుతోంది. ఇంట్లో ఆడపిల్ల ఉంటే ఎంతైనా ఆ కళే వేరు అని ఆ వయసు ఆడపిల్లలెవరొచ్చినా రామారావు సంతోషపడతాడు. అలాగే సంతోషపడుతుండగా రామారావు సంతోషపడతాడు. అలాగే సంతోషపడుతుండగా వినయ్ ఒచ్చాడు. కొడుకుని చూసి బిత్తర పోయాడు రామారావు. నుదుటి మీద ఎర్రగా ఇంత బారున కుంకుమ బొట్టు.



"అదేంటి ఆ వేషం" అన్నాడు చిరాగ్గా.

"నా ఇష్టం నాకిది బాగుంది" అన్నాడు వినయ్ విసురుగా. రామారావుకి ఏం అనాలో తెలియలేదు. ఎదురుగా జాఫరాలీ. "మీ జాఫర్ మామయ్యరా. చిన్నప్పుడు నిన్నెత్తుకు మోశాడు" వినయ్ జాఫర్ వంక చూసి తలాడించి గదిలోకి వెళ్ళిపోయాడు. రాత్రి భోజనాల్లో కొడుకు తమతో కూర్చోనందుకు రామారావు నొచ్చుకున్నాడు.

రాత్రి అందరూ డాబా మీద చేరారు వినయ్ తప్ప. ఎంత పిల్చినా వినయ్ రాలేదు. నసీమా, పార్వతులు నిద్ర వస్తుందని కిందికి దిగి వెళ్ళాక రామారావు జాఫర్‌తో తన మనసుతో మాట చెప్పాడు.

"మావాడు బాగా చెడిపోయినట్లున్నాడురా. మీరు మా ఇంటికి రావటం వాడికిష్టంలేదు. కారణం మీరు ముస్లింలని" జాఫరాలీ ముందు నివ్వెరపోయి తర్వాత నవ్వాడు. "మీవాడేంటిరా. దేశమే చెడిపోయింది. మా ముస్లింలను దేశద్రోహులంటుంది. బాబ్రీ మసీదు తర్వాత చాలా మారింది గదా"

"దేశాన్ని బాగు చెయ్యటం నా వల్లకాదు. నా కొడుకుని బాగు చేసుకోవాలి. వాడికి ఎక్కిన పిచ్చ దించాలి"

"కష్టం నువ్వు దించలేవు"

"ఎందుకిట్లా అయిందంటావు. వాడి వయసులో మన స్నేహం ఎంత హాయిగా ఉండేది. మీ రుచులు నేనూ, మా రుచులు నువ్వూ ఎంతగా ఇష్టపడ్డాం."

"ఎందుకో తెలిసినట్లూ ఉంటుంది. తెలవనట్లూ ఉంటుంది. పాడు రాజకీయాలని తిట్టుకోవటం తప్ప ఏమీ చెయ్యలేకపోతున్నాం".

"మా వాడిని మార్చాలి"

"ప్రయత్నించు"

"మీ అమ్మాయి బురఖా వేస్తోందేం? మీ ఆవిడకు లేదుగా?"

"ఇప్పుడావిడా వేస్తోంది."

"అలాగా" మూలిగాడు రామారావు.

"నేను రేప్పొద్దున వెళదాం అనుకుంటున్నా. అమ్మాయిని కొన్నాళ్ళు మీ ఇంట్లో ఉంచితే ఓ నెలలో ఎక్కడన్నా గది చూసుకోవటమో, హాస్టల్లో చేరటమో చేస్తుందనుకున్నా. మరిప్పుడేం చేద్దాం. మా చుట్టాలున్నారు. వాళ్ళింటో దింపి వెళ్ళనా?" సందేహంగా అన్నాడు.

"ఇంకానయం. మావాడేదో తెలిసీ తెలియకా వాగితే నేను వాడి మాట పాటిస్తాననుకున్నావా? ఈ నెల మా ఇంట్లోనే ఉంటుంది. నేనీ ప్రాంతంలో ఏదన్నా గది దొరుకుతుందేమో చూస్తాను. హాస్టళ్ళు కూడా ఉండాలి. చూద్దాం. నువ్వింకేం మాట్లాడకు" అన్నాడు పట్టుదలగా.

"సరే నీ ఇష్టం. నీకేదన్నా సమస్య అయితే ఫోన్ చెయ్యి. నేనొచ్చి ఏదో ఒకటి చేస్తాను." నీరసంగా అన్నాడు జాఫరాలి. ఇద్దరి మనసులూ బరువెక్కాయి. స్నేహపు తీపి జ్ఞాపకాల్తో మత్తెక్కాల్సిన హృదయాలు బాధతో మూలుగుతున్నాయి. ఎందుకిలా? ఎందుకిలా?

తెలుస్తోంది? కానీ ఏం చెయ్యలేము. ఏం చెయ్యలేమా? మన పిల్లల్ని మనం రక్షించుకోలేమా?

ప్రశ్నలు. ప్రశ్నలు.

కొడుకు మీద కోపం నిలుపుకోవటం కూడా కష్టంగా ఉంది రామారావుకి. మొదట్నించీ చుట్టూ ఉన్న మంచి తప్ప చెడు చూడని తత్త్వం అతనిది. చూసినా కళ్ళు మూసుకుని అవతలకు పోయే స్వభావం. మంచీ చెడూ తెలిసినా చెడుని చూసి తలవంచుకు వెళ్ళే కోట్లాది మధ్యతరగతి మనుషుల్లో అతనొకడు. మర్నాడు జాఫరాలీ వెళ్ళిపోయాడు.

నసీమా బురఖా వేసుకుని తమ ఇంట్లోంచి బైటికెళ్ళటం చూస్తే వినయ్‌కి ఒంటినిండా కారం రాసుకున్నట్లుంది.

తల్లి దగ్గరకు వెళ్ళి "ఈ అమ్మాయి ఎన్ని రోజులుంటుంది" అని అడిగాడు వెనకాలే ఒస్తున్న తండ్రిని చూసుకోకుండా.

"ఎన్ని రోజులేంటి? మనింట్లోనే ఉంటుంది. నీకేంటి బాధ?"

పెద్దగా కోపం మారు మోగింది గొంతులో.

"బురఖా వేసుకుని మనింట్లోంచి అలా వెళ్ళటం అసహ్యంగా ఉంది"

"పిచ్చి పిచ్చిగా వాగకు. ఆ పిల్లకిష్టం ఒచ్చినట్లు ఉంటుంది. మధ్యలో నీ ఇష్టం ఏమిటి?"

"అసలు నీకీ ముస్లిం స్నేహితులేంటి?"

"ఏం ఉండకూడదా– నీ పర్మిషన్ తీసుకుని స్నేహాలు చెయ్యాలా?" తండ్రి గొంతు పెద్దది చేసి కళ్ళురమటంతో వినయ్ అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

ఆ రోజు సాయంత్రం కూడా వినయ్ పెద్ద బొట్టు పెట్టుకుని వచ్చాడు. అది అలాగే ఉంచుకుని ఇల్లంతా తిరిగాడు. రామారావు దాన్ని చూసి చిరాకుపడి, అడిగి లాభం లేదని ఒదిలేశాడు. కొడుకులకు గట్టిగా ఒక విషయం చెప్పి ఆజ్ఞాపించటం రామారావుకి చేతకాదు. ఆ అవసరం లేకుండానే ఇంతకాలం గడిచింది. వాళ్ళ మాటలు విని వాళ్ళ కోర్కెలు తీర్చటం అలవాటైంది. పిల్లలు చదువులో ఎక్కిరావటంతో వాళ్ళ

మీద కోపం తెచ్చుకోవాల్సిన అవసరం, వాళ్ళ గురించి దిగులు పడాల్సిన అవసరం ఏనాడూ రాలేదు. చదువు తప్ప మరో విషయం అతను పెద్దగా పట్టించుకోలేదు. చికాకైన మనసు సరి చేసుకుంటూ

"పార్వతీ అన్నాలు పెట్టు. అందరం కలిసి తిందాం" అని పెద్దగా అరిచాడు.

"నేనిప్పుడే తిన"నంటూ వినయ్ అంతకంటే పెద్దగా కేకేశాడు.

"నువ్వూ తినవా నసీమా" అంది పార్వతి ఉద్రిక్తంగా.

"నేను తింటానాంటీ" అంది నసీమా.

"వాడికి కూడా పెట్టు" పెద్దగా అరిచాడు రామారావు.

చివరికి నలుగురూ డైనింగ్ టేబుల్ దగ్గర చేరారు.

నసీమా తెల్లని నైటీలో నల్లని పెద్ద జుట్టు విరబోసుకుని దేవకన్యలా ఉంది.

ఆ పిల్లవైపు కన్నెత్తి, చూడకుండా తింటున్న వినయ్‌ని చూస్తే చీదరేసింది రామారావుకి.

తన ముందు ఒక అందమైన అమ్మాయి కూర్చుంటే చూడకుండా ఉండేంత బండ అయ్యాడా వీడు.

నసీమా కేసి చూశాడు. ఆ పిల్ల కూడా వినయ్ కేసి చూడటం లేదు.

"వినయ్ నసీమాకు రేపాదివారం హైదరాబాదంతా చూపించ రాదూ?" అన్నాడు అనునయంగా.

''ఇంకానయం'' అన్నాడు వినయ్ తలెత్తకుండా.

"ఏం"

"ఆ బురఖాను వెంటేసుకుని నేను తిరగాలా?" అన్నాడు వ్యంగ్యంగా.



నసీమాను ముందుంచుకుని అంత మొరటుగా మాట్లాడిన వినయ్‌ని చూసి ఏం చెయ్యాలో అర్థం కాలేదు.

"నేనూ మీ అబ్బాయితోవెళ్ళనంకుల్" అంది నసీమా.

"ఏం"

"ఆ పెద్ద బొట్టుతో ఉన్న మీ అబ్బాయి వెంట తిరిగితే" నసీమా ఆగింది.

రామారావు పెద్దగా నవ్వి

"బాగా అంటించావమ్మా గుడ్. అలా ఉండాలి ఆడపిల్లలు" అన్నాడు.

వినయ్ నసీమా వంక కొరకొరా చూశాడు.

నసీమా నవ్వుతూ చూసింది.

ఆ నవ్వు చూసి వినయ్ చిత్తవ్వాలనుకున్నాడు రామారావు.

వినయ్ చిరచిరలాడుతూనే ఉన్నాడు.

"నాకే అధికారం ఉంటే వీడికీ నసీమాకూ పెళ్ళి చేసేవాడిని" అన్నాడు రామారావు పార్వతితో.

"మీకా అధికారంలేదు లెండి" అందామె పెద్ద కొడుకు పెళ్ళి తల్చుకుంటూ.

"వీడిని మార్చలేమా పార్వతీ"

"నాకు నమ్మకం లేదు." పార్వతి గట్టిగానే అంది.

D D D

నసీమా ఇంట్లో ఉండటం తనకిష్టం లేదన్న విషయాన్ని స్పష్టం చేయటమే ధ్యేయంగా పెట్టుకున్నట్టు ప్రవర్తిస్తున్నాడు వినయ్. ఆ అమ్మాయి ఉన్నవైపు పొరపాటుగా కూడా వెళ్ళడు. రాత్రిళ్ళు పొద్దుబోయి ఇంటికి వస్తున్నాడు. అదేమిటని పార్వతి అడిగితే "మీ స్నేహితులు ఇళ్ళు ఆక్రమించారుగా, వాళ్ళను పోనీ" అంటాడు.

ఒక రోజు రామారావు కొడుకుతో మాట్లాడాలని అతను ఒచ్చేదాకా మేలుకుని కూర్చున్నాడు.

పన్నెండు గంటలకు ఒచ్చినవాడు భోజనం చెయ్యకుండా టి.వి. పెట్టాడు.

"ఒరే నీతో మాట్లాడాలి ఇలారా" అన్నాడు రామారావు బెడ్‌రూంలోంచి

"ఒక నిముషం నాన్నా ఈ పాట చూసి" కొడుకు సమాధానం విని తండ్రే లేచి వచ్చాడు. టి.వి.లో సినిమా పాటేదో వస్తోంది. కొడుకుతో ఎలా మాట్లాడాలా అని ఆలోచిస్తూ టి.వి. వైపు చూసిన రామారావు ఆశ్చర్యంతో అలాగే చూస్తుండి పోయాడు. పాతబస్తీ వీధుల్లో చార్మినార్ మీదా హరేరామా హరే కృష్ణ అని భజన చేస్తున్న కాషాయిధారులు. రామారావుకి చాలా ఇబ్బందిగా అనిపించింది. పాట మామూలుగా ఉందిగానీ విజువల్స్ భయం పుట్టించేలా ఉన్నాయి. జాఫరాలీ చూస్తే ఏమనుకుంటాడు. వాళ్ళకింకెక్కడా చోటు దొరకలేదా. చార్మినార్ మీదకెక్కి హరేరామ అంటూ భజన చెయ్యాలా? ముస్లిం విద్వేషాన్ని కక్కిన సినిమాలు కొన్ని అతనూ చూసి తిట్టుకున్నాడు. కానీ ఆ సినిమాలలోలాగానే తనింట్లో కూడా ఒక భాగం తయారవుతుందనుకోలేదు. పాట పూర్తయ్యాక వినయ్ టి.వి. కట్టేసి

"ఏంటి నాన్నా" అంటూ ఒచ్చాడు.

రామారావుకి మాట్లాడబుద్ధి కాలేదు. టి.వి.లో చూసిన ఆ దృశ్యాలు ఎంత మూర్ఖంగా ఉన్నాయో వీడూ అంత మూర్ఖంగా ఉంటాడు. ఎవరిదీ తప్పని ఒప్పుకోరు. తన ఆఫీసులో ఇట్లాంటి వాళ్ళు కొందరున్నారు. వాళ్ళను చూసి చిరాకుపడి దూరంగా ఉంటున్నాడు. కొడుకుతో దూరంగా ఉండటం ఎలా? మనసంతా గందరగోళమైపోయి తనవంక చిత్రంగా చూస్తున్న కొడుకుతో "ఏం లేదులే పడుకో పో" అని తనూ వెళ్ళి పడుకున్నాడు. పార్వతి అలా ఊరుకోలేకపోయింది. నసీమా బురఖా తీసేస్తే కొడుకు అయిష్టం తగ్గుతుందేమోనని ఆశ పడింది. వినయ్ మాట్లాడితే బురఖా అంటున్నాడు.

ఆ రెండు రోజుల తర్వాత ఓ సాయంత్రం నసీమా పెద్దజడ విప్పి నూనె రాసి చిక్కుతీస్తూ అడిగింది పార్వతి.

"మీ అమ్మ బురఖా వేసుకునేది కాదుగా నసీమా. నువ్వెందుకు వేస్తున్నావు?"

"మేం ముస్లింలం కదా ఆంటీ"

"ఐతే–"

"మీరు బొట్టు పెట్టుకుంటారుగా, అట్లాగే" సింపుల్‌గా చెప్పింది. పార్వతి మాట్లాడలేకపోయింది.

"ఇబ్బందిగా ఉండదూ?"

"లేదాంటి. అలవాటయింది" బురఖా అంటే ఫాతిమాకు ఇష్టం ఉండేది కాదు. మరి నసీమా.

"గాలాడదు గదమ్మా. అది తీసేస్తే ఏం?"

"ఎలా తీస్తాం ఆంటి. మేం ముస్లింలం కదా బురఖా వేసుకోవాలి. లేకపోతే మీకూ మాకూ తేడా ఎలా తెలుస్తుంది?"

"మీకూ మాకూ తేడా తెలియాలా నసీమా"

"తేడా ఉంది గదా ఆంటి. ఉన్నప్పుడు తెలియకుండా ఎట్లా"

"నేనూ మీ అమ్మా తేడా లేకుండానే ఉన్నాంగదా"

"మా అమ్మ బొట్టు పెట్టుకోదు గదా ఆంటి, మంగళసూత్రం

ఉండదు. మా అమ్మకీ మీకూ చాలా తేడా ఉంది"

నసీమా మాటల్లో నిజం ఉందీ. లేదూ. తేడాలు ఉంటాయి. లేకుండా ఎట్లా ఉంటాయి. కానీ ఈ తేడాల్లో అప్పటికీ ఇప్పటికీ ఏదో తేడా ఉంది.

"ఏమో మీరూ మాలాగే బురఖా తీసేస్తే హాయిగా ఉంటుందనిపిస్తుంది" అనేసింది పార్వతి.

"మీరూ మాలాగే బురఖా వేసుకుంటే బాగుంటుందని నేను అనను ఆంటీ"

నసీమా మాట పార్వతికి చురుక్కుమని తగిలింది.

నసీమాకూ తనకూ ఎక్కడోతేడా ఉంది. ఏంటది?

పార్వతికి తెలియటంలేదు.

మీరూ మేమూ అనుకునే స్థితి.

మీరూ మేమూ ఒకటే అనుకునే స్థితి

మీరూ మేమూ వేరు అనుకునే స్థితి

– ఈ మూడూ చిందరవందరగా కలిసిపోయి పార్వతికి చిక్కుముడి పడ్డాయి. నసీమా జుట్టు చిక్కుతియ్యటం అయిపోయినా అయిపోయినట్లనిపించక దువ్వుతూనే ఉంది.

"మాలో ఏదో మార్పొచ్చినట్లు అడుగుతున్నారు. మీలో ఏ మార్పు రాలేదా ఆంటీ"

నసీమా ప్రశ్నకు పైకి చెప్పగల సమాధానం లేదు. కానీ ఒచ్చాయి. పెద్దకొడుకు అఖిల్ పెళ్ళప్పుడు చాలా మార్పులొచ్చాయి. తమ పెళ్ళి రిజిష్టర్ ఆఫీసులో జరిగింది. అంతా నలభై రూపాయల ఖర్చుతో. అఖిల్ పెళ్ళికి తమకిష్టం లేకపోయినా కన్యాదానం పుచ్చుకున్నారు. కొడుకు పది లక్షల కట్నం తీసుకున్నాడు. "ఆ అమ్మాయి తల్లితండ్రులు మీలాగా కాదు. దేవుడూ, భయం, భక్తీ ఉన్నాయి. శాస్త్రోక్తంగా పెళ్ళి జరగాల్సిందే"నన్నాడు. సత్యన్నారాయణ వ్రతంతో సహా అన్నీ జరిపించారు. దాని కోసం ఇంట్లోకి చిన్న దేవుడి మందిరం తెచ్చాడు అఖిల్.



దాని మీద దుమ్మూ ధూళీ పడకుండా శుభ్రం చేసి తను తృప్తి పడుతుంటే చిన్నకొడుకు పూలు పెట్టటం, దణ్ణం పెట్టటం చేస్తున్నాడు.

మార్పులు ఒచ్చాయి. రాలేదని కాదు. మరి నసీమాను ప్రశ్నించే హక్కు తనకేముంది?

"మీ ఇంట్లో కులమతాల ప్రసక్తే లేదని బాబా చెప్పాడు"

పార్వతి ఆలోచనల్ని ఆపుతూ అంది నసీమా.

"ఔను. లేదు..."

"మీ అబ్బాయికి నేను మీ ఇంట్లో ఉండటం ఇష్టం లేదుగదా ఆంటీ – ఎందుకలా"

ఉలిక్కి పడింది పార్వతి.

"అదేం కాదమ్మా. వాడికి ఇష్టం లేకపోవటం ఏంటి. వాడు నీతో సరిగా మాట్లాడటం లేదనా? వాడంతే. ఆడ పిల్లలతో మాట్లాడడు" తడబడుతూ అంది.

"లేదాంటీ నాతో స్పష్టంగానే మాట్లాడాడు."

"ఏమని?"

"నేనీ ఇంట్లో ఉండటం తనకిష్టం లేదనీ. వీలైనంత త్వరగా వెళ్ళిపొమ్మనీ."

పార్వతికి తను అక్కడే భూమిలోకి కుంగిపోతే బాగుండు ననిపించింది.

"మీరూ అంకుల్ బాధపడతారని ఉన్నాను గానీ నాకూ ఇక్కడ ఉండటం ఇష్టం లేదాంటి"

అమ్మా నాన్నా బాధపడతారని వినయ్ ఒక్కక్షణం ఆలోచించ లేదు. ఈ పిల్ల తమ గురించి ఆలోచించింది. తేడా ఎక్కడో ఉందనిపించింది పార్వతికి.

"ఔనమ్మా, నేనూ అంకుల్ నువ్వు వెళ్తే చాలా బాధపడతాం. నీకు హాస్టల్లో సీటు దొరికే వరకూ ఇక్కడే ఉండాలి." పార్వతి నసీమాను దగ్గరకు తీసుకుంది.

"నాన్న మా పిల్లలందరికీ మీ గురించి ఎంతో చెప్పాడాంటీ. మిమ్మల్ని చూడకపోయినా మా అక్కచెల్లెళ్ళకు మీరంటే చాలా ఇష్టం. గౌరవం."

జాఫరాలీ మీద తమ పిల్లలకు గౌరవం కలిగించలేని తన చేతగానితనానికి ఏడుపొచ్చింది పార్వతికి.

ఇదంతా రామారావుతో చెప్పి కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

రామారావుకి అసలే అర్థం కావటంలేదు. ఎక్కడో తేడా ఒచ్చింది.

పిల్లలు చెప్పింది వినటం తప్ప, వాళ్ళ ఇష్టాలు పాటించటం తప్ప తమ ఇష్టాలు వాళ్ళకెందుకు చెప్పలేకపోయారు? వాళ్ళ చుట్టూ తమ ప్రపంచం నిర్మించుకోవటం తప్ప తమకంటూ ఓ ప్రపంచం లేకుండా చేసుకున్నారెందుకు? పిల్లలు రాకముందు తమకున్న ప్రపంచం ఏమయింది? దానిలోకి వాళ్ళనెందుకు లాక్కోలేదు.

అంత తీరికేది. పరుగు. పరుగు.

తమకు అనాయాసంగా అలవడిన సంస్కారం పిల్లలకు అంతే సులువుగా ఎందుకలవడలేదు?

"అబ్బా – అలగా వాళ్ళను ఇంట్లోకి తీసుకు వస్తావు. ఎట్లా చచ్చేది రా నీతో" అని నాయనమ్మ అన్న రోజున అన్నం మానేసి సత్యాగ్రహం చేసి మర్నాడు నాయనమ్మ చేత ఆ తన మిత్రులందరికీ అన్నం పెట్టించే వరకూ తన పంతం ఒదల్లేదు. ఇవాళ కొడుకు దగ్గర ఇంత బలహీనత ఏంటి?

పెద్దల నెదిరించినంత సులువు కాదా పిల్లల నెదిరించటం. ఆ రోజు సమాజం తనకనుకూలంగా ఉన్నందువల్ల తనకా బలం ఒచ్చిందా? ఇవాళ సమాజం తనకాబలం ఇవ్వటం లేదా?

అసలేది సమాజం. తను మర్చిపోయిన సమాజం. తను పట్టించుకోని సమాజం.

తన రెక్కల్ని పిల్లల్ని పొదువుకోటానికే ఉపయోగిస్తూ తను ఎగిరిచూడటం మర్చిపోయిన సమాజం.

ఆఫీసులో యువకుడు గుర్తొచ్చాడు రామారావుకి.

మనసంతా అశాంతి మయమయింది.

అలవాటు తప్పిన అశాంతి భరించలేకపోయాడు. అందునా పిల్లల విషయంలో పిల్లలు పరీక్షల్లో సాధించే విజయాలిచ్చిన ఆనందం తప్ప ఓ అశాంతి అలవాటు తప్పింది. కొడుకు మీద కోపం అలాగే ఉంచుకోవటం కూడా అతనికి చాలా కష్టంగా ఉంది.

D D D

వారం రోజులు నసీమా వర్కింగ్ విమెన్స్ హాస్టళ్ళ చుట్టూ తిరిగింది. ఎక్కడా ఖాళీలేదనే సమాధానమే.

"ఖాళీలున్నా నన్ను చేర్చుకోరనుకుంటానాంటీ" అంది పార్వతితో

"అదేంటమ్మా"

"నేను ముస్లింని గదా. ఆ హాస్టళ్ళలో ముస్లింలెవరూ ఉన్నట్లు లేరు."

"ఛా–అలా పెట్టుకుంటే హాస్టళ్ళు నడుస్తాయా?"

"ఎందుకు నడవవు? మెజారిటీ హిందూసేగా. ముస్లిం

అమ్మాయిలు ఉద్యోగాలు చేసేదే తక్కువ. హాస్టళ్ళలో ఉండేది ఇంకా తక్కువ. ముస్లిం ఆడపిల్లల కోసం ఒక హాస్టలు ఉందేమో కనుక్కోవాలి. లేకపోతే ఒకటి పెట్టాలి" స్థిరంగా అంది నసీమా.

పార్వతి డిగ్రీ గుంటూరు విమెన్స్ కాలేజీలో చదివినప్పుడు హాస్టల్లోనే ఉంది. అక్కడ పది మంది దాకా ముస్లిం అమ్మాయిలున్నారు. అందరూ హాయిగా కలిసి ఉండేవారు. అది చెప్పి అలా అందరూ కలిసిపోవాలి గానీ వేర్వేరుగా ఉండాలా అంది.

"వేరుగా ఉంటే మాకు సీటు దొరుకుతుంది. ముస్లింలం కాబట్టి సీటివ్వలేదనే సందేహాలుండవు. వేరుగా ఉంటేనే బాగుంటుంది" ఎంత విసిగిపోయిందో నసీమా తన పట్టు ఒదల్లేదు. పార్వతికేం చెప్పాలో తోచలేదు. బాధపడుతున్నది నసీమా. బాధ ఎలా పోతుందా అని ఆలోచిస్తోంది. ఆ బాధ తనకు తెలియదు. తను ఆలోచించలేదు.

మరో రెండు రోజుల్లో నసీమా ఒక గది అద్దెకు తీసుకుంది. పాతబస్తీలో సుల్తాన్‌షాహీ దగ్గర.

"అయ్యో – అంత దూరాన ఎందుకమ్మా" అన్నాడు రామారావు.

"ఏమో నాకక్కడే బాగుంది అంకుల్. మా వాళ్ళంతా అక్కడే ఉన్నారు"

మావాళ్ళు – జాఫరాలి ఆ మాట అనుకోలేదు. నసీమా అనుకుంటోంది. జాఫరాలీ ఇరవై ఏళ్ళ తర్వాత వెతుక్కుంటూ వచ్చాడు. వినయ్ నసీమా ఉన్న పదిహేను రోజులూ ముళ్ళ మీద ఉన్నట్టు ఉన్నాడు. నసీమాకూ అలాంటి ఫీలింగ్ కలిగించాడు.

జాఫరాలీ నసీమాలను చూస్తే తనకు ప్రేమ. వినయ్‌కి కోపం. ఏమిటిదంతా?

ఆలోచించాల్సింది ఆలోచించాల్సినపుడు ఆలోచించలేదని రామారావుకి తోచటంలేదు.

రామారావు అతనిలాంటి అనేక మంది ఆలోచించకపోవటం వల్లనే, సమయానికి స్పందించకపోవటం వల్లనే రథయాత్రలూ, బాబ్రీ మసీదులు, గుజరాత్‌లూ జరిగాయని కూడా వాళ్ళకు తట్టదు. అవి వాళ్ళకు రోజూ ఉదయాన్నే కాలక్షేపాన్నిచ్చే వార్తలుగా మారి చాలా కాలమయిందని కూడా గుర్తించరు. అరరే–అయ్యయ్యో అబ్బా–మరీ ఘోరం" వంటి మాటలతో వాళ్ళ బాధ్యత తీరిందనుకుంటారు.

అలా తీరిపోకుండా దేశంలో చెలరేగిన చిచ్చు తమ ఇంట్లో చిన్న కలవరాన్ని కలిగించవచ్చని వాళ్ళనుకోరు.

అలాంటి కలవరం కలిగితే ఏం చెయ్యాలో తెలియక సతమతమవుతారు.

రామారావుకి ఆ కలవరం పదిహేను రోజుల్లోనే తప్పింది. నసీమా తన గదికి వెళ్ళిపోయింది.

జాఫరాలీ ఫోన్‌లో కృతజ్ఞతలు తెలిపాడు గానీ మళ్ళీ రాలేదు.

ఆ ఉదంతం గుర్తొచ్చినపుడు బాధపడి మళ్ళీ మామూలవటం రామారావుకి అలవాటైంది.

కొడుకు మీద కోపం నిలుపుకోవటం మాత్రం చేతకాలేదు.

ఏదో కుర్ర వెధవ అని సర్దుకున్నాడు.

పాకిస్తాన్ క్రికెట్ టీంలోంచి వసీం అక్రమ్‌ను తీసేశారని వినయ్ సంతోషించాడు. తల్లికి సంబంధించి అతని సమస్య తీరింది. తనకు క్రికెట్ మీదే ఇష్టం పోయిందని ప్రకటించి ఊరుకుంది పార్వతి.

ఆరు నెలల్లో అమెరికా వెళ్ళే కొడుకుతో పేచీ ఎందుకు అనిపించింది రామారావుకి.

రామారావు మతోన్మాది కాదు. సెక్యులరిస్టు. సారీ జాఫరాలీ అనుకోవటం తప్ప ఏం చెయ్యలేదు.

V

# కవిత

# మట్టి చేతులు

**చలపాక ప్రకాష్**



మావి మట్టిచేతులు
మట్టిలో పుట్టినం
మట్టిలో పెరిగినాం
ఆ మట్టిలోనే తిండీ, నిద్ర
అవి ఇవీ అన్నీను!
మట్టితల్లి మాకేమి ఇచ్చినదని
మేం నిందించం
రోడ్డు ప్రక్క గుడారాల్లో
మట్టి పాత్రల వృత్తే మా బ్రతుకులైనా
మాలో వున్న 'తృప్తే' మాకానందం!!
మాకు ధనరాశులపై ఆశకన్నా
కళామతల్లి ఇచ్చిన హస్తకళానైపుణ్యమే
పదివేలు
హైటెక్ చదువు సంధ్యలు
హైటెక్ యంత్రాలులేకున్నా
మాలో దాగివున్న సృజనాత్మక శక్తే
వేయి కళ్ళను అబ్బురపరిచి
ఆనందపరవశాలకులోను చేస్తాయ్
మట్టి చేతులను చూసి
ఈసడించుకునే నేత్రాలు
మా కళానైపుణ్య దగదగలతో
డైనింగ్ టేబుల్ మీద పాత్రలుగా
షోకేసుల్లో దృశ్యకళాఖండాలుగా
అలంకారాలవుతాయ్
కంటి పాపల్లా కాపాడుకుంటాయ్!
శిలాజాలు, బోరెక్స్, జిగురు మిశ్రమాలు
మాకొలిమిలో నేస్తాలవుతూ
రంగురంగుల సింగారాలు మా చేతి అద్దకాల తళుకులతో
మీ చేతుల్లో టీకప్పులు, డిన్నరు ప్లేట్లుగా
మీ గూళ్ళలో అందమైన రూపాలుగా సాక్షాత్కరింపబడతాయ్
మా కాలే కడుపులకు నిండుకుండలుగా
ప్రాణాలు పోస్తాయ్!!
పొగరు, అశ్రద్ధలకు బలిచేస్తే
పగిలేవి సొగసైన కళాకృతుల పెంకుముక్కలు కావు!
మా చేతుల్లో కళాజీవం పోసుకొని
మీకు కనువిందు చేసిన మా పిల్లల
గుండె ముక్కలే అవి!!
కళాసృష్టి జీవనం మాది
కొలిమి కష్టాలు మావి
కళాకృతుల అందాల 'ధరా'దత్తం మీవి
అంతేగా..?!!

V

## ప్రాచీనం

# కులాధిక్యతను తోసిపుచ్చిన అన్నమయ్య సంకీర్తనలు

***తానునమ్మిన భగవంతుని మీద వేలకొద్దీ కీర్తనల్ని రచించి, పాడి తన భక్తి ప్రపత్తుల్ని ప్రదర్శించాడు. భగవంతుని మనసారా పూజించే భక్తులకు కులమతాల గోడలు అడ్డురావు. మానవులంతా భగవంతుని సృష్టి అని వారిలో ఏ విధమైన తారతమ్యాలు ఉండవని నిజమైన భక్తుడు విశ్వసిస్తాడు. అన్నమయ్య సంకీర్తనల్లో కూడా కులం ప్రస్తావించబడింది. కులం ప్రాతిపదిక మీద కాకుండా మానవుడు గుణం ప్రాతిపదిక మీద గౌరవించబడాలనే విషయం స్పష్టమవుతుంది.***

**డా॥ గుమ్మా సాంబశివరావు**

**క్రీ.శ. 15వ** శతాబ్దానికి చెందిన అన్నమయ్య తిరుమలలోని శ్రీ వెంకటేశ్వరుని పూజించి కీర్తించిన వాగ్గేయకార పితామహుడు. తానునమ్మిన భగవంతుని మీద వేలకొద్దీ కీర్తనల్ని రచించి, పాడి తన భక్తి ప్రపత్తుల్ని ప్రదర్శించాడు. భగవంతుని మనసారా పూజించే భక్తులకు కులమతాల గోడలు అడ్డురావు. మానవులంతా భగవంతుని సృష్టి అని వారిలో ఏ విధమైన తారతమ్యాలు ఉండవని నిజమైన భక్తుడు విశ్వసిస్తాడు. అన్నమయ్య సంకీర్తనల్లో కూడా కులం ప్రస్తావించబడింది కులం ప్రాతిపదిక మీద కాకుండా మానవుడు గుణం ప్రాతిపదిక మీద గౌరవించబడాలనే విషయం స్పష్టమవుతుంది. అన్నమయ్య రచించిన కీర్తనలు శృంగార సంకీర్తనలు, ఆధ్యాత్మిక సంకీర్తనలు అని రెండు రకాలు. ఆధ్యాత్మిక సంకీర్తనల్లో కులం విషయం అక్కడక్కడా ప్రస్తావించబడింది.

ఏ కులానికి చెందిన వాడైనా సత్క్రమమైన ప్రవర్తనకపోతే అతడు కులహీనుడని అన్నమయ్య అభిప్రాయం

ఎక్కువ కులజుడైన హీనకులజుడైన
నిక్కమెతిగిన మహానిత్యుడే ఘనుడు ॥పల్లవి॥
వేదములు చదివియు విముఖుడై హరిభక్తి
యాదరించని సోమయాజికంటె
యేది యును లేని కులహీనుడైనను విష్ణు
పాదములు సేవించు భక్తుడే ఘనుడు
॥ఎక్కు॥

పరమమగు వేదాంత పఠన దొరకియు సదా
హరిభక్తి లేని సన్యాసి కంటె
సరవి మాలిన యంత్యజాతి కులజుడైన
నరసి విష్ణుని వెదకు నాతడే ఘనుడు
॥ఎక్కు॥

వినియు జదివియును శ్రీ విభుని దాసుడుగాక
తనువు వేపుచునుండు తపసికంటె
యెనలేని శ్రీ వేంకటేశు ప్రసాదాన్న
మనుభవించిన యాతడప్పుడే ఘనుడు
॥ఎక్కు॥
(1-318)

ఈ సంకీర్తనలో పుట్టుకతో ఉత్తమ కులజుడు కాకపోయినా హరినామస్మరణంతో, శ్రీవేంకటనాధుని మాహాత్మ్యాలను వింటూ, ఆయన ప్రసాదాన్నిలను ఆరగించినవాడు గొప్పవాడని అన్నమయ్య ప్రబోధించాడు. అంత్యకులంలో పుట్టినప్పటికీ హరిని సేవించే వాడైతే ఉత్తముడుగా పరిగణించబడతాడని అన్నమయ్య భావం. భక్తి భావంతో నిండిన బడుగు జీవి కూడా ఉత్తమ మానవుడేనని ఇక్కడ గుర్తించవచ్చు.

అన్నమయ్య ఈ విధమైన భావాన్నే మరో సంకీర్తనలో వెల్లడిస్తున్నాడు.

ఏ కులజుడేమి యెవ్వడైనేమి
ఆకడనాతడె హరి నెఱిగిన వాడు
॥పల్లవి॥

పరగిన సత్య సంపన్నుడైన వాడే
పరనింద సేయ దత్పరుడుగానివాడు
అరుదైన భూత దయానిధియగు వాడే
పరులు దానేయని భావించువాడు
॥ఏకు॥

నిర్మలుడై యాత్మ నియతి గలుగు వాడే
ధర్మతత్పర బుద్ధి దగిలిన వాడు
కర్మమార్గములు గడవని వాడే
మర్మమై హరిభక్తి మఱవని వాడు
॥ఏకు॥

జగతిపై హితముగా జరియించువాడే
పగలేక మతిలోన బ్రతికిన వాడు
తెగి సకలము నాత్మ, దెలిసిన వాడే
తగిలి వేంకటేశు దాసుడయిన వాడు
॥ఏకు॥
(1-292)

కులాన్ని బట్టి గొప్పతనాన్ని, ఆధిక్యాన్ని నిర్ణయించటం తగదని ప్రవర్తనను బట్టి, గుణాన్ని బట్టి ఒక వ్యక్తి విశిష్టతను నిర్ణయించవలసి ఉంటుందని అన్నమయ్య ప్రబోధం. సత్యసంపన్నుడై ఇతరుల్ని దూషించకుండా సర్వప్రాణులపట్ల దయాభావం కలిగి, "ఆత్మవత్సర్వభూతాని" అనే భావంతో ప్రవర్తించే వాడు ఉత్తమ మానవుడని, అతని కులంతో పనిలేదని అన్నమయ్య భావం.

ఏ కులం వాడైనా విష్ణుపాద సేవకుడైతే అతడు బ్రహ్మజ్ఞాన సంపన్నుడై, బ్రాహ్మణోత్తమునిగా గుర్తించబడతాడనే విషయాన్ని అన్నమయ్య మరో సంకీర్తన ద్వారా స్పష్టం చేస్తున్నాడు.

కొంచెమును ఘనము గనుగొననేల హరిదలచు
పంచమహాపాతకుడే
బ్రాహ్మణోత్తముడు ॥పల్లవి॥

వేదములు చదివియును విముఖుడై హరికథల
నాదరించని సోమయాజికంటె
యేదియును లేని కులహీనుడైనను విష్ణు
పాద సేవకుడువో బ్రాహ్మణోత్తముడు
॥కొంచె॥

పరమమగు వేదాంత పఠన దొరకియు సదా
హరిదలచలేని సన్యాసికంటే
మరగిపసురము దినెడిమాలయైనను వాడె

పరమాత్ము గొలిచినను
బ్రాహ్మణోత్తముడు ॥కొంచె॥

వినియు జదివియు రమా విభుని దలపక
వృధా
తనువు వేపుచు దిరుగు తపసికంటె
చనవుగల వేంకటేశ్వరుదాసులకు వెంట
బనిదిరుగునధముండే
బ్రాహ్మణోత్తముడు ॥కొంచె॥
(1-329)

శ్రీ వేంకటేశ్వరుని దాసులు ఏ కులంవారైనా ఆయన పాదసేవకులు కావటంవల్ల ధన్యులౌతారనే విషయాన్ని అన్నమయ్య మరో సంకీర్తనలో తెలియజేస్తున్నాడు.

పరులసేవలు చేసి బ్రతికేరటా
సిరివరు దాసులు సిరులందుటరుదా ॥పల్లవి॥

కోరి వొక నరుని గొలిచిన వారలు
ధీరులై సలిగెల దిరిగేరట
కూరిమి బ్రహ్మాండ కోటలేలెడి వాని
వారలింతట జనవరులౌటరుదా ॥పరు॥

చేకొన్న తుమ్మిదచేవద్ద కీటకము
లాకడ దుమ్మిద లయ్యానట
శ్రీకాంతుని పాదసేవకులగు వార
లేకులజులయినా నెక్కుడౌటరుదా ॥పరు॥

ధరణీశు నాజ్ఞల తమ దేశములందు
సిరుల నాణెపు ముద్ర చెల్లీనట
తిరువేంకటాద్రి శ్రీదేవుని ముద్రలు
ధరియింపగా నింతట జెల్లుటరుదా ॥పరు॥
(1-390)

భ్రమర కీటక న్యాయంవల్ల తుమ్మిదలలో చిక్కుకొన్న కీటకం తుమ్మెద అయినట్లు శ్రీ కాంతుని పాదసేవకులు ఏ కులానికి చెందినవారైనా సమాజంలో ఉన్నతులుగా గుర్తించబడటంలో ఆశ్చర్యం లేదని అన్నమయ్య వివరిస్తున్నాడు. లౌకికమైన రాజ్యంలో రాజముద్రలు చెల్లినట్లే భక్తిసామ్రాజ్యంలో శ్రీ దేవుని ముద్రలు చెల్లుతాయని చెప్పటం ద్వారా భక్తుల గొప్పదనాన్ని స్పష్టం చేస్తున్నాడు.

లోహం ఎలా ఉన్నా పరుసవేదివల్ల అది బంగారంగా మారినట్లు, మనుజుడు ఏ కులంవాడైనా వనజనాభుని భక్తిని వదలకుండా ఉంటే అతడు పుణ్యాత్ముడై ప్రశంసించబడతాడని అన్నమయ్య తెలియజేస్తున్నాడు.

**"సామంతం :** పరుసమొక్కటే కాదా పయిడిగా జేసేది
అరయ లోహమెట్టున్నా నందుకేమీ ॥పల్లవి॥

వనజనాభుని భక్తి వదలకుండిన జాలు
మనసు యెందు దిరిగినా మరియేమి
మొనసి ముద్రలు భుజములనుండితేజాలు
తనువెంత హేయమైనా దానికేమి
॥పరు॥

శ్రీకాంతునామము జిహ్వ దగిలితేజాలు
యేకులజుడైనాను హీనమేమి
సాకారుడైన హరి శరణుజొచ్చిన జాలు
చేకొని పాపము లెన్ని చేసిననేమి
॥పరు॥

జీవుడెట్టున్నానేమి జీవునిలో యంతరాత్మ
శ్రీ వేంకటేశునకాచింత యేమి
యేవలన బరమైన యిహమైన మాకుజాలు
కైవశ మాయనతడు కడమలింకేవీ
॥పరు॥
(1-373)

............ O ............

**_పుట్టుకతో బ్రాహ్మణకులానికి సంబంధించిన వాడైనా హరిభక్తి, వేదాంత పఠనం, రమావిభుని స్మరణం లేకపోతే అతడు అధముడని, ఏ కులంలో పుట్టినా పశుమాంసాన్ని తినే మాల అయిన పుటికీ పరమాత్ముని సేవిస్తే అతడు బ్రహ్మజ్ఞాన సంపన్నునిగా పరిగణింపబడతాడనే విషయాన్ని అన్నమయ్య స్పష్టం చేస్తున్నాడు._**

............ O ............



అంటే తన భక్తుడు ఎక్కడ తిరిగినా, హీనుకులజుడైనా, దైవనామస్మరణం చేస్తూ శరణుజొచ్చితే అతనిని దేవుడు కరుణిస్తాడని గ్రహించవచ్చు.

ఇత్తడిని తెచ్చి బంగారంగా మార్చినట్లు పాపాత్ముని చెడు లక్షణాలను మరలించి భగవంతుడు తన భక్తుని గొప్పవానిగా మార్చటం జరుగుతుందని, కుక్కల్ని వండుకొని తినే కులహీనుని బ్రహ్మజ్ఞానిగా తీర్చి దిద్దటం కూడా సంభవిస్తుందని అన్నమయ్య వేరొక సంకీర్తనలో స్పష్టం చేస్తున్నాడు.

ఇంత సేసెబో దైవమింతలోననే అయ్యో
సంతపాకలంజదెచ్చి సన్యాసి జేసె ॥పల్లవి॥

పరిగ లేరేటి వాని బట్ట పురాజుగా
నిరత భోగము లిచ్చి నిలిపినట్లు
ధరలోన నతిపాతకుని నన్నునిట్లు
అరయనిత్తడి దెచ్చి యపరంజి జేసె ॥ఇంత॥

కుక్కల వండుక తినే కులహీనుని దెచ్చి
వెక్కసపు బాపని గావించినయట్లు
దిక్కు లెఱుగగ గష్టదేహినికన్ను దెచ్చి
గక్కన దెలుకపిండి కస్తూరిసేసె ॥ఇంత॥

చెడుగైన దోమ దెచ్చి సింహపు గొదమగా
జెడిదంపు బ్రేమతోడు బెంచినయట్లు
కదునధముని వేంకటపతి ననునిటు
చిడిపిరాయి దెచ్చి చింతామణి సేసె ॥ఇంత॥
(1-282)

అధముల్ని సైతం అధికుల్ని చేసే కరుణార్ద్ర దృష్టి భగవంతునికి ఉన్నదని అనేకమైన ఉపమానాలతో అన్నమయ్య ఈ సంకీర్తనల్లో మనోహరంగా వివరించాడు.

సృష్టికర్త శరీర భాగాల నుంచి ఆవిర్భవించిన వివిధ వర్ణాల వారిని అన్నమయ్య ఒక సంకీర్తనలో ఇలా వర్ణిస్తున్నాడు.

పురుషుండని శ్రుతి వొగడేనట ఆ పురుషుడు నిరాకారమట
విరసవాక్యము లొండొంటికి నివివింటే నసంబద్ధములు
॥పల్లవి॥

మొగమున బ్రాహ్మలు మొలచిరట ఆ మూరితి
అవయవరహితుడట
తగ బాహువులను రాజులట, ఆతత్వమే
యెంచగ శూన్యమట
పగటున తోడేలను వైశ్యులట ఆ బ్రహ్మము
దేహము బయలట
అగపడి పాదాల శూద్రులట ఆతని
రూపము లేదట ॥పురు॥
(2-252)

జగతిలో జాతి భేదాలను ఎంచకూడదని, అలాంటి భావాలు వ్యర్థమనే అన్నమయ్య ప్రబోధిస్తున్నాడు.

విజాతులన్నియు వృథావృథా
అజామిళాదుల కదియే జాతి
॥పల్లవి॥

జాతిభేదములు శరీర గుణములు
జాతి శరీరము సరిదోడనె చెడు
ఆతుల పరిశుద్ధం చెప్పుదును అది నిర్దోషంబనాది
యీతల హరి విజ్ఞానపు దాస్యంబిది మొక్కటి పోసుజాతి ॥విజా॥

హరియిందరిలో నంతరాత్ముడిదె
ధరణి జాతి భేదములెంచిన
పరమయోగులీభావ మష్టమదము భావవికారమనిమానిరి
ధరణిలోన బరతత్వజ్ఞానము ధర్మమూలమేసుజాతి ॥విజా॥

లౌకిక వేదికలంపటులకునివి
కైకొను నవశ్య కర్తవ్యంబులు
శ్రీకాంతుడు శ్రీ వేంకటపతి సేసిన సంపాదమిందరికి
మేకొని యిన్నియు మీరిన వారికి మీ నామమేసుజాతి ॥విజా॥
(2-383)

ఆత్మ పరిశుద్ధంగా ఉంటుందని, అది నిర్దోషమని, అనాది అని, హరివిజ్ఞానపు దాస్యమేసుజాతి అని భక్తి ప్రాముఖ్యాన్ని తెలుపుతూ జాతి భేదాలను అన్నమయ్య నిరసిస్తున్నాడు.

భగవంతుడు సర్వసముడని, దేవదేవుడని సమస్త సృష్టి సమతా భావసమన్వితమై ఉంటుందని, ఎక్కువ తక్కువల భేదం మానవ కల్పితమనే భావాన్ని అన్నమయ్య ఒక సంకీర్తనలో సహృదయరంజకంగా వర్ణించాడు.

నీవు సర్వసముడవు నీవు దేవదేవుడవు
యీవల నా గుణ దోషాలెంచని కనేలా
॥పల్లవి॥

పూవులపై గాసీ బొరి ముండ్లపై గాసీని
ఆవల వెన్నెల కేమి హాని వచ్చీనా
పావనుల నటుగాచి పాపపుంజమైననన్ను
గావగా నీకృపకును గడమయ్యీనా ॥నీవు॥

గోవుమీద విసరీ గుక్కమీద విసరీని
పావనపుగాలికి పాపమంటీనా
దేవతల రక్షించి దీనుడనైననాకు
దోవ చూపి రక్షించితే దోసమయ్యీనా
॥నీవు॥

కులజుని యింట నుండీ కులహీనుని
యింటనుండీ
యిలలో నెండకు నేమి హీనమయ్యీనా
వలసి శ్రీ వేంకటాద్రి వరములు యిచ్చి నాలో
నిలిచి వరములిచ్చి నేడు గావవే
॥నీవు॥
(2-129)

.............. O ..............

***15వ శతాబ్దంలోనే అన్నమయ్య సర్వజన సమభావాన్ని ప్రకటించాడు. రాజు నిద్రకు బంటు నిద్రకు తేడా ఉండదని, బ్రాహ్మణుడు ఉండే భూమి చండాలుడుండే భూమి ఒకటేనంటూ మానవతాదృక్పథంతో, సర్వజన సమభావంతో జానపద గేయరీతిలో తందనాన పాటగా అన్నమయ్య ఈ లోకానికి అందించాడు.***

.............. O ..............

ప్రకృతిలోని సహజ సిద్ధమైన వెన్నెల పూవుల మీద, ముళ్ళ మీదా ఒకే రకంగా ప్రసరిస్తుందని, గాలి వీచినప్పుడు అది గోవు మీదా, కుక్క మీదా ఒకే రకంగా ఉంటుందని, కులజుని ఇంటిపై పడే ఎండ కులహీనుని ఇంటిపై పడే ఎండ ఒకటేనని సృష్టిని అనుభవించటంలో తారతమ్యాలుండవని, అంటే భగవంతుడు సర్వసముడని గ్రహించవచ్చు.

15వ శతాబ్దంలోనే అన్నమయ్య సర్వజన సమభావాన్ని ప్రకటించాడు. రాజు నిద్రకు బంటు నిద్రకు తేడా ఉండదని, బ్రాహ్మణుడు ఉండే భూమి చండాలుడుండే భూమి ఒకటేనంటూ మానవతాదృక్పథంతో, సర్వజన సమభావంతో జానపద గేయరీతిలో తందనాన పాటగా అన్నమయ్య ఈ లోకానికి అందించాడు.

"**బౌళి :** తందనాన అహి తందనాన పురె
తందనాన భళా తందనానా ॥పల్లవి॥

బ్రహ్మ మొకటె పరబ్రహ్మ మొకటె పర
బ్రహ్మ మొకటే పరబ్రహ్మమొకటే ॥తందు॥

కందువగు హీనాధికములిందు లేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకుల మింతానొకటే
అందరికి శ్రీహరే అంతరాత్మ ॥తందు॥

నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటు నిద్రనదియు నొకటే
మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యెకటే
చండాలుడుండేటి సరిభూమి యొకటె ॥తందు॥
(2-385)

ఇంకా కీటకాలకు పశువులకు, దేవతలకు కామసుఖము, ధనాఢ్యునికి, నిరుపేదకూ దివారాత్రాలు, శిష్టదుష్టాన్నాలను తినే ఆకలి, సుగంధ, దుర్గంధాల మీద ప్రసరించే గాలి, శునకము మీద, ఏనుగు మీద పడే ఎండ సమానమని అన్నమయ్య సర్వసమానత్వ భావాన్ని ప్రకటించాడు.

ఈ విధంగా అన్నమాచార్య సంకీర్తనల్లో అక్కడక్కడా కులం ప్రస్తావించబడింది. ఆయన కులానికంటే గుణానికే ప్రాధాన్యం ఇచ్చాడు. ముఖ్యంగా హరిభక్తికి ఆధిక్యాన్ని కలిగించి ఆ భక్తి కలిగిన వారే ఉన్నతోన్నతులని తన భక్తి భావాన్ని ప్రకటించాడు. సర్వజీవులు సమానమేనని మానవతా దృక్పథాన్ని ఏనాడో చాటి చెప్పిన విశాల దృక్పథం కలిగిన భక్తాగ్రేసరుడు అన్నమయ్య.

**(మే 9 అన్నమయ్య 395వ జయంతి)**

V

## కవిత

# బిడాల నీతులు



**వల్లభాపురం జనార్దన**

మోడీ జాబిలి
ప్రజాస్వామ్యగుజిలీ
కుర్చీ హవేలీ

చీకటి నెల
తరగతి పాఠాలు
గర్భస్రావాలు

ప్రజాస్వామ్యమా!
కంగాళీకరికులం
టోపీ ఎజండా

మన ఓటర్లు
మామిడి తోరణాలు
మంచుబొమ్మలు

డాలరు కల
స్వేచ్ఛా విపణీతల
అక్షయపాత్ర

పేటెంటు సూత్రం
సృజనకు నిర్బంధం
భజంత్రీ భాష

జీవననాదం
మార్కెటు వేణుగానం
ధనవిప్లవం

అప్పుల పూలు
రైతు ఆత్మహత్యలు
ప్రోగ్రెస్ రిపోర్టు

శ్రీరాంసాగరం
బంజరు భూమి నాట్యం
దేవతా వస్త్రం

ముఖాముఖీయం
చప్పట్లతో ముచ్చట్లు
ప్రశ్నకు ప్రశ్నే

మన ఆరోగ్యం
ప్రపంచ బ్యాంకు దత్తం
ప్రైవేటు బెత్తం

ఒంటె పెదవి
అన్నపూర్ణ ఆహారం
వృద్ధుల వేట

పేటెంటు బిల్లు
బహుళజాతి గోళ్లు
మెదళ్ల సీళ్లు

పెద్దన్న బాణం
మానవ హక్కుల కిట్
కందిరీగలు

రైతు క్లింటను
భారత బాసుమతి
పేటెంటు సేద్యం

ఆరోగ్యసేవ
అతిసార చావులు
జనాభాకు స్టే

డిస్పోజల్ ఫైళ్లు
వారోత్సవాల రీళ్లు
దుమ్ములబేళ్లు

గోదారి తీర్థం
తెల్గుతల్లి ప్రాజెక్టు
ధూమ శ్యామలం

మార్కెట్టు పోటీ
బహుళజాతి లాఠీ
స్వదేశీ ట్రీటీ

---

# మాయాక్షరాలు

**జుగాష్విలి**

ప్రశాంతపాద ముద్రల్ని
పెళపెళమంటున్న పచ్చనోటొకటి
సుతిమెత్తగా చెరుపుకుంటూ పోతుంది

ప్రేమగాన స్వరం
రెండు రూపాయి బిళ్ళల మధ్య నలిగి
కీచురాయి రాగం తీస్తుంది

పసిరెమ్మల పూలనవ్వు
రూపాయి గలగలల మధ్య
తెలతెల్లబోతుంది

బతుకు
ఎద్దు పళ్ళ దవడల క్రింద
మానవార్థిక సంబంధాలను నెమరేస్తుంది

జీవన శైలీ వృక్షం
వస్తు వ్యామోహ విషఫలాలను విరగకాస్తుంది.

ఎడారీకరణ
జీవితపు పెదరెక్కల్ని విరిచేస్తుంది

స్నేహమూ ప్రేమా ఒఠ్ఠిమాటలు కావు
అవి మనిషి జీవనశ్వాసలు

మనసు పలకమీది మాయాక్షరాలను
కన్నీటి ఉమ్మితో తుడిచేసుకోవాలి
పిండి బలపం చేతబట్టి
మళ్ళీ అ ఆ ల నుంచి మొదలవ్వాలి

---

# శ్మశానం

**కె. కాంతారావు**

బ్రతుకుల్నేకాదు
చావుల్నీ శాసించేందుకు
మీ ఊరి శ్మశానం
బహుళజాతి కంపెనీకి
ప్రైవేటీకరించబడింది
ఇప్పుడక్కడ
క్షణాలలో శవాలను బూడిద చేసే
ఎలక్ట్రిక్ కుంపట్లే
ఆరు కిలోల బూడిద
అందంగా ప్యాక్ చేసి
సాంప్రదాయ మోనోగ్రాములు ముద్రించి
గంగానదిని పవిత్రీకరించేందుకు

డోర్ డెలివరీ చేయబడుతుంది
ఆచారం
అయిపోయిన క్యాలెండర్లయినాయి
గంగిరెద్దుల ఆటల్లేవు
కాటిపాపల గంటల్లేవు
డప్పుల మోతల్లేవు
పాత చేటల్లేవు

పగలిన కుండల్లేవు
నిశ్శబ్దమే నిశ్శబ్దం
శవాలను కొత్తిమీర కట్టల్లా
చలువ చేసి
కట్టెల్లా నిలువ చేసి
అమెరికా వలస పక్షులొచ్చే వరకు
పని చేసే కొత్త రకం వృత్తికాపరోళ్ళు
నిరుద్యోగ దేశంలో కోకొల్లలు
వస్తుగత రాజ్యరహిత గ్రామానికి
అనాది సంస్కృతులెందుకు
ఆచార వ్యవహారాలెందుకు
ఏదైనా గ్లో'బలి'జం ముందు
గొర్రెపిల్లే కదా?

## ప్రెస్‌నోట్స్

# సమాంతర సమీక్ష

*ఒకరిద్దరి కవిత్వంపై వచ్చిన సమీక్షల్ని పక్కన పెడితే చాలా మట్టుకు కవిత్వ సమీక్షలు మొక్కుబడిగా వస్తున్నాయి. కవిత్వానికి కాస్త ప్రాధాన్యం తగ్గిస్తూ కథలు, నవలలకు ఎక్కువ ప్రాధాన్యం కల్పించి సమీక్షలు ప్రచురిస్తున్నారు. సాహిత్య విమర్శ, విశ్లేషణ, వ్యాఖ్యాన వ్యాససంకలనాలకు సమీక్షలో మంచి స్థానం లభిస్తోంది.*

**నాళేశ్వరం శంకరం**

సమీక్ష ఒక జీవనది. సెలయేటి కాలువ మూలంగానో, వర్షాధార మేఘమండలాల మూలంగానో ఊటలు ఊటలైపోయే నీటి మూటల మూలంగానో జీవనది పరవళ్ళు తొక్కుతూ ప్రవహించగలదు.

అయితే జీవ నదుల్లోకి మురికి వాడల నీరూ, పారిశ్రామికవాడల కెమికల్ వాటరు లాంటి కలుషిత జలాలు యేదో వొకమారు కాక అనునిత్యం వచ్చి చేరితే ఆ నదుల స్వరూప స్వభావాలే ప్రశ్నార్థకం కాగలవుకదా! అలాగే సమీక్షకుల జ్ఞానం కలుషితమై పోతే సాహిత్య పాఠకుడు అనారోగ్యానికి గురికావలసి వస్తుంది.

'కరవమంటే కప్పకుకోపం విడువమంటే పాముక్కోపం' లాగా సాహితీ వేత్తలకూ సమీక్షలకు మధ్యన వైరభావం ఉండటానికి వీలులేదు. గ్రంథకర్తలకూ సమీక్షల ప్రదాతలకూ మధ్యన పరస్పర సమీక్షల భజనగీతాలు ఆడపాడదపానైనా తగ్గనప్పుడూ-వడ్డించేవాడు మనవాడే పంక్తిభోజనంలో యెక్కడ కూర్చుంటే యేమిటి? అనే థియరి బాగా ముదిరిపోతున్న సందర్భంలో మన తెలుగు సమీక్షలేమైనా ఇందులో కూరుకుపోయాయా అనే సందేహం కలుగుతున్నవాళ్ళు ప్రస్తుతం లేకపోలేదు.

మరో పద్ధతి యేంటంటే రాయడానికి యేదైతేనేం యెంత అవగాహన చేసుకుని రాశామనే ముఖ్యాంశాలు కన్నా యెన్ని రాశామనే సంఖ్యాంశాలు చేసుకునేవారు పెరిగిపోతున్నారు. మరో విషయం ఒకటి రెండు పత్రికల్ని వదిలితే అన్ని పత్రికల్లోనూ కొందరి సమీక్షలనే పదేపదే చూస్తున్నాం. పత్రికకు పత్రికకు ప్రత్యేకమైన. విలక్షణమైన 'లైన్' ఉన్నట్లే సమీక్షల విషయంలో యెందుకుండదు.

ఈ రెండు నెలల కాలంలో వివిధ పత్రికల్లో వచ్చిన కొన్ని సమీక్షలు చదివాను. ఒకరిద్దరి కవిత్వంపై వచ్చిన సమీక్షల్ని పక్కన పెడితే చాలా మట్టుకు కవిత్వంపై వచ్చే సమీక్షలు మొక్కుబడిగా వస్తున్నాయి. కాస్త కవిత్వానికి ప్రాధాన్యం తగ్గిస్తూ కథ, నవలకు సమీక్ష విషయంలో ఎక్కువ ప్రాధాన్యం కల్పించి ప్రచురిస్తున్నారు. సాహిత్యం విమర్శ, విశ్లేషణ, వ్యాఖ్యాన వ్యాస సంకలనాలకు సమీక్షలో మంచి స్థానం లభిస్తుందనేది సమీక్షలు తిరిగేస్తే తెలుస్తుంది.

**నవలలు :**

ఈ రెండు నెలల కాలంలో ఏడెనిమిది నవలపై నుంచి సమీక్షలు వచ్చాయి. నూరేపల్లి విజయ 'అగ్నివర్షం' ఒక కమర్షియల్ నవల. సుప్రసిద్ధనవలల్లో అగ్రభాగాన ఉండే 'కొమరంభీం' నవలకు భూపాల్ 'పిల్లల కోసం' పేరుతో కొమరంభీం సాహస జీవితాన్ని పిల్లలకు అర్థమయ్యేరీతిలో, అర్థమయ్యే భాషలో అందించారు.

నందిగం కృష్ణారావు 'నల్లపిల్లి'పై ఈ రెండు నెలల క్రితం కొన్ని సమీక్షలు మంచి ప్రాధాన్యతను సంతరించుకునే విధంగా వచ్చాయి. 'నల్లపిల్లి' నవల సమీక్షల ద్వారా ఒక సుస్థిర స్థానం సంపాదించు కోగలిగింది. టి. రఘుకుమార్‌దన్న ఈ వికృత వ్యవస్థకు పరాకాష్టగా అభివర్ణించారు. చీకట్లో నల్లపిల్లిని వెతకడం ఎంత నిష్ప్రయోజనమో, వికృతమైన నేటి వ్యవస్థలో మంచిని వెతకటం కూడా అంతే, పోలీసులు, న్యాయవాదులు, సాక్షులు, డాక్టర్లు, అధికారులు దాదాపు అందరూ ప్రస్తుత వ్యవస్థ నికృష్ట స్థాయికి దిగజారడానికి కారకులేనని ఒక సంఘటన ద్వారా చాటి చెప్పడానికి రచయిత గట్టి ప్రయత్నం చేశారన్నారు. కె.పి. అశోక్‌కుమార్‌గారు కల్పనకు వాస్తవానికి మధ్యన అడ్డుగోడలను ఛేదించే ప్రయత్నం చేసిన నవలగా విశ్లేషించారు. ఈ సమీక్షలో ఉన్న కొత్తదనం యేమిటంటే 'నల్లపిల్లి' విషయంలో రచయితను ఇంటర్వ్యూ చేయడం.

తెలిదేవర భానుమూర్తి పినాకపాణి 'నిప్పులవాగు' సీమ దళితుల జీవితాలకు అద్దం పట్టిందన్నారు. "నిప్పులవాగులో నీళ్ళున్నాయో లేదో తెలియదుగాని ఈ నిప్పులవాగు నిండా నిప్పులే ఉన్నాయి. ముఠాకక్షలు, భూపోరాటం, అన్నలదాడులను 'నిప్పులవాగు' అనే పేరుతో రచయిత సూచించినట్లు"న్నదన్నారు మాల మాదిగల చుట్టూ నాయకులు తిరిగే స్వభావం గురించీ, బానిస మనస్తత్వం గురించి చక్కగా సామాజిక, సాంస్కృతిక నేపథ్యాన్ని ఈ నవల బలంగా వ్యక్తీకరించింది. నవలలో స్వామిదాసు పాత్ర మాటలు నగ్నసత్యాలు "ఎవల కష్టం వాల్లు జేసుకొని గౌరవంగా రెండు ముద్దలు తింటాంటే ఎసనంత గూడా సూడలేకపోతాండారు" అనేది నగ్నవాస్తవంకదా!

వి. రాజారావు మోహనరావు ఇటీవల రెండు నవలలను ఒక చోట చేర్చి పుస్తకంగా తెచ్చారు. చెమికల ఈ రెండు నవలల్ని సమీక్షిస్తూ "సమాజంలో పెద్ద మనుషులుగా చెలామణీ అవుతున్న వారిలోని క్రౌర్యం కంటే అలగా జనంలోని క్రౌర్యం చాలా తక్కువే" అన్నది వాస్తవం. మరో ప్రవాహంలోని రామయ్య, లక్ష్మి, సీతాలు, పోచి వంటి పాత్రలు ప్రస్తుత సమాజంలో సంచరిస్తున్న మనుషుల ప్రతిబింబాలే. అలాగే 'అనుక్షణం' నవలలోని వీరన్న, సీతాలు, చుక్కమ్మలు కూడా. ముఖ్యంగా ఈ మూడు పాత్రలు సంఘర్షణలు వేదనలకు మారుపేర్లుగా ఉన్నాయి. సీతాలు, వీరన్నలు వెంటాడే పాత్రలు. సీతాలు వలస వెళ్ళడానికి ప్రధాన కారణం వ్యక్తీకరిస్తూ "ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్ళటం వలస. ఒక బతుకులోంచి మరో బతుకులోకి వెళ్ళడం కూడా వలసే... అలాంటి వలసలు సీతాలు బతుక్కు తప్పలేదు" అంటారు రచయిత. ఈ బడుగు బతుకులకు తప్పకపోవడం యదార్థం కదా!

నవీన్ 'కాలరేఖలు' నవలను యడవల్లి హరిప్రసాద్ కాలాను భూతికన్నా కాల వివరణ ఎక్కువగా ఉన్న నవలగా పేర్కొన్నారు. తెలంగాణా ఉద్యమ స్ఫూర్తినీ, బహు ముఖాలుగా విస్తరించిన అనేక ఉద్యమాలనూ నవలా రూపంలో ఇమిడి పోయే విధంగా ఈ చారిత్రాత్మక సందర్భంగల నవలను సమీక్షకులు సమీక్షిస్తూ "నవీన్ చరిత్ర పరిశోధకులని మించిన నైపుణ్యం ప్రదర్శించాడు. తన రాజకీయ మొగ్గు

ఎలాంటిదైనా నిష్పాక్షికంగా అన్ని ధోరణుల్ని రికార్డు చేయగలిగాడు. ఇదో ప్రామాణిక గ్రంథం. రెఫరెన్స్ బుక్ అని చెప్పేందుకు సంకోచించ”నక్కరలేదంటారు.

మానం పద్మజ 'ప్రథమ స్థానం' నవలపై సమీక్షలు పాజిటివ్‌గా వచ్చాయి. ముస్కుల రమ సమీక్షిస్తూ “వివాహ బంధమే జీవితంకాదని, మనకు నచ్చనపుడు విడిపోయి ఎవరి వ్యక్తిత్వంతో వారు జీవించవచ్చని, కంటికి కనిపించని కుటుంబ హింసను భరించవలసిన అవసరంలేదని 'చిన్ని' జీవితం” నిరూపిస్తుందన్నారు. పేరుమోసిన రచయిత్రికాకపోయినా మంచి రచననా శక్తిగల రచయిత్రిగా గుర్తించగలుగుతాం ఈ నవలను చదివి. చిత్తర్వు మధుగారు కూడా మరో పత్రికలో సమీక్షిస్తూ అభ్యుదయ భావాలుగల చిన్నిని, సమీక్షిస్తూ ప్రతిస్త్రీ, స్త్రీలను గౌరవించే ప్రతి పురుషుడు చదివి ఆలోచించాల్సిన విలువలున్న నవల అన్నారు. నవల చదవని వాళ్ళు అందులో ఒక్క వాక్యం వింటే చాలు సగం నవల అర్థమైపోతుంది. “నాతోపాటు నా పిల్లాడిని ప్రేమించే వ్యక్తి కూడా ఎదురయినప్పుడు తప్పకుండా మళ్ళీ పెళ్ళి చేసుకుంటాను” అంటుంది. స్త్రీ స్వేచ్ఛను కోరిన నవల ఇది.

**కథలు :**

ఈ రెండు నెలల కాలంలో పదిహేను దాకా కథల సంపుటాలు, 5 దాకా కథాసంకలనాల సమీక్షలు వచ్చాయి.

'విశాలాంధ్ర తెలుగు కథ'పై ఇది వరకే మంచి సమీక్షలు వచ్చాయి. ఇటీవల ఎన్. వేణుగోపాల్, ఎస్వీ సత్యనారాయణ ఈ 108 కథలపై మంచి సమీక్షలు చేశారు. చర్చనీయమైన గొప్ప ప్రయత్నమంటూ అందులోని అద్వితీయమైన అంశాలను వెలికితీసి చూపారు. “రచనల ప్రాతినిధ్య సంకలనమే గాని కథకుల ప్రాతినిధ్య సంకలనం” కాదన్నారు వేణు.

మధురాంతకం నరేంద్ర సంకలనం చేసిన 'తాత్విక కథలు' విలక్షణమైనవి. శ్రీవిరించి సమీక్షిస్తూ వినూత్న ప్రయత్నంగా అభివర్ణించారు. తాత్విక చింతనతో రాసిన 29 మంది కథకుల కథల్ని సంకలనం చేశారు. శ్రీవిరించి సమీక్షలో “జీవితాన్ని ప్రశ్నించి, జిజ్ఞాసతోనో, ఆత్మసాక్షాత్కారంతోనో ముగిసే కథలు. మనసు పొలిమేరల నుంచి బైట పడటానికి పెనుగులాడే కథలు.

అల్లాడి ఉమ, ఎం. శ్రీధర్, ఆంగ్లంలోకి అనువాదం చేసిన 'అయోని అండ్ అదర్ స్టోరీస్' సంకలనాన్ని చింతపట్ల సుదర్శన్ సమీక్షిస్తూ “ఏ స్టిచ్చింగ్ అయినా అన్ని విధాలా ఫిట్టింగ్‌గా ఉండక పోయినా తొడుక్కుందుకు సరిపోతే చాలుననుకునే వాళ్ళకి ఈ అనువాదాలు చక్కగా సరిపోతాయి” అంటారు. రావిశాస్త్రి 'విలువలు'గల కథ వాల్యూస్ కథకు

.............. O ..............

***అనేక మంది రచయితలు, రచయిత్రులు స్వంత ధనంతో కథా సంపుటాలను కవుల మాదిరి తీసుకురావడం ముదావహం. దాదాపు 15 సంపుటాలు ఈ రెండు నెలలలో రివ్యూలు కావడం వెనక కథకుల కృషిని అభినందించాలి. కొందరి రివ్యూలు అధిక ప్రాధాన్యతకు నోచుకుంటే మరికొందరివి యేక్‌యాంచ్ దోయాంచ్‌తో సరిపెట్టబడ్డాయి.***

.............. O ..............

సుదర్శన్ లేవనెత్తిన అంశం ఆలోచించదగింది. “తెలుగు ఆలోచన వెంట ఇంగ్లీషు పరుగుతీయడం వరకు బాగానే వుంది. కానీ భాషకి అందని ఆయన ఆలోచన లోతుల్ని అందుకోవడం కొన్ని చోట్ల వీలుకాలేద”న్నారు ఈ వీలుకాని అంశాలను అనువాద ప్రక్రియ ఆలోచించవలసిన అంశం. పైడిమర్రి రామకృష్ణగారు 'కథాకిరణాలు'గా చెబుతున్న 122 మంది తెలుగు కథకుల వివరాలతో వచ్చింది. గత, వర్తమాన కథకుల మేళవింపుగా దీన్ని తెచ్చారు.

దాదాపు 15 సంపుటాలు ఈ రెండు నెలలలో రివ్యూలు కావడం వెనక కథకుల కృషిని అభినందించాలి. కొందరి రివ్యూలు అధిక ప్రాధాన్యతకు నోచుకుంటే మరికొందరివి యేక్‌యాంచ్ దోయాంచ్‌తో సరిపెట్టబడ్డాయి.

బి. దామోదరరావు 'గిరివి' కథ వట్టికోట ఆళ్వార్ స్వామి స్మారక పురస్కారం పొందిన కథ. పొలాన్ని తాకట్టుపెట్టి కొడుకును ఓ ఫ్యాక్టరీ ఉద్యోగస్తున్ని చేసినా తరువాత తరువాత వాడి ఉద్యోగం పోతుంది. 'గిరివి' అలాగే ఉండిపోతుంది. రైతుబిడ్డ రాములు ఆత్మహత్య చేసుకుంటాడు. 'గిరివి' డబ్బులు కట్టలేక. చక్కని కథ.

కె. వరలక్ష్మి 'మట్టి–బంగారం' ప్రధానంగా స్త్రీలు స్వతంత్ర స్వభావం కలవారు. చుట్టూ ఉన్న వాతావరణాన్ని గమనించగలరు. ప్రశ్నించగలరు. అవసరం వస్తే తిరగబడగలరు. విమల సమీక్షిస్తూ “స్త్రీల దృష్టి కోసం నుండి కులం, ఆర్థిక, పరిస్థితుల్లో వస్తున్న మార్పుల గురించి విశ్లేషించే మంచి ప్రయత్నాన్ని రచయిత్రి సమర్థంగా చేశారు. నమ్మకం, మానవత్వం వంటి మామూలు కథలతోపాటు మట్టి–బంగారం 'పిల్లి' వంటి మంచి కథలు కూడా ఉన్నాయంటారు. ఈ సంపుటిలో...

కనుపర్తి విజయబక్షీ 'కాబా కాశీమిలన్” సంపుటిని షరీఫ్, కస్తూరి మురళీకృష్ణ సమీక్షించారు. ఇరవైనాల్గు కథలలో మనిషిని మనిషిగా గుర్తించే స్థితి నుంచి స్త్రీల సమస్యలదాకా ఆవేదనతో మంచి కథలు రాసిందని ఒకరు సమీక్షిస్తే, మరొకరు మనసును కదిలించే కథలుగా ఉన్నాయన్నారు. విజయబక్షి ఉపాధ్యాయురాలిగా, మహిళా ఉద్యమ కారిణిగా పొందిన అనుభవాన్ని కథలుగా మలిచారనేది కథలు చదువుతే తెలుస్తుంది.

వి. అశ్వినీదత్ 'అమాహ' కథల సంపుటిలో కొన్ని విదేశ ఇతివృత్తాలతో ఉంటే, మరికొన్ని మనగ్రామీణ వాతావరణంతో ముడిపడి వున్నాయి. పర్యటనలతో ముడిపడిన కథలు కూడా ఉన్నాయి. మాలి, పంజరం, పారిజాతం, చెరువు మంచి కథలు. టి.ఎస్. కృష్ణమూర్తిగారి కథల్ని కె. వీరా సమీక్షిస్తూ ఇందులో 14 కథలున్నాయన్నారు. ఇవి సగటు మనిషి జీవితాన్ని ప్రతిబింబిస్తాయనీ సదానందం, నల్లచుక్కలు, ఎదురీత వంటివి మంచి కథలుగా విశ్లేషించారు.

ఉషారాణి భాటియా వంతెన కథలలో ప్రధాన ఇతివృత్తం అనుభూతి. ఇందులోని ఇరవై కథలలో స్త్రీల జీవితంలో ముఖ్యంగా వృద్ధాప్య జీవితాన్ని చక్కగా విశ్లేషించిన కథలున్నాయి. పురుష సమాజం ఆర్థికంగా బలహీనమైన స్త్రీల జీవితాలను యెలా లోబరచుకుంటుందో వివరించిన సందేశాత్మక కథల పుస్తకమిది. అలాగే ఎ.ఎస్. మణిగారి ఆరవింద కథలను 'జె' సమీక్షించారు. ఇందులో 16 కథలున్నాయి. స్త్రీ పురుషుల మధ్యన సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలకు అద్దం పట్టిన కథలివి.

ముక్తవరం పార్థసారధి 'మిణుగురులు' చెమికల సమీక్షిస్తూ రచయితకు తెలిసిన ఇతివృత్తాల్ని యెన్నుకునే ఇందులోని 35 కథలు రాశారన్నారు. వెంటిలేటర్, హిపోక్రసీ, పొదుపు, మనవాళ్ళు వంటి కథలు యెందుకు మంచి కథలో విశ్లేషించి చూపారు. పతంజలి అన్నట్టు జీవితానికీ పాఠకుడికీ మధ్యన పనికిమాలిన తెరలాగా పార్థసారధి యే కథలో లేకపోవడం ముదావహమే.

చిత్తర్వు మధు కథలను నిశాపతి సమీక్షిస్తూ ఇందులో మంచి కథలతోపాటు గొప్ప కథలు కూడా ఉన్నాయన్నారు. ఉన్నాయన్న కథల్ని చక్కగా విశ్లేషించారు. ఇది మంచి సమీక్ష. 'ఆధునికమైన ఇతివృత్తం, ఆర్ద్రమైన కథనం, పాఠకుడిని కథ 'మూడ్'లోకి తీసుకెళ్ళగల రచనా చాతుర్యం మధు కలానికి పెట్టని నగలు”గా వర్ణించారు. అరుణోదయం, ఎర్రపూలు వామపక్ష భావాలతో రాసిన మంచి కథలు.

ఆర్. శశికళ 'చెదిరిన పిచ్చుక గూడు' అనే కథల సంపుటిని సుధామ మనసుపెట్టి సమీక్షించారు. ఇందులో 15 కథలున్నాయి. ఇవి పనిగట్టుకుని రాసినవి కావు.

అనుభవంలోంచి వచ్చినవి కావాలంటే చిన్నోడు, కలుపు మొక్కలు, ఆగ్రహం వంటి కథలు చదివితే మీకే తెలుస్తుంది.

శశికళ పిల్లల మీద కథలు రాసినట్లే సుప్రసిద్ధ రచయిత కె.ఆర్.కె. మోహన్ 'పిల్లల కథలు' అనే కథల సంపుటి ఇటీవల తీసుకురాగలిగారు. మల్లపల్లి ధూర్జటి ఈ కథల్ని సమీక్షిస్తూ బాలల సాహిత్యాన్ని చిన్నచూపు చూడని రచయితలలో కె.ఆర్.కె. మోహన్ ఒకరు. వివిధ బాలల పత్రికలలో ప్రచురితమైన ఆయన కథల సంకలనమే ఈ పుస్తకం అంటారు. ఇందులో 49 జానపద కథలు, 5 చారిత్రక పౌరాణిక కథలు, 12 సాంఘిక కథలతోపాటు ప్రముఖుల జీవితాలలోని గొప్ప సంఘటనలను కథగా మలిచి చెప్పిన ఈ పిల్లల కథలు తప్పక చదవదగ్గ సంపుటిగా విశ్లేషించారు.

దాసరి అమరేంద్ర శేఫాలిక సంపుటిని గొరుసు జగదీశ్వరరెడ్డి పెద్ద సమీక్ష చేయడమేగాక కథల మీద చిన్న ఇంటర్వ్యూ కూడా చేశారు. జగదీశ్వరరెడ్డి ఇందులోని కథల్లో లీనమై మనసుకు నచ్చిన వాటిని యేరుకుని సమీక్షించిన తీరు బాగుంది. ఈ కథలను జీవితాన్వేషణలో రాలిన శేఫాలికా సౌరభాలుగా అభివర్ణిం చారు. శేఫాలిక, ఆచరణ, విజయ, సెలవుల్లో, రాజేశ్వరి, సారేజహాసే అచ్ఛా, భద్రత, చెదర గూడని స్వప్నాలు, చదువు వంటి మంచి కథల్ని యెన్నుకుని విశ్లేషించారు. రెడ్డి "ఇందులోని కథలన్నీ చదివేక నా దేహంలోకి రచయిత ఆత్మ పరకాయ ప్రవేశం చేసినట్లుగా కథల్లోని పాత్రలు నాతో చిరకాల పరిచయం వున్నట్లుగా నా చుట్టూ తిరగనారంభించా"యెంటారు. నిజానికి శేషాలిక అంటే చాలా మందికి అర్థం తెలియదు. అమరేంద్ర శేఫాలిక అంటే పారిజాతపుష్పం అని అన్నాడు.

ఈ సంవత్సరం అంటే 2002 కథామహల్ సంకలనం వచ్చింది. ఒక పత్రికలో రివ్యూ అయింది. యడవల్లి హరి ప్రసాద్ దీన్ని సమీక్షిస్తూ ఇందులోని సంఘటనలు, పాత్రలు వెంటాడతాయి. ఇందులోని వస్తు రూపాలు భిన్నమైనవి. టి. సంపత్‌కుమార్ అంకురం, శాంతినారాయణ అద్దెతల్లి, శ్రీకంఠమూర్తిగారి, దిష్టి, బోయ జంగయ్య శిథిల విగ్రహాలు, కేతువిశ్వనాథరెడ్డి కాంక్ష వంటి మంచి కథల్ని ఇందులో చేర్చటం ముదావహం.

**కవిత్వం**

అన్ని ప్రక్రియల కన్నా వచన కవితా ప్రక్రియ ముందంజలో వుంది. దాదాపు ఇరవైదాకా వచన కవితా సంపుటాలతోపాటు వివిధ కవుల కవిత్వంతో వచ్చిన సంకలనాలు మరో నాలుగు దాకా ఉన్నాయి. ఇంకా సమీక్షకు నోచుకోనివి మరిన్ని తప్పక ఉండి

.............. O ..............

***అన్ని ప్రక్రియల కన్నా వచన కవితా ప్రక్రియ ముందంజలో వుంది. దాదాపు ఇరవైదాకా వచన కవితా సంపుటాలతోపాటు వివిధ కవుల కవిత్వంతో వచ్చిన సంకలనాలు మరో నాలుగు దాకా ఉన్నాయి.***

.............. O ..............

ఉంటాయి. ఈ రెండు నెలల్లో సమీక్షించిన కవితా సంపుటాలివి. అనిశెట్టి రజిత–ఉసురు, కత్తి పద్మారావు–ముళ్ళకిరీటం, ఎన్‌గోపి–జలగీతం, జింబో–రెండక్షరాలు, మద్దూరి నగేష్‌బాబు–నరలోక ప్రార్థన, టి. రాధాకృష్ణమాచార్యులు–భూమి పొరల్లోంచి, జయప్రభ–దిపబ్ ఆఫ్ వైజగ్ పట్నం, ఘంటశాల నిర్మల నిర్వచనం, అరుణ్‌బవేరా – ఒక కన్నీటి చుక్క కోసం, తాళ్ళలారి లాబన్‌బాబు – లాబన్‌గీతాలు, రాధేయ–చదువుల తల్లి, అంబటి వెంకన్న–కదురు, పెన్నా శివరామకృష్ణ–సల్లాపంతోపాటు వివిధ కవుల కవితలతో వచ్చిన వచ్చిన సంకలనాలన్నీ ఒక విలక్షణత, ప్రత్యేకతలు సంతరించుకున్నాయి. సుంకిరెడ్డి నారాయణరెడ్డి, అంబటి సురేంద్ర రాజు సంపాదకత్వంలో మత్తడి, దాట్లదేవదానం రాజు సంపాద కత్వంలో వంతెన, ననుమాసస్వామి, ఎస్.వి. సత్యనారాయణ, మనస చెన్నప్ప ఆధ్వర్యంలో యువకవిత వంటి సంలకనాలు మరిన్ని వచ్చాయి.

అనిశెట్టి రజిత ఉసురుపై మంచి సమీక్షలు వచ్చాయి. అన్నవరం దేవేందర్, నందిని సిద్ధారెడ్డి సమీక్షల్లో రజిత కవిత్వాన్ని ప్రశంసించారు. అన్నవరం దేవేందర్ 'ఉసురు'ను తెలంగాణా దళిత బహుజన స్త్రీవాద భూమికలతో విశ్లేషించారు. తెలంగాణా పల్లెల బాధల్నీ, భాషా ప్రయోగాల్ని, తెలంగాణా సంస్కృతిపట్ల ప్రేమని తెలియజేసే కవితలు యెన్నో ఉన్నాయన్నారు. తల్లికుండ, అమ్మా నల్ల మొగుల్జేసిందే, డాలర్ కొడుకులు, మూడు అతుకుల చీర, లచ్చువ్వ వంటి కవితల్లోన్ని ప్రత్యేకతల్ని యెత్తిచూపారు నందిని సిద్ధారెడ్డిగారు సమీక్షిస్తూ ఉసురు దుఃఖాల్ని మోసుకొచ్చిన కవిత్వమన్నారు. ఇది విస్తృత సమీక్ష.

ఘంటశాల నిర్మల కవిత్వం నిర్వచనంపై ఇది వరకే మంచి మంచి సమీక్షలు వచ్చాయి. వాటితోపాటు మరికొన్ని ఇటీవల పత్రికల్లో కూడా మంచి ప్రాధాన్యతగల సమీక్షలు వచ్చాయి. కోవెల సంపత్కుమారా చార్య, సీతారాం సమీక్షలు ఆమె/నిలువెత్తు కవిత్వాన్ని ప్రశంసించారు. సీతారాంగారైతే సమీక్షపేర ఆరు పేజీల ప్రామాణిక వ్యాసం రాశారు. ఘంటశాల నిర్మల మంచి కవయిత్రి. ఆలస్యంగా పుస్తకం వేసినా ఆమె స్థానాన్ని యెవరూ కాదనలేరు. సంపత్కుమారాచార్య సమీక్షిస్తూ సంకలనంలోని దాదాపు మూడు వంతుల కవితల్లో ఏ నాలుగయిదో తప్ప స్త్రీవాద భూమిక మించి కన్నా 'స్త్రీ' భావ భూమిక మించి నిష్పన్నమైనవే అంటారు. ఇంచుమించు ప్రతి కవితా కాలికంగానూ వాస్తవికంగానూ అభివృద్ధిపరంగానూ ప్రత్యేకతను సంపాదించిన గాఢ మనస్వినిగా నిర్మల కవిత్వాన్ని ప్రశంసించారు.

అబ్బూరి ఛాయాదేవి జయప్రభ 'ది పబ్ ఆఫ్ వైజాగ్' పట్నంను చక్కటి విశ్లేషణలతో సమీక్షించారు. ఇది నిజానికి మొదటి సమీక్షకాదు. ఇది వరకూ కొన్ని సమీక్షలు వచ్చాయి. సహృదయ సమీక్షకురాలైన ఛాయాదేవి కడిగిన ముత్యంలాటి జయప్రభ కవితా సొగసుల్ని ఉదాహరణలతో సహా మనముందుంచారు.

ఎన్. గోపి జలగీతం మీద నుంచి సమీక్షలు వచ్చాయి. ప్రతి సమీక్షకుడు అందులోని వస్తు ప్రాధాన్యతనూ, కవితా సౌందర్యాన్ని సమీక్షించారు. చింతపట్ల సుదర్శన్ మాత్రం అందులో తనకు నచ్చని అంశాలను యెత్తిచూపారు. 27 భాగాల ఈ దీర్ఘకవితలో 27వ భాగం సుదర్శన్‌గారికి బాగా నచ్చింది. జలగీతం దీర్ఘ కవిత కావడం, సార్వజననమైన వస్తువు 'జలం' కావడం, అది సమస్త ప్రాణులకు జీవాధారమైన ఇతివృత్తం కావడం మూలంగా దీనికి ఒక శాశ్వత సిద్ధి లభించే అవకాశం ఉంది. ఇది వివిధ భాషలలో అనువాదమవడం అభినందించదగిన అంశం.

కత్తి పద్మారావు ముళ్ళకిరీటాన్ని కేశవ్ సమీక్షిస్తూ దళిత కవిత్వంలో ముళ్ళకిరీటం విలక్షణతను యెత్తిచూపారు. దళిత ఉద్యమకారుడిగా, కవిగా ఆయనది ఒక ప్రత్యేక పంథా. దళిత సౌందర్య కవిత్వం యెక్కడెక్కడుందో యెత్తి చూపారు. "దళితుల్ని చిన్నచూపు చూసే లక్షణం ఒక్కతరంలోనే అంతరించదు. అందుకు యెంతో పోరాటం అవసరం. తమ మీద తాము పోరాటం, శత్రువుతో పోరాటం అనివార్యమైన అవసరం. ఉద్యమకారునికీ, కవికీ తప్పనిసరి అంశాలివి. ఈ రెండు లక్షణాలు నిండుగా ఉన్నాయం టారు. దీన్ని సమీక్షిస్తూ కేశవ్.

జింబో రెండక్షరాలను కిరణ్ సమీక్షిస్తూ తెలంగాణా కవితలో కొత్త పార్శ్వంగా విశ్లేషించారు. రెండక్షరాల మీద ఇది వరకే చాలా పత్రికల్లో మంచి సమీక్షలు వచ్చాయి. ఈ రెండు నెలల్లో వచ్చిన సమీక్ష మాత్రం ఇదే.

మద్దూరు నగేష్‌బాబు నరలోక

ప్రార్థనను వంశీ ప్రశేన్, ఒక అభాసగా భావించి ఉంటారు. వస్తువు సమీక్షకునికి యెక్కువగా నచ్చలేదు కానీ అందులోని కవిత్వానికి పరవశుడై ప్రశంసించారు. "ఒక అమూర్త పీడితుడిని సృష్టించిన విప్లవ కవులు విఫలమయినట్టే నగేష్‌బాబు కూడా ఒక అమూర్త దళితుడిని సృష్టించి అతన్ని క్రైస్తవీకరించడంవల్ల విఫలమయ్యాడు" అని యెత్తిచూపారు.

రాధాకృష్ణమాచార్యుల 'భూమి పొరల్లోంచి' అనే ఈ కవితా సంపుటిని ఏకశిల సమీక్షించారు. అతని ఉద్దేశ్యం, సందేశం స్పష్టంగా విప్పిచెప్పారు. మనిషిని అశాంతికి గురి చేసే కారణాల మీద రాసిన కవిత్వాన్ని యెత్తి చూపారు. అమ్మ మీద అల్లిన కవితల్ని చక్కగా విశ్లేషించారు. అరుణ్ బవేరా 'ఒక కన్నీటి చుక్కకోసం' సమీక్షలో ప్రపంచీకరణ దాడిలో లుప్తమవుతున్న విలువల నేపథ్యంలోంచి రాసిన కవిత్వం అత్యధిక భాగం ఇందులో ఉంది. తాళ్లూరి లాబన్ బాబు లాబన్ గీతాలను 'ఫీనిక్స్‌సన్' సమీక్షిస్తూ దీన్ని పఠించడం కన్నా వినడంలోనే ప్రయోజనం ఉన్న కవిత్వంగా అభివర్ణించారు. కర్రి శ్యామసుందరరావు 'చదువులతల్లి' అనే పద్యకవిత్వాన్ని కె. లక్ష్మీఅన్నపూర్ణ, శారదాదేవిని స్తుతిస్తూ రాసిన పద్యపాదాల్ని యెత్తి చూపుతూ కవి సరస్వతీదేవిలో లీనమైన అంశాన్ని ఉటంకించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు వేసిన 'యువకవిత' సంకలనాన్ని కసిరెడ్డి వెంకటరెడ్డి సమీక్షిస్తూ మంచి సూచనలు చేశారు.

పెన్నా శివరామకృష్ణ 'సల్లాపం' గజల్స్‌ను నోముల సత్యనారాయన సుదీర్ఘమైన వివరాలతోపాటు సమీక్షిస్తూ గజల్ వెనక ఉన్న మతలబ్‌ను పెన్నా పట్టుకున్న తీరును ప్రశంసిస్తూ కొన్ని గజల్లను ఉదహరించారు కూడా.

అంబటి వెంకన్న కదురుపై వర్ఘుల శివకుమార్ మంచి కవితాత్మకమైన సమీక్ష చేశారు. వెంకన్న కవిత్వం అప్పుడు పొరల అంతర్వేదనలోంచి విచ్చుకున్న కవిత్వంగా మెచ్చుకున్నారు.

రాధేయ క్షతగ్రాతంను 'జి.రా' సమీక్షిస్తూ రాయలసీమ సమస్యలపైన, రైతులపైన కవితల్ని ప్రశంసించారు. స్వయాన రాధేయ "ఇవాళ కవిత్వమంటే నిట్టూర్పుల నిర్మాణంలో నివురు దాచిన అగ్నిలిపి"గా వ్యాఖ్యానించిన తీరు ప్రశంసించదగేట్లుగా ఉంది. సుప్రసిద్ధ నవలాకారుడైన దాశరథి రంగాచార్యుల 'మానస కవిత' సంపుటిని ఇటీవల తెచ్చారు. 'జె', సమీక్షిస్తూ 163 కవితలున్న ఇందులో చాలా మట్టుకు గుండె లోతుల్ని తట్టిలేపే కవితలున్నాయని ఉదాహరణలతో సమీక్షించారు.

అనేక కవితా సంపుటాలతోపాటు

.............. O ..............

***సాహిత్య వ్యాస సంకలనాలు, విమర్శలు, విశ్లేషణలు, అనువాదాలు, ఆత్మకథల వంటి అనేక అంశాల మీద వస్తున్న పుస్తకాలకు తగిన ప్రాధాన్యం లభించడం ముదావహమే. రెండు నెలల్లో వచ్చిన కథ, నవల, కవిత్వం కన్న యెక్కువగా 'సాహిత్య విమర్శ-వివిధాంశాల' మీద వచ్చిన గ్రంథాలే యెక్కువ.***

.............. O ..............

వైవిధ్యమైన ఉద్యమపరమైన కవితా సంకలనాలు కూడా కొన్ని వచ్చాయి. దాట్ల దేవదానం రాజు సంపాదకత్వంలో 'వంతెన' అనే ఒక మంచి కవితా సంకలనం వచ్చింది. అద్దేపల్లి, ఆకెళ్ళ, గౌతమ్, భగవాన్, శిఖామణి వంటి అనే మంచి మంచి కవుల కవితలతో తెచ్చిన సంకలనమిది. యానాముకీ ఎదుర్లంకకీ గోదావరి మీద పెద్ద వంతెన కట్టబడింది. దీనితో యానాం జీవన విధానంలో మార్పు వచ్చింది. ద్వా.నా.శాస్త్రి వంతెన చక్కటి కవిత్వంగల మంచి సంకలనంగా ప్రశంసించారు.

సుంకిరెడ్డి నారాయణరెడ్డి, అంబటి సురేంద్రరాజు సంపాదకత్వంలో వచ్చిన 'మత్తడి'ని కోవెల సంపత్కుమార చక్కటి సమీక్ష చేస్తున్నారు. మొదటి భాగం ఒక దిన పత్రికలో వచ్చింది. సంపత్కుమార చారిత్రక సందర్భంలోంచి సమీక్షిస్తూ 'మత్తడి' రావడానికి వెనక ఉన్న తెలంగాణా కవుల నేపథ్యాన్ని విశ్లేషించారు. మత్తడి కవిత్వంలో "తెలంగాణా కవిత్వం మాత్రమే ఉంది. తెలంగాణవాద కవిత్వం లేదు" అంటారు.

**సాహిత్య విమర్శ : వివిధాంశాలు :**

పేర్వారం జగన్నాథం సంకలనం చేసిన 'దేశీయ కవితా ప్రస్థానం' ఒక ప్రామాణికతో వెలువడిన సాహిత్య విమర్శగా చెప్పుకోవాలంటారు ద్వా.నా. శాస్త్రి తన సమీక్షలో అంతా బాగానే ఉంది కాని పేర్వారం సంపాదకీయమే గందరగోళంగా ఉందంటారు. లోపలి వ్యాసాలకు ముందుమాటకు యే మాత్రం పొంతన కుదిరే విధంగా లేదన్నారు. పి.వి. రమణగారు సమీక్షిస్తూ "సాంస్కృతి మూలాలను మానవీయ విలువలను నింపుకొని జాతివికాసానికి తోడ్పడే దేశీయ కవితా నిర్మాణానికి ఆహ్వానం పలికే" పుస్తకంగా విశ్లేషించారు.

కె. రామచంద్రమూర్తి చలపతిరావుగారు కృషి చేసిన 'తెలుగు వెలుగు'లను సమీక్షిస్తూ-నాల్గు దశాబ్దాల చీకటి నుంచి వెలుగులోకి నడిపించిన, వివిధ రంగాలలో కృషి చేసిన వైతాళికులను స్మరించుకుంటూ చక్కటి సమీక్ష చేశారు. ఈ రెండు నెలల కాలంలో వచ్చిన అత్యుత్తమ సమీక్ష ఇది. పరిధిని దాటి పోకుండానే సమీక్షకుడు చేయువలసిన పనిని సమర్థవంతంగా చేయగలిగారు. చలపతి రావు దగ్గర మొదలు పెట్టి మునిమాణిక్యం, జాషువా, విశ్వనాథ, శ్రీశ్రీ, సి. నారాయణరెడ్డి దాకా విశ్లేషించిన తీరు బాగుంది. నారాయణరెడ్డిపై అభిప్రాయాలను ఉటంకించిన తీరు చూడండి. అలనాటి "యువకవి శ్రీ సింగిరెడ్డి నారాయణరెడ్డి రచనకన్నా ప్రచురణ ఆవిష్కరణ గొప్పవన్న లోకరహస్యం ఆకళించుకున్నవాడూనూ...' అని సుతిమెత్తగా అంటూ కవులలో పెద్దపీట వేసుకుని తన జనప్రియత్వాన్ని సుస్థిరం చేసుకుంటారు' అంటూ జాతకం సరిగానే చెప్పారు'' అనడంలో చలపతిరావు అభిప్రాయాలతో పాటు తన అభిప్రాయాల్ని కలిపిన తీరులోనే సమీక్షకుని కుండే స్వభావాన్ని సరిగా వ్యక్తపరిచారు. సుందరయ్య గురించి రాసేప్పుడు రాజకీయ వ్యతిరేకత వదులుకోలేక పోయిన వైనాన్ని విశ్లేషించారు.

ఎ.ఎ.వి. ప్రసాద్ యార్లగడ్డ బాలగంగాధరరావు నామ విజ్ఞానాన్ని సమీక్షించిన తీరు ప్రశంసనీయమైంది. 'పేరులోనే కలదు పెన్నిధి' అంటారు. "నామవిజ్ఞానానికి మూలాలు యాస్కుని నిరుక్తంలో ఉన్నాయని అది వేదశబ్దాలకు అర్థాన్ని, వ్యుత్పత్తిని నిరూపించిందని'' చెప్పారన్నారు. స్థలనామాలు, గృహనామాలు, వ్యక్తి, వృక్ష, వాస్తు నామాలు, జంతునామాలు, తదితర పేర్లను గురించి విశ్లేషించిన నామవిజ్ఞాన శాస్త్రం యార్లగడ్డ వారిదిమరి.

సుంకర వెంకమాంబ రంగనాథరామాయణము-అనుశీలన అనే పరిశోధన గ్రంథాన్ని మునిపల్లె రాజు సమీక్షిస్తూ ప్రతిభావంతమైన పరిశోధనగా కొనియాడారు. ఈ పుస్తకానికి బాపుబొమ్మ ఒక ఆభరణంలా ఉంది.

అక్కిరాజు రమాపతిరావు సంకలనం చేసిన 'సాహితీ వైజయంతి' అనే వ్యాస సంకలనాన్ని వెలుదండ నిత్యానందరావుగారు ఇదొక ప్రశస్తవ్యాస తోరణంగా విశ్లేషించారు. ఇరవైయేడు ప్రసిద్ధ రచయితల ప్రశస్త వ్యాస సంపుటమిది.

విశ్వనాథ అచ్యుతదేవరాయలు 'వేదారవిందము'పై ముదిగొండ శివప్రసాద్ సమీక్షిస్తూ ఈ గ్రంథం వేదాలపై సముచిత వ్యాఖ్యానంలా నిలుస్తుందన్నారు. విశ్వనాథ కుమారుడైన అచ్యుత దేవరాయలు ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నా వేదములపై మూడు

భాగములుగల వ్యాఖ్యాన గ్రంథమిది.

ఏటుకూరి బలరామమూర్తి వ్యాసావళిని సంకలనం చేసిన ఏటుకూరి పంకజమ్మ గ్రంథాన్ని కె.పి. అశోక్‌కుమార్ గారు సమీక్షిస్తూ ఏటుకూరి బలరామమూర్తి చేసిన ప్రసంగాలు, రాసిన విశిష్ట రచనల్ని, వ్యాసాల్ని ఒక చోటకు తేవడం బాగుందన్నారు.

జనసాహితి 'భాష-సంస్కృతి-ఉద్యమం' గ్రంథాన్ని చెమికల సమీక్షిస్తూ మాతృభాష విషయంలో ఒక మంచి మాట చెప్పారని మరొకమారు గుర్తు చేశారు. మాతృభాషా విషయంలో పాలుపంచుకునే వారందరూ గూగీని ఆదర్శంగా తీసుకోవాలనీ గూగీ ఆంగ్ల భాషాధ్యాపకుడిగా పని చేసినా తన మాతృభాష 'గికుయీ' భాషలోనే రచనలు చేశారన్నారు. 'భాష-సామ్రాజ్యవాదం' అనే గూగీ వ్యాసం కూడా ఇందులో ఉంది.

పుల్లెల శ్రీరామచంద్రుడు 'ప్రాకృత భాషా వాఙ్మయ చరిత్ర' అనే గ్రంథాన్ని ద్వా.నా. శాస్త్రి సమీక్షిస్తూ ప్రాకృత భాష గురించి, సాహిత్యం గురించి, ప్రామాణికమైన, సవివరమైన గ్రంథాలు తెలుగులో లేవన్నారు. ప్రాకృత భాషా సాహిత్యాల చరిత్రను సాధికారికంగా సవివరంగా పుల్లెల రామచంద్రుడు రాసినందుకు తప్పక అభినందించాలి. అయ్యా, అగ్గి, మట్టి, సింగారం వంటి కొన్ని వేల మాటలు ప్రాకృతం నుంచి వచ్చాయనేది తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది.

నల్లూరి రుక్మిణి 'జ్ఞానం- అందరిదీ' అన్న వ్యాస సంకలనాన్ని ఎన్. వేణుగోపాల్ ఉత్తమ సమీక్ష అనుకునేట్లు చేశారు. స్త్రీల పోరాట చరిత్రకు మరొక ముఖ్యమైన చేర్పుగా విశ్లేషించారు. "నల్లూరి రుక్మిణి వ్యాసాలు ఇంతకాలమూ మహిళా ఉద్యమ చరిత్రకారులు విస్మరించ దలుచుకున్న వాస్తవాలను మన దృష్టికి తెస్తాయి. ఒక ప్రత్యామ్నాయ చరిత్ర రచనకు అవసరమైన ఆధారాలను అందజేస్తాయి" అంటారు వేణుగోపాల్.

శిలాలోలిత మరో పత్రికలో సమీక్షిస్తూ రుక్మిణి కార్యాచరణే ఆమె వ్యాసాలంటారు. సాహిత్య వ్యాసానికి కావలసిన ఆత్మ పరిశీలన రుక్మిణి వ్యాసాల్లో లభిస్తుందంటారు. వి.ఆర్. బొమ్మారెడ్డి 'కమ్యూనిస్టు పత్రికలు' శేఖర్‌రెడ్డి సమీక్షిస్తూ 'పత్రికల ఉత్పత్తి వికాసం గూర్చి తెలుగులో ఒక్క పుస్తకం కూడా ఇప్పటికీ రాలేదనీ, బొమ్మారెడ్డి శ్రమకోర్చి పుస్తకం తెచ్చినందుకు తప్పక అభినందించాలంటారు.

పుచ్చలపల్లి సుందరయ్య 'విప్లవపంథాలో నా పయనం'ను వాసిరెడ్డి వేణుగోపాల్ జగమెరిగిన కమ్యూనిస్టుగా ప్రశంసిస్తూ విప్లవోద్యమంలో ఎదురైన ముళ్లబాటలు, తొక్కిన కొత్త పుంతలు

............. O .............

***పుచ్చలపల్లి సుందరయ్య గారి 'విప్లవపంథాలో నా పయనం'ను వాసిరెడ్డి వేణుగోపాల్ గారు జగమెరిగిన కమ్యూనిస్టుగా ప్రశంసిస్తూ విప్లవోద్యమంలో ఎదురైన ముళ్ల బాటలు, తొక్కిన కొత్త పుంతలు సుందరయ్య విప్లవపథ పయనంలో కళ్ళకు కట్టినట్టు కనిపిస్తాయి.***

............. O .............

సుందరయ్య విప్లవపథ పయనంలో కళ్ళకు కట్టినట్టు కనిపిస్తాయి. సుందరయ్య బాల్యం నుండి 1948 కలకత్తాలో జరిగిన పార్టీ మహాసభల దాకా రాసుకున్న ఆయన ఆత్మకథ ఆయనది కాదు. ప్రజలది. కాకపోతే ఉద్యమానిది. మంచి పుస్తకం.

శారదానంద స్వామి శ్రీరామకృష్ణ పరమహంస మొట్ట మొదటి రెండు సంపుటాలను దయాత్మానందస్వామి అనువదించారు. ఈ పరమహంస జీవిత చరిత్రను రెంటాల జయదేవ, దోర్బల శర్మలు సమీక్షించారు. దీన్ని రామకృష్ణ భక్తులేకాదు, ఆధ్యాత్మిక జిజ్ఞాసువులేకాదు అందరూ చదవదగిన గ్రంథంగా రెంటాల జయదేవ సమీక్షించారు.

వేదుల శకుంతల 'కృష్ణా తరంగిణి' పేరుతో వచ్చిన పుస్తకంలో శకుంతలగారు కృష్ణాపత్రికలో రాసిన 79 'కాలమ్స్'ను యేర్చికూర్చి గ్రంథంగా తెచ్చారు. ఇందులో స్త్రీవిద్య, ప్రలోభాలు, సంపాదన, ప్రచారం వంటి కాలమ్స్ బాగున్నాయి. కట్టమంచి బాలకృష్ణారెడ్డి యూరప్ యాత్రాజ్ఞాపకాలను పుస్తకం తెచ్చారు. సి.ఆర్.ఎస్సార్ సమీక్షిస్తూ 'యూరప్ పర్యటించి స్తోమత లేనివారికి బాలకృష్ణారెడ్డి యూరప్ జ్ఞాపకాలు' చదివితే చూసివచ్చినంత ఫలితం లభిస్తుందంటారు.

ఎం. ఆదినారాయణరాసిన 'జిప్సీలు' ప్రతి ఒక్కరు చదవ దగ్గ గ్రంథంగా సుధామగారు చక్కటి సమీక్ష చేశారు. ఇది సంచార జీవుల పరిచయ గ్రంథమిది. సుధామగారు సమీక్షిస్తూ ముప్పయ్ అధ్యాయాలుగా సాగిన ఈ గ్రంథంలో ఆఫ్రికా, అరేబియా, మధ్య ఆసియా ప్రాంతాలలో ఉన్న సంచార జీవులు, దిమ్మరులు, వలసకళాకారుల జీవితం, సాహిత్యం, వారి కుటుంబ వ్యవస్థ అర్థమవుతుంది. ఇది ప్రామాణిక పుస్తకంగా యెన్నదగిందంటారు. వేంపల్లి గంగాధర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు. వివిధ పత్రికల్లో విభిన్న అంశాల మీద రాసిన వ్యాసాలు, శేషంద్రను చేసిన ఇంటర్వ్యూను ఒక చోట 'కథనం' పేరున ఒక చోట చేరి పుస్తకంగా తీసుకువచ్చారు. వారి రచనా విధానం, శైలి, వస్తు వైవిధ్యం తెలుసుకోవడానికి తప్పక చదవదగ్గ పుస్తకమిది. అలాగే ఉప్పల నర్సింహం రాసిన 'తెలంగాణ ముచ్చట్లు' తప్పక చదవ దగినవి. మైత్రేయ సమీక్షిస్తూ తెలంగాణ గ్రామీణ స్త్రీలు సంభాషించుకునే భాషలో వచ్చిన తెలంగాణ మాండలిక పదాలకు ఇది ప్రామాణిక గ్రంథంగా ఉంటుంది. తెచ్చిపెట్టుకున్న తెలంగాణ పదాలు కావు. భాషా పరిశోధకులకు ఒక బొగ్గుల గనిలా ఉపయోగపడుతుందంటారు.

తుమ్మేటి రఘోత్తమరెడ్డి పనిపిల్ల కథపై సాగిన చర్చనంతా ఒక చోట చేర్చి ఎవరీ పనిపిల్ల' పేరుతో ఠాకూర్ రామ్‌సింగ్ సంకలనం చేశారు. కాళీపట్నం 'యజ్ఞం' కథపై వచ్చినట్లే పనిపిల్లపై తేవడం ముదావహం.

అంపశయ్య నవీన్ సాహితీయాత్రను వివరించే పుస్తకం సాహితీ ప్రస్థానం. యద్ధనపూడి సావిత్రి సమీక్షిస్తూ అంపశయ్య, ముళ్ళపొదలు అంత స్రవంతి నవలలపై రాసిన వ్యాసాలూ, కాత్యాయినీ, అద్దేపల్లిగార్ల వ్యాసాలు నవీన్ ప్రస్థానానికి హైలెట్‌గా అభివర్ణించారు. అంపశయ్య నుండి అంబరం వరకు యెదిగిన నవీన్ సాహిత్యానికి ఇదొక బెస్ట్‌కాంప్లిమెంట్ బుక్‌గా చెప్పుకోవచ్చు.

అక్కిరాజు రమాపతిరావు తిరుమలరామచంద్ర జీవితం-రచనలు అనే పుస్తకాన్ని ముదిగొండ శివప్రసాద్ సమీక్ష చేశారు. అక్కిరాజు పేరు వినగానే వీరేశలింగం పంతులు గుర్తుకు వస్తాడు. వీరేశలింగంపై చేసిన సేవలాంటిదే తిరులరామచంద్ర మీద చేసిన ఒక రకమైన పరిశోధన.

అలాగే తురగా జానకీ రాణి నీ జీవితం నాకు కావాలి, వెలుగు రేఖలను జె. శ్యామల సమీక్ష చేస్తూ ఆమె ఎనిమిది నాటకాలనూ, ఆరు రూపకాలను చక్కగా విశ్లేషించారు. ఈ నాటకాలు, జానకి జీవనానుభవంలోంచి వచ్చినవే అన్నారు.

పది యేక పాత్రలను ఐతా చంద్రయ్య వాసి పుస్తకంగా తెచ్చారు. 'ఏకపాత్రల' పై వచ్చే గ్రంథాలు చాలా స్వల్పం. శ్రీరంగస్వామి ఏకపాత్రలను సమీక్షిస్తూ ఏకపాత్ర రూపం కనుమరుగవుతున్న సందర్భంలో పుస్తకంగా ఐతా చంద్రయ్య తేవడం అభినందనీయమన్నారు.

సాహిత్యం, విమర్శ, ఆత్మకథ, ప్రత్యేక సంచికలు, నాటికలు, భాష, సంస్కృతులపైన సాంస్కృతిక కళారంగాలపైన వచ్చిన మరిన్ని పుస్తకాలను విశ్లేషించ లేకపోతున్నందుకు విచారంగా ఉంది.

V

## నా పరిశోధన

# తెలుగు, మలయాళ సామెతలు - కుటుంబ జీవన చిత్రణ

*సోదర భాషలైన ఈ రెండింటి సామెతల్లోనూ ఎన్నో పోలికలున్నాయి. అలాగే ఎన్నో తేడాలున్నాయి. పోలికల విషయానికొస్తే వస్తు రూపాలు రెండింటా సాదృశ్యాల సందర్భాలే ఎక్కువ. కొన్ని సమయాల్లో సామెతల్లోని వస్తువు ఒకటే అయినప్పటికీ రూపం వేరుగావచ్చును (అంటే సామెత చెప్పే తీరు మారిపోతుంది) మరొక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. **1925**ల వరకూ కేరళలోని నాయర్ తదితర ప్రాబల్య కులాల్లో బలంగా వున్న మాతృస్వామిక వ్యవస్థకు సంబంధించిన ఆనవాళ్ళు తెలుగు సామెతల్లో నిలిచివుండడం.*

**డా॥ నలిమల భాస్కర్**

అనుభవం ఆలంబనంగా పదహారణాల తెలుగుదనంతో ప్రభవించిన సామెత పల్లీయుల సంపద. జానపద సారస్వతంలో దీని స్థానం అత్యంత ప్రధానం. ఒక జాతి సంస్కృతీ సంస్కారాలకీ, ఆచార వ్యవహారాలకీ, ఆశనిరాశలకీ, కష్టసుఖాలకీ, జీవన రీతులకీ సజీవ స్రవంతి సామెతల సాహితి.

సామెతలపై పరిశోధన ఆత్మ సంశోధనలాంటిది. వ్యవహారంలో సామెతకున్న ప్రాధాన్యం అన్యన్య సామాన్యం. తెలుగులో సామెతలపై వివిధ విశ్వవిద్యాలయాల్లో ఇప్పటి వరకు రెండు పి.హెచ్.డి. సిద్ధాంత గ్రంథాలూ, ఏడు ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసాలూ సమర్పించబడ్డాయి. అంతే కాకుండా విశ్వవిద్యాలయాలకు బాహిరంగానూ కృషి జరిగింది. నా పరిశోధనా లక్ష్యం.... ప్రధానంగా తెలుగు, మలయాళ సామెతల్లో కుటుంబ జీవనం చిత్రించబడిన విధానాన్ని అనుశీలించడం. ఇది తులనాత్మక పరిశీలనం. తెలుగు భాష తమిళ, కన్నడ, మళయాళాల్లా ద్రావిడ భాష. ఈ భాషల మధ్య, సాహిత్యాల మధ్య అనేక సారూప్యాలూ, సాదృశ్యాలూ వున్నాయి. ఇవి ద్రావిడ సంస్కృతినీ, విశేషించి భారతీయ సంస్కృతినీ ప్రకటిస్తున్నాయి. తులనాత్మక పరిశోధనలు అవిచ్ఛిన్నంగా కొనసాగడం ఆరోగ్యకరం. రెండు లేదా అంతకన్న ఎక్కువ సాహిత్యాల తులనాత్మక వివేచనంవల్ల పలు సాదృశ్యాలే కాకుండా కొన్ని వైదృశ్యాలూ వెల్లడవుతాయి. సాదృశ్యాలు పై సాహిత్యాల ఏకీభావానికి తోడ్పడితే, వైదృశ్యాలు ఆయాసాహిత్యాల ప్రత్యేక వ్యక్తిత్వాల్ని అర్థం చేసుకోవడానికి దోహదపడతాయి. భిన్నత్వంలో ఏకత్వం నిరూపిస్తాయి.

ఈ పరిశోధనా ప్రణాళికలో ముందుగా 'సామెతలపై పరిశోధనలు-పలు శోధనలు' అనే పరిచయాధ్యాయం రాశాను. ఇందులో జానపద సాహిత్యంలో సామెతకున్న ప్రాధాన్యం వివరిస్తూ, తెలుగులో ముఖ్యంగా విశ్వవిద్యాలయాల్లో సామెతలపై జరిగిన కృషిని పేర్కొనడం జరిగింది. తర్వాత మలయాళ సామెతలపై జరిగిన పరిశోధనా వివరాలు ఇచ్చి, తులనాత్మక పరిశీలనల లక్ష్యం స్పష్టం చేశాను.

నా పరిశోధనలోని మొత్తం అధ్యాయాలు తొమ్మిది. మొదటిది 'కుటుంబం-భారతదేశం' భారతీయ సమాజంలో కుటుంబం నాటి నుంచీ నేటి వరకూ ఎలా అవిచ్ఛిన్నంగా వస్తోందో, ఎన్ని మార్పులకు లోనయిందో వివరించాను. అంతే కాకుండా కుటుంబాన్ని నిర్వచించి, వ్యుత్పత్తి చెప్పుకొని, ఉమ్మడి, వేరు కుటుంబాల నిర్మాణాది విషయ వివేచనం చేసి, పితృస్వామికం, మాతృస్వామికం అనే రెండు పరస్పర విరుద్ధ కుటుంబ పద్ధతుల్ని చర్చ చేసి, కేరళ రాష్ట్రంలోని కుటుంబ వ్యవస్థలో మాతృస్వామికం (మరుమక్కత్తాయం) ప్రత్యేక వైదృశ్యంగా పేర్కొన్నాను. అలాగే బహుభర్తృత్వం సైతం కేరళ ప్రత్యేకతగా ఈ అధ్యాయంలో వివరించాను. తెలుగు, కేరళ ప్రజల జీవన విధానాల్లో అనేక సాదృశ్యాలున్నా, మలయాళీలు మాత్రం క్రీ.శ. 1925 ప్రాంతాల దాకా మాతృస్వామికం, బహుభర్తృత్వాల్ని ఆచరించడం ప్రధాన వైదృశ్యం. తెలుగు మలయాళ భాషల్లోని ఉమ్మడి, వేరు కుటుంబాలకు చెందిన సామెతల్నీ, కుటుంబ పోషణ, తదితర కుటుంబ సంబంధిత సామెతల్నీ ఈ అధ్యాయంలో పోల్చడం జరిగింది.

రెండవ అధ్యాయమైన తల్లిదండ్రులు-పిల్లలులో కుటుంబంలో తల్లిదండ్రులు-సంతానానికి సంబంధించిన సామెతల్ని అనేక శీర్షికల క్రింద తులనాత్మకంగా పరిశీలించడం జరిగింది. ముందు ఈ అధ్యాయంలో విడిగా తల్లి ప్రాధాన్యం, తర్వాత ప్రత్యేకంగా తండ్రి ప్రాధాన్యం, తల్లిదండ్రులు-పిల్లల పరమైన నానుడుల్ని క్రమంగా చర్చించాను. తల్లిదండ్రుల గుణాలు పిల్లలకి సంక్రమించడం, తల్లిదండ్రుల్ని మించిన పిల్లలు, పిల్లలు-ప్రాధాన్యం, పిల్లలు-సంఖ్య, పిల్లల పుట్టుక-కొన్ని నమ్మకాలు, పిల్లలు-కొడుకు, తల్లీ పెళ్ళాల పట్ల తనయుల భావాలు, తల్లిదండ్రులు-కొడుకుల పోషణ, తల్లిదండ్రులు-పిల్లలు-అవీయివీ సంతానం-కూతురు, కూతురి గురించి తల్లిభావన, కొడుకులు-కూతుళ్ళు, పిల్లలు-దండన, పిల్లలు-గారాబం, పిల్లలపై మరికొన్ని సామెతలు అనే శీర్షికల క్రింద తెలుగు, మలయాళ భాషల్లోని సామెతల్ని పోల్చడం జరిగింది. అనేక సందర్భాల్లో వీటి మధ్య సాటి భావాలే సాక్షాత్కరిస్తున్నాయి.

'ఆలుమగలు-పెళ్ళి' అనేది మూడో అధ్యాయం. ఇందులో అనేక కోణాల్లో భార్యాభర్తలకూ, వివాహానికి సంబంధించిన సామెతల్లోని అంశాల్ని పోల్చడమైంది. కుటుంబానికి ఆలంబనం ఆలుమగలు. వీరు వివాహ వ్యవస్థవల్ల ఏకమై, కుటుంబానికి నిండుదనాన్ని సమకూర్చి వ్యవస్థాధర్మాల్ని అనుష్టిస్తారు. ఈ అధ్యాయంలో ఓం ప్రథమంగా భార్య యొక్క ప్రాముఖ్యాన్ని సమీక్షించాను. కులకాంత/పరకాంతల వ్యత్యాసాన్ని వెల్లడించాను. తర్వాత భార్యని చిన్నచూపు చూసే సామెతల్నీ, భార్యను శిక్షించాలని చెప్పే నానుడుల్నీ, స్త్రీ-పెత్తనానికి సంబంధించిన

వాటినీ, వివరించడం జరిగింది. భార్యకు సంబంధించిన మిగిలిన నానుడుల్ని 'భార్య-చనువు, ఇల్లు విడిచిన భార్య, అంకెకురాని ఆలు, భార్య అదృష్ట దురదృష్టాలు, భార్య-వ్యామోహం, భార్య-పాతివ్రత్యం, భార్య రంకుతనం, భార్య-గడుసుదనం, భార్య-అందం, మరి కొందరు వనితలు' అనే విభాగాల క్రింద తులనాత్మక వివేచనం జరిగింది. ఇదే అధ్యాయంలో తర్వాత భర్త యొక్క ప్రాముఖ్యాన్ని తెలుగు, మలయాళ సామెతల ఆధారంగా పోల్చాను. 'నపుంసకులైన మగలు, భర్త-దారిద్ర్యం, తిండిపోతు మగలు, తెలివి తక్కువ మగలు, మరి కొందరు పురుషులు' అనే విభాగాల ద్వారా విపులీకరించాను. తదనంతరం భార్యాభర్తలు-గొప్పదనం అనే శీర్షికలో ఉమ్మడిగా ఆలుమగల ప్రాశస్త్యాన్ని వివరించే సామెతల సమీక్ష జరిగింది. భార్యాభర్తలు-కలహం, ఒకరికొకరు తగిన/మించిన ఆలుమగలు అనేవి తర్వాతి శీర్షికలు. ఈ మూడో అధ్యాయంలోనే పెళ్ళి ప్రాముఖ్యాన్ని వివరించడమైంది. కుటుంబానికి మూలకందం వివాహ వ్యవస్థ. పెళ్ళిని నిర్వచించి, బహుభార్యాత్వ సామెతల్ని పోల్చాను. తర్వాత బహుభర్తృత్వపు నానుడులు. పెళ్ళి-వయస్సు, బాల్యవివాహం, సతి, వితంతు/పునర్వివాహం స్త్రీ, వావి-వరస, గోత్రం, మేనరికం, ఓలి, వరకట్నం మొదలైన విభాగాల ద్వారా రెండు భాషల్లోని సామెతల్ని సమీక్షించడం జరిగింది. పెళ్ళి-మరికొన్ని ఆచారాలు అనే శీర్షికలో 'తాళి, అయిరేణి కుండలు, తలంబ్రాలు, సన్నెకల్లు' అనే విభాగాల క్రింద ఉభయ భాషా సామెతల్ని పోల్చి చూపాను.

............. O .............

***తల్లిగారిల్లు, అత్తగారిల్లు, అవ్వగారిల్లు, చెల్లెలి ఇల్లు, అక్కయిల్లు మొదలైన మాటలు తెలుగు వ్యవహారంలో ఇప్పటికే వున్నాయి. ఇవన్నీ సమాజంలో, కుటుంబంలో స్త్రీ ప్రాధాన్యాన్ని తెలియజెప్పే మాతృస్వామిక వ్యవస్థావశేషపదాలు. వీటికి బదులుగా తండ్రిగారిల్లు, తాతగారిల్లు మామగారిల్లు, బావయిల్లు లాంటి మాటలు తెలుగులో లేవు.***

............. O .............

నాల్గవ అధ్యాయం 'అత్త-మామ-అల్లుడు-కోడలు-ఆడ బిడ్డ (ఆడపడుచు) అనేది కుటుంబంలో తల్లిదండ్రులు-పిల్లల మధ్య ఆత్మీయమైన రక్తసంబంధాలు ఉంటాయి. పరస్పరం వీరి మధ్య హక్కులూ, బాధ్యతలూ నెలకొని ఉంటాయి. అత్త-మామ-అల్లుడు-కోడలు-ఆడబిడ్డల బంధాలు అలాంటివి కావు. ఈ అధ్యాయంలో 'అత్త-అధికారం ఎలాంటిది? ఆమె స్వభావం ఏమిటి? ఆవిడ అవసరం ఎంత?' అనే విషయాలు ముందు విశదీకరించాను. పిదప అత్త-కోడళ్ళ సామెతల్లోని అనివార్య సంఘర్షణలు చిత్రీకరించబడ్డాయి. కోడలు, మామ, మేనమామ-ప్రాముఖ్యం, మామ-కోడలు, అత్తమామల గురించి తెలుగులోని సామెతలు, అల్లుడు, అత్త-అల్లుడు,, మామ-అల్లుడు(మాతుల/మాతులేతర మావులు-అల్లుళ్ళు), అల్లుడు-అత్తగారిల్లు, ఆడబిడ్డ మొదలైన శీర్షికల క్రింద ఆయా సామెతలు వివేచింప బడ్డాయి. ఈ అధ్యాయంలోనే ఆడబిడ్డను చేర్చడానికి కారణం. అగ్నికి అజ్యంలా అత్తకు ఆడపడుచు తోడవుతుంది.

ఐదవ అధ్యాయంలో అన్నదమ్ములు-అక్కచెల్లెళ్ళకు సంబంధించిన రెండు భాషల్లోన్ని నానుడుల్ని తులనాత్మకంగా పరిశీలించాను. కుటుంబంలో వీళ్ళు ఏకోదరులు. చిన్న తనంలో అన్నదమ్ముల మధ్య అపూర్వమైన ఐక్యత వుంటుంది. పెద్దయ్యాక ఆస్తిపాస్తుల వివాదాల్లో పరస్పరం కలహించుకొంటారు. అయినా... అవిభక్త భారతీయ కుటుంబంలో వీరంతా ఆపదలకీ, సంపదలకీ ఏకమవుతుంటారు. ఈ అధ్యాయంలో అన్నదమ్ములు, పాలిపగు ప్రకటించే సామెతలు, (అన్నదమ్ములు, అన్నదమ్ముల పిల్లలు పాలివాళ్ళు కాబట్టి ఇందులోనే చేర్చాను) అక్కచెల్లెళ్ళ సామెతలు చర్చించబడ్డాయి. ఏరాలు, షడ్డకుల సామెతలు సైతం ఇక్కడే ప్రస్తావించాను. కారణం. ఏరాండ్రు పరస్పరం అక్కచెల్లెళ్ళ వరస, షడ్డకులు అన్నదమ్ముల వావి కల్గిన వాళ్ళు.

బావ-బావమరిది-మరది-వదిన-మరదలు అనేది ఆరో అధ్యాయం. పరస్పరం వీరి మధ్య వుండే బంధాలు తల్లిదండ్రులు-పిల్లల సంబంధాలంత బలమైనవి కావు. అయితే... బావమరిది, బావల సంబంధాలు, బావమరదళ్ళ బంధాలు కొంత వరకు బలిష్ఠంగానే ఉంటాయి. ఈ అధ్యాయంలో బావ, అక్క-బావల ఉమ్మడి సామెతలూ, బావమరదళ్ళు, వదిన, బావమరిది, మరిది మొదలైన సామెతలూ పోల్చడం జరిగింది. వియ్యంకులు, వియ్యపురాండ్రు కూడా తమలో తాము బావ, వదినల వరుసతో పిలుచుకొంటారు. ఈ అధ్యాయంలోనే వీరి ప్రస్తావన వచ్చింది.

ఉమ్మడి కుటుంబంలో చిన్నమ్మ-చిన్నాన్న-పెద్దమ్మ-పెద్దనాన్నలు కూడా సభ్యులే! వీరి గురించి తర్వాతి అధ్యాయంలో సమీక్షించడమైంది. ముందుగా చిన్నమ్మ గురించీ, తర్వాత వరుసగా పెద్దమ్మ-చిన్నాన్న, పెదనాన్నల గురించీ చర్చించాను.

భారతీయ సమష్టి కుటుంబంలో తాత-అవ్వ-మనుమడు-మనుమరాండ్రు సైతం ఉంటారు. తాత అవ్వలు పెద్దతరం. తల్లితండ్రులు తర్వాతి తరం. తాత అవ్వలకు తమ మనుమలు, మనుమరాళ్ళంటే అధికమైన ప్రేమ ఉంటుంది. తమ కొడుకులూ, కోడళ్ళ మీద అయిష్టమున్నా, మనవలు, మనవరాండ్రంటే ఎంతో ప్రీతిని చూపిస్తారు. కనుక వీరి మధ్య బంధాలు ప్రేమపూర్వకంగా ఉంటాయి. ఈ అధ్యాయంలో తాత, అవ్వ-మనుమలు, అవ్వ తాతలు, అవ్వ-మనుమరాలు, మనుమడు అనే శీర్షికల క్రింద సామెతల్ని పోల్చాను. తాత అవ్వలు పెద్దతరం కాబట్టి విడిగా పెద్దలకు సంబంధించిన సామెతల్ని మరో విభాగం క్రింద ఈ అధ్యాయంలోనే చెప్పడం జరిగింది.

చివరి అధ్యాయం చుట్టాలకు సంబంధించింది. కుటుంబంతో బంధుత్వం కల్గిన వాళ్ళు బంధువులు. ఇందులో ముందుగా బంధు ప్రాధాన్యం చర్చించబడింది. బంధువులు-జాగ్రత్తలు, చుట్టాలు-రాకపోకలు. చుట్టాలు-మనస్తత్వం, చుట్టాలు-నమ్మకాలు, బంధువులు-ప్రాధాన్యక్రమం, తెలుగులో వుండి మలయాళంలో లేని బంధుసంబంధిత సామెతలు, మలయాళంలో వుండి తెలుగులో లేని చుట్టాల పరమైన సామెతలు అనే వివిధ విభాగాల క్రింద తెలుగు, మలయాళ భాషా సామెతల్ని పరిశీలించాను.

ఇదే కాకుండా ఆలుమగలు-పెళ్ళికి సంబంధించిన మరికొన్ని సామెతల్ని పరిశిష్టంలో ఇవ్వడం జరిగింది.

అప్పటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సంకలనం చేయించిన 'తెలుగు సామెతలు' అన్న పుస్తకమూ, మలయాళంలో పి.సి. కర్తాగారి 'పళంజొల్ ప్రపంచం' (సామెతల లోకం) అనే గ్రంథమూ ప్రధానంగా నేను పరిశోధనకు ఎన్నుకున్న గ్రంథాలు. ఈ రెండు భాషల్లో ఉన్న దాదాపు ఇరవై వేల సామెతల్ని పరిశీలించి నేను కొన్ని నిర్ధారణలకు రావడం జరిగింది. సోదర భాషలైన ఈ రెండింటి సామెతలోనూ ఎన్నో పోలికలున్నాయి. అలాగే ఎన్నో తేడాలున్నాయి. పోలికల విషయానికొస్తే వస్తు రూపాలు రెండింటా సాదృశ్యాల సందర్భాలే ఎక్కువ. కొన్ని సమయాల్లో సామెతల్లోని వస్తువు ఒకటే అయినప్పటికీ రూపం వేరుగావచ్చును (అంటే సామెత చెప్పే తీరు మారిపోతుంది) మరొక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. 1925ల వరకూ కేరళలోని నాయర్

తదితర ప్రాబల్య కులాల్లో బలంగా వున్న మాతృస్వామిక వ్యవస్థకు సంబంధించిన ఆనవాళ్ళు తెలుగు సామెతల్లో నిలిచివుండడం. ఈ ఆనవాళ్ళు సామెతల్లోనేగాక పదబంధాల్లోనూ, వ్యవహారంలోనూ వుండడం ఆశ్చర్యాన్ని గొలిపే విషయం. తల్లిగారిల్లు, అత్తగారిల్లు, అవ్వగారిల్లు, చెల్లెలి ఇల్లు, అక్కయిల్లు మొదలైన మాటలు తెలుగు వ్యవహారంలో ఇప్పటికే వున్నాయి. ఇవన్నీ సమాజంలో, కుటుంబంలో స్త్రీ ప్రాధాన్యాన్ని తెలియజెప్పే మాతృస్వామిక వ్యవస్థావశేషపదాలు. వీటికి బదులుగా తండ్రిగారిల్లు, తాతగారిల్లు మామగారిల్లు, బావయిల్లు లాంటి మాటలు తెలుగులో లేవు. ఈనాడు ఒక వేళ మనం వీటిని ఉచ్చరిస్తున్నా అవి ఆధునికతా ప్రభావంతో వచ్చినవని గ్రహించగలం. మనం ఇతరుల్ని నమ్మించవలసి వచ్చినప్పుడూ, మన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే సందర్భంలోనూ 'అమ్మతోడు' అంటాం. అంతేగానీ 'అయ్యతోడు' అంటూ ప్రమాణం చేయం. విపరీతమైన బాధ కల్గిన సందర్భంలోనూ 'అమ్మా' అంటూ మూల్గుతాం. ఇవన్నీ మాతృస్వామికానికి సంబంధించిన శిలాజపదాలు. కేరళ మాతృస్వామిక వ్యవస్థలో మేనమామకు ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. అంతా అతగాడి కనుసన్నల్లో అదుపాజ్ఞల్లో వుండాల్సిందే! ఈ లక్షణం తెలుగు సమాజంలో యిప్పటికీ వుంది. "తల్లితండ్రి చచ్చి మేనమామ ఉండాలె అన్నది తెలుగు సామెత. "తల్లిపుట్టిల్లు మేనమామనకెరుక" అనేది మరో సామెత. మేనమామ తన సోదరి పిల్లల పుట్టు వెంట్రుకలు తీసే కార్యక్రమానికి వస్తాడు. ఎరుకలు మొదలైన జాతుల్లో మేనకోడలిని వివాహ వేదిక దగ్గరికి తీసుకొచ్చేదీ మేనమామే! ఆంధ్ర ప్రాంతంలో సోదరి కూతుర్ని పెళ్ళి చేసుకునేది సైతం మేనమామే!! (అన్ని సందర్భాల్లో కాదు సుమా!) మేనమామ తన కూతురును సోదరి కుమారునికి కట్టబెట్టడం వెనక కూడా అతని ప్రాధాన్యం స్పష్టవుతున్నది. మేనరికం మనకు వావివరసా కల్గిన పెళ్ళి సంబంధం. బావా మరదళ్ళ పరిహాసాలూ పరిణామాలూ తెలుగు సమాజంలో చాలా వరకు సహజ మధుర సన్నివేశాలు. ఔత్తరాహుల్లో 'మాతులఃగృహనాశాయ' అన్న నమ్మకం వుంది. అంటే మాత(తల్లి) తోబుట్టువైన మేనమామ ఇల్లు ముంచుతాడని అర్థం. ఈ విషయంలో ఉత్తరాది వారికీ మనకూ ఉన్న తేడా గమనించదగింది. అందుకే "తల్లితండ్రి చచ్చినా మేనమామ ఉండాలె" అన్నారు. పుట్టుపూర్వోత్తరాలు మేనమామకు ఎరుక" అని కూడా చెప్పారు. మలయాళంలో "ఉండెన్నుం బల్లెన్నుం పఱవానుం కారణవర్" అని సామెత వుంది. "ఉందనీ లేనిదీ చెప్పే అధికారం అతనిదే (ఈ సామెతే తెలుగులో అత్తపరంగా వుంది. కద్దు అనడానికీ, లేదు అనడానికీ అత్తకే అధికారం) ఇవన్నీ మనలో మాతృస్వామిక వ్యవస్థ ఒకప్పుడు ఉండేదనడానికి సాక్ష్యాలు. ఇక గౌతమీ పుత్రశాతకర్ణి లాంటి పేర్లు మనందరికీ తెలిసినవే! ముందు తల్లిని గురించిన కొన్ని సామెతలను పరిశీలిద్దాం.

"తల్లి దైవం, తండ్రి ధనం"

"తల్లిని మించిన దైవం లేదు"

మొదటి సామెత తల్లి దైవంతో సమానురాలు అని చెబితే, రెండో సామెత తల్లిని మించిన దైవం లేదు అని నిష్కర్షగా చెప్పింది. రెండూ తల్లి గొప్పతనాన్ని నిరూపించిన సామెతలే! మొదటి సామెతలో తండ్రి ప్రస్తావన కూడా వుంది. పైగా తల్లితో పోల్చి చెప్పడం జరిగింది. జీవితం గడవడానికి దైవమొక్కటే చాలదు... డబ్బూ కావాలి. పరలోకం


............ O ............

*తెలుగు సామెత-తల్లి గూనిదైతే తల్లి ప్రేమ గూనిదవుతుందా? మలయాళీ" -ఆవు కుంటిదయితే పాలుకుంటివా? ఎంత చక్కని సారూప్యం! తల్లి వంగిపోవచ్చు. ఆమె ప్రేమ చెక్కుచెదరదు. తల్లికి మలయాళంలో గోవుతల్లిని ప్రతీకగా తీసుకున్నారు. ఆవు తల్లి కుంటుతూ వుంటే పాలు కుంటుతాయా? ఇలా వస్తువు ఒక్కటయినప్పటికీ శిల్పం మారి చెప్పే తీరు మారడం గమనార్హం.*

............ O ............


మాత్రమే కాదు ఇహం కూడా వుంది. మలయాళంలో "అమ్మ యిల్లెంగిల్ ఐశ్వరం ఇల్ల" అన్న సామెత వుంది "అమ్మలేకపోతే ఐశ్వర్యం లేదు" అని దీని అర్థం. ఇక్కడ తల్లి ధనంతో సమానమైంది. కేరళ మాతృస్వామిక వ్యవస్థలో తల్లి యింటి యాజమానురాలు. అందుకే తెలుగులో తండ్రిని ధనంతో పోల్చినట్లు, మలయాళంలో తల్లిలేని పక్షంలో ఐశ్వర్యమే లేదని చెప్పారు. తెలుగులోనే మరొక సామెత "కన్నతల్లినీడ కానుగ చెట్టునీడ" అన్నది. మలయాళంలో ''అమ్మయుళ్ళప్పోలుం నిలావుళ్ళప్పోలుం సుఖముళ్ళూ" అన్నారు. (అమ్మ ఉన్నప్పుడున్నూ, వెన్నెల ఉన్నప్పుడున్నూ సుఖముంటుంది) రెండు సామెతల్లోనూ వస్తువు తల్లి. ఆ తల్లి ఆశ్రయం కానుగ చెట్టులా చల్లగా, ఆరోగ్యవంతంగా వుంటుందని ఆంధ్రులన్నారు. కేరళీయులు అమ్మ ఉన్నప్పటి సుఖాన్ని వెన్నెలతో పోల్చారు. ఆంధ్రుల ఉపమానం నిత్యజీవితంలోంచి వచ్చింది. మలయాళీలు అందరాని అందలాల్లోంచి అందాల జాబిల్లిని తెచ్చి అమ్మకు సమానం చేశారు. కానుగ చెట్టు నీడ, వెన్నెల లాంటి ఆశ్రయాలు వేరు ఆశయాలు ఒకటే! తెలంగాణాలో "కొత్తంత పండుగ లేదు-తల్లంత దయలేదు" అన్న సామెత వుంది. కొత్త అంటే... వరి పంట యింటికి రాగానే ఆ కొత్త బియ్యంతో చేసుకునే పండగ. మనది వ్యావసాయక దేశం కనుక కొత్తంత పండగ లేదన్నారు. అట్లాగే తల్లికి వున్నంత దయ మరొకరికి వుండదన్నారు. మలయాళంలో" అమ్మయుడె అన్పిను అళవిల్ల" అన్నారు. (అమ్మగారి ప్రేమకు హద్దులేదు) ఇక... కొత్తంత పండగ లేదు అన్న దానికి కేరళలో "పున్నెల్లరియుం కున్యన్మత్తిచాఱుం" అన్నారు. కొత్త బియ్యపు అన్నమూ, కున్యన్మత్తి అనే పేరుగల చేపల పులుసూ మంచి కాంబినేషన్ అని అర్థం. ఈ అన్నమూ పులుసుల ప్రస్తావన పెద్దగా అవసరం లేదిక్కడ. కొంత మంది తల్లులు కఠినాతికఠినంగా ఉంటారేమో! అయినప్పటికీ ఆమె కనిపెంచిన తల్లి. దీన్ని సూచించడానికే "కఠినమైనా కన్నతల్లి-వట్టిదైనా వరి కూడు" సామెతను చలామణీలోకి తెచ్చారు. ఎంత కఠినాత్మురాలయినా కడుపుకు చూస్తుంది. సామెతలోని పరార్థ పరమార్థం కూరలూగీరలూ లేకున్నా వరికూడు వరికూడే అని ఈ సామెత కేరళలో కొంత రూపం మారి ఎలా వుందో చూద్దాం. "నీరాయాలుం మోరా-పేయి ఆయాలుం తాయి" (నీళ్ళు నీళ్ళు ఉన్నా చల్ల-దయ్యంలాంటిదయినా తల్లి) ఎంత పలచగా వున్నా చల్లగుణంపోనట్లు దయ్యంలాంటిదయినా తల్లి తల్లే అన్నారు. మరొక తెలుగు సామెత-తల్లి గూనిదైతే తల్లి ప్రేమ గూనిదవుతుందా? మలయాళీ" -ఆవు కుంటిదయితే పాలుకుంటివా? ఎంత చక్కని సారూప్యం! తల్లి వంగిపోవచ్చు. ఆమె ప్రేమ చెక్కుచెదరదు. తల్లికి మలయాళంలో గోవుతల్లిని ప్రతీకగా తీసుకున్నారు. ఆవు తల్లి కుంటుతూ వుంటే పాలు కుంటుతాయా? ఇలా వస్తువు ఒక్కటయినప్పటికీ శిల్పం మారి చెప్పే తీరు మారడం గమనార్హం.

"తల్లి చస్తే తరం బాసె-తండ్రి చస్తే రుణం బాసె"

"తల్లి చస్తే నాలుక చచ్చినట్లు -తండ్రి చస్తే కళాపోయినట్టు"

"తల్లి చస్తే కాపురం తెలుస్తుంది - తండ్రి చస్తే పెత్తనం తెలుస్తుంది"

"ఏనుగంత తండ్రి కన్న ఏకుల బుట్టంత తల్లి నయం"

"తల్లిదే వలపక్షం - ధరణిదే వలపక్షం"

"అమ్మా అని పిలవని నోరు - కుమ్మరి మన్ను దవ్విన గుంట" లాంటి తల్లి ప్రాధాన్యాన్ని తెలిపే సామెతలు అనేకం. మలయాళంలో

"తల్లి శాపానికి ఆటంకంలేదు" (మాతృశాపత్తిను తడవిల్ల! "అమ్మ తన్నినా అమ్మా అని పిలుస్తూనే కదా ఏడవడం!) (అమ్మ తల్లియాలుం అమ్మయె విళిచ్చల్లే కరయున్నతు?) "అమ్మమూలంగా అభివృద్ధి జరుగుతుంది (అమ్మ మూలం అభివయ్‌క్కుం) "తండ్రీ తల్లీ తప్ప అన్నింటినీ కొనుక్కోవచ్చు" (తందయుం తళ్ళయుం ఒళిచ్చు ఎల్లాం విలయ్‌క్కు వాంగాం) "తల్లి మాట వినని బిడ్డ – కుక్కనోట చీర" (తళ్ళవాక్కు కేళ్‌క్కాత్త పిళ్ళ–నాయిడె వాయిలె చీర" లాంటివి తల్లి గురించి గొప్పగా చెప్పిన సామెతలు. రెండు భాషల్లోనూ మాతృప్రాధాన్యం గురించి ఇంకా అనేకానేక సామెతలున్నాయి. ఇవన్నీ కొన్ని సందర్భాల్లో తండ్రి కన్నా, దైవం కన్నా తల్లి గొప్పదనీ చెబుతున్నాయి. పైగా తల్లి, తల్లిమాట, తల్లిదయ, తల్లి ఉనికిని గురించి సజీవమైన, జీవితానికి సన్నిహితమైన పోలికలతో వివరించాయి. ఇవన్నీ సమాజంలో కుటుంబంలో జీవితంలో స్త్రీ ప్రాధాన్యాన్ని, తల్లి గొప్పతనాన్ని గురించి చెబుతున్నా మాతృస్వామిక వ్యవస్థ తాలూకు ఛాయలుగానూ నిలుస్తున్నాయి. కేరళలో చాలా కాలం మాతృస్వామిక వ్యవస్థ (మరుమక్కత్తాయం)తోపాటు బహుభర్తృత్వం కూడా అమల్లో ఉండింది. బహుభర్తృత్వానికి సంబంధించిన సామెత ఒక్కటి కూడా మలయాళంలో లేదు. అయితే ఒక మాట బాగా ప్రచారంలో వుందక్కడ. అది తర్వాత్తర్వాత సామెతగా మారుతుందేమో చూడాలి. ఎనభై తొంభై ఏండ్ల వయసున్న నాయర్ తదితర జాతిస్త్రీలు "న్యాన్ మూన్నాలుడె కూడె పోఱుత్తవళడీ... ఎన్నె తోప్పిక్కుండా" అంటారు ఇప్పటికీ "నేను ముగ్గురు మగలతో వేగినదాణ్ణి... నన్ను ఆటపట్టించవద్దు" అని దీని అర్థం. ఈ తరం ఆడపిల్లలతో వయోవృద్ధులైన ఆడవాళ్ళు ఇలా సవాల్ చేస్తుంటారు. కారణం ఆ వృద్ధ స్త్రీలు తమ జీవితంలో బహుభర్తృత్వాన్ని అనుభవించినవాళ్ళు. తెలుగు సమాజంలో ఇప్పుడు బహుభర్తృత్వం లేకపోయినా, ఒకప్పుడు ఉండేదనడానికి సామెతలున్నాయి. 'ఆర్భాటపు అత్తగారికి ఆరుగురు మొగులు", "వగలాడీ నీకు మగలెందరే అంటే తొలి మగనితో తొంబయి మంది"

ఇలా ఆయా శీర్షికల కింద తెలుగు మలయాళాల్లో సామెతల పరంగా ఉన్న సాదృశ్యవైదృశ్యాలను ఎన్నింటినయినా ఎత్తి చూపవచ్చు. రెండు భాషల సామెతల్లో వున్న పోలికలు మనిషి ఎక్కడివాడయినా ఒక్కలాగే వుంటాడని చెప్తుతున్నాయి. వ్యత్యాసాలు మాత్రం మనిషి మనిషికీ ప్రత్యేకతలుంటాయని మరీ స్పష్టం చేస్తున్నాయి. ఒక్క ముక్కలో మనిషి తన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూనే విశ్వమానవుడిగా ఎదుగవలసిన అవసరాన్ని బలంగా చెప్పుతున్నాయి. V

---

# యుద్ధం ఒక వాస్తవం

**ఎల్లెన్‌మేరీ** అనుసరణ : నిర్మలానంద

**(కవయిత్రి ఎల్లెన్‌మేరీకి 34 ఏళ్ళ వయసు. మిన్నన్నెయా పాలిష్ ఎం.ఎన్.లో నివాసం. వీడియో నిర్మిస్తుంది. బాబిలోనే ఆర్ట్ అండ్ కల్చరల్ సెంటర్‌లో ఉమ్మడి సభ్యురాలు. చిత్రాలు వేస్తుంది. రాజకీయ కార్యకర్త – ప్రతిఘటన కవిత్వం రచిస్తుంది. శాంతి కోసం కృషి చేస్తుంది)**

తను వేసిన పెయింటింగ్‌ని చూపిస్తూ
అన్నాడు అతను, 'ఇది నా దేశం
ఒకనాడు అందమయిన పూలతోట
నేడు సర్వనాశనం చేయబడింది'
పెయింటింగ్ ఎంతో అందంగా వుంది
అయితే అది పువ్వులా లేదు

ఇంకా అన్నాడు గదా,
'శత్రుదేశం నా దేశంపై
బాంబుల వర్షం కురిపించినపుడు
వరదలైపారింది నెత్తురు
వంతెన కొట్టుకుపోయింది పూర్తిగా
బతికి వున్న ఆత్మీయులకోసం వెదకుతూ
నెత్తుటి నదిలో నేను ఈదాను నిజంగానే నా మనసు బద్దలయ్యింది
ఇహ నా మనసేమయిందో తెలుసా?
పిచ్చెత్తినట్టుగా అయిపోయింది
నదిలో ఈదసాగాను
చేతికి లభించింది మృత్యువే!

యుద్ధం రూపకాలంకారం కాదు
యుద్ధం విముక్తి కోసం పోరాడదు
అది చెడుగు మీద విజయం కోసంకాదు
నన్ను నమ్మండి
యుద్ధమంటే బాంబులూ గన్నులూ నెత్తురూ
యుద్ధమంటే బీభత్సం
వేనవేల మానవుల దారుణమారణహోమం
యుద్ధమంటే చనిపోయిన పసికూనలూ అనాధలూ శరణార్థులూ
యుద్ధమంటే చనిపోయిన తల్లులూ తండ్రులూ తాతలూ
నేస్తగాళ్ళూ ప్రియురాళ్లూ పక్షులూ
యుద్ధమంటే ఆకలి బాధనించి లేదు రక్షణ
యుద్ధమంటే విధ్వంసం
కర్ణభేరీలు పేలిపోయి మిగిలేబధిరత్వం
వేస్తుంది మృత్యు దుర్గంధం
యుద్ధమంటే బతకడానికి భయపడిపోయే పసిపిల్లలు
వారి నోట మాటరాదు
అదే పనిగా ఉలికులిక్కి పడ్తారు
కళ్లకి నిద్దురరాదు
యుద్ధమంటే పంచ, మంచి నీళ్లూ, పోగొట్టుకున్న పనీ
చెట్లూ పెంపుడు జంతువులూ
ఆహారం, అందం, ఆనందం, సంగీతం, సౌకర్యాలు, ఆశ, ఆట
రోజువారీ చిట్టి పొట్టి విలువయిన సుఖాలన్నీ పోగొట్టుకోవడం
యుద్ధం వాసయోగ్యం కల్పించే అన్నిటినీ నాశనం చేసేస్తుంది
ఒక బాంబూ ఒక చావూ ఒకరేవూ
అర్థరహితమయిన వినాశనాన్ని సృష్టిస్తుంది
ప్రతి బాలుడూ కలలుకనే హక్కునుంచి వంచితుడవుతాడు
అది ఓ దుఃఖ భరిత వృత్తం
కొలమానానికి అందనిది
హృదయం ఒక పుష్పం
ఇది కూడా కాదు ఒక రూపకాలంకారం
హృదయం వికసించాలని కోరుకుంటుంది
యుద్ధం ఒక వాస్తవం
హృదయం ఒక కుసుమం
యుద్ధం హృదయాన్ని ముక్కలు చేసేస్తుంది
ఎన్నడూ కోలుకోలేని విధంగా!



V

కథ

కేతు విశ్వనాథరెడ్డి

# పొడి నిజం




**నా** వంతు వచ్చింది. లేచి నిలబడినా. మా రంగయ్యసారు నిన్న చెప్పిన కతను సొంత మాటల్లో రాసినా, రాసిన కతను చదవాల. కాగితం తీసుకొని నిలబడినా, నిలబడినానో లేదో, మా సారు అరిచినాడు.

"గంగాధరా! నోటు బుక్కులో రాసుకొని రమ్మని చెప్పినా, చిత్తు కాగితం మీద రాసుకొని వచ్చినావేం?"

"నోటు బుక్కు అయిపోయింది సార్. కొనుక్కున్నాక మల్లా రాసుకుంటానుసార్," అన్నా.

"అన్నిటికి కరువే, నీటికీ కరువే, నోటు బుక్కులకూ కరువే," అని మా సారు గొణిగినాడు. "సరే చదువు" అన్నాడు.

అమ్మయ్య అనుకున్నాను. చదవడం మొదలు పెట్టినా

"బగీరదుడు" అని

"బగీరదుడు కాదు కాదు గంగాధరా! భగీరథుడు అనాల. పొల్లుల్ని మింగద్దు. రాయడమన్నా సరిగ్గా రాసినావా? ఏది చూడనీ"

సారుకు కాగితాన్ని అందించినా, చూసినాడు.

"సరిగ్గా రాసినావే. పలికేది చక్కగా పలకాల" అన్నాడు.

నేను మల్లా మొదటికొచ్చినా. సారు చెప్పినట్లు "భగీరథుడు" అన్నా.

తర్వాత చదువు అన్నాడు మాసారు.

"భగీరథుడు ఒక రాజు. ఆయన ముత్తాతకు అరవై వేలమంది కొడుకులుండేవారు. ఆ ముత్తాత పేరు సగరుడు. సగరుని కొడుకులు సాగరులు. వాల్లు...'

"ల్ల కాదు 'ళ్ల' అనాల. ఆ... కానీ"

"వాళ్ళు ఇంద్రుడు దొంగిలించిన గుర్రం కోసం బూ... బూ... భూమి అంతా వెతికినారు. కనపడలేదు. భూమిని తవ్వి పాతాళానికి పోయినారు. కపిలునికి కోపం వచ్చింది. వాళ్ళను బూడిద చేసినాడు. భగీరథుడు వారికి సొర్గం...."

"సొర్గం కాదు స్వర్గం" అని మాస్టారు నా మాటను దిద్దినాడు.

"భగీరథుడు వారికి స్వర్గం వచ్చేటట్లు చేయాలనుకున్నాడు. దాని కోసం గంగను గుడ్కి పెద్ద తపస్సు చేసినాడు. గంగ మనలోకానికి దిగివచ్చింది. పాతాలానికి...

"ల కాదు నాయనా గంగాధరా!ళ..ళ..."

"పాతాళానికి భగీరథుని వెంబడి పోయింది. భగీరథుని ముత్తాతల బూడిద మీద గంగ పారింది. సముద్రమైంది. సాగరులకు స్వర్గం దొరికింది..."

"ఏదీ నీ కథను చూపించు," అని సారు తిరిగి తీసుకున్నాడు. చదివినాడు. ఏమని చెప్పినాడంటే...

"గంగాధరా! తప్పులు లేకుండా రాసినావు. తప్పులతో చదువుతే ఎట్లా? రాసేది శుద్ధంగా ఉండాలి. పలుకు శుద్ధంగా ఉండాలి. భాష ఎవరి సొత్తూ కాదు. చక్కగా నేర్చుకుంటే అదే వస్తుంది. చదువుకున్న వాళ్ళ మాటలను శ్రద్ధగా వినండి. మాట్లాడండి. చదువుని రాని వాళ్ళ భాష, యాస తప్పుకాదు. మర్యాద కోసం చదువొచ్చిన

వాళ్ళ భాషను మాట్లాడతాం. మంచి మంచి కథలు వింటే, చదివితే మంచిది. ఇది నీకే కాదు చెప్పింది. ఈ నాలుగో తరగతిలోని అందరికీ."

అందరం ఒక్కసారిగా "సరేసార్" అనినాము.

మా సారు పిల్లలందరికీ చెప్పినాడు :

"గంగాధర్ కథ బాగుంది", అని

నాకు చక్కలిగిలి పెట్టినట్లయింది.

సారు కత మీద పాటం చెప్పినాడు :

'భగీరథుడు తన ముత్తాతల కోసమే తపస్సు చేసినాడు. గంగను భూలోకంలో ప్రవహింపజేసినాడు. తన కుటుంబం కోసం చేసుకున్న పని. స్వార్థం అంటే ఎవరికి వాళ్ళు చేసుకునే మేలు. ఈ మేలు తనకు మాత్రమే ఉపయోగపడిందా? నలుగురికీ మేలు చేసిందా? ఇదీ అసలు గొడవ."

రంగయ్య సారు మాట్లాడేది నాకు చాలా బాగుంటుంది. ఒక్కొక్కసారి అంతపెద్దపెద్ద మాటలు నా తలకాయకు అందవు.

బెల్లు మోగింది "పోండర్రా. రేపు మన అసలు పాఠం కొత్తది మొదలు పెడదాం" అన్నాడు. మా పుస్తకాలు సంచుల్లో సర్దుకున్నాం. బిలబిలా, గోలగోలగా ఇండ్లకు బయలుదేరినాం.

నా సంచిని ఇంట్లో తలవాకిలి పక్క కింద గూట్లో పెట్టినా. మా అమ్మకు చెప్పినా :

"అమ్మా! రంగయ్యసారు నేను రాసిన కత బాగుంది అన్నాడు. నోటు బుక్కులో రాసుకోవాల. రెండునోటు బుక్కులు కొనాల."



"మీ నాయన రానీలే. మీ మామా వాళ్ల ఊరికి పోయినాడు – బియ్యం కోసం, అప్పుకోసం" అనింది మా యమ్మ.

మా మామ వాళ్ళకు చిన్న అంగడి ఉంది. అందుకోసం పోయి ఉంటాడులే అనుకున్నా.

మా అమ్మ చెప్పింది.

"గంగాధరా! మీ అబ్బ పొద్దననంగా పోయినాడు. ఇంకా ఇంటికి రాలేదు. అంబళ్ల పొద్దున సంగటి తిని పోయినాడు. పైటేల ఏమీ తినలేదు. కయాలు ఎక్కువైంది. నీలి తొట్ల దగ్గరన్నా కూర్చొని ఉంటాడు. మన పొలం కాడ, ఆ కాలవ దగ్గరన్నా కూర్చోని ఉంటాడు. ఆ నీలి తొట్లూ, ఆ పూడిపోయిన బాయీ, చుట్టు ఉండే ఎకరాల పొలం మీ ముదెబ్బల కాలం నాటిది. తకరార్లలో అమ్ముడు పోలేదు... ఒక దాయాది మరొక దాయాది బాగుపడతాడంటే ఓర్చలేదు. పది మంది దాయాదులు కలిసి అమ్ముకోవడం కుదిరేపనా? ఇప్పుడు కొనేనాధుడు లేదు. కానీ మీ అబ్బకేమో ఆశ. సరేలే సరేలే. రోజూ ఉండేవే ఇవి. మీ అబ్బను పిల్చకరా – చీకటి పడకుండానే. చీకటి పడితే మీ అబ్బకు కండ్లు సరిగ్గా కనపడవు. చుక్కలా లొచ్చినాయి. దార్లో ఏ రాయికో, గోడకో, కంపచెట్టుకో కొట్టుకొని కింద పడితే, యాడ చస్తాం రా గంగాధరా? పాడు రోజులు దాపురించినాయి..."

పాడు రోజులంటే ఏమిటో అవి ఎందుకొస్తాయో? పాడు మనుషులు అనే మాటను విన్నా. అంటే చెడ్డ మనుషులు. పాడు రోజులు అంటే చెడ్డ రోజులు. రోజులు చెడ్డగా ఉండడం అంటే ఏందో? రంగయ్య సారును అడగాల. మిగతా సార్లు చెప్పలేరు. రంగయ్యసారుకు తెలిసినంత మిగిలిన సార్లకు తెలియదు. నాకు ఆడుకోవాలని ఉంది. అమ్మేమో 'అబ్బను తొడుకొనిరా' అంది. అబ్బంటే నాకు చానా ఇది. మా అబ్బకు కతలు బాగా వచ్చు. నాకంటే బాగా చదువుకున్నాడు. బారతమూ అదీ. నేను కతలు చెప్తానంటే రాస్తానంటే మా అబ్బేనన్ను బలపరిచేది. మా నాయనకు ఎప్పుడూ సంసారం పనులే అబ్బ ఎన్నికతలు చెప్తాడో! ఈ మద్దెన చెప్పడంలేదు. అమ్మ చెప్పినట్లు కయాలుగా ఉంటాడు. కయాలు అంటే దిగులు. దిగులు ఎందుకొస్తాది? ఏవో రాత్రి పూట పడుకునేముందు "ఏదన్నా కత చెప్పొబ్బా" అంటాను. "మనసు బాగా లేదురా" అంటూ అన్నాడు. దిగులు అంటే మనసు బాగా లేకపోవడం అన్నమాట. అబ్బ రోజూ పొద్దున సంగటి ఇంత తినిపోయి మాపటేల వస్తా ఉండాడని అమ్మ నాతో ఆ మొన్న చెప్పింది. ఆకలయితే మనసు బాగుండదేమో. నాకు ఆకలయితే దిగులు కలుగుతుంది. కోపం వస్తుంది. అప్పుడు ఎవరన్నా ఏదన్నా అంటే తన్నుదామనిపిస్తుంది. నేను పైటేల ఇంటికి వచ్చినా. అమ్మపెట్టిన సంగటి, కారం తినినా,నాకు ఆకలి లేదు. కోపం రాలేదు. అసలు ఆకలి అనేది ఎందుకుండాలి? ఆకలి లేకుండా చెయ్యొచ్చు గదా, ఎవరన్నా?

"గంగాధరా! ఏందిరా కూర్చోని ఆలోచన చేస్తుండావు. పోయిరా నాయనా! ఆ పెద్దాయనను ఇంటికి తీసుకరా" అనింది మా యమ్మ. "పోతాండాలే అమ్మా!" అన్నా.

మా అమ్మకు మా అబ్బ అంటే చానా ప్రేమ. ముసలోడు గదా! మాజేజి ఆ నడుమ చచ్చిపోయింది గదా. మా నాయన ఊర్లో ఉన్నా, లేకపోయినా పనులు ఏమన్నా ఉంటే చూసుకుంటాడు. పనులుంటే ఊరికే కూర్చోడు. మా పెదనాయనలు, వాళ్ళ పిల్లలున్నారు. నాకంటే పెద్దోల్లు. వాల్ల మీదకంటే మా అబ్బకు మా మీదనే ఇష్టం. వాళ్ళకు అబ్బంటే పడదు. కోడి గోసుకున్నా పిలవరు. వేరుబోయినారు గదా! వేరుబోతే ప్రేమ లుండవంట. ఎందుకుండవో?

మా రంగయ్యసారు ఒకసారి చెప్పినాడు. ఎవరో గురజాడ అనే ఆయన ఉండాడంట! ఆయన చెప్పినాడంట: 'ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును' అని మరి మా అబ్బ ఇవ్వాలనుకుంటే వాళ్ళు తీసుకోవాల గదా? ఇదేందో?

మా అమ్మ కసిరింది : "గంగాధరా! చెప్పింది వినరా! అబ్బను పిల్చుకొని రారా. నా బయం నాది"

అబ్బ కోసం బయలుదేరినా, దారిలో బాలమ్మ కనపడింది. బాలమ్మంటే మూడో తరగతిలో నా తరగతే.ఇప్పుడు స్కూలు వచ్చేసింది. మేకనూ, రెండే మేకల పిల్లలనూ తోలుకొని వస్తా కనపడింది.

"నూకలిస్తా, మేకలు కాస్తావా?" అని అడిగి ఏడిపించాలనిపించింది. అడిగినా

"యాడిస్తావు? పండితే గదా!" అంది, బాలమ్మ

"పండకపోతే అంగట్లో దొరుకుతాయి గదా" అన్నా.

"అంగట్లో అన్నీ దొరుకుతాయి. అల్లుని నోట్లో శని!" అనింది బాలమ్మ, బాలమ్మ మాటకు మాట అంటిస్తుంది. అందుకే నాకు ఇష్టం.

"అల్లుడెవరూ?' అన్నా బాలమ్మను ఉడికించడం నాకు బలే బాగా ఉంటుంది.

"నా మొగుడూ, నీ మొగుడూ" అంది.

ఆడోళ్లకు మొగుళ్లు ఉంటారు. మొగోళ్ళకు మొగుళ్ళు ఉండరు. ఏందో? తిక్క మాటలు, అనుకున్నా, బాలమ్మకు చదువు బాగా వచ్చేది. జరుగుబాటు లేక మానేసిందంట! నాకు కూడా అది అనుకుంటే బయమేస్తాంది.

"ఏందో వచ్చా గంగాదరా! మా నాయన దేశాంతరం పోయినాడు పని కోసం. నాకు చానా పని ఉంది. ఇంటి దగ్గర అంటూ పోయింది.

నీలి తొట్ల దగ్గరకు పోయినా. తొట్లో గొర్లు, మేకలు పడుకొని ఉన్నాయి. ఆ పక్కన ఒక చిన్న మిద్దె ఉంది. దాంట్లో గొర్లపెంటికలు, మేక పెంటికలు తప్ప ఏమీ కనపడలేదు. మా అబ్బ ఆ చుట్టు పక్కల కనపడలేదు. మా పొలం దగ్గరకు పరిగెత్తినా 'ఎంతెంత దూరం చానచాన

దూరం’ అని పాడుకుంటూ పొలాలంబడి అడ్డంగా పరిగెత్తినా నాకేం బయంలేదు.

పొలాల్లో ఒక్కరు కూడా కనపడలేదు. ఒక్క పురుగులేదు. ఒక పిట్టలేదు. విత్తనం వెయ్యిలేదు. పైరు లేదు. మా అయిదెకరాల చేను వచ్చింది. అది కూడా మిగతా వాటి మాదిరే శుబ్బరంగా తుడిచిన పలక మాదిరి ఉంది. అచ్చరాలు తుడిచేసిన పలక మాదిరిగా మా చేనులో నుంచి చూసినా. కాలవ కనపడతాంది. జమ్మిచెట్టు కనపడతాంది. జమ్మిచెట్టు కింద ఎవరో కూర్చొని ఉన్నారు. తల మీద ఒల్లె గుడ్డ వేసుకొని అట్లా వేసుకునేది మా అబ్బే!

బాగా చూసినా.... మా అబ్బే... ‘అబ్బా’! అని గట్టిగా అరిచినా మా అబ్బలేచి నిలబడినాడు.

“ఒరేయి గంగాధరా! ఇక్కడకు, ఇక్కడకురా. పరుగెత్త మాకు. రాయోరప్పో కాళ్లకు కొట్టుకుంటుంది. నిదానంగా రా అని మా అబ్బ అరిచి చెప్పినాడు. మా అబ్బ ఒత్తులను నాకంటే బాగా పలుకుతాడు. కాలవగట్టు మీద ఉండే జమ్మి చెట్టు దగ్గరకు గెసపోసుకుంటా పోయినా మా అబ్బ దొరికినాడు. నువ్వెందుకు ఇంత దూరం వచ్చినావు రా?” అని అడిగినాడు.

“నీ కోసమే అమ్మ పిల్చుకొని రమ్మనింది. చీకటి పడితే నీకు కండ్లు సరిగా కనపడవని చెప్పింది” అన్నా.

“పగలే చీకటి పడింది గంగాధరా!” అన్నాడు మా అబ్బ ఆకాశంపైకి చూస్తా ఉండాడు. దూరంగా ఉండే కొండ చూస్తా ఉండాడు. పొలాలు చూస్తా ఉండాడు. కాలువలోకి చూస్తా ఉండాడు. పెద్దోల్ల వేదాంతం నాకు అర్థం కాదు.



అబ్బ తన కుడిచేత్తో నా కుడి చెయ్యిని పట్టుకున్నాడు. మెల్లగా గెట్టు దిగుతూ కాలువలోకి తీసుకపోయినాడు. కాలువ నడుమ నిలబడినాడు. నేనూ నిలబడినా.

“ఇది పులివెందల కాలవ కథ గంగాధరూ!” అన్నాడు.

ఆ కథేదో విని, తొందరగా ఇంటికి పోవచ్చు. ఇంకా పొద్దుంది. అనుకున్నా, “చెప్పబ్బా అన్నా.

“ఇది జరిగిన కథరా గంగాధరూ. నలభై ఏండ్లు పైగా అయింది మా కళ్ళ ముందు జరిగింది. ఈ కథలోని వాళ్ళంతా రైతులే. ఈ కాలవ కోసం పెద్దపెద్ద సభలు జరిగినాయి. రైతులంతా ఒక్కతాటి మీద నిలిచినారు. రైతు యాత్ర జరిగింది. రైతులం పోలీసుల దెబ్బలు తిన్నాం. జైళ్లకు కూడా పోయినాం. ఆ పార్టీలేదు. ఈ పార్టీ లేదు. అందరూ ఒక్కటే. అందరికీ కావలసింది ఒక్కటే. కాలవ. ముఖ్యంగా శివరామిరెడ్డి అనే ఆయన ఉండేవాడు. అచ్చం గాంధీతాత మాదిరి అనుకో. జగమొండి. ముతక పంచెలో రైతే, కత్తులొద్దు, కఠార్లొద్దు, ఈ తపులు లొద్దు, ఏమొద్దు, నలుగురం కలిస్తే మనమే పులులం అనేవాడు. కాలవ కోసం తిండీ తిప్పలు మాని పది రోజులు కూర్చున్నాడు. అప్పటి సభలు అప్పటి నాయకులు పాటలు మరిచిపోదామన్నా, మరిచిపోలేదు.

కాలవ ఎట్లాగో వచ్చింది. చివరకు కాలవలో నీళ్లొచ్చిన రోజు గంగాధరూ! పెద్ద పండుగ అనుకో, ఊరు ఊరంతా కదిలి వచ్చింది. కాలవ గెట్ల మీద నిలబడి చూసినారు ఆడోళ్లూ, మగోళ్లూ, పిల్లా పిసుకూ, ముసలీ ముతకా, మా జన్మల్లో అన్ని నీళ్లు కాలవలో పారతా ఉండగా చూడలేదు. వానాకాలంలో రెండు మూడు రోజులు వంక పారితే చూసిందే. నేను కాలవ నీళ్లల్లో దిగినా దోసిళ్ళలో నీళ్లు నెత్తి మీద పోసుకున్నా. ఆ నీళ్లు తాగినా గంతులేసినా, చూసినోళ్లంతా నాకు పిచ్చి పట్టిందనుకున్నారు.

ఒక పంటకే నీళ్లు వదిలినా బతుకులు మారినాయి. కాలవ పక్క బావుల్లో ఊటలు పెరిగాయి. మనకు బావి లేదు. అది మీ ముగ్గురు పెదనాయనల భాగానికి పోయింది. చంకలు గుద్దుకొని చీని చెట్లు వేసుకునే వాళ్ళు వేసుకున్నారు. వడ్లు పండించే వాళ్లు వడ్లు పండించుకున్నారు. మనమూ పండించుకున్నాం. చెనక్కాయల్నీ, నల్లకుసుమల్నీ, మిరపనీ ఈ సారి మాత్రం ఈ కాలవలోని మట్టీ రాళ్ళుగా నెత్తిమీద కొట్టుకోవాల్సిందే. నిమ్మచెట్లు వేసుకున్నోళ్లకు నీళ్లు లేవు. ఎనిమిది నూరు వెయ్యి అడుగులు పాతాళంలో బోర్లు వేసుకున్నారు. చుక్క నీళ్లు పడలేదు. పైగా చీనీ చెట్లకు బంక తెగులు. మనుషులకు అప్పుల తెగులు.

ఇప్పుడు చూడు. కాలవలో గడ్డి పరక కూడా ఎండిపోయింది. గోరీ గుంత మాదిరి ఉంది. అప్పుడు గండిపేట, ళొగరుపేట ఇంకా ఏదో అన్నారు.

ఇప్పుడు చిత్రావతి చిత్రావతి అంటున్నారు. ఇంకేమంటారో తెలియదు. కనపడిన చోటల్లా రాళ్ళను పాతి పెట్టి పోతారు. మన కొండవార ఉండాయే ఆ పనికిరాని తంగేడు, జిల్లేడు చెట్ల మాదిరి ఆ ఎండిపోయిన కంపచెట్ల మాదిరి ఉంది మన బతుకు. గడ్డి లేదు గాదం లేదు. సాగు నీరు లేదు. తాగే నీరుకూ కటకటే... అప్పిచ్చేవాడు లేడు. ఇదీ మనకథ!

ఇది కథా? ఏమో నాకు తెలియదు. కతమాదిరుంది కతమాదిరిలేదు.

“పోదాంపద అబ్బా! అమ్మ ఇంటికాడ ఎదురు చూస్తా ఉంటాది” అన్నా.

మా అబ్బ ఏమనుకున్నాడో మా అబ్బ మోకాళ్లు పట్టుకొన్నాడు. మెల్లగా కాలవను ఎక్కినాం. ఇంటి దారి పట్టినాం. దారిలో మా అబ్బ ఏమీ మాట్లాడలేదు. ఏందో ఆలోచన చేస్తా ఉండాడు. మా అబ్బ ఆలోచన నాకు తెలియదు. నా ఆలోచన మా అబ్బకు తెలియదు. విచిత్రం! తెలిస్తే కాలవలో నీళ్లొస్తాయా?

రాత్రి అన్నం తిన్నాం. ఇంటి బయట మంచాలు వేసుకున్నాం. నేనూ అబ్బా పక్కపక్కన మంచాలు వేసుకున్నాం. మా అమ్మ ఇంకా ఇంట్లో ఏదో పనిలోనే ఉంది. అమ్మకు ఎప్పుడూ పనే. అదేం పనో? బాలమ్మకూ పనే అంట!

మా ఎదురింట్లో నుంచీ టి.వి. పాటలు విన్పిస్తా ఉండాయి. ఆ పెదనాయన రోడ్డు పనులు తీసుకున్నాడు. టి.వి. కొన్నాడు. మాకు టి.వి. లేదు. వాళ్లింటికి పోయి టి.వి. చూడాలని నాకు లేదు. దిగులుగా ఉంది.

మా అబ్బ వైపు చూసినా, వెల్లకిలా పడుకొని ఆకాశం దిక్కు చూస్తా ఉండాడు. నేను చూసినా. ఆకాశం మా ఊర్లో కుమ్మరాము మాదిరి ఉంది. చుక్కలూ లేవు, గిక్కలూ లేవు, గాలి మాత్రం అంతో ఇంతో ఆడతా ఉంది.

మా అబ్బ నా వైపు తిరిగినాడు.

“గంగాధరా! ఇక్కడికి రా” అని పిలిచినాడు. అబ్బ లేచి కూర్చున్నాడు. నేను అబ్బ పక్కన కూర్చున్నా.

“కుమ్మరాయనా, రాచపుండు కథ గుర్తుందా గంగాధరూ?” అని అబ్బ అడిగినాడు.

“ఉంది అబ్బా!” అన్నా. నాకు ప్రతి కతా గుర్తుంటుంది. ఒకసారి వింటే చాలు.

“ఆ కథ చెప్పు” అని మా అబ్బ అడిగినాడు.

మా అబ్బ ఈ కతను నాకు ఎప్పుడో చెప్పినాడు. నేను ఇప్పుడు మా అబ్బకు చెప్తా ఉండా:

“ఒక కుమ్మరాయనకు వీపు మీద రాచపుండు పుట్టిందంట!

దాంతో ఒకటే దురద పుట్టిందంట. కుమ్మరాయనేమో కుండలు తట్టుకోవాల. దురద అడ్డంగదా? కుండలు తట్టుకునే తబకతో దురదపుట్టినప్పుడల్లా తపాతపామని వీపు మీద కొట్టుకునేవాడు. ఎక్కడంటే, పుండు దురద పుట్టిన దగ్గర, రాచపురుగు తబక దెబ్బలకు తట్టుకోలేకపోయింది. "వీడేమో ఇట్లా కొట్టి చస్తా ఉండాడు. వీడి దగ్గరుంటే నేను చస్తాను. రాజు దగ్గరకు పోతా' అనుకుందంట. పని లేని రాజు దగ్గరే ఉండిపోయింది", కతముగించి" ఇంతేగదా అబ్బా" అన్నా.

మా అబ్బ పకాపకా నవ్వినాడు. నేనూ నవ్వినా

"గంగాధరా! దీనికి ఒక తోక కథ ఉంది. నేను ఇంతకుముందు చెప్పడం మరిచిపోయినా. ఇప్పుడు జ్ఞాపకం వస్తాంది. వింటావా? నిద్రవస్తాందా?" అని అబ్బ అడిగినాడు.

"నిద్దర పట్టలేదులే అబ్బా! కత వింటా. చెప్పు" అన్నా.

"పని లేని రాజు దగ్గరకు రాచపుండు పోయిందని చెప్పినావు గదా? అని అడిగినాడు." అవును అన్నాను.

"అయితే విను... రాజు దగ్గర ఒక రాజ వైద్యుడుండాడు. ఆ ఆకు నూరినాడు. ఈ ఆకు నూరినాడు. కల్వంలో ఆ మందు నూరినాడు. ఈ మందు నూరినాడు. ఆ పసరు పూసినాడు. ఈ పసరు పూసినాడు. ఆ గుళికలు తినమన్నాడు. ఈ గుళికలు తినమన్నాడు. పుండు మానలేదు. పుండు మాన్పించినోళ్లకు అర్థ రాజ్యం ఇస్తానని చాటింపు వేయించినాడు, రాజు. దేశదేశాల నుంచి వైద్యులు దిగినారు. మంత్రగాళ్ళు దిగినారు. ఆ రాచపుండు వైద్యులకు లొంగలేదు. మంత్రాలకు చింతకాయలు రాలేదు. రాచపుండుకు భయమేసింది. వీళ్లంతా తనను మందుల్తో మాకుల్తో చంపుతారని దిగులు పడింది. ఎక్కడికి పోతామబ్బా? అని ఆలోచన చేసింది. రాజ్యమంతా కరువు. పనిలేని రైతు కనబడినాడు. వేలాది మంది రైతులు కనబడినారు. వీళ్లైతే మంచిది. తిండి తిప్పలకు చస్తా ఉండరు. వైద్యమెక్కడ చేయించుకుంటారు? రేపోమాపో బాధపడి బాధపడి చచ్చిపోతారు. నా దెబ్బకు అని అనుకున్నిందట! అనుకోనీ అనుకోనీ రైతుల మీద ఒక్కసారిగా వచ్చి వాలింది.రైతులకు పెద్ద రాచపుండ్లు వచ్చినాయి. అబ్బ కతను ముగించినాడు. మా అబ్బ మాటలు వణికినట్లు అనిపించింది. 'ఏందో? కత విని నేను పెద్దగా దిగులు పడినా. మా అబ్బ పక్కనే నిద్దరపోయినా.

రెండు మూడు రోజులు మా అబ్బచెప్పిన కతను గురించి ఆలోచించినా. భగీరథుడు గంగను తెచ్చి, రైతుల రాచపుండ్లు మీద పోయేటట్లు చేస్తే, రాచపుండ్లకు తిక్కకుదురుతుంది. అనుకున్నా అంతే కత రాసిపెట్టుకున్నా కాగితం మీదే. మా నాయన ఇంకా రాలేదు. నోటు బుక్కులను నేను కొనలేదు.

కత తీసుకొని మా రంగయ్య సారు ఇంటికి పోయినా బెరుకు బెరుకుగా కాగితం కతను ఇచ్చినా. 'ఏంది?' అనలేదు. చూసినాడు. చదివినాడు. మా రంగయ్య సారుకు కండ్లనీళ్లు వచ్చినాయి. కత చదివితే కండ్ల నీళ్లు వస్తాయా? వింటే వస్తాయి అనుకున్నా.

కండ్ల నీళ్లు తుడుచుకుంటూ రంగయ్య సారు అన్నాడు?

"గంగాధరా! రైతులకు పుట్టింది కరువు రాచపుండ్లు, నువ్వు బాగా రాసినావు. భగీరథుడు గంగను తెచ్చి పుండ్లను కడిగి పోగొట్టాలని. ఇప్పుడున్న భగీరథులకు మన రైతులు వాళ్ళ తాతముత్తాతలు కాదు..."

ఇప్పుడున్న భగీరథులెవ్వరో నాకు తెలియలేదు. ఓహో!ఇప్పుడు అట్లాంటి రాజులు లేరు కదా? ముఖ్యమంత్రులు, మంత్రులు మాదిరోల్లు ఉండారు. ఏందో? ఇదంతా గొడవ, గొడవ. అయోమయం అంకాలమ్మ తిర్నాల. పెరిగి పెద్దవుతాను గదా? రంగయ్యసారు భగీరథుని కత చదివినప్పుడు చెప్పినాడు గదా: నలుగురికీ మేలు చేసేది ఉందా? లేదా?" అని అదెట్లాగా? ఎట్లాగంటే గంగను మా ఊరికి తేవాల. అంతే. ఆరు నూరుగానీ గంగను తేవాల. అన్ని ఊర్లకూ తేవాల. తెచ్చి తీరాల... అంతే.... అయితే, అంత దాకా ఇంతేనా?

V

## కవిత



## రిషా అలీ.. నాగలక్ష్మీ

జిలుకర శ్రీనివాస్

రిషా అలీ!
నువ్వెలా వున్నావో అక్కడ!
మేఘాలు
బాంబుల్ని కురుస్తున్నచోట
తుపాకులు తూటాల్ని
వర్షిస్తున్న చోట
నువ్వెలా వున్నావో!!

పత్రిక ముఖం
చూసినప్పుడల్లా
నేను
నీ మరణవార్త కన్పించకుంటే
బావుండని కోరుకుంటా!
కాలిన పసికందు శరీరాల్లో
రక్తపు మడుగులో
ఒరిగిన ఏ తల్లి బడిలోనైనా
చిట్టితల్లి కన్పిస్తే
నువ్వేనేమోనని
దుఃఖపడుతా!
నువ్వంటే నాకెందుకింత
మమకారం?

యుద్ధం కింద నలుగుతున్న
పిల్లలంటే
నాకెందుకింత విషాదం!!
ప్రపంచమంతా
తుపాకులు మొలుస్తున్న వేళ
నువ్వుకాదక్కడ
బోరునేడుస్తుంది
నేను తెలుసా!
ఇక్కడ చదువుకొనలేక
నాగలక్ష్మి మరణించింది
అక్కడ
డాక్టర్ అవ్వాలన్న నీ కలలపై
అమెరికా బి-సిక్స్టీన్
పేల్చింది
చిర్నవ్వుల్ని వధించింది
ఆ క్రౌర్యపిశాచమే!
నేనో ఆయుధమవుతాను
వాడిమీదికి గురిపెట్టు

## చందాలు పంపేవారికి మనవి

సాంకేతిక కారణాల వల్ల ప్రస్థానం సంవత్సర చందాలు ప్రస్తుతానికి తీసుకోవడం లేదు. రాష్ట్రంలోని ఏడు ప్రజాశక్తి బుక్‌హౌస్ బ్రాంచీల ద్వారానూ, ప్రజాశక్తి పత్రిక ఏజంట్ల ద్వారానూ, రామకృష్ణ న్యూస్ ఏజన్సీస్ ద్వారానూ ప్రస్థానం తెప్పించుకోవచ్చు.హైదరాబాదులోని హెడ్డాఫీసుకు ఆర్డర్ పంపితే మీకు కాపీలు అందే ఏర్పాటు చేయగలము. ఇప్పటికే వార్షిక చందాలు చెల్లించిన వారు దగ్గరలోని ప్రజాశక్తి బుక్ హౌస్ బ్రాంచీలలో కాపీ తీసుకోవచ్చు. వీలు కాని వారు మాకు రాస్తే అందించే ఏర్పాటు చేస్తాము.


## ప్రస్థానం అడ్వర్టయిజ్‌మెంట్ టారిఫ్

| | | |
|---|---|---|
| బ్యాక్ పేజి | : | 15,000 |
| కవర్ ఇన్నర్ పేజి | : | 12,000 |
| లోపలి పేజి (కలర్) | : | 10,000 |
| లోపలి పేజి (బ్లాక్ అండ్ వైట్) | : | 5,000 |

నివాళి

# కడదాకా పీడితుల పక్షాన నిలిచిన హోవార్డ్ ఫాస్ట్



*బ్రహ్మాండమైన సాహిత్యాన్ని సృష్టించిన ఫాస్ట్ చివరి వరకు తన రాజకీయ నైశిత్యాన్ని, వామపక్ష దృక్పథాన్ని విడనాడలేదు. జాక్ లండన్ తర్వాత అమెరికాలో కార్మికవర్గ నేపథ్యం నుండి వచ్చిన రచయితను తానేనని ఆయన నుండే తాను స్ఫూర్తిని పొందానని గర్వంగా చెప్పుకునే ఫాస్ట్ అదే బాటలో ముందుకుసాగారు. నల్లజాతి గాయకుడు పాల్‌రోబ్‌సన్‌తో సన్నిహిత మైత్రిని ఫాస్ట్ కొనసాగించారు.*

**గుడిపూడి విజయరావు**

'స్పార్టకస్' పేరు వింటేనే ఒళ్ళు పులకరిస్తుంది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, పీడిత జన విముక్తిని కాంక్షించే ప్రతి ఒక్కరికి నిరంతర స్ఫూర్తి స్పార్టకస్. క్రీస్తు పూర్వం 71లో రోమన్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన బానిసల తిరుగుబాటుకు నాయకత్వం వహించిన వాడు స్పార్టకస్. ఆ మహాయోధుడికి ఆ చారిత్రక ఘట్టానికి అనితర సాధ్యమైనరీతిలో నవలా రూపమిచ్చిన సాహితీ స్రష్ట హోవార్డ్ ఫాస్ట్. అతి పిన్న వయసులోనే సాహితీ ప్రస్థానాన్ని ఆరంభించి కడదాకా కొనసాగించిన ప్రఖ్యాత అమెరికన్ రచయిత హోవార్డ్ ఫాస్ట్ 88ఏండ్ల వయస్సులో 2003 మార్చి 12వ తేదీన కన్నుమూశారు. హోవార్డ్ ఫాస్ట్ సాహిత్య సృష్టి ఎంతో విస్తారమైంది, విభిన్నమైంది. ఆయన లెక్కకు మించిన గ్రంధాలు రచించారు. అమ్ముడైన ఆయన గ్రంధాల మొత్తం ప్రతుల సంఖ్య 8 కోట్లు. అంటే ఆ కృషి ఎంతటి బృహత్తరమైనదో అర్థం చేసుకోవచ్చు. హోవార్ట్ ఫాస్ట్ కేవలం సాహిత్యరంగానికే పరిమితం కాలేదు. కమ్యూనిస్టు, అభ్యుదయ రాజకీయాల్లో ఉద్యమాల్లో ఆయన ప్రత్యక్షంగాను, పరోక్షంగాను పాలుపంచుకున్నారు. ఫలితంగా అనేక అణచివేతలకు చివరకు జైలు నిర్బంధానికి సైతం గురికావలసి వచ్చింది. అయినప్పటికీ ఆయన కడదాకా పీడితుల పక్షాన్నే నిలబడ్డాడు. అటువంటి ఉదాత్తమైన వ్యక్తి జీవితాన్ని, కృషిని ఈ సందర్భంగా స్మరించుకోవడం సాహిత్యాభిమానుల బాధ్యత.

హోవార్డ్ ఫాస్ట్ 1914 నవంబరు 2వ తేదీన న్యూయార్క్ నగరంలో జన్మించారు. ఆయన తండ్రి టెక్స్‌టైల్ కార్మికుడు. పుట్టిన దగ్గర నుండి పేదరికాన్ని అనుభవించిన ఫాస్ట్ హైస్కూలు విద్య కూడా పూర్తి చేయలేక పోయాడు. అయినా పేదరికంతో కృంగిపోక జీవితాన్ని ఒక సవాలుగా స్వీకరించి ముందుకు సాగాడు. పదహారేళ్ళ వయస్సులో ఫాస్ట్ మొట్టమొదటి కథ రచించాడు. ఆ కథను ఓ పత్రిక ప్రచురించడమే కాకుండా పారితోషికాన్ని కూడా ముట్టచెప్పింది. అప్పటి నుండి ఫాస్ట్‌కు సాహిత్యమే జీవనోపాధి అయింది. మొదటి కథ తర్వాత రెండేళ్ళకు ఫాస్ట్ తన మొదటి నవల 'టు వ్యాలీస్' రచించాడు. న్యూయార్క్‌లోని డయల్‌ప్రెస్ 1933లో ఆ నవలను ప్రచురించింది. 1939లో 'కన్‌సీవ్డ్ ఇన్‌లిబర్టీ' నవల ప్రచురణతో ఫాస్ట్ సాహితీ రంగంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. ఇది అమెరికా విప్లవానికి సంబంధించిన చారిత్రక నవల. ఇదే అంశంపై 'ది అన్‌వాంకిష్డ్' (1942), 'సిటిజన్ టామ్ పాయిన్' (1943) నవలలను ప్రచురించాడు. 1941లో ప్రచురితమయిన 'లాస్ట్ ఫ్రంటియర్' నవల అమెరికా ఖండం వలసగా మార్చ బడటం ఎటువంటి ఫలితాలకు దారితీసిందీ అక్కడి తొలి నివాసుల దృష్టికోణం నుంచి వివరిస్తుంది. 18వ శతాబ్దానికి చెందిన మహోన్నత విప్లవ ప్రచారకుడు టామ్‌పాయిన్ జీవితాన్ని ఆనాటి చారిత్రిక నేపథ్యంలో ఎంతో ఉత్కంఠ భరితంగా వివరిస్తుంది 'సిటిజన్ టామ్ పాయిన్' నవల.

'సిటిజన్ టామ్ పాయిన్' రాస్తున్నపుడే ఫాస్ట్ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యాడు. ప్రజాస్వామ్యవాదిగా, ఫాసిస్టు వ్యతిరేకిగా ఉన్న ఫాస్ట్ ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో ఫాసిస్ట్ మూకలను సోవియట్ యూనియన్ వీరోచితంగా ప్రతిఘటిస్తున్న సమయంలో కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులయ్యారు. 1957 వరకు ఆయన కమ్యూనిస్టు పార్టీలో కొనసాగారు. ఈ కాలంలో అమెరికా కమ్యూనిస్టు పార్టీ అధికారపత్రిక 'డైలీ వరల్డ్'లో విస్తారంగా రచనలు చేశారు. ఈ రచనలు ఓ రాజకీయ జర్నలిస్టుగా ఆయన ప్రతిభకు అద్దం పట్టాయి. అయితే ఆయన కేవలం ఈ రచనలకే పరిమితం కాలేదు. క్రియాశీల రాజకీయాల్లనూ పాల్గొన్నారు. 1948 అధ్యక్ష ఎన్నికల్లో ఆయన హెన్రీ వాలెస్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. పలు అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లకు కూడా ఫాస్ట్ హాజరయ్యారు. రాజకీయాలను, రచనా వ్యాసంగాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్న ఈ తరుణంలోనే ఫాస్ట్‌పై ప్రభుత్వ నిర్బంధం, నిఘా కూడా అధికమయింది. అమెరికా గూడచారి శాఖ ఎఫ్.బి.ఐ. ఫాస్ట్‌పై 1100 పేజీల రిపోర్టును తయారు చేసిందంటే ఆయన పై నిఘా ఎంత తీవ్రంగా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. అమెరికాయేతర కార్యకలాపాల కమిటీ ఎదుట హాజరయ్యేందుకు నిరాకరించడంతో ఫాస్ట్ 1950లో జైలుపాలు కావలసి

వచ్చింది. స్పెయిన్ అంతర్యుద్ధంలో గాయపడిన వారి చికిత్స కోసం ఫ్రాన్స్‌లో నిర్మించిన ఆసుపత్రికి విరాళాలందించిన వారి జాబితాను తెలియజేయకపోవడమే ఆయన చేసిన నేరం. జైల్లో ఉన్న ఈ కాలంలో ప్రజా స్వామ్య హక్కులపట్ల ఫాస్ట్ నిబద్ధత మరింత బలపడింది. ఈ సమయంలోనే ప్రఖ్యాత 'స్పార్టకస్' నవలపై ఆయన పని చేశారు. మూడు మాసాల తర్వాత ఆయన జైలు నుండి విడుదల య్యారు. 1952లో అమెరికన్ లేబర్ పార్టీ తరపున కాంగ్రెస్‌కు ఫాస్ట్ పోటీ చేశారు. 1953లో సోవియట్ యూని యన్ ఆయనను స్టాలిన్ శాంతి బహుమతితో సత్కరించింది. ప్రఖ్యాత అమెరికా నల్లజాతి గాయకుడు పాల్‌రోబ్ సన్‌కు కూడా ఈ పురస్కారం లభించింది. ఈ సమయం లోనే కమ్యూనిస్ట్ పార్టీలో కొన్ని ధోరణులపట్ల ఫాస్ట్ తీవ్ర అసంతృప్తికి గురయ్యాడు. 'ది నేకెడ్ గాడ్ : ది రైటర్ అండ్ కమ్యూనిజం' అనే గ్రంథంలో పార్టీపట్ల తన అభిప్రాయాలను వ్యక్తం చేసిన ఫాస్ట్ 1957లో కమ్యూనిస్టు పార్టీకి రాజీనామా చేశారు. ఈ ఘటన ఆనాడు ఎంతో సంచలనం సృష్టించింది. అమెరికా పాలకులు దీన్ని తమ కమ్యూ నిస్టు వ్యతిరేక ప్రచారానికి వాడుకోవాలని ఎంతో ఆశపడ్డారు. నిజాయి తీపరులకు కమ్యూనిస్టు పార్టీలో స్థానం లేదని దుష్ప్రచారం చేయాలన్నది వారి దురుద్దేశ్యం. కాని ఫాస్ట్ ఆ తర్వాత వ్యవహరించిన తీరు అమెరికా పాలకులకు అటువంటి అవకాశాన్నివ్వ లేదు. 1990లో ప్రచురించిన 'బీయింగ్ రెడ్' అనే గ్రంథంలో ఆయన పార్టీ గురించి ఇలా చెప్పారు. "ఒక్క సారిగా పైకి పోవాలన్న కాంక్ష, సంకుచితత్వం, ద్వేషం పార్టీలో నాకు కనిపించాయి. ప్రేమ, అంకితభావం, గొప్ప సాహసం, ఔన్నత్యం కూడా నాకు కనిపించాయి. నేనెన్నడూ చూడనంతటి అత్యున్నత మానవత్వం మూర్తీ భవించిన మహానుభావులు కూడా పార్టీలో ఉన్నారు."

ఫాస్ట్ రాజకీయాల్లో తలమున్కలవుతున్న సమయంలో ప్రచురణ కర్తలు ఆయనకు దూరం కాసాగారు. 'స్పార్టకస్' నవలను అనేక మంది ప్రచురణ కర్తలు తిరస్కరించారు. ఫాస్ట్ కలుసుకున్న ప్రచురణ కర్తలు కొందరి వద్దకు ఎఫ్.బి.ఐ. ఏజెంట్లు వెళ్ళి ఆయన రచనలను ప్రచురించ వద్దని హెచ్చరించారు. ఈ పరిస్థితిలో ఫాస్ట్ తన రచనలను తానే ప్రచురిం చుకోవడానికి పూనుకున్నాడు. 'బ్లూ హెరాన్ ప్రెస్'ను స్థాపించి 'స్పార్టకస్' నవలను ప్రచురించాడు. ఈ తొలి ప్రచురణే గొప్ప ఆదరణ పొందింది. మూడు మాసాల్లోనే 48 వేల కాపీలు అమ్ముడయ్యాయి. ఆ తర్వాత ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో కమ్యూనిస్టు వ్యతిరేక జాడ్యం మెకర్థీజంను వివరించే పలు నవలలను ఫాస్ట్ రచించారు. కమ్యూనిస్టు పార్టీతో ప్రత్యక్ష సంబంధాన్ని వదులుకున్న తర్వాత ఫాస్ట్ హాలీవుడ్‌కు వెళ్ళారు. స్క్రీన్‌ప్లే రచయితగా మారారు. ఈ కాలంలోనే 'స్పార్టకస్' సినిమాగా వచ్చి అపూర్వ విజయాన్ని సాధించింది. ఇరవయ్యవ శతాబ్దం ఆరంభం నుండి, వియత్నాం యుద్ధకాలం వరకు ఒక అమెరికా కుటుంబ జీవితాన్ని వివరిస్తూ రాసిన 'ఇమిగ్రెంట్స్' నవల టెలి సీరియల్‌గా కూడా గొప్ప విజయాన్ని సాధించింది.

అమెరికా చారిత్రిక నవలా రచయితల్లో ఫాస్ట్ స్థానం అందరి కన్నా ముందుంటుంది. ఆయన నవలల్లో కాలానుక్రమ అధ్యాయాలుండవు. దృశ్యాలు మాత్రమే ఉంటాయి. ఆయన నవల చదువుతూ ఉంటే కథా గమనం కంటే మిన్నగా ఆయా దృశ్యాలు పాఠకుని మనోనేత్రం ముందు సాక్షాత్కరిస్తుంటాయి. ఫ్లాష్ బ్యాక్ పద్ధతిని ఫాస్ట్ ఎంతో నైపుణ్యంతో ఉపయోగించుకుంటారు. చారిత్రక, రాజకీయ నవలలు ఫాస్ట్ ప్రధాన కృషి అంటే సముచితంగా ఉంటుంది. అందులోనూ చారిత్రక నవలలది

............ O ............

**'స్పార్టకస్' నవలను అనేక మంది ప్రచురణ కర్తలు తిరస్కరిం చారు. ఫాస్ట్ కలుసు కున్న ప్రచురణ కర్తలు కొందరి వద్దకు ఎఫ్.బి.ఐ. ఏజెంట్లు వెళ్ళి ఆయన రచనలను ప్రచురించ వద్దని హెచ్చరిం చారు.**

............ O ............




ప్రథమస్థానం. అయితే ఫాస్ట్ సాహితీ కృషి కేవలం ఇలాంటి నవలలకే పరిమితం కాలేదు. ఇ.కన్నింగ్ హాం అనే పేరుతో ఆయన 20కి పైగా డిటెక్టివ్ నవలలు, సైన్స్‌ఫిక్షన్ నవలలు కూడా రచించారు. ఆయన స్వంత పేరుతో రాసిన ప్రధాన నవలలు 40కి పైగా ఉంటాయి. ఇవి కాకుండా అనేక కథలు, వ్యాసాల సంకలనాలు కూడా వెలువడ్డాయి.

ఇంతటి బృహత్తరమైన కృషికి అనుగుణంగానే ఫాస్ట్ పేరు ప్రఖ్యాతులు కూడా సంపాదించారు. ఆయనకు జనాదరణ మొదటి నవల నుండే ఆరంభ మయింది. ఆ మొదటి నవల 'టు వ్యాలీస్' అమెరికాలో ప్రచురితమయిన కొద్ది మాసాలకే ఇంగ్లండ్‌లో కూడా ప్రచురితమయింది. ఇదే నవల మొదటి పాత ప్రతి ఒకటి విలువైన పాత వస్తువులు అమ్మే దుకాణంలో కొద్ది సంవత్సరాల క్రితం 500 డాలర్ల ధర పలికింది. ఈ విషయం ఫాస్ట్ దృష్టికి వచ్చినపుడు మొత్తం ఆ నవల రాసినందుకే తనకు అంత మొత్తం ముట్టలేదని నవ్వుతూ వ్యాఖ్యానించారు. ఫాస్ట్ నవలలకు విదేశాలలో కూడా మంచి ప్రజాదరణ లభించింది పూర్వపు సోవియట్ యూనియన్, ఇతర సోషలిస్టు దేశాలలో ఫాస్ట్ నవలలకు విపరీతమైన గిరాకీ ఉండేది. ఆయన నవలలు ఫ్రెంచి, ఇటాలియన్, జర్మన్, స్పానిష్, కేటలాన్, పోర్చుగీస్, గ్రీక్, జెక్, క్రోట్, హీబ్రూ, చైనీస్, జపనీస్, బెంగాలీ, తెలుగు తదితర అనేక భాషలలో అనువదించబడి ప్రపంచ వ్యాపితంగా ప్రచురించ బడ్డాయి.'లాస్ట్ ఫ్రంటియర్' నవల ఒక్కటే 20 భాషల్లోకి అనువదించ బడింది.

ఫాస్ట్ చివరి వరకు నవలలు రాస్తూనే ఉన్నారు. వీటిలో అమెరికాలో పరిస్థితులను విమర్శనాత్మకంగా వివరించే రాజకీయ నవలలు కూడా ఉన్నాయి. ది డిన్నర్ పార్టీ (1987), దిప్లెడ్జ్ (1988), కన్‌ఫెషన్స్ ఆఫ్ జోకల్లెన్ (1989) ఈ తరహా నవలలు. ది ట్రయల్ ఆఫ్ ఎ బిగెయిల్ గుడ్ మ్యాన్ (1993) నవల మహిళల గర్భ విచ్ఛిత్తి హక్కును నిరోధించడానికి జరిగే ప్రయత్నాలను సందేహాస్పద దృష్టితో వివరిస్తుంది. ఫాస్ట్ చివరి నవల గ్రీన్‌విచ్ 2000లో ప్రచురితమయింది. అప్పటికి ఆయన వయసు 85 ఏళ్ళు. మరో కొత్త నవలపై పని చేస్తున్న సమయంలోనే ఆయన కన్ను మూశారు. ఇంతటి బ్రహ్మాండమైన సాహిత్యాన్ని సృష్టించిన ఫాస్ట్ చివరి వరకు తన రాజకీయ నైశిత్యాన్ని, వామపక్ష దృక్పథాన్ని విడనాడలేదు. జాక్ లండన్ తర్వాత అమెరికాలో కార్మికవర్గ నేపథ్యం నుండి వచ్చిన రచయితను తానేనని ఆయన నుండే తాను స్ఫూర్తిని పొందానని గర్వంగా చెప్పుకునే ఫాస్ట్ అదే బాటలో ముందుకుసాగారు. నల్లజాతి గాయకుడు పాల్‌రోబ్‌సన్‌తో సన్నిహిత మైత్రిని ఫాస్ట్ కొనసాగించారు. ఫ్రెంచి విప్లవ చిత్రకారుడు పికాసోతో ఆయనకు దగ్గర సంబంధాలుండేవి. చిలీ కమ్యూనిస్టు కవి పాబ్లో నెరూడాతో ఆయనకు ప్రగాఢానుబంధం ఉండేది. నెరూడా తన కవిత్వం సంపుటి నొకదాన్ని ఫాస్ట్‌కు అంకితమిచ్చాడు కూడా.

ఏడు దశాబ్దాలకు పైగా ఏకబిగిన అభ్యుదయ సాహిత్య రంగానికి ఎనలేని సేవలందించి, వామపక్ష, ప్రజాతంత్ర, అభ్యుదయ ఉద్యమాల్లో కూడా పాలుపంచుకున్న హోవార్డ్ ఫాస్ట్ మృతి ప్రపంచ సాహిత్యరంగానికి, అభ్యుదయోద్యమానికి తీరనిలోటు. ఏక ధృవ ప్రపం చంలో తనకెదురే లేదని విర్రవీగుతున్న అమెరికాను అమెరికా గడ్డ నుండే నిలదీసిన ఓ సాహితీ మూర్తి అదృశ్యమయ్యాడు. అయినా ఆయన రచనలు ఆ కర్తవ్యాన్ని ముందుకు తీసుకెళ్ళే వారికి నిత్యం స్ఫూర్తినిస్తూనే ఉంటాయి.

V

# సామాన్యుడి దిశగా సాంఘిక నాటకం

***ఎక్కువ నాటక, నాటికలు, నినాదప్రాయంగా, వాగాడంబరంతో సాగడం విచారించదగ్గ విషయం. అదే సందర్భంలో ఇతివృత్తాలు కుటుంబం పరిధిని దాటుకుంటూ సామాజిక, జాతీయ అంశాల వైపు అడుగిడడం ముదావహం. అయితే అవి సామాన్యుడి జీవితానికి దగ్గరవుతున్న కొద్దీ సామాన్యుడు కూడా ఔత్సాహిక తెలుగు సాంఘిక నాటకానికి మరింత చేరువవుతాడు.***

**శైలి**

ఔత్సాహిక తెలుగు సాంఘిక నాటకరంగానికి పరిషత్ పోటీలు ఓ ప్రధాన ఆధారంగా నిలుస్తున్నాయి. అదే సందర్భంలో నాటక విలువలను, సామాజిక విలువలను ప్రగతి పథంలో నడిపించేందుకు ఈ పరిషత్ పోటీలు దోహదపడ్తున్నాయా? లేదా కేవలం బహుమతులకే పరిమితమై ప్రమాణాలను దిగజార్చుకునే స్థితిలోకి పరిషత్ పోటీలు పడిపోతున్నాయా? అని మీమాంస కూడా ముందుకు వస్తున్నది.

పరుచూరి రఘుబాబు స్మారక 13వ వార్షిక అఖిలభారత నాటకోత్సవాలు 2003 ఏప్రిల్ 27 నుండి మే 1 వరకు హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగాయి.

క్రమం తప్పకుండా గత 13 ఏళ్ళుగా ఈ పరిషత్ నడుస్తోంది, సినీ ప్రముఖుల అండదండలు మెండుగా లభించడం, ఈ పరిషత్ ద్వారా కొందరు రచయితలు, నటీనటులు సినీరంగ ప్రవేశం చేయడం, అన్నిటికంటే ముఖ్యంగా నాటకరంగంలో ప్రవేశం ఉండి, సినీరంగంలో గత 25 ఏళ్ళుగా లబ్ధప్రతిష్టులైన పరుచూరి బ్రదర్స్ ఈ పరిషత్‌కు స్వయంగా సారధ్యం వహించడం ఈ పరిషత్ ప్రత్యేకతగా నిలుస్తున్నది. సినీహీరో చిరంజీవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఈ పరిషత్ ముగింపు ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా కార్మిక మంత్రి బాబుమోహన్ విచ్చేశారు.

ఈసారి పరుచూరి రఘుబాబు పరిషత్‌కు 5 నాటకాలు 16 నాటికలు ప్రదర్శనకు ఎంపిక అయ్యాయి. నాటక నిడివి రెండు గంటలలోపు, నాటిక నిడివి గంటలోపు ఉన్న విషయం తెలిసిందేకదా. ఎల్.వి.ఆర్. క్రియేషన్స్ గుంటూరు వారి "ఉత్తమ పంచాయితీ" ఉత్తమ నాటకంగా, గురజాడ కళామందిర్ విజయవాడ వారి 'శబ్దం' ద్వితీయ ఉత్తమ నాటకంగా ఎన్నికయ్యాయి. "శబ్దం" ఉత్తమ రచన, ఉత్తమ పంచాయితీకి ఉత్తమ దర్శకత్వం బహుమతులు లభించాయి.

గొళ్ళపాటి నాగేశ్వరరావు రచించిన ఉత్తమ పంచాయితీ నాటకం గ్రామీణ వాతావరణానికి అద్దం పడ్తుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో జీవిస్తున్న ఆధునిక నగర వాసులను సహజంగానే పల్లె సౌందర్యం అమితంగా ఆకర్షిస్తుంది. రంగస్థలంపై అలరిస్తుంది. కక్షలు, కార్పణ్యాల కన్నా కులమతాలకు అతీతమైన శ్రమైకజీవన సౌందర్యమే సమాజాన్ని ముందుకు నడిపిస్తుందనే వాస్తవాన్ని నాటకం తెలియజెప్తుంది. అయితే సమస్య మూలాలను అన్వేషించే విధంగా ప్రేక్షకుడి ఆలోచనా స్థాయిని పెంచడంలో వైఫల్యం ఉన్నది. దర్శకత్వం నుసుము కోటి శివ.

ఇక శబ్దం నాటకం ఎయిడ్స్‌కు సంబంధించింది. ఎయిడ్స్ మహమ్మారిని పోగొట్టాలంటే 'నిశ్శబ్దాన్ని ఛేదించండి అని ప్రభుత్వం నినాదాన్ని యిచ్చింది. దాన్నే శబ్దాన్ని సృష్టించండి అంటూ నాటక కళాకారులు త్రిప్పి చెప్పారు.

కన్నబిడ్డలచే గెంటివేయబడిన వృద్ధ పురుషుల ఆశ్రయంలోకి ఎయిడ్స్ వ్యాధి సోకిన ఒక యువతిని ఓ యువడాక్టర్ చేర్పిస్తాడు. ఎయిడ్స్ కారణాన ఆ యువతిని కూడా కన్న తండ్రి ఇంట్లోంచి గెంటివేస్తాడు. అయితే ఈ యువతి ఆ డాక్టర్ ప్రేమికులు. ఎయిడ్స్ అని తెలిసినా డాక్టర్ మానవతా హృదయంతో ఆ యువతిని పెళ్ళి చేసుకోవడానికి ముందుకు వస్తాడు. కాని యువతి చనిపోతుంది. నాటకం ముగుస్తుంది. ఈ నాటక రచన దర్శకత్వం ఎం. సంజీవి.

నాటికల విషయానికి వస్తే కళావాణి ఉభయ గోదావరులు వారి 'సద్గతి' నాటిక ఉత్తమ నాటకంగా, రసఝరి పొన్నూరి వారి గుండె చప్పుడు ద్వితీయ ఉత్తమ నాటికగా, విశ్వహిత కళాకేంద్రం హైదరాబాద్‌వారి శేషప్రశ్న తృతీయ ఉత్తమ నాటికగా ఎంపిక అయ్యాయి.

సద్గతి నాటికలో కేవలం మూడే మూడు పాత్రలు. భర్త, భార్య, తల్లి వున్న కుటుంబం అది. మానవ సంబంధాలకు దూరమై ప్రతిదీ వ్యాపార సంబంధంతోనే కొలవాలనే ధనస్వామ్య ప్రవృత్తికి ప్రతీకగా భర్త పాత్ర ఉంటుంది. ప్రకృతి సిద్ధమైన మాతృత్వపు మానవ సంబంధాలను మనిషి కాపాడుకోవాలనే దీక్షతో భార్యపాత్ర ఉంటుంది. ఆధునిక నాగరిక సమాజపు జీవితాల్లోకి అనివార్యంగా తోసుకు వస్తున్న ఈ ఘర్షణను రచయిత, దర్శకుడు, పాత్రదారులు, టెక్నిషియన్‌లు అందరూ కలిసి కట్టుగా, ఆద్యంతం రక్తి కట్టించారు. ధనవ్యామోహాన్ని విడనాడి మానవ సంబంధాల ఒడికి చేరకపోతే మనిషి మనుగడకు అర్థంలేదనే విషయాన్ని నాటిక తేటతెల్లం చేస్తుంది. ఈ నాటక రచన స్నిగ్ధ. దర్శకత్వం ప్రసాదమూర్తి. ఉత్తమ నాటిక రచయిత కూడా స్నిగ్ధ.

మనిషి గుండెలో కులమతాలకు అతీతమైన భారతీయ ధ్వని ప్రతిధ్వనించాలనే సందేశాన్ని తెలియజెప్పే నాటిక 'గుండె చప్పుడు'.



రవీంద్రభారతిలో ప్రదర్శించిన 'ఉత్తమ పంచాయితీ' నాటకంలో ఒక దృశ్యం

కర్ఫ్యూ నీడలో ఓ శిథిల మందిరానికి హిందు, ముస్లిం వ్యక్తులు, ఇద్దరు చేరుకుంటారు. కాని అక్కడ అంతకుముందే జ్ఞాని లాంటి పిచ్చివాడు ఉంటాడు. హిందూ ముస్లింలు ఒకర్ని ఒకరు ద్వేషించుకున్నా ఆస్పత్రిలో వున్న తమ తల్లి, బిడ్డలు పరమత శీలుర సేవలవల్లనే బ్రతికారన్న సత్యం తెలుసుకుని సంబరపడిపోతారు. మత విద్వేషం కన్నా మతసామరస్యంలోనే భారతీయుని బతుకు ఉందని నాటిక చెప్తుంది. శిష్ట్లా చంద్రశేఖర్ రచించిన ఈ నాటకానికి వై.ఎస్. కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహించారు.

నక్సలైట్లు వ్యక్తిగత హింసావాద సిద్ధాంతంతో అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నారు. అయినా ప్రజలు విశాలహృదయంతో సాటి మనిషిని ప్రేమించి కాపాడాలనే మానవతా ధర్మానికి కట్టుబడి వున్నారని "శేష ప్రశ్న" నాటిక తెలియజెప్తుంది. నక్సలైట్ల చేతుల్లో హతులైన వారికోసం బాధితులు వేసే ప్రశ్నలు శేషప్రశ్నలుగా మిగిలిపోతున్నాయనేది నాటిక సారాంశం. శిష్ట్లా రాంప్రసాద్ రచించిన ఈ నాటికకు దర్శకత్వం టి. శివరామకృష్ణారావు.

అయితే 'ప్రేక్షకుడు' నాటకం గురించి ఓ విషయం చెప్పుకోవాలి. శాంతిబాబు రచనా దర్శకత్వంలో ఒంగోలు జనచైతన్య వారు ఈ నాటకం ప్రదర్శించారు.

ఈ నాటకంలో ప్రజలకు ఆదర్శనీయులైన మహోన్నత వ్యక్తుల మధ్య ఆ పాత్రల ద్వారానే చర్చ జరుగుతుంది. మహాత్మాగాంధి, అంబేద్కర్, అల్లూరి సీతారామరాజు, మహాకవి శ్రీశ్రీలు ఆ పాత్రలు. అయితే ఆ మహనీయులు ప్రజలకు అందించిన ఆదర్శ విలువల స్ఫూర్తిని మిడిమిడి జ్ఞానంతో ప్రక్కదోవ పట్టించడం లేదా పలచబరచి చూపడం క్షంతవ్యంకాదు. శాస్త్రబద్ధంకాని అలాంటి నాటకాలకు ప్రదర్శనామోదాన్ని కలుగజేయడం ప్రోత్సహించడం ఎవరికీ శ్రేయస్కరం కాదు. కాగా సాగరి చిలకలూరిపేట వారి 'ఖడ్గసృష్టి' నాటిక వీధి నాటిక ప్రక్రియలో సాగింది. రచన డా॥ కందిమళ్ళ సాంబశివరావు, దర్శకత్వం ఐ. రాజకుమార్.

చివరిగా ఎక్కువ నాటకాలు, నాటికలు, నినాదప్రాయంగా, వాగాడంబరంతో సాగడం విచారించదగ్గ విషయం. అదే సందర్భంలో ఇతివృత్తాలు కుటుంబం పరిధిని దాటుకుంటూ సామాజిక, జాతీయ అంశాల వైపు అడుగిడడం ముదావహం. అయితే అవి సామాన్యుడి జీవితానికి దగ్గరవుతున్న కొద్దీ సామాన్యుడు కూడా ఔత్సాహిక తెలుగు సాంఘిక నాటకానికి మరింత చేరువవుతాడు. ఆ క్రమంలోనే సామాజిక విలువలు, నాటక విలువలు పెంపొందించేందుకు నాటక కర్తలు, నాటక క్రియలు ముఖ్యంగా పరిషత్ నిర్వాహకులు నడుంకట్టాలి. తప్పదు మరి.

మనోగతం

# వీళ్ళని కలిపిన వాళ్ళకి కోటి దండాలు

కల్కి అవతారం కత్తి పట్టుకొని గుర్రం మీంచి దూసుకొస్తున్నట్టున్నాడు. కనకదుర్గమ్మ తల్లి ముక్కు పుడకని కృష్ణమ్మ తల్లి ముద్దుపెట్టుకుంటున్నట్టుంది. వీరబ్రహ్మంగారు చెప్పిందంతా జరుగుతున్నట్టే ఉంది. నోస్టర్‌డామస్ చెప్పింది కూడా.

మొన్న బాగ్‌లింగంపల్లి భారీ ఘోరాలు జరిగి పోయాయి. అరసం అఖిలభారత మహాసభలోని విపరీతాతి విపరీతాలని ఈ జలమలో ఈపాడు కళ్ళతో చూస్తామని నలభయ్యేళ్ళలో ఒక్క రాత్రి ఒక్క పగటికలలో కూడా అనుకోలేదు. ఆర్టీసీ ఆఫీసు ఎదురుగా బెల్లపు చెట్ల మీద సాయంత్రానికి జేరే కాకుల గుంపుల్ని చూశామో ఏమో! ఆ ఇంటి మీద వాలని కాకులూ, ఈ ఇంటి మీదవాలని కాకులన్నీ కలిసి ఒకే కప్పు కిందికి జేరాయి. "అరిచేతిని అడ్డు పెట్టి" అని రాసిన చేతుల్తోనే తనివితీరా దశాబ్దాలుగా దుమ్మెత్తిపోసుకున్న చేతులే కలిసి కదంతొక్కాయి. అక్కడ ఎన్ని అపభ్రంశాలు వినాల్సొచ్చిందో మీకు తెలీదు. ఊరేగింపులో బెంగాలీ రచయితలు "అభ్యుదయ రచయితల సంఘం" అని గట్టిగా అరిస్తే గద్దర్, వరవరరావు కలిసి రెట్టించి "వర్ధిల్లాలి" అని వంతపాడుతున్నారు. ఈ పాపిష్టి చెవులతో ఇలాటి కోరస్ వింటామని ఎప్పుడన్నా అనుకున్నామా. ఇది నిజమా! చేయిగిల్లుకుని చూస్తే అది నిజమైన నారాయణగూడా ఫ్లైఓవర్. మండుటెండలో ఊరేగింపులో అందరం ఉన్నాం. "అరసం" బేనర్‌ను అగ్రభాగాన పట్టుకునడుస్తున్న వాళ్ళలో మాజీ దిగంబర్ జ్వాలాముఖి, కవి వరవరరావు. గొంతుబొంగురుపోయినా ఎస్వీసత్యనారాయణ నినాదాలు ఆపడు. కేతు విశ్వనాథరెడ్డి జిందాబాద్ డౌన్‌డౌన్ అనడమూ ఆపడు. అంతలోనే అమెరికాని శాపనార్థాలు పెడుతూ పౌరహక్కుల రత్నమాల పెద్ద నినాదమిస్తుంది. పక్కనున్న అరసం వాళ్ళలో కలిసి గద్దర్ కూడా అందుకుంటాడు. నిడమర్తి ఉమారాజేశ్వరరావు. పరకాల పట్టాభి రామారావు, నిర్మలానంద, మల్లిక్, కె. రాజేశ్వరరావు, ఆర్వియార్.

ఎంతెంత మంది ఎందరెందరు మహానుభావులు. ఒకరు తెగరోసిన ఆదిమ రివిజనిస్టు. మరొకరు తాజా నయా రివిజనిస్టు. అదిగో ముందు వరసలో బేనర్ పట్టుకున్నాడే ఆయన చిన్ననాడే వామపక్ష బాలారిష్టం సోకిన పిడివాది కమ్ దుందుడుకు వాది. వెనక గుంపులో పాటలు పాడుతున్నాడే ఆయన సోషల్ సామ్రాజ్యవాద ఏజెంట్. చివర్లో పరిగెడుతున్నాడాయన "రన్నింగ్ డాగ్ ఆఫ్ ఇంపీరియలిజమ్" నా భుజం రాసుకుంటూ ముందుకెళ్లాడే ఆయన నయా వలసవాదానికీ, కాంప్రడోర్ బూర్జువాజీకీ డబుల్ ఏజెంట్. మన వెనక నడుస్తూనే వాటర్ పాకెట్స్ పంచుతున్నాడే ఆయన ప్రొలిటేరియట్ వేన్‌గార్డ్ కాదనీ, రైతాంగానిదే నాయకత్వమనీ వాదించిన పల్లెటూరి బైతు ఫ్లస్ రెన్‌గేడ్. కళ్లజోడూ రింగుల జుత్తుతో తెల్లలాల్చీ పైజమాలో ఉన్నాడే ఆయన : "కేపిటల్ మూడు వాల్యూములూ సర్‌ప్లస్ వాల్యూ అనుబంధాలూ మొత్తం చదవడం కళ్లకి దెబ్బేకాక పుస్తకారాధన పాపం కిందికి వస్తుందనీ మావో సూక్తుల రెడ్‌బుక్‌ని ఉదయం, మధ్యాహ్నం, రాత్రి చదివితే సకల రోగాలూ తగ్గుతాయని నమ్మే హెల్త్‌కాన్షస్ కామ్రేడ్. ఆరు వియత్నామ్‌లుగానీ మరో సింగిల్ వరల్డ్ వార్ గానీ తెస్తే గ్లోబంతా ఎర్రగా మెరుస్తుందని చెప్పిన మార్క్సిజం మేడీజీ మాస్టరు ఈయన. ఇంత కాలం ఇలా అందచందాలు చిందే ఎన్నో పేర్లు ఒకరికొకరు పెట్టుకుంటూ తిట్టుకుంటూ మహదానందంలో మునిగిన మనవాళ్ళంతా ఒకే గుంపుగా కలిసిపోయారంటే చిత్రం. చిత్రాతి విపరీత విచిత్రం.

వీళ్లందరికీ ఆ రోజు పొద్దుటే జ్ఞానోదయమయిపోయిందంటే ఎవ్వడూ నమ్మడు. అంతా జార్జిబుష్‌గారి చలవ. నరేంద్రమోడీ పుణ్యం. తొగాడియా దయ. ఉమాభారతి దీవెన. వీళ్ళందర్నీ అర్జెంట్‌గా కలిపేసిన వాళ్ళందరికీ పాదపాదాలా పరి దండాలు.

**-మోహన్**

**ఆర్టిస్ట్**






ప్రసంగిస్తున్న కె. రామమోహన్‌రాయ్, వేదికపై ప్రముఖులు

# ఖమ్మం జిల్లా సాహితీ స్రవంతి 4వ వార్షికోత్సవం

**ఖ**మ్మం జిల్లా సాహితీ స్రవంతి 4వ వార్షికోత్సవం భద్రాచలం డివిజన్ సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో భద్రాచలం ఉపాధ్యాయ విద్యా కళాశాలలో మార్చి 9వ తేదీన విజయవంతంగా జరిగింది. జె. శేషగిరిరావు, చీఫ్ మేనేజర్ ఐ.టి.సి. బిపిఎల్ సభను ప్రారంభించారు. లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల అధినేత శ్రీ మాగంటి సూర్యం, ఉపాధ్యాయ విద్యా కళాశాల ప్రధానాచార్యులు బి.ఎస్. దేవరాజ్, లయన్ జి.ఎస్. శంకరరావు, డా. పి. శంకరయ్య, లయన్స్ క్లబ్ ఛైర్మన్ ఎం. బాలనర్సారెడ్డి, క్రాంతి ఐ.టి.ఐ. అధినేత చావా లక్ష్మీనారాయణ, గౌరవ అతిథులుగా విచ్చేశారు. తెలుగు అధ్యాపకులు, సాహితీ స్రవంతి సలహాదారులు ఎన్.సి.హెచ్. చక్రవర్తి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రసిద్ధ విమర్శకులు డా. కడియాల రామమోహనరాయ్ "సాహిత్యం-సమాజం" అనే అంశం మీద ప్రధానోపన్యాసం చేశారు. అనంతరం భద్రాచలం సాహితీ స్రవంతి ప్రచురించిన రాష్ట్ర వ్యాప్తకవుల కవితా సంకలనం "మరోసంగమం"ను శ్రీమతి వనజా శేషగిరిరావు ఆవిష్కరించారు. డా.కల్లూరి ఆనందరావు గ్రంథ సమీక్ష గావించారు.

మధ్యాహ్నం ప్రతినిధులు సభలో ఖమ్మం జిల్లా కార్యదర్శి శ్రీ కటుకోజ్వల ఆనందాచారి కార్యదర్శి నివేదిక సమర్పించారు. జిల్లా అధ్యక్షులు శ్రీ కపిల రాంకుమార్ అధ్యక్షత వహించారు. జిల్లా సాహితీ స్రవంతి ప్రతినిధులు సాహిత్య కార్యక్రమాల గురించి నిర్మాణ విషయాల గురించి ప్రసంగించారు.

అనంతరం కవి సమ్మేళనం నిర్వహించబడింది. జిల్లాయేతర కవులు పలువురు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రౌతు రవి రచించిన 'వేకువ పిట్టలు" అనే హైకూ సంకలనాన్ని భద్రాచలం డివిజన్ సాహితీ స్రవంతి అధ్యక్షులు మాల్యశ్రీ ఆవిష్కరించగా సాధనాల వెంకటస్వామి నాయుడు గ్రంథ సమీక్ష చేశారు.

ఆఖరుగా "వచన కవితా ధారణ" కార్యక్రమం పాండిచ్చేరీ రాష్ట్రం యానాంకు చెందిన పి.ఆర్.ఎల్. స్వామిచే ఆహ్లాదకరంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఎస్. ధనంజయుడు (భద్రాద్రి బ్యాంక్ మేనేజర్), ఎస్. బ్రహ్మారెడ్డి (ప్రగతి విద్యా సంస్థల అధినేత) విచ్చేశారు. జె. శేషగిరిరావు (చీఫ్ మేనేజర్ ఐ.టి.సి. బిపిఎల్) అధ్యక్షత వహించారు. ఈ సభకు విచ్చేసిన ప్రతినిధులకు, కవులకు, రచయితలకు, ప్రేక్షక శ్రోతలకు భద్రాద్రి గ్యాస్ కంపెనీ అధినేత డి. అప్పారావు, రుచికరమైన విందు సౌకర్యం సమకూర్చారు, టి. దుర్గాచారి, నంబూరి జీవరత్నం, వి. రాంబాబు, వి. నాగేశ్వరరావు, సీరాల అప్పారావు, బి. భానుచంద్ర, చింతూరి గాంధి, అమ్మిన అమ్మిరాజు, జి. తులసీదాస్, జి. అశోక్, జి. వేణు, సి. శరత్‌బాబు మొదలైన సాహితీ స్రవంతి బాధ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇంకా జాతశ్రీ, డా. రూత్‌మేరీ, డా. రాజ్యలక్ష్మి, డా. చింతలపూడి వెంకటేశ్వర్లు, డా. సి.హెచ్.ఎల్. నరసింహారావు, ఈగ హనుమాన్, తెన్నేటి లక్ష్మీనరసింహమూర్తి, డా. కాసర్లరంగారావు, ఎస్. కాంతారావు, శ్రీమతి జాస్తి రమాదేవి, బొల్లి ముంత వెంకట రమణారావు, బి.ఎస్.ఆర్. శాస్త్రి, ఎం.డి. తాజుద్దీన్, బి. నాగేశ్వరసింగ్, పి.వి.ఎస్. మల్లేశ్వరరావు, పెండ్యాల కామేశ్వరరావు మొదలైన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డివిజన్ సాహితీ స్రవంతి సహాయ కార్యదర్శి పైడిపల్లి చైతన్య మొదట స్వాగతం పలుకగా ప్రధాన కార్యదర్శి అమ్మిన శ్రీనివాసరాజు వందన సమర్పణతో ఈ సభా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

**-మాల్య శ్రీ**

## విషధారలు

**డా॥ ఎన్. గోపి**

ఈ పల్లెల్లో
బడిపిల్లలు
బోరుకొట్టంగానే
మొదటిసారి వచ్చేవి విషం నురగలే
ప్రభుత్వాల దయవల్ల
పిల్లలకు చైతన్యం పెరిగినట్టుంది
అంగీలను, లంగాలను
వడబోత గుడ్డలుగా మార్చుకొని
నీళ్లు తాగుతున్నారు

ఫ్లోరిన్
ఇంకా వీళ్ల పాఠ్యపుస్తకాల్లోకి ఎక్కలేదు
వారి బట్టలపై నల్లటి మచ్చలు
రేపటి అవిటితనానికి సూచికలు
వీరి వంకర కాళ్ళను
శకుని పాచికలుగా ఆడుతారుగాని

ఒరే నాయనా!
రాజకీయాల నోళ్ళతో కాదు
నీళ్ళలా మాట్లాడండి
నీళ్లలా స్వచ్ఛంగా ఆలోచించండి
వైరుధ్యాలు లేని సామూహిక బాష్పాలే
ఈ విషాన్ని తప్పిస్తాయి
మీకేమిటి!
అవిటి చేతులు వేసినా
లెక్కకొచ్చే ఓట్లేకదా!

కథ

గోపరాజు నాగేశ్వరరావు



# నాలుగో సింహం

*నిష్కారణంగా వాళ్ళ నెవర్నో కాల్చి చంపి టూ టౌన్ ఎస్సై అప్పనంగా అవార్డులూ, రివార్డులూ అందుకుంటే వన్ టౌన్ ఎస్సైకి ఒళ్ళు మండదూ...! మండింది. మండటం కూడా వరల్డ్ ట్రేడ్ సెంటర్ని వల్లకాడు చేసిన లాడెన్ మీద బుష్‌కు మండినంతగా మండింది. అందుకే నానా యాగీ చేస్తున్నాడు. ఫైళ్ళు దూరంగా విసిరేస్తున్నాడు. అందర్నీ బండ బూతులు తిడుతున్నాడు. లేడీ కానిస్టేబుళ్ళను కూడా లేకిమాట లంటున్నాడు. గంట నుంచి ఒకటే గందరగోళం చేస్తున్నాడు.*

మాదకద్రవ్యాల వినియోగాన్ని నిరోధించే మహత్తర కార్యక్రమంలో భాగంగా రైల్వే స్టేషన్ దగ్గరికి వెళ్ళి గంజాయిపట్లు పడుతూ చింత చెట్టు కింద చిద్విలాసంగా కూర్చున్న సాధువులను చావబాది అప్పుడే స్టేషన్‌కు తిరిగొచ్చాడు హెడ్డు ఏసురత్నం.

అసలుకే రోజులు బాగాలేవు. దొంగచచ్చినోళ్ళు తెలివిమీరారు. వాళ్ళకు పోలీసులన్నా మూడు సింహాల బిళ్ళనూ కాజెయ్యగలవాళ్ళు. కాని కాలంలో కానిస్టేబుల్నని కాలరెగరెయ్యకుండా కాస్తంతా మెలకువగా ఉండటమే మంచిదని భావించాడు. తానెక్కొచ్చిన మోపెడ్‌ను ఎందుకైనా మంచిదని సెంట్రీ పక్కనే పార్కు చేసి "మోపెడ్ జాగ్రత్త. పోతే మళ్ళీ కొనాలంటే తడిసి మోపెడవుతుంది" అని సెంట్రీని హెచ్చరించి స్టేషన్ లోపలికి దారి తీశాడు. హెడ్డు ఏసురత్నం. 'లాకప్ రూం' అనబడే చిత్రహింసల గదిదాటి దూరంగా వున్న సిబ్బంది విశ్రాంతి గదిలోకి వెళ్ళాడు... ఆశ్చర్యపోయాడు!

కొండల మీద అమెరికా వాడు బాంబు లేస్తుంటే గుహల్లో గువ్వల్లా కూర్చున్న తాలిబాన్లలా బిక్కుబిక్కుమంటూ కనిపించారు కానిస్టేబుళ్ళు. వాళ్ళలా ఎందుకున్నారో హెడ్డుకు అర్థం కాలేదు. తలెత్తి ఇంకొంచెం దూరంగా చూస్తే కిటికీ దగ్గర నిలబడి వుంది లేడీ కానిస్టేబులు రత్తమ్మ.

హెడ్డు హెడ్డు పెట్టి ఆలోచించాడు! డిపార్టుమెంటల్ సీక్రెసీ అని అన్ని విషయాలు అందరూ చెప్పరుగానీ రత్తమ్మ మాత్రం అలా కాదు. ఒకటి అడిగితే వంద చెబుతుంది.

ఇక ఆలస్యం చెయ్యలేదు హెడ్డు. గబగబా నడుస్తూ రత్తమ్మ దగ్గరికి వెళ్ళి పొడిదగ్గు దగ్గాడు.

తలెత్తి హెడ్డును చూసింది రత్తమ్మ. "నమస్తేసారూ...!" అంది అమితమైన వినయంతో.

"నమస్తేలేగానీ అందరూ అలా వున్నారేం?" అని మరో అడుగు ముందుకు వేసి "ఏం జరిగింది?" అడిగాడు హెడ్డు రహస్యంగా.

"ఏం జరిగిందా! ఎస్సైసారుకు గత్తరొచ్చింది" అని వెటికెలు విరవబోయిందల్లా తమాయించుకొని భయంభయంగా హెడ్డు వైపుచూసింది రత్తమ్మ.

హెడ్డు కోపగించుకోలేదు. తేలిగ్గా నవ్వుతూ మెచ్చుకోలుగా చూసి "తుత్తర మాట లొద్దులేగానీ అసలేం జరిగిందో చెప్పు" అన్నాడు శాంతంగానే.

అప్పుడు అంతా పూసగుచ్చినట్టే విడమరిచి చెప్పిందామె.

హెడ్డు అంతా జాగ్రత్తగా విన్నాడు "ఓసోస్... ఇంతేనా! ఈపాటి భాగ్యానికి ఇంతమంది భయపడితే ఎలా? ఎస్సై సార్నెలా కూల్ చేయాలో ఆ కిటుకు నాకు బాగా తెలుసు. ఇక ఆ విషయం నాకొదిలెయ్యండి" అని గంభీరంగా అడుగులు వేస్తూ ఎస్సైగారి చెక్కల గదిలోకి వెళ్ళాడు. స్టిఫ్‌గా సెల్యూట్ చేశాడు.

"ఇప్పటి దాకా ఎక్కడ చచ్చావ్?" కొరకొరా చూశాడు ఎస్సై.

"అక్కడికే వొస్తున్నాను సారూ.... వొస్తున్నాను! మాదకద్రవ్యాల కూపీలాగి మీకూ, మన స్టేషన్‌కూ పేరు తెద్దామని పెందలాడే రైల్వేస్టేషన్‌కు వెళ్ళాను. ఫోర్టువంటీ పాసింజర్లో వస్తాడనుకున్న పెద్ద సాధువు రాయలసీమ నుంచి రానేలేదు. వాడొస్తే పెద్ద సంఖ్యలో గంజాయి పొట్లాలూ, చిలుములూ దొరికేవి. సీజ్ చేసి చితకబాదేవాణ్ని. చిత్రంగా వాదు తప్పించుకున్నాడు. దాంతో చిర్రెత్తుకొచ్చి చిల్లరమల్లర సాధువుల్ని చితక్కొట్టి తీరా బయల్దేరబోతే మీ విషయం తెలిసింది..."

"ఏ విషయం?" ఎస్సై ప్రశ్నార్థకంగా చూశాడు.

"టూ టౌన్ ఎస్సైకి ఎన్ని అవార్డులు, రివార్డులూ వచ్చినా అతగాడు మీ ముందు బలాదూరే అన్న విషయం డిపార్టుమెంట్లో తెలుసందరికీ. అయ్యా! ఒక్క సత్యం చెప్పమంటారా?"

"ఏమిటది?" ఆసక్తిగా అడిగాడు ఎస్సై.

"మన డిపార్టుమెంటు తీరే వేరు. పని చెయ్యకపోయినా పై అధికారుల ప్రాపకం వుంటే ప్రమోషన్లు కూడా ప్రవాహంలా వస్తాయి. అదే లేకపోతే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుంటుంది బతుకు. మంచికి పోవద్దని మాదు బాదుకొని చెప్పినా మీరేమో మాట వినరాయె. అతి మంచితనం మాటపట్టింపులతో వొరిగిందేముంది మీకు? సర్వీసులో చేరి దశాబ్దం దాటినా మీ ఇంట్లో పట్టుమని పదికిలోల బంగారం లేదు. బాపట్ల దగ్గర పదెకరాల తమలపాకుతోట, అనకాపల్లి దగ్గర జీడిమామిడి తోటా, గుంటూర్లో మేడ, సొంత ఊళ్ళో మిద్దె తప్ప హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లో జాగా అయినా లేదు.



అయ్యా! తమరేమో అలా వుంటే పోనీ, అమ్మగారైనా అదను చూసి ఆలోచన చెప్పరు మీకు. ఏదో పాపం ఆ స్టువర్టుపురం దొంగల దయవల్ల రెండు రవ్వల హారాలూ, నడుముకు నప్పిన వడ్డాణం, డజను బంగారపు గాజులూ సమకూరాయిగానీ మీరు సంపాదించి ఇచ్చిందేమిటి?

క్రింది ఉద్యోగి హెడ్డు ఏమిటా ఇలా స్వతంత్రించి అనటం అని ఆగ్రహించకండి. అయ్యా! ఇకనైనా గ్రహించండి. మంచితనం మనకు పనికిరాదు. మనం పోలీసులమేగానీ పాపులను రక్షించే భగవంతుడిమి కాము. నిజంగా తమరు కళ్ళు తెరిస్తే అవార్డులూ, రివార్డులూ ఏం కర్మ ఏకంగా ఏలిన వారి సరసనే కూర్చుండే స్థాయికి ఎదగొచ్చు... మీ సత్తా ఏమిటో ఇంకా మీకు తెలియదుగానీ సారూ! కంటికి కనిపించేవి మూడు సింహాలేగానీ కనిపించని ఆ నాలుగో సింహం మీరు" అని తన సుదీర్ఘ ఉపన్యాసం ముగించి ఆనందంగా నవ్వాడు హెడ్డు ఏసురత్నం.

హెడ్డు మాటలు ఎస్సైమీద బాగా ప్రభావం చూపించాయి. కార్బన్ డయాక్సైడ్‌కు మంటలు చల్లారినట్టే చప్పున చల్లారిపోయాడు. అభిమానంగా హెడ్డువైపు చూస్తూ ఏదో అనబోయిన వాడల్లా ఉలిక్కిపడి కుర్చీలోంచి లేచాడు.

బైట్నించి అరుపులూ ఆర్తనాదాలూ వినిపిస్తున్నాయి. ఫెళఫెళా రావాలూ ఇళ్ళు కూలిపోతున్న శబ్దాలూ వినిపిస్తున్నాయి. పోలీసుస్టేషన్లో బల్లలూ కుర్చీలూ తిరగబడుతున్నాయి.

భూమి కదిలిపోతున్నది.

"భూకంపం! భూకంపం!!" అరుస్తున్నారెవరో... జనం ఇళ్ళలోంచి వీధుల్లోకి పరుగులు తీస్తున్నారు. ఎస్సైతో సహా యావన్మంది పోలీసు సిబ్బంది కూడా స్టేషన్లోంచి బైటికురికారు. అంతా గందరగోళంగా వుంది. భూకంపం క్షణంలో చెయ్యాల్సిన విధ్వంసం అంతా చేసి ఆ వెంటనే శాంతించింది.

D D D

"ఈ లేని వాళ్ళందరూ కలిమిగలిగిన వాళ్ళను చూస్తేనే కళ్ళలో నిప్పులు పోసుకుంటారుగానీ నిజానికి నిర్భయంగా బతుకుతున్నది లేనివాళ్ళే! భయాలూ, బాధలూ తప్ప మనలాంటి వాళ్ళకు మిగిలిందేంటో నువ్వే చెప్పు. పేరుకూ, హోదాకూ మాత్రం జైలర్ని. ఇంట్లో ఈగల మోత బైట పల్లకీ మోత అన్న చందంగా వుంది నా వ్యవహారం. చిన్నమ్మాయికి పెళ్ళి కుదిరిందిగానీ చేతిలో చిల్లిగవ్వలేదు..." అన్నాడు జైలరు జగన్నాథం, ఎదురుగా కూర్చున్న వన్‌టౌన్ ఎస్సై ఏడుకొండలుతో.

వాళ్ళ వయస్సు మధ్య వ్యత్యాసం, హోదాల్లో అంతరం వున్నా ఇద్దరూ ప్రాణమిత్రులు. రోజూ ఏదో ఒక సమయంలో కలుస్తుంటారు. కష్టసుఖాలు చెప్పుకుంటారు. సలహాలు ఇచ్చుకుంటుంటారు.

భూకంపం సద్దుమణిగింతర్వాత రెస్క్యూ ఆపరేషన్స్ మొదలై ఊరంతా ఓ రౌండుకొట్టి పనిలో పనిగా జైలు కార్యాలయానికి చేరుకున్నాడు ఏడుకొండలు. జైలంతా హడావుడిగా వుంది. రెండు బేరమ్స్ భూకంపంలో కూలిపోయాయి. జైలు గోడలు బీటలు వారాయి.

కూలిపోయిన బేరమ్స్‌లోని ఖైదీలను వేరే గదుల్లోకి మార్పించాడు జైలర్ జగన్నాథం. ఖైదీలు పారిపోకుండా కట్టుదిట్టం చేసి కాస్తింత విశ్రాంతిగా కూర్చోగానే మిత్రుడు ఏడుకొండలు ఊడిపడ్డాడు.

"చేతిలో చిల్లిగవ్వయినా లేదా?" జగన్నాథం వైపు ఆశ్చర్యంగా చూశాడు ఏడుకొండలు.

"ఒట్టు! చిల్లిగవ్వలేదు. ఇన్‌కంటాక్స్ వాళ్ళకూ, యాంటీ కరప్షన్ యమభటులకూ భయపడి ఐశ్వర్యం అంతా ఎక్కడెక్కడో దాస్తే అవసరానికి చేతికి అందవుకదా! అందుకే అన్నాను మనకన్నా లేనివాళ్ళే ఎంతో నయం అని. నాకు వుండి కూడా ఏం ప్రయోజనం? ముహూర్తమా దగ్గరపడుతున్నది. కట్నం యాభై లక్షలు. అడ్వాన్సు పాతిక లక్షలు పంపించమని మగపెళ్ళివాళ్ళు కబురు మీద కబురు పంపిస్తున్నారు. కట్నం కాక బట్టలనీ బంగారమనీ మరో పాతిక లక్షలైనా కావాలి" అని దీర్ఘంగా నిట్టూర్చాడు జగన్నాథం.

ఏడుకొండలు ఆలోచనలో పడ్డాడు. కొంచెంసేపటికి ఆలోచనల నుంచి తేరుకుని "సొంత డబ్బు ఖర్చుకాకుండా మీ అమ్మాయి పెళ్ళి జరిగేందుకో మార్గం చెప్పనా?" అడిగాడు.

జగన్నాథం కళ్ళు మెరిశాయి. "ఏమిటి?" అంటూ ఆసక్తిగా చూశాడు.

"మూడు రాష్ట్రాలను గజగజలాడించిన నలుగురు బందిపోట్లు ఈ మధ్యనే అరెస్టయి మీ జైలుకు వచ్చారుకదూ?"

"అవును"

"వాళ్ళతో మనమొక ఒప్పందానికి రావాలి. అప్పుడే మీ ఆర్థిక సమస్య పరిష్కారమవుతఉంది"

జైలర్ జగన్నాథం శరీరం మీది రోమాలు నిక్కపొడుచుకున్నాయి. "వాళ్ళతో ఒప్పందమా? ఏమిటది?" అడిగాడు.

"అది చాలా రహస్యంగా వుండాలి. ఎవరికి తెలిసినా ప్రమాదం. మెయ్యబోయి మెడకు వేసుకున్నట్లవుతుంది మన పని..."

"ఇంతకూ విషయం ఏమిటి?" కొంచెం అసహనంగానే

అడిగాడు జగన్నాధం.

ఎస్సై ఏడుకొండలు కుర్చీలోంచి లేచి జగన్నాధం దగ్గరికి వెళ్ళాడు. అతని చెవిలో రహస్యంగా ఏదో చెప్పాడు.

జగన్నాధం అంతా విని భయంతో స్వల్పంగా కంపించిపోయాడు. "కథ అడ్డం తిరిగితే ప్రమాదం కదా?" అన్నాడు వొణికే గొంతుతో.

"రిస్క్ తీసుకోకుండా జీవితాలు అద్భుతంగా మారవు. పైగా మీ అమ్మాయి పెళ్ళి. ఆ మాత్రం సాహసం చెయ్యకపోతే ఎలా?"

"నాకు భయంగా వుంది"

"భయపడితే భాగ్యం చేతికి అందదు. నేను జైలు బయటే నా సిబ్బందితో సిద్ధంగా వుంటాను. గజదొంగలు పారిపోకుండా చూసే బాధ్యత నాది. అదీకాకుండా అలాంటి దొంగలు మనలాంటి పెద్ద మనుషులతో కుదుర్చుకున్న ఒప్పందాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించరు..."

"తప్పదంటావా?" బేలగా అడిగాడు జగన్నాధం.

"తప్పదు! ఇలాంటి అవకాశం ఒకసారి చెయ్యిజారిందంటే తిరిగిరాదు"

"అ...లా...గే..." అని తలూపాడు జగన్నాధం.

"ఈ రాత్రికే అన్నీ జరిగిపోవాలి... బీకేర్‌ఫుల్" అని జగన్నాధాన్ని హెచ్చరించి ఆనందంగా నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు ఎస్సై ఏడుకొండలు.

×××

రాత్రి బాగా పొద్దుపోయింది. ఊరు సద్దుమణిగింది. అప్పుడప్పుడూ రెస్క్యూ ఆపరేషన్స్ వీధుల్లో తిరుగుతున్న ప్రభుత్వ వాహనాల శబ్దం తప్ప అంతా నిశ్శబ్దంగా వుంది.

నమ్మకస్తులైన వార్డర్లకు 'పని' పురమాయించి జైలు కార్యాలయంలో కంగాళీగా పచార్లు కొడుతున్నాడు జగన్నాధం.

గంట సమయం గడిచింది... వార్డరొకడు వచ్చాడు.

"పనైందా?" వార్డర్ను అడిగాడు.

"అయిందిసార్!" చెప్పాడు వార్డరు.

"ఎవ్వరికీ అనుమానం రాకుండా చేశారా?"

"చేశాం! గజదొంగల ఖైదుకొట్టు గోడ పడగొట్టాం. జైలు కాంపౌండు వాల్‌కూ కన్నం వేశాం. భూకంపంలో గోడలు పడినట్టే వున్నాయిగానీ కావాలని కన్నం వేసినట్టు లేనేలేదు"

"వెరీగుడ్" వార్డర్ను అభినందించాడు. జగన్నాధం. సరిగ్గా అప్పుడే మరో వార్డరు నలుగురు గజదొంగలను వెంటపెట్టుకొని జగన్నాధం దగ్గరికి వచ్చాడు.

"పది నిమిషాలు మీరు బైటికి వెళ్ళండి" వార్డర్లను ఆదేశించి వాళ్ళు బైటికి వెళ్ళగానే దొంగల వైపుకు తిరిగి "చెప్పిందంతా గుర్తుంది కదా?" అని అడిగాడు జగన్నాథం.

"ఉంది"

"జాగ్రత్త! చిన్నపొరపాటు కూడా జరక్కూడదు"

"జరగదుగానీ నాదో సందేహం"

"ఏమిటి?" దొంగ వైపు చూశాడు జగన్నాధం.

"భూకంపంలో జైలు గోడలు పడిపోవటం... మేము అవకాశం చూసుకొని పారిపోవటం. పోతూ పోతూ దారిలో వున్న బ్యాంకును దోపిడి చెయ్యటం... ఆ డబ్బును మీకు అప్పగించటం... అంతా బాగానే వుంది కానీ మేం పారిపోయినందుకు మీ ఉద్యోగం ఊడిపోదూ?"

జగన్నాధం కిసుక్కున నవ్వాడు. "భూకంపం అంటే ప్రకృతి వైపరీత్యం. అలాంటిది సంభవించి జైలు గోడలు కూలిపోయి గజదొంగలు పరారైతే జైలర్ది తప్పెలా అవుతుంది? అందుచేత నా ఉద్యోగానికేమీ ప్రమాదం వుండదు" చెప్పాడు జగన్నాధం.

"దోపిడి చేసిన సొత్తు మీకు ఇవ్వకుండా మేమందరం పారిపోతే ఏం చెయ్యగలరు?"

"మీకా అవకాశం వుండదు"

"ఎందుకని?"

"ఇదంతా నేనూ, ఎస్సై ఏడుకొండలూ కలిసి వేసిన ప్లాను. మీరు జైలు బైటికి వెళ్ళిన క్షణం నుంచే అతను తన సిబ్బందితో నీడలా మిమ్మల్ని వెంటాడుతూనే వుంటాడు. మీరు బ్యాంకు దోపిడి చెయ్యాలి. దోపిడి సొత్తు మాకు అప్పగించాలి.... అదీ మన ఒప్పందం"

"ఒప్పందాన్ని మన్నిస్తే మాకేమిటి ప్రయోజనం?" అడిగారు వాళ్ళు.

"నిక్షేపంగా జైల్నుంచి పారిపోవచ్చు. పోతూపోతూ దోపిడి సొత్తులో కొంత వాటా కూడా తీసుకొని వెళ్ళొచ్చు"

"ఎస్సై మాకు సహకరిస్తాడా? ఏరు దాటి తెప్ప తగలెయ్యడుకదా?"



" అలా జరగదు... బాధ్యత నాది. ఇక ఎలాంటి ఆలోచనలూ పెట్టుకోకుండా మీరు క్షేమంగా వెళ్లిరాండి" చెప్పాడు జగన్నాధం.

జైలరు వద్ద సెలవు తీసుకొని దొంగలు వెళ్ళిపోయారు.

జగన్నాధం తనలో తనే గుంభనంగా నవ్వుకున్నాడు! అందుకు కారణం లేకపోలేదు.... అంతటి పేరు మోసిన గజదొంగలనే బురిడీ కొట్టించబోతున్నాడు తను!

గజదొంగలు అవలీలగా బ్యాంకు లాకర్లు తెరుస్తారు. ట్రెజర్ చెస్ట్ బద్దలు చేస్తారు. దోపిడి సొత్తుతో తిరిగి వస్తారు. డబ్బు తనకందించి వాళ్ళవాటా వాళ్ళు తీసుకొని వెళ్దామంటారు. తను వాళ్ళకు వాటా ఇవ్వడు. వాటా అడిగితే మళ్ళీ జైల్లో వేస్తానని బెదిరిస్తాడు. జైల్లో మళ్ళీ వేసినా వెయ్యచ్చుగానీ, వేస్తే దోపిడి సొత్తు గుట్టు రట్టవుతుంది. అందుకే వాళ్ళను పారిపోనివ్వాలి. సొత్తుతో సహా పారిపోయారని ప్రభుత్వం అనుకోవాలి...

D D D

గజదొంగలు జైలు కాంపౌండు వాల్ కంతగుండా దూరి వీధిలోకి రాగానే ఎస్సై ఏడుకొండలు హఠాత్తుగా పూడిపడి "జైలరు జగన్నాధం పంపించిన దొంగలు మీరేకదూ?" అని అడిగాడు.

"అవున్సార్...!" అన్నారు వాళ్ళు.

"ఇప్పుడు మీ కార్యక్రమం?"

"బ్యాంకును దోచుకోవాలి"

"పదండి మరి" అన్నాడు ఏడుకొండలు. అందరూ కలిసి బ్యాంకు దగ్గరికి వెళ్ళారు.

ఎస్సై తన సిబ్బందితో దూరంగా నిలబడి వుంటే దొంగలు బ్యాంకు గేటును సమీపించారు. ముందుగా సెక్యూరిటీ గార్డును బంధించి తాళ్ళతో కట్టేశారు. అరవకుండా నోటికి ప్లాస్టరు అంటించారు. ఆ తర్వాత గోడ దూకి లోపలికి వెళ్ళారు. మెయిన్ గేటు తాళాలు బద్దలు కొట్టారు.

"ఫైర్...." అన్న ఏడుకొండలు అరుపు వినిపించింది.

పోలీసులు తుపాకులూ, ఎస్సై ఏడుకొండలు సర్వీసు రివాల్వరూ

అదే పనిగా గర్జించాయి.... గజదొంగలు నలుగురూ తూటాలు శరీరాల్లోంచి దూసుకొని వెళ్ళి నెత్తుటి ముద్దల్లా క్రింద రాలిపోయారు.

D D D

పత్రికల్లో తాటికాయంత అక్షరాల్లో సెన్సేషనల్ వార్త!

'అర్ధరాత్రివేళ జైలు వీధిలో అనుమానాస్పదంగా కనిపించిన నలుగురు వ్యక్తుల్ని నీడలా వెంటాడాడు ఎస్సై ఏడుకొండలు. వాళ్ళు నలుగురూ బ్యాంకును దోపిడి చెయ్యబోగా సకాలంలో దాడి జరిపి నివారించాడు. సెక్యూరిటీ గార్డు ప్రాణాలను రక్షించటమే కాకుండా దోపిడి దొంగలు మారణాయుధాలతో ఎదురు దాడికి దిగినా ప్రాణాలకు తెగించి కాల్పులు జరిపాడు.

పోలీసు కాల్పుల్లో మృతి చెందిన ఆ నలుగురు వ్యక్తులూ ఆరితేరిన గజదొంగలనీ, జైల్నించి తప్పించుకొని పారిపోతూ దోపిడికి ప్రయత్నించారనీ పోలీసు వర్గాల భోగట్టా. అలాంటి గజదొంగలను మట్టుపెట్టినందుకూ, సకాలంలో సాహసం ప్రదర్శించి బ్యాంకు దోపిడిని నివారించినందుకూ హోంశాఖా మంత్రి డిజిపి, ఇతర అధికారులూ ఎస్సై ఏడుకొండల్ని అభినందించారు. వచ్చే ఆగస్టు 15 వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా ఏడుకొండలుకు అవార్డు ప్రదానం చేస్తారని ముఖ్యమంత్రి కార్యాలయం వారు ప్రకటించారు...

అదీ వార్తల సారాంశం

పత్రిక చదివి ఆనందంతో పూగిపోతూ "నేను చెప్పలేదా సారూ! మీరు కనిపించని నాలుగో సింహం" అని ఎస్సైని అభినందించాడు హెడ్డు.

వన్ టౌన్ పోలీసుస్టేషన్లో అలా ఆనందం పరచుకుంటే జైలు కార్యాలయంలోనూ, జైలరు జగన్నాథం ఇంట్లోనూ అంతులేని విషాదం పరచుకున్నది! భూకంపం వచ్చి జైలు గోడలు పడిపోయినా అజాగ్రత్తగా వుండి నలుగురు నటోరియస్ క్రిమినల్స్ పారిపోవటానికి కారణమైన జైలర్ జగన్నాథాన్ని ప్రభుత్వం సస్పెండు చేసింది.

చిన్నమ్మాయి పెళ్ళి చేరువలోకి వస్తుంటే ఇలాంటి సమయంలో సస్పెండు కావటం బాధకదూ మరి!

V

# వసం(తాం)తం

## డా॥ బులుసు గోపాలకృష్ణనన్

మావి పూసిందంటాలా
కూసింది కోయిల
వసంతం వచ్చిందనుకొని...
వచ్చిందేమొ వేసవి
వసంతాన్ని ఎగదన్నేసి!
కవి ముదిరిందాన్నాది
మా అమ్మమ్మ
కాదని వాదిస్తుంది మా చిన్నారి
ఔనన్నా కాదన్నా
తప్పనిది కరువు
మా వీధిలోని కుర్రాళ్ళకు
చెరువు మధ్యన క్రికెట్ మేచ్
కారు మబ్బుల్లో వెలుగు రేఖ!

# కవిత

# అక్షరమా-క్షమించు

## డా॥ మానేపల్లి

అక్షరమా-క్షమించు
నాకు రుచి తెలియడం మానేసింది

ఊహ తెలిసినప్పటి నుంచీ కళ్లూ వేళ్లూ కాళ్లూ
అక్షరాల వెంట పరుగుతియ్యడానికి అలవాటు పడిపోయాయి
పుస్తకాలు చదివీ చదివీ
పరీక్షలు రాసీ రాసీ – నోరూ, కళ్లూ చెడిపోయాయి
నాకు అక్షరాల పోలిక దొరకడం లేదు
'కంప్యూటర్' సహాయం లేనిదే, ఐటీ ఆసరా లేనిదే
నోరు మెదపడం కూడా రావడం లేదు



అక్షరమా-క్షమించు, చదవడం రావడం లేదు

పరీక్ష పుస్తకాల దొంతర్లలో
నా శరీరం అస్థిపంజరమైపోయింది
ఈ మధ్య మరీను
ఉద్యోగ
విద్యా
సోపానాల్లో ప్రజలంతా పక్కదారి పట్టిపోతున్నారు

పరీక్షలంటే ఏబీసీడీలు నల్లగా దిద్దడమో
రైటో, రాంగో రాయడం తప్ప మరేంకాదు గనుక
అక్షరాలతో అట్టే పని కూడా పడటం లేదు.
వంటికి జబ్బు చేసే ఒక డాక్టరు నయం చెయ్యలేడట!
పన్నొక డాక్టరూ, కన్నొక డాక్టరూ
ఊపిరి తిత్తులొకరూ, గుండెలొకరూ చూసి
సూపర్ స్పెషల్ వైద్యం చేసినట్టు

కార్పొరేట్ కాలేజీలు కత్తులు నూరుతున్నాయి
చదువు ముక్కలు ముక్కలై ప్రయివేటీకరణ తినేసింది
చదువంటే అక్షరాలు కాదు, జీవిత సారం కదూ
జీవితసారం అంతా కీల్లోనూ, క్విజ్లోనూ, ఇంటర్వ్యూల్లోనూ ఇంకి పోయింది
అక్షరకల్లోలం పద్మవ్యూహం స్థాయికి అభివృద్ధి చెందిపోయింది

అక్షరమా-క్షమించు
నీ మీద ప్రేమ వేదనుకోవద్దు
మంచి పుస్తకం నీడన మనసెంతో చల్లన
గొప్ప పుస్తకం మధ్యన గుండెంతో ఎత్తున
నిజమే నిజమే – కాని
సంస్కృతం, ఇంగ్లీషు, హిందీల సంకటంలోంచి
పరీక్షల పుట్టల్లోంచి
ప్రయివేటీకరణ పన్నగాల పన్నాగాల్నించి
నన్ను నేను రక్షించుకోనీ
ఇది జీవిత సర్వస్వం కోసం పోరాటం
సమాజ రుగ్మతలు తీరనిదే చదువెలా సాధ్యం?
అందాకా అమ్మలాంటి ఓనా అక్షరమా
దయచేసి నన్ను క్షమించు

V



కె. రామచంద్రమూర్తి, సదాశివ, చందా లింగయ్య, తమ్మినేని వీరభద్రం, చేరా, ఓల్గా

# సాహిత్యమేళగా చేరా అభినందన

'కవితా హృదయాలకు గుమ్మం, నిరంతర చైతన్యానికి గమ్యం' అని వర్ణించబడే ఖమ్మంలో మార్చి 30న సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో మన చేరా అభినందన సభ ఒక సాహిత్య మేళగా జరిగింది.

ఖమ్మం జిల్లాలో పుట్టి భాషా శాస్త్ర పరిశోధనలో ఎనలేని ఖ్యాతి నార్జించిన సాహితీ విమర్శకుడూ అయిన చేకూరు రామారావుగారికి ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. దీనిని పురస్కరించుకొని కేవలం అభినందన సభే కాక రోజంతా సాహిత్య చర్చలు, సాహిత్య గోష్టి ఏర్పాటు చేసింది. ఇదే సందర్భంలో జిల్లాలో సాహిత్యరంగంలో కృషి చేసిన పాతిక మంది కవులను రచయితలను సత్కరించింది. జిల్లా నలుమూలల నుండే కాక రాష్ట్రంలోని ఇతర చోట్ల నుండి కూడా అనేక మంది కవులు, రచయితలు వందల సంఖ్యలో పాల్గొని అభినందన సభను ఒక సాహిత్య సమ్మేళనంగా మార్చారు. గత ముప్పయి యేండ్లలో ఇంత పెద్ద సాహిత్య సభ ఖమ్మంలో జరగడం ఇదేనని అందరూ అభినందించారు.

ఉదయం పదకొండు గంటల నుండి రాత్రి పది గంటల వరకు ఈ సాహితీ సమ్మేళనమ్ నాలుగు భాగాలుగా జరిగింది.

సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు డా॥ హరీష్ అధ్యక్షత వహించిన ప్రారంభసభలో మాజీ పార్లమెంటు సభ్యులు తమ్మినేని వీరభద్రం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమాజం సాహిత్యం రెండూ విడదీయలేనివని, సామాజిక అభివృద్ధికి పాటుపడటమే అసలైన రాజకీయాల ఉద్దేశ్యమని, సాహిత్య ఆశయం కూడా సామాజిక చైతన్యం, అభివృద్ధేనని, అందుకనే సమాజంలో ఏ సంఘటన జరిగినా ముందుగా స్పందించేది రాజకీయ వాదులు, కవులు రచయితలేనని, నిర్బంధాలకు గురయ్యేది కూడా వీరేనని పేర్కొన్నారు.

గత నాలుగు సంవత్సరాలుగా సాహితీ స్రవంతి ఖమ్మం జిల్లాలో చేస్తున్న కార్యక్రమాలలో భాగంగా ఇంకొంత కొత్త ఉత్సాహాన్ని పెంచుకునేందుకు చేరా సభను పెద్దగా చేయతలపెట్టామని, సాహిత్య విమర్శలో తనకంటూ ప్రత్యేక ముద్రను వేసుకున్న 'చేరా'ను అభినందించడం గర్వకారణమని డా॥ హరీష్ అధ్యక్షోపన్యాసం చేస్తూ వివరించారు. ఇంకా ఈ సభలో అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ నాగమల్లిక, సాహితీవేత్త, ఎస్.వి. నారాయణ రవిమారుత్, క్రాంతి శ్రీనివాసరావు, రచయిత్రి రావులపల్లి సునీత, మెంతుల శ్రీశైలం పాల్గొని ప్రసంగించారు. సాహితీస్రవంతి కార్యదర్శి కె. ఆనందాచారి స్వాగతం పలుకగా, కపిల రాంకుమార్ వందన సమర్పణ చేశారు.

అనంతరం 'ప్రపంచీకరణ-భాషా సాహిత్య సంస్కృతులపై ప్రభావం అనే అంశంపై కథా రచయిత కేతు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ సమాచార సాంకేతిక విప్లవం, మన సాంస్కృతిక మూలాలను ధ్వంసం చేస్తోందని దీనికి తెలుగు సాహిత్యం తీవ్రంగానే స్పందించిందని వివరించారు. ప్రస్థానం ఎడిటర్ తెలకపల్లి రవి మాట్లాడుతూ ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్, ఎంటర్‌టైన్‌మెంట్ అనే "ఐఇ"ను మృత్యుశీతల స్పర్శగా అభివర్ణించారు. సామాజికరంగంలో కమాడీకరణ, రాజకీయంలో మోడీకరణ, అంతర్జాతీయంగా డాలరీకరణ వీటి క్రోడీకరణే ప్రపంచీకరణ అని ఇది భాషా సాహిత్యాలపై చూపుతున్న ప్రభావాల్ని సోదాహరణంగా వివరించారు. మాజీ రాజ్యసభ సభ్యులు డా॥ వై. రాధాకృష్ణమూర్తిగారి అధ్యక్షతన జరిగిన ఈ గోష్ఠి సభికులను ఎంతో ఆలోచింపచేసింది. ఇందులో సాహితీ స్రవంతి బాధ్యులు రౌతురవి, శేషగిరి, బేగం, టి.వి. చలం పాడిన పాటలు అందరినీ అలరించాయి.

మధ్యాహ్నం చేరా భాషా సాహిత్యాలపై తెలుగు అకాడమి అధ్యక్షురాలు డా॥ ఆవుల మంజులత అధ్యక్షతన సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌లో కోవెల సంపత్కుమారాచార్య, డా॥ అనుమాండ్ల భూమయ్య కాత్యాయని విద్మహే, డా॥సి. మృణాళిని, ఎండ్లూరి సుధాకర్, రెంటాల వెంకటేశ్వరరావు, శిఖామణి మొదలైన వారు ప్రసంగించి పత్రాలు సమర్పించారు.

సాయంత్రం స్థానిక వర్తక సంఘ భవనంలో తమ్మినేని వీరభద్రం అధ్యక్షతన మన చేరా అభినందన సభ అత్యంత ఉత్సాహంగా కిక్కిరిసిన జనంతో జరిగింది. దాదాపు వేయి మంది సాహితీ అభిమానులు పాల్గొన్నారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. రామచంద్రమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. డా॥ ఎస్. సదాశివ, జిల్లా పరిషత్ ఛైర్మన్ చందాలింగయ్య, జిల్లా ప్రముఖులు చేకూరి కాశయ్య, కె.ఎల్.నర్సింహారావు, ప్రొ.వై.వైకుంఠం, కవి కె. శివారెడ్డి, దేవిప్రియ, ఓల్గా, బేతవోలు రామబ్రహ్మం, సి. ధర్మారావులు పాల్గొని చేరాను అభినందించి ప్రసంగించారు. ఇది నా జీవితంలో మరచిపోలేని సత్కారమని చేరా చివరగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చేరా అభినందన సంచిక, ఖమ్మం జిల్లా కవుల కవితా సంకలనం, చేరా గారి పుస్తకాలు 'శతమానం' సంపత్కుమారాచారిగారి పుస్తకం ఆవిష్కరణ జరిగింది. యాకూబ్ సమన్వయకర్తగా వ్యవహరించగా జక్కంపూడి నాగేశ్వరరావు వందన సమర్పణలో సభ ముగిసింది.

ఈ సభకు నెల రోజుల ముందు సాహితీ క్విజ్‌ను జిల్లా వ్యాప్తంగా నిర్వహించి కళాశాలల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మొత్తం కార్యక్రమం విలక్షణంగా, వైవిధ్యభరితంగా జరిగింది. స్థానిక రాజకీయ ప్రముఖులు ఈ సభకు ప్రోత్సాహాన్ని, సహకారాన్ని అందించారు.

సీతారాం, వంశీకృష్ణ, అమరనాథ్ మొదలైన వారి నిర్వహణా భాగస్వామ్యంతో సాహితీ స్రవంతి విజయవంతంగా సభ నిర్వహించింది.

**-కె. ఆనందాచారి**

కథ

లెనిన్ ధనిశెట్టి



# నైట్‌మేర్

*తెల్లటి చీకటి దట్టంగా కమ్ముకొంటున్న సమయంలో నా గదిలో.... నేను నిద్రనా క్రమించుకొన్న కాస్సేపటికి.... చలికి వొణుకుతున్నట్టు ముణగ దీసుకొన్నాను... మోకాళ్ళు గుండెల్లోకి దిగబడుతూ.... తలకొద్ది కొద్దిగా గొంతులోకి ఇంకిపోతూ.... గొంతు ఛాతీలోకి కూరుకుపోతూ.... కాస్త... కాస్త చేతులు భుజాల్లోకీ, కాళ్ళు కడుపులోకీ కుంచించుకుపోతూ.... క్రమక్రమంగా... నాలోకి నేనే ముడుచుకుపోతూ.... వొక గుండ్రంగా.... గోళంలా.... బంతిలా మారాను...*

$97^{0}.4^{0}$ (ఫారెన్‌హీట్) $\rightarrow 77^{0} \rightarrow 67^{0} \rightarrow 27^{0} \rightarrow 10^{0} \rightarrow 0^{0} \rightarrow -10^{0} \rightarrow -20^{0} \rightarrow -40^{0}$

అటూ ఇటూ దొల్లేను.... ఇష్టం వచ్చినట్టుగా... స్వేచ్ఛగా

వోహ్... వింత.... బంతి అనుభూతి....

.... మంచు బంతిలా మారేను... వుత్సాహంగా దొల్లేను.... దొల్లి... దొల్లి.... మంచం అంచుల నుంచి కిందపడి భళ్ళున పగిలేను... వొక పవిత్ర దేశంలోని రాష్ట్రాలన్ని ముక్కలయ్యాను... చెల్లాచెదురుగా రకరకాల ఆకారాలయ్యేను... కరుగుతున్నాను... నిదానంగా... దానంగా... నంగా.....గా.... కరగీ.. కరిగీ...రిగీ.... గీ.... నీరయి పరుచుకొన్నాను. నేలంతా అనేక రూపాల్లో... అలా... ఇగిరీ.. ఇగిరీ... ఆవిరయ్యాను.... నిశ్శబ్దంలో శబ్దంగా విధ్వంసమయ్యాను....

D D D

డిసెంబరు చలికి గడగడా వొణుకుతున్న బంక వెన్నెల్ని గొంతుదాకే తాగీ... తాగీ వృక్షాలన్నీ వొక వున్మత్త స్వప్నమైకంలో నిద్రిస్తున్నాయి.... అనంతానంత చీకటి కటిక ఆకాశంలో సమాధుల్లా వున్న యాభై నక్షత్రాలు చావుకళతో ప్రకాశిస్తున్నాయి... క్రమేణా యాభై నక్షత్రాలు వొక వ్యక్తిగా మారాయి....

వాడి చేతుల్లో వొక గొడ్డలినై తలకిందులుగా వేలాడుతూ... వూగుతూ.... వొక వేపచెట్టు స్వప్నంలోకి ప్రవేశించాను నేను.... ఇద్దరమూ వేపచెట్టు ముందుకు చేరుకొన్నాము... వొక్క వూపున పైకేసాడు వాడు. నన్ను తరతరాలనల్లటి బలిష్టమైన దాని కాండం మీద తెల్లటిగాటును ముద్రించాను.

దాని నుంచి స్రవిస్తోన్న ఎర్రటి రక్తం....

కొమ్మల్ని అల్లల్లాడించింది.... దాని భయాన్ని వొక చెట్టు నుంచి మరో చెట్టును ప్రసారం చేసింది గాలి... హోరునగాలి.... చెట్లన్నీ మేల్కొన్నాయి.... భూమిలో వేర్లతో రహస్యంగా మంతనాలు జరపసాగాయి.... గాలి.... పైన పక్షులు బీభత్సంగా అరుస్తూ వలయాలు... వలయాలుగా... కింద సుళ్ళు తిరుగుతున్న ఎండుటాకులు.... కలకలానికి వాడు నన్నో మూల విసిరి కొట్టి యాభై నక్షత్రాలుగా మారి నింగిలో కెగిశాడు.... క్షణకాలంలో...

నల్లటి వెలుగు పల్చగా పరచుకొనే వేళ... వేపపుల్లకోసం వచ్చిన వొక కమ్మరి కంట్లో... నేను... శ్రద్ధగా మోసుకొని కొలిమి దగ్గరకు చేర్చాడు కొలిమిలో ఎర్రగా కాలేను. వెదుర్లు చీల్చే చిన్న కత్తిలా మారేను... కమ్మరి కొలిమి తిత్తికి

యాభై రంధ్రాలు.... వాడు... కమ్మరి.... దేశాలు పట్టిపోయేడు... అలా వెదుర్లు చీల్చేకత్తిలా మారి వొక మేదరికంటున్న స్వప్నంలోకి చొరబడ్డాను.... యాభై అందమైన వెదురు బుట్టలల్లాను.. వొక్కటీ అమ్ముడుపోలేదు.... వొక దురదృష్ట కాలంలో యాభై బుట్టలూ, యాభై ముసుగు దెయ్యాల్లా మారి నన్ను వెంటాడేరు... పరుగెత్తి... పరుగెత్తి... అలల వొడ్డుకు చేరాను.... ముందు భోరున శివాలెత్తుతున్న అలలు.... వెనుక భీకరమైన యాభై ముసుగు దెయ్యాలు... పక్కన్నే పూటుగా తాగి తెప్పకడ్డంపడి నిద్రపోతున్న పట్టపోడు... మరుక్షణం వాడి స్వప్నంలోకి ప్రవేశించాను వాడికలలో వొలగా మారేను... చేపల వేటకు వాడితో తెప్పలో సముద్రం మీదికి వెళ్ళాను.... నా చుట్టూ యాభై అధునాతన మరపడవలు సముద్రాన్ని అడుక్కంటా దేవేశాయి. యాభై రోజులపాటు... అలా.. అవిశ్రాంతంగా జరిగిన పోటీ వేటలో నేను వొక్కటంటే వొక్క చేపను కూడా పట్టలేకపోయాను సముద్రంలోని వుప్పునీరు పట్టపోడి కళ్ళలో పొంగింది... ఏడు మణుగుల చేపల్ని ఎంటిక సమానంగా వేటాడిన వాడి తాతముత్తాతల రక్తం వాడి వొంట్లో చారు అలలాగే వుప్పొంగి మరిగిపోయింది... పట్టపోడునన్ను యాభై మెలికల తాడుగా పేని వాడి గుడిశెలోని నిట్టాడి కూసానికి వురి పోసుకొని మరణించాడు... వురి తీయబడ్డ పట్టపోడి శిరస్సు యాభైరకాలుగా తానెలా దోపిడీ అయ్యిందీ, కన్నీరు కారుస్తూ చెప్పింది... నిజంగా అవి యాభై రహస్యాలే... అలా నేను వురితాడును.... దారపు పోగులుగా విడిపోయి వొక నేతగాని మగ్గంతో ముద్దు ముచ్చట్లాడి... తెల్లటి నేతగుడ్డగా మారేను... వాడు నన్నో సంతలో అమ్మకానికి వుంచాడు. యాభై రకాల మిల్లు గుడ్డలు నేనమ్ముడవ్వకుండా అడ్డుపడ్డాయి.... వాడు.... నేతగాడు.... తన జాడలు తానే తుడుపుకొంటూ... నేను ఎండా... తడిసీ... వొక తుఫానులో... వొంద వాయిగుండాలలో చిక్కుకొని గాలికి ఎగురుతూ వొక చాకలివాడి స్వప్నంలోకి ప్రవేశించాను... వాడికి పంచెనయ్యాను... యాభై రంధ్రాలు పడ్డాను. వాడు శ్రద్ధగా అతుకులేశాడు..



వొక చల్లని మధ్యాహ్నం.. నన్ను గట్టుమీదుంచి వాడు రేవులో వున్నప్పుడు వాడి గాడిదతో లేచొచ్చేశాను... దానికి యాభై భాషలొచ్చు... దానితో యాభై రోజులు కాపురం చేశాక... వొక రోజు అది తన ఆత్మకథను విన్పించింది, వొక మోదుగు చెట్టునీడన... .సఖీ... నాలా ధర్మం నాలుగు పాదాలతో నడవనందుకు నేను కుమిలిపోయాను.... ద్వేషంతో రగిలిపోయాను... ధర్మాన్ని వధించాలని నిరాయిధరిగా బయల్దేరాను... ధర్మాన్ని వెతికీ... వెతికీ... అలసి సొలసిపోయాను... అది సప్త సముద్రాల ఆవల యాభై నక్షత్రాల రూపంలో వుందని తెలిసింది... ధర్మం... యాభై నక్షత్రాల ధర్మం... వొట్టి భ్రాంతి.. ఎక్కడొ వుండి ఇక్కడి మనల్నీ మన ప్రకృతినీ శాసించడం... వొట్టి భ్రాంతి... వొట్టి గందరగోళం ధర్మ సంస్తాపనార్థాయ సంభవామి యుగేయుగే, యాభై నక్షత్రాల ధర్మాన్ని వధించి నా గార్ధభ ధర్మాన్ని స్థాపించేందుకు యీ యుగంలో నేను జన్మించాను. అలా చెప్పుకుపోతున్న గాడిదను యాభైనక్షత్రాల పదమూడు చారల కట్లెడు పాము కాటేసింది, బుస్సున.... యుద్ధరంగంలో నేలకులుతున్న మహాయోధుడిలా నేలవాలింది గాడిద... నెత్తురు కక్కుకొంటూ నల్లగా మారి మరణించింది... నివ్వెరపోయాను నేను... గాడిదకక్కిన రక్తపు మడుగులో తడిసి ఎర్రగా మారాను. అయితే వొక మూల మాత్రం నాకు ఆ ఎరుపు రంగు అంటలేదు... ఆ ప్రదేశంలో మాత్రం తెల్లగానే మిగిలాను నేను.... గాడిద మరణించిన తర్వాత తెల్లటి చీకటి దట్టంగా పరచుకొంటున్న వేళలో వొక వ్యక్తి హుటాహుటిన వొచ్చి చచ్చిపడున్న గాడిదను వినమ్రతతో పిలిచేడు.... తట్టిలేపాడు... విషయం గ్రహించి... ఆనందంతో గంతులేశాడు... వాడి కళ్ళలో ప్రతిఫలిస్తున్న యాభై నక్షత్రాల విచిత్రవింత కాంతి, వాడి తర్వాత మరికొంత మంది వచ్చారు. వాళ్ళను చూసి వాడు ఏడవడం, ప్రారంభించారు... భోరున, వాడితోపాటే అందరూ యాభై రకాల ఏడుపులేడ్చారు.... అలా ఎడుస్తూనే... పక్కన్నే వొక గుంట తొవ్వి గాడిదను పూడ్చిపెట్టారు.... తర్వాత అందమైన పాలరాతి సమాధిని కట్టారు.... "అత్యంత ధర్మంగా జీవించి, పవిత్రంగా మరణించిన వొక వ్యక్తి ఇక్కడ, నిద్రిస్తున్నాడు" అనే వాక్యాన్ని సమాధిపైన చెక్కారు... తర్వాత నన్ను వొక పొడవాటి కర్రకు తగిలించి జెండాగా మార్చారు.... మధ్యలో తెల్లటి మచ్చగల ఎర్రటి జెండానయ్యాను... ఎంత వుల్లాసం... స్వేచ్ఛగా ఎగరగలగడం అయితే కర్రకు తగులుకొని వేలాడుతూ ఎగరడాన్ని నాపైని తెలుపు రంగుకు సుతారమూ ఇష్టంలేదు.... అలా గాడిద సమాధి అయిన యాభైవ రోజు నాటికి– అత్యంత ధర్మంగా జీవించి మరణించిన వ్యక్తి విషయం ప్రపంచమంతా వ్యాపించింది... ఆ వ్యక్తి సమాధిని దర్శించేందుకు... వొకరు... ఇద్దరు... పదులు... .వందలు... వేలు... లక్షలాదిగా ప్రజలు వొస్తున్నారు... వొకడు ఆ వ్యక్తి పేర పీఠాన్ని ఏర్పరిచి పీఠాధిపతిగా మారాడు. వొక చిత్రకారుడు ఆ వ్యక్తి బొమ్మను చిత్రించాడు. ఒవిరిగడ్డంతో... అరనవ్వుతో... మరొకడు దాన్ని చూసి అసహనానందంతో అరిచాడు– "ప్రపంచాన్ని సమూలంగా మార్చి పారేయగలవాడూ" "యాభై నక్షత్రాల ధర్మాన్ని బద్దలుకొట్టగలవాడూ యితనేనని" ఆ అరుపు విని భయభ్రాంతులైన కొందరు కవులు ఆ సంధిలో ఎన్నో ధర్మ ప్రవచనాలు రాసి అవి ధర్మంగా జీవించి మరణించిన వ్యక్తి ప్రవచనాలుగా ప్రచారం చేయసాగారు.

ఆ రోజు....

జన సముద్రం నా చుట్టూ... లక్షలాది మంది... యాభై గుంపులుగా విడిపోయి కీచులాడుకొంటూ... ధర్మంగా జీవించి మరణించిన వ్యక్తి మా వాడంటే... మా వాడని వాదించుకొంటూ.. అల్లకల్లోలంగా యాభై గుంపుల జన సముద్రం.... వ్యక్తి సమాధిపై యాభైనెర్రెలు... ఒకడు నను కిందకు తోశాడు... వేరొకడు సమూలంగా పెకలించాడు... వొకడు నన్ను భుజాన వేసుకొన్నాడు...

అలా వొకడూ మరొకడూ... మొత్తం యాభై సమూహాలు నన్ను యాభై ముక్కలుగా చింపి యాభై జండాలుగా తయారు చేశారు. మరుక్షణం నేను యాభై రకాల రంగుల్లోకి మారిపోయాను.. అలా వారు యాభై దిక్కులకు పారిపోయారు. కానీ వారి నాయకులు మాత్రం యాభై మది యాభై నక్షత్రాలుగా మారి పడమటి సంధ్యాకాశంలో నిలిచారు.... యిలా బీభత్స ఘట్టంలో నా తాలూకూ వొక ముక్క... ఏ రంగూలేని తెల్లగుడ్డ ముక్క మాత్రం నేల మీదపడి కొట్టుకొంటుంది గిల...గిలా... అలా కొట్టుకొంటూ నేను ఆ సమాధికి దగ్గరలో వున్న వొక మాతంగి చేతిలో పడ్డాను ఆమె చేతిలోని గుడ్డముక్కలో నేను పునరుజ్జీవినైనాను... ఆమె కన్నీళ్ళనూ, వేదననూ గుండె నిండా పీల్చుకొని నన్ను నేను పిండుకొన్నాను... దోసెడు లాలాజలాన్ని స్రవించాను... స్రవించి ఘనీభవించి వొక మేఘంలా మారాను.... నన్ను బంధించాలని వాడు యాభై కన్నుల ఇనుప వలతో వెంటాడాడు... వొల విసిరాడు వర్షించేను భోరున... అడవిలో చెలమనయ్యాను.... వొక చారల చిరుత నన్ను నిలువెల్లా పీల్చుకొంది దాహార్తితో.... అడవిలో చిరుతనయ్యాను... యాభై మంది నను వేటాడారు నేను దొరక్కపోవడంతో నా ఆహారాన్ని వేటాడారు... చెట్లన్నీ కొట్టించి

అడవిలోకి రోడ్లు వేసిమరీ వేటాడారు... నా పొట్టకూటికి కరువొచ్చింది. వో వారం రోజులు మాంసం తినకుండా నిరంతరం ఆలోచిస్తూ వుండడంతో నా పంజా మానవుడి అరచేతిలా, వెనుక కాళ్ళు మానవుడి పాదాల్లా మారిపోవడం ప్రారంభించాయి. నడకే కష్టమయ్యింది.... నేను చిరుతగా మారిన యాభైవ రోజు... వాళ్ళు నా కోసం యాభై కమ్ముల బోనుంచారు... ఆ దుర్దినం నేను అందులోపడబోయి త్రుటిలో తప్పించుకొని.... జనారణ్యంలోకి పరుగుతీశాను... భీతితో, అరుస్తూ... నన్ను చూసి పరుగులు తీస్తూ ప్రజలు... కాంక్రీట్ సమాధుల్లో దాక్కుంటూ... అలా ఆకలి తమకంతో పరుగులు తీస్తుండగా కనిపించిన వొక బక్క చిక్కిన ఎద్దును కసిదీరా చంపబోయాను... అది తన రెండు కొమ్ములతో ఎత్తి నాకు యెక్కింది... కబేళాలో నికృష్టమైన చావు చచ్చేందుకంటే వొక వీరునికి వేటగా మారడం ఉత్తమ లక్షణం అంటూ... ఆనందంగా నాకు ఆహారంగా మారింది... కడుపునిండా తిన్నాను... ఎద్దులా మారాను... వొక గూటానికి నా కాలు కట్టి వుంది.... వాడే... మరొకడితో నన్ను యాభై రూపాయలకు బేరమాడుతున్నాడు... పక్కన్నే వొందలాది బక్కచిక్కిన ఎద్దులూ, ఆవులూ, బర్రెలూ, తమ పిల్లలతో సహా కబేళాకు తరలిపోతూ... వొక జాతిని మూకుమ్మడిగా హత్య చేసేందుకు పథకం రచిస్తున్న యాభై నక్షత్రాల వాడు... యాభై రూపాయలకు బేరం కుదిరినట్టుంది... మరొకడు గూటం తాడు విప్పాడు... వొక్క పరుగు తీశాను నేను... అలా పరుగెత్తి పరిగెత్తి యాభై చక్రాల నరకు రవాణా వాహనం కింద పడి నుజ్జునుజ్జయ్యాను. వుత్త చర్మాన్ని మాత్రమే మిగిలాను.... అలా నేను మాదిగబుడ్డోడి స్వప్నంలోకి ప్రవేశించాను... వాడి తప్పెటగా మారాను... డక్కిలి, నులకచందయ్యల కిన్నెరతో కలిసి కిలకిలా నవ్వాను.. జాతరలో మోతలు మోగాను... బానిసగా ఆడాను, పాడాను, మోగాను కొంత కాలానికి యాభై వర్గాల గుండెల్లో గుబులునై ధన... ధనా మోగాను... వాడి ఆత్మకథని దండోరాగా మారుపలికాను... దండోరా గాలిలోకి సోకగానే యాభై యంత్ర వాయిద్యాలు ప్రత్యక్షమై యాభై రకాల చిత్రవిచిత్రమైన శబ్దాలను వెలువరించసాగాయి... వాటితోపాటీగా బుడ్డోడు తప్పెట వాయించసాగాడు... శబ్ద యుద్ధం... ఆ వాద్యాలతోపోటీ పడీ... పడీ... బుడ్డోడి కంట్లో చెవుల్లో రక్తం కారింది ధారాపాతంగా... విడవకుండా తప్పెట వాయిస్తూ వాడు అనంతవాయువుల్లో వొక వాయువుగా మారి దిక్కులేకుండా పోయాడు.... యాభై యంత్ర వాయిద్యాలు ఆనందరాగాన్ని ఆలపించాయి యాభై రకాలుగా... అలా మాదిగ బుడ్డోడు మరణించిన తర్వాత వాడి చేతుల్లో నుంచి నేను దొల్లుకుంటూ వొక దిబ్బలో పడ్డాను... నాపైన గుట్టలుగా పేరుకొంటున్న పేడ, గడ్డి చెత్త... దిబ్బగర్భంలో చీకి... చీకి... శుష్కిస్తూ... నేను సారవంతమైన ఎరువుగా మారుతున్న వైనం...



కొంత కాలానికి.... కరువు మైకంలో నెర్రెలిచ్చిన వొక పొలంలో, దయగలరైతు చేతుల ద్వారా విసరబడ్డాను... యాభై రోజులపాటు నీళ్ళలో నానాను, తర్వాత యాభై నాగళ్ళుగల వొక యంత్రం నన్ను దున్ని అతలాకుతలం చేసింది భూమి పొరల్లో దాక్కున్నాను... నాపై వరిపైరు విత్తారు... పైరులోకి ప్రసారమయ్యాను... నేనిప్పుడు రైతు తీర్చాల్సిన అప్పును... అతని యజమానికి కట్టవలసిన కౌలును... చెల్లించాల్సిన విద్యుత్ బిల్లును అతని కూతురికి కొనవలసిన అల్లుణ్ణి... ప్రాణం కన్నా మిన్నగా భావించే అతడి పరువును, ప్రతిష్టను, అతని మాటను... అతని భవిష్యత్తు జ్ఞాపకాన్ని... అన్నీ... అతనికి మిగిలిందల్లా నేనే... యాభై రకాల తెగుళ్ళు దాడి చేశాయి నాపై... చివరిదాకా పోరాడి నేను వరి కంకుల్లో సగం గింజనైనాను... ఎండకు ఎండీ ఎండీ పరిగనైనాను... అతను మాత్రం యాభై రకాల పురుగుమందులు తెచ్చి వొక్క మందులోంచీ వొక్క చుక్కా మొత్తం యాభై చుక్కల పురుగు మందు తాగి తానునిత్యమూ ప్రేమించే మట్టిలో మట్టిగా మారాడు... ఆ మట్టిలోంచి లేచిన జిల్లేడు చెట్టు యాభై పూలను పుష్పించింది... నక్షత్రాల్లా... పూలు... యాభై నక్షత్రాల్లా.... అలా నేను పరిగలా మారిన తర్వాత వొక యానాదిజంట నన్ను పొలంలోంచి ఏరి కంకుల్ని నూర్చి వొచ్చిన ధాన్యాన్ని దంచి నన్ను నూకలుగా మార్చారు... వారిద్దరికీ నూకల గంజినయ్యాను... వాళ్ళ వొంట్లో సత్తవనయ్యాను... ఆ సత్తువతోవాళ్ళు పాడిన పాటనయ్యాను... దొంగతనంగా గాలిలో మాటువేసున్న వొక సంగీత మాంత్రికుడు వొక అయస్కాంత గృహంలో యాభై రకాల వాద్యాలతో నన్ను బంధించాడు... వాడి గొంతుపై యాభై నక్షత్రాల పచ్చపొడుపు మచ్చలు... వాడు నన్ను వినిపించి... లక్షలాది ప్రజలను వినోదింపజేశాడు.. అలా నేను పాటలోనుంచి వాడి కీర్తిగామారాను వొక సాయంత్రం నేనూ సంగీత మాంత్రికుడు పురావస్తు ప్రదర్శనశాల కెళ్ళాం అక్కడ ప్రదర్శనలో వున్న ఆకాశవాణి వొక విషాద విధ్వంస గీతాన్ని వినిపించింది. ఆ గీతంలో ఏదో అనిశ్చితాన్వేషణ... వొక అసందిగ్ధ దుఃఖం... వంద ముక్కలయ్యాను... నిలువునా కరిగినీరయ్యాను... నీరయ్యి.. జల...జల.. ప్రవహించాను నూతన అస్థిత్వం తొణికిసలాడే ప్రవాహాన్నై బహుముఖాలుగా ప్రవహించాను... నేను పాయలుగా చీలిన నేలలపై రాజనాలు పండించాను... అలా ప్రవహిస్తున్న నాకు వొక స్మశాన స్థలం వద్ద గొర్రె ధూళి వేళలో వాడు... వాడే. యాభై ద్వారాల ఆనకట్ట రూపంలో నా కడ్డుగా నిలిచాడు....వాణ్ణి జయించాలనే తపన... నాలో.. ఆకాశంలోకి ఎగిరాను యాభై నక్షత్రాలు మీదకురికాయి దబ్బున కింద పడ్డాను దిశ మార్చుకొని పక్కనే వున్న పత్తిచేనుపై ప్రవహించాను... విరగబూసింది పత్తిచేను.... దూది పింజనైగాల్లోకి ఎగిరాను... ఎగిరీ.. ఎగిరీ... వొక దూదేకుల స్వప్నంలోకి ప్రవేశించాను... అతను నన్ను తన కమాను వులితో వొక చెమ్కిపరుపులా చెక్కాడు.. మరుసటి రోజు అతనికమానుయాభై ముక్కలుగా విరిగిపోయింది.... అతను నన్నో ప్రజానాయకుడికి బహుమతిగా ఇచ్చాడు.... వాడికింద పడి నలిగిపోయాను... ప్రతి రోజూ నగ్నంగా నా మీద శయనించే వాడి వాసన భరించలేక... వొక రోజు వాడు కంటున్న స్వప్నంలోకి అన్న చేతిలో నిలువెత్తు తుపాకీనయ్యాను.

అలా 'నిరుపయోగంగా' అడవుల్లోకి వొచ్చిపడ్డాను.. వొక రోజు.. వాడే.. వాడే యాభై నక్షత్రాల వాడు యాభై మంది పోలీసుల్లా మారి మమ్మల్ని చుట్టుముట్టారు.. ఇద్దర్ని విడివిడి లాకప్ గదుల్లో వుంచారు... యాభై రోజులు గడిచాక అన్న జనజీవన స్రవంతిలో కలిసిపోయాడనీ విన్నాను.... ఎక్కడో దూరంగా వేయి మంది వీరులు మరణించిన చప్పుడు అన్న మాజీ అయ్యాడన్న వార్తవిని నేను ఆశ్చర్యార్థకాన్నయ్యాను... యాభై వొకటో రోజు నా లాకప్ తలుపులు తెరిచారు, నన్ను జుట్టు పట్టుకొని యిడ్చుకెళ్ళి యాభై కమ్ముల తలుపు వున్న వొక గదిలో తోశారు... బట్టలూడదీశారు... వాళ్ళ కళ్ళలో యాభై నక్షత్రాల కాంతి క్రౌర్యమై ప్రకాశిస్తుంది...

ఎవరు నువ్వ?... ప్రశ్నించారు.

ఎంత పురాతన ప్రశ్న... నవ్వుగామారాను... లాఠీలు నా వొంటి మీద నాట్యం చేశాయి.

వొక ములుగుగా మారాను...

నిజం చెప్పు...

వెంటనే బోధకుడిలా మారి వారికి నిజాన్ని బోధించాను...

నివ్వెరపోయారు కిందపడదోసి బూట్లతో నా అరచేతుల్ని స్పృశించారు...

నా వేళ్ళ గోళ్ళ మధ్య గుండుసూదుల్ని గుచ్చారు... నా శరీరంపై రక్త గాయాలు చేసి వుప్పుకారాన్ని కూరారు... నా పొడవాటి అంగీలో ఎలుకల్ని వొదిలారు... మోకాళ్ళకు నా గొంతును బలవంతంగా ఆనించి మోకాళ్ళ మధ్యలో రోకలి దూర్చి రెండు చేతులూ పైకిలాగి కట్టారు. నా వీపు మీద రబ్బరు చెప్పు దెబ్బల వర్షం... విమాన మెక్కించారు.... తలకిందులుగా వేలాడ దీశారు..

నా రెండు కాళ్ళు ఎడం చేసి ముడ్డిలో లాఠీని దూర్చారు...

ఎవరునువ్వు?

నా మర్మాంగమంలో పెట్రోలు ఎక్కించారు.

నిజం చెప్పు...

కరెంటు షాకునిచ్చారు...

అలా యాభై రకాలుగా వారు నన్ను హింసించినా... నా చేత అబద్ధమైన నిజాన్ని చెప్పించలేకపోయారు... చివరకి నా కనురెప్పలు కత్తిరించారు...

ఎంత హింస.... నిద్రముంచుకొస్తుంది... నిద్రపోలేను... వొస్తు ప్రపంచాన్ని నిరంతరం చూస్తూ... రెప్పలు లేని రక్తసిక్తమైన గుడ్ల కళ్ళతో... నిలువెత్తునడిచే గాయాన్నై వొక విషాదగేయాన్ని ఆలపించాను గొంతెత్తి. బిలబిలా పరుగెత్తి వొచ్చాయి బూట్లు, ఆ గేయానికనుగుణంగా నా శరీరంపై నాట్యం చేశాయి. నుజ్జు నుజ్జయి కందెనలా మారాను.. అయితే నా గుండె మాత్రం ఇనుపగుండులా... నాట్యం చేస్తున్న బూట్ల మధ్యలో సందుచూసుకొని దొల్లుకుంటూ యాభై కమ్మలు మధ్యలో నుంచి బయటపడ్డాను... శరీరం కోల్పోయిన నేను వొక నిర్మానుష్యమైన రోడ్డు మీదకు వచ్చిపడ్డాను... రోడ్డు మధ్యలో తొలుచుకొంటూ నేలలో నన్ను నేను నాటుకొన్నాను... యాభై రోజుల తర్వాత రోడ్డును పెకలించుకొని మహావృక్షాన్నై పైకిలేచాను.... వేనకు వేల తుపాకుల్ని వొందూది విల్లమ్ముల్ని పుష్పించాను... యాభై నక్షత్రాలను బంధించేందుకు యాభై వూడలు దింపాను... ఇనుపవేర్లతో భూగర్భాన్ని కావలించుకొన్నాను... అంతిమ పోరాటానికి సిద్ధమయ్యాను కాచుకొని వున్నాను యాభై నక్షత్రాల కోసం...

యాభై రోజులు గడిచాయి...

ఆ రోజు... నా వూడలే నా పైకి తిరుగుబాటు చేశాయి... అవి నన్ను పాశవికంగా చుట్టు ముట్టాయి... నన్ను భీకరంగా పెనవేశాయి. వాటి పట్టులో వుక్కిరిబిక్కిరవుతూ నేను...????... వొందలాది విల్లులు నా పైకి సంధించబడ్డాయి. లక్షలాది తుపాకులు బీభత్సంగా పాశవికంగా నాపైన కాల్పులు జరపసాగాయి... యాభై వూడలతో కుమ్మక్కైన తుపాకులు, విల్లమ్ములు, నా శరీరంపై బిగిసుకొంటున్న వూడలపట్టు... తుపాకి గుళ్ళ శరాల వర్షం... కొంచెం కొంచెం మరణిస్తూ... వూపిరాడక... బాధతో వుండుండీ మెలికలు తిరుగుతూ...

D D D

దిగ్గున లేచాను.... ఫ్యాను తిరుగుతున్న శబ్దం గీరగా... నా గది నిశ్శబ్దంగా... కల... పీడకల... నీటి చెంబు అందుకొన్నాను... దాహం... గటగటగట తాగాను... కల.. ఎంత భయంకరమైన కల... ముక్కలు ముక్కలు గుర్తొస్తున్న కల... టైమ్ చూసాను... నాలుగున్నర... ఫ్యాను తిరుగుతున్నా చెమట... చెమట... బనియన్ తీసాను. వొంటిపై నుంచి... దాన్ని హేంగర్‌కు తగిలిస్తూ అద్దంలో చూసుకొన్నాను అప్ర యత్నంగా... నా ఛాతీపైన నక్షత్రాల గుర్తులు... కనిపించీ కనిపించీ కనిపించనట్టుగా లెక్కపెట్టాను... యాభై... మతిపోతుంది నాకు... నా చేతులు కత్తిని వెతుకుతూ నిర్విరామంగా... నా గదిలో నా మెదడు కలను జ్ఞాపకంగా మార్చేందుకు అనంతంగా ఆలోచిస్తూ.. నా శరీరంలో..

V

# జలపద్మవ్యూహం

**కొలనుపాక మురళీధరరావు**

పాతాళగంగను
చేతికందేవరకు
చేజిక్కించుకోవాలని
కడువెదున నీళ్ళకోసం
కడగండ్లతో విసుగూ విరామంలేక
'పానీ' పట్టు యుద్ధంలో
వీరాభిమన్యులవుతూ వున్న సామాన్యులు
పాలకుల చేతుల్లో చేతలలో
గిలగిలలాడుతున్న పల్లెజీవులు
సాగునీరు, తాగునీరు లేక
సాగిలబడిన శ్రామికులు
ఫ్లోరిన్ భూతంపాలిటపడి
ఎముకలు ఒంకర టింకరపోయిన వక్రజీవులు
కృష్ణమ్మ కరుణించదనుకున్న అమాయకులు
తమ బదుకుబండలపాలైన
తమ పిల్లలు అష్టావక్రులు కాకుండా
క్షేమంగా ఉండాలనుకునే ఆశాజీవులు
తాగునీరు సాగునీరు బొట్టుకోసం
దిగులుతో బిక్కచచ్చిపోతున్న అభాగ్యజీవులు...
కరువుతో బదుకుబరువు
ఎండిన చెరువు

# హైకూలు

**మాధవీ సనారా**

పెన్ను తెరలో
ఎన్నక్షరాలున్నాయో
తీద్దాం బైటికి

రైతు కోసమే
ఎదురుచూపులతో
బంజరు భూమి

మొన్నరికార్డు
అరిసంత అయితే
గారంత నేను

పిల్లని చూస్తే
ఆ ఎదవ కళ్ళల్లో
ఎన్ని ఆకల్లో

ఎన్నిదశలో
మెతుకవటానికి
పండిన వరి

జోరున వర్షం
నిశ్చింతగా కొందరు
బెంగగా వాడు

## అనువాద సాహిత్యం



# ఫెంగ్ సు ఫెంగ్

# నీతి కథలు



***ప్రముఖ చైనా రచయిత ఫెంగ్ సు ఫెంగ్ (1903-1976) ఈ ఆధునిక నీతి కథల్ని 1930-40 ప్రాంతాల్లో రాశాడు. తనకు సమకాలికుడూ, సన్నిహితుడూ అయిన లూ సున్ వలె ఫెంగ్ సుఫెంగ్ వ్యంగ్యంగా, నీతి కథల రూపంలో ఆనాటి నియంతల్నీ, విదేశీ పెత్తందార్లనీ విమర్శించాడు. ముఖ్యంగా కొమింటాంగ్ ప్రభుత్వం అన్ని రకాల సాహిత్య ప్రక్రియల మీదా నిషేధం విధించినప్పుడు, అతి పురాతనమైనవిగా కనిపించే ఈ నీతి కథలు తత్కాలీన పరిస్థితులకు అద్దం పట్టి ప్రజల్ని చైతన్య వంతుల్ని చేయటంలో ఎంతో వుపకరించాయి.***

అనుసరణ : **ముక్తవరం పార్థసారధి**

## ఆవూ-పలుపుతాడూ

బానిసలుగా బతుకుతున్న ఆవూ, కుక్కా పారిపోవాలనుకున్నాయి అనుకున్నట్టుగా, చీకటి పడగానే కుక్కవచ్చి పలుపుతాడు కొరికెయ్యసాగింది.

"కుక్క బావా, తాడు నేం చెయ్యకు. ఆ గుంజకు కట్టిన ముడిని మాత్రం విప్పు. మంచి తాడు. నాకున్న ఆస్తి యిదొక్కటే" అంటూ బతిమాలింది ఆవు.

కుక్క ముడి విప్పింది.

మూడో కంటికి కనిపించకుండా రెండూ వూరి పొలిమేరలు దాటాయి. మరి కాసేపటికి తాడు ఓ బండ పగులులో చిక్కుకుపోయి, ఎంత ప్రయత్నించినా రాలేదు.

పారిపోయిన తన పెంపుడు జంతువుల కోసం గాలిస్తూ వచ్చిన యజమానికి ఆవును పట్టుకోవటం కష్టమేమీ కాలేదు.

ఇదే కదా నేను చేసిన పొరబాటు, స్వేచ్ఛను కోరే వాళ్ళు ఆస్తి మీద ఆశ పెట్టుకో కూడదు. అనుకుని నిట్టూర్చింది ఆవు.

## పామూ-పాటా

ఆహారం వెదుకుతూ వచ్చిన కౌజు పిట్టను పాము గుటుక్కున మింగేసింది. భర్తను పోగొట్టుకున్న ఆడ కౌజు పిట్ట శోకం గాధమైంది. హృదయాల్ని కదిలించి, రగిలింప చేసే ఆ పాట అడవంతా కార్చిచ్చులా వ్యాపించింది.

దారిన పోతున్న గాయకుడు ఈ గానానికి చలించి పోయాడు. జీవజాతి ఆక్రందనసంతా ధ్వనించేలా పాట కట్టాడు. ఆక్రోశం సరిపోదు. తిరుగుబాటు చేయాలి. అన్యాయాల్ని అరికట్టాలి. అదీ పాట అర్థం. ఉదయ సంధ్యలలో, నిశిరాత్రులలో, ఆహ్లాదకరమైన సాయంత్రాలలో ఆ పాట ఎప్పుడూ ఎవరు విన్నా నెత్తురు సలసలా కాగేది. ఉప్పెనలా లేచిన జనమంతా పాము కోసం వేట ప్రారంభించారు. ఇది పిట్టను మింగినదా కాదా అని చూడకుండా ఎక్కడ ఏ పాము కనిపించినా బడిత పూజ చెయ్యటమే.

కళా ప్రయోజనం సామాజిక న్యాయం. అన్యాయాల్ని ఎదుర్కోవటానికి ప్రోత్సహిస్తుంది కళ.

## పక్షులూ-మబ్బులూ-కొండలూ

ఆకాశంలో వలయాలు తిరుగుతున్న పక్షి, 'ఆహా, ఆహా తెల్లటి మబ్బు

ఎంత అందంగా వుందో, దాన్ని చేరుకోవటమే నా లక్ష్యం." అనుకుని రెక్కలార్చి ముందుకు సాగింది. కాని మబ్బు నిలకడగా వుంటుందా. ఒకసారి అక్కడా దొరికినట్టే దొరికి జారిపోతుంది. ముఖ్యంగా పింజలు పింజలై కనుమరుగైపోతుంది. పక్షి వాస్తవాన్ని గ్రహించింది. "నా గమ్యం మబ్బులు కాదు. ఆ ఎత్తైన కొండ శిఖరాలు. వాటిని అధిగమించటంలో జీవిత సార్థకత వుంటుంది. ఆనందం, విజయోత్సాహం దొరికేదక్కడ." స్వీయ మానసిక లక్ష్యాలతో కాక, చరిత్రగతిని అధ్యయనం చేసి ప్రజా వుద్యమాల్ని నడుపు.

## కప్పగారి యుద్ధభేరీ

నరుకుల బండీని అడ్డగించి దోచుకోవాలనుకుంది పాము. ఇంత ఘనకార్యం చేయాలంటే ఒక్కరు సరిపోతారా మరి!

"భీకర యుద్ధం జరగబోతోంది. నీ భేరీ మోగించి కాసింత సాయం చెయ్యినాకు. 'అంటో అభ్యర్థించింది కప్పను.

కప్ప ఆనందానికి పట్టపగ్గలేవు.

బండి సమీపించగానే, పాము గాలి పీల్చుకుని, వుబ్బి బుసకొట్టింది. కప్ప బెకబెకలతో వాతావరణాన్ని భయానకంగా మార్చింది. 'బండీ ఎలా కదుల్తావో చూస్తాను!' అంటూ పాము దారికి అడ్డంగా వచ్చేసింది. దురదృష్టవశాత్తూ బండి కదిలిపోయింది. పాము చితికిపోయింది. ఈ విషయం తెలియని కప్ప బెకబెకల రణభేరి మాత్రం ఆపలేదు.

దేగలు వచ్చి పామును భోం చేశాయి. యుద్ధరంగంలో వైరి పక్షాలు లేవు. అయినా కప్ప బెకబెకలు ఆగలేదు. రాబందులకు చికాకేసింది.

'ఈ న్యూసెన్సు ఆగదా, దాన్నీ తినేద్దాంపద' అంటూ వచ్చి కప్పను గుటుక్కుమన్నాయి. కప్ప యుద్ధనేరం చెయ్యకపోయినా, దేగలకు సహజమైన ఆహారం కదా!

నిరంకుశుల కొమ్ముగాచే ప్రజా వ్యతిరేక సాహిత్యం, కళలు అంతరించక తప్పదు.



## నవయుగ వైతాళికుడు

ఓ మధ్యాహ్నం తుఫానువచ్చే సూచనలు కనిపించాయి. నల్లటి మబ్బులు, ఈదురుగాలి, మరికాసేపట్లో ప్రళయ ఝంఝ తప్పదు.

చెట్టుమీద గూడు కట్టుకుంటున్న సాలీడుకు వైతాళికుణ్ణనిపించుకోవాలని బుద్ధిపుట్టింది.

"పరిస్థితులు పరిపక్వమైనాయి. పాతను తుడిచేసి కొత్తలోకం ఆవిష్కరించటానికి వస్తున్నది విలయం. ఉరుములు, మెరుపులు, పిడుగులు, మరో ప్రపంచాన్ని స్వాగతిద్దాం." అంటూ గానం చేసింది.

తుఫాను రానే వచ్చింది. అప్పుడు చూడాలి సాలీడుని భయంతో బిక్కచచ్చి ప్రాణాల్ని అరచేతిలో పట్టుకుని, తన గూడు ఏమైపోతుందోననే బెంగతో, ఒక ఆకు వెనక నక్కి చివరి క్షణాల్ని లెక్కపెట్టుకుంటూ గడిపింది.

తుఫాను వుధృతం తగ్గింది. ఆకాశంలో ఇంద్రధనుస్సు విచ్చుకుంది. తెల్లటి మబ్బులు సరదాగా కదిలాయి. వర్షంలో స్నానం చేసిన పూలమొక్కలు ఆ చల్లని సాయంత్రం ఆహ్లాదంగా గానం చేశాయి.

"సాలీడు గారూ, అలా అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని నక్కి వుండకపోయినట్లయితే మీకు 'మహాకవీ', 'నవయుగ వైతాళికుడూ' అని అజరామరమైన కీర్తి వచ్చి వుండేది. అన్నది ఆకాశమంతెత్తు ఎదిగిన చెట్టు.



## చేదబావీ-జీవనదీ

పూర్వకాలంలో అయితే ఒకదాని జోలికొకటి పోకుండా, దేనిమానాన అది వుండేవి-బావీ, నదీ.

కాని యిప్పుడో - కాలం మారిపోయింది.

"ఎటు చూస్తే అటు బురద, ఎప్పుడూ రొద చేస్తూ ప్రవహిస్తుంటుంది. ఛీ అదీ ఓ బతుకే నాలాగ లోతుగా, దుమ్మూ, ధూళీ లేకుండా లోతుగా వుండగలదా అది. నా కిటికీ లోంచి నీలాకాశాన్ని పరికిస్తూ, విశ్వరహస్యాల్ని పరిశోధిస్తాను. ఆదర్శ జీవితమంటే నాది." అంటూ గొప్పలు చెప్పుకుంది బావి.

నది వూరుకుంటుందా మరి.పొంగింది. కట్టల్ని తెంచుకుని పొర్లింది. వరదనీటితో చుట్టుపక్కల నేలంతా జలమయమైంది. ఆదర్శజీవితం గడుపుతున్న బావి అందులో కలిసిపోయింది.



V

## కవిత

# ప్రేలాపన



**జీవన్**

భూమి నాది
అనంతాకాశం నాది
సప్త సముద్రాలు నావి
సమస్త ఖండాల్లోని సంపదంతా నాది
హిట్లరు నాకు ఆరాధ్యదైవం
ముస్సోలినీ నా మేనమామ
ప్రపంచమే నా క్రీడాస్థలి
బడుగు జీవుల హాహాకారాలు
నాకు కుహుకుహూ రవాలు
ప్రపంచం బరువంతా నా భుజాల మీదే
ప్రపంచ పోలీసనే కీర్తి కిరీటం నాదే
రాజ్యాల మధ్య
సరిహద్దు రేఖల్ని గీయడం
తుడిపెయ్యడం నాకు హాబీ
కాదన్న వాజమ్మ ఎవ్వడైనా వుంటే
అడ్డంగా నరుకుతాను
ఏ దేశాన్ని ఎవ్వడు ఏలాలో
ఎంపిక చేసేది నేనే
సహజ వనరులూ
చమురు నిక్షేపాలూ
ఎక్కడున్నా సరే
మా బహుళజాతి సంస్థల పరం కావాలి
అదే మరి "ప్రపంచీకరణ"

D D D

యుద్ధం ముగిసినట్లే
సద్దం ఆచూకీ తెలియదు
సుసంపన్న మోసపోటేమియా
సా పాదాక్రాంత మయ్యింది....
కానీ,
టన్నుల కొద్ది బాంబులు కురిపిస్తున్నా
చెక్కు చెదరని ఇరాకీల మనోధైర్యం చూసి
చకితుణ్ణవుతున్నా
ఓ సంశయనం నన్ను వెంటాడుతోంది
ఇరాక్‌ను గెలిచాను కానీ ఇరాకీలను గెలవగలనా
అప్పుడప్పుడో పీడకల నీడలా వెంటాడుతోంది
గల్ఫ్ మరో వియత్నాంగా మారిందని
అప్పుడు గజగజ వణికిపోతాను
కంటిమీద కునుకుండదు

V

# నా మదర్‌టంగ్ తెలుగే!

**కుమారస్వామి**

నా పాదాలు అవనీతలంపై
మస్తిష్కం సైబర్ స్పేస్‌లో
నేనెలా తెలుగు మాట్లాడగలను?
మిత్రుల కరచాలనంతో
గ్లాడ్ టు మీట్ టు యు అనకపోతే
నేనొక వెర్రిబాగుల వాన్ని!
విష్ యూ హ్యాపి వుగాదని చెప్పకపోతే
నేనొక ప్రవాసాంధ్రున్ని!



మైఖేల్ జాక్సన్ రాకతో పులకించిన
కూచిపూడి
తన పదగతుల్ని మార్చుకుంది
శాస్త్రీయ సంగీతం పరవశించి
నిలువెల్లా వంకరలు పోతోంది
పద్యం నిలువెల్లా విరిగి కరిగి
వీటి కనుగుణంగా
నృత్యం చేస్తోంది
ప్రపంచీకరణ ఘాతంతో
వ్రయ్యలయిన జీవిత మార్కెట్ శకలాల్లోంచి
నా మాతృభాష కొత్త టర్మినాలజీతో
రూపం మార్చుకుంటోంది
జానపదుల గుండె చప్పుళ్ళు
రిమోట్‌ల నియంత్రణలో
వినిపిస్తున్నాయ్
తెల్లతోలుకు తెలుగు ఆత్మను విక్రయించిన
బేహారులకు
కంప్యూటర్ కైవల్యమై
ఇంటింటా ఇంటర్ నెట్‌లను ఆవిష్కరిస్తుంటే
తెలుగు తియ్యదనంగా ఆంగ్లంలో
హొయలు పోతోంది
గాడ్ ప్రామిస్
నా మదర్ టంగ్ తెలుగే
చరిత్ర వద్దన్న మూర్ఖులకు
నవంబరు ఒకటి
కేలండరులో ఒక తేది మాత్రమే
మృత భాషను
అమృతం చేయాలనే ఛాందసబధిరనేతలకు
తెలుగు పోలికేక
వినబడుతుందా?

V

# సమీక్షా పర్వం


F సరిహద్దురేఖ

F ఊటబాయి

F మనోజ్ దాస్ కథలు

F కన్నీటి సీమ

F మత్తడి

F ఎందుకీ పనిపిల్ల?

F శేఫాలిక


అద్దేపల్లి రామమోహనరావు




## కవిత్వంలో 'సరిహద్దు రేఖ'లు

ప్రతి బలమైన కవికీ ఒక సొంతదనం (Identity) ఉంటుంది. ఎన్ని వస్తువుల్ని తన కవితల్లో గ్రహించనీ, కొన్నిటిలోనే అతని ఆత్మావిష్కరణ నిండుగా జరుగుతుంది. అభ్యుదయ విప్లవ కవిత్వాలు రాసే కొందరి సొంతదనం సామాజికం కావచ్చు. కవి శక్తియుక్తులకంటే భిన్నమైన విషయం ఇది. చైతన్యవంతుడైన కవి, విభిన్న వస్తువుల్ని గూర్చి బాగా రాయవచ్చు. కాని, అతని చైతన్యం ఎక్కడ కేంద్రీకరింపబడి ఉన్నది గమనించడం ఒక ఆసక్తికరమైన విషయం.

ఆధునిక తెలుగు కవిత్వంలో, సామాజిక ఉద్యమ కవిత్వంతోపాటు, ఒక అస్తిత్వ వేదనాత్మకమైన కవిత్వపు పాయకూడా ప్రవహిస్తూ వస్తోంది. అస్తిత్వవేదనాత్మక కవిత్వం రాసేవాళ్ళు ఎక్కువగా పాశ్చాత్య కవిత్వ ప్రభావితులు. అస్తిత్వానికి సంబంధించిన మౌలిక అంశాలు వీరి కవితల్లో ప్రతిబింబిస్తె మనిషిలోపలి ప్రపంచాల ఆవిష్కరణ, అకారణమైన దుఃఖమూ, కొండొకచో మృత్యుప్రేమ, సామాజిక సన్నివేశాన్ని కూడా తన వేదన ద్వారా వ్యక్తీకరించడమూ, ప్రకృతి సౌందర్యం – మొదలైన అంశాలు ఈ విధమైన కవిత్వంలో కనిపిస్తె అజంతా, మోల మీదుగా ఇలాటి కవిత్వం ప్రవహిస్తూ వచ్చింది. 1980ల నుండి ఈ భావధారచేత ప్రభావితులైన యువకుల్లో అఫ్సర్, యాకూబ్‌లు బలమైన ఆవిష్కరణలతో ముందుకు వచ్చారు. అఫ్సర్ 'ఇవాళ', యాకూబ్ 'ప్రవహించే జ్ఞాపకం' అస్తిత్వ వేదనాత్మక భావాల్ని బాగా ప్రతిఫలింపజేసినై. యాకూబ్‌లో మృత్యు ప్రేమ వస్తువులేదు. అనుబంధాల ప్రభావం, ఆర్ద్రతాపూరితమైన అభివ్యక్తి, సున్నితమైన భావచిత్రాలు, జీవనతత్వ అన్వేషణ–మొదలైనవి యాకూబ్‌లోని మౌలిక లక్షణాలు.

1990లు దాటిన తర్వాత, చాలా మంది ఇలాటి కవుల్లో కొత్త విధమైన సామాజిక భావాలు కూడా మిళితమైనాయి. వర్గపోరాట భావాలు ఉధృతంగా ఉన్నప్పుడు కూడా, తమ ధోరణి తమదిగా రాసుకుపోయిన ఈ కవులు, 90ల తర్వాతి ప్రభావాల్నించి దూరంగా ఉండలేకపోయారు. ఈ ప్రభావాలు వారి సామాజిక అస్తిత్వానికే సవాలుగా ఉండడంతో, ఇవి కూడా వారి కవిత్వంలో ప్రధానాంశాలు అయినాయి. స్త్రీ, దళిత, మైనారిటీ వాదాలు, మరీ ముఖ్యంగా సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలూ వారికి కవితా వస్తువులుగా స్వీకరింపవలసినవే అనిపించినాయి. ఆ భావధారకి సంబంధించిన పెద్ద వారిపై వీటి ప్రభావం ఎక్కువగా ఉండకపోవచ్చుగాని, యువకులు మాత్రం అనివార్యంగా ఈ వాదాల్ని తమలో కలుపుకున్నారు. ఇలాటి సంకీర్ణ నేపథ్యంలోనించి వచ్చిన కవితా సంపుటియే యాకూబ్ 'సరిహద్దు రేఖ'.

II

మొదటనే చెప్పినట్లుగా అస్తిత్వ వేదన విషయంలోయాకూబ్ చాలా బలమూ, ప్రత్యేకతా కలిగిన కవి. ఇది సామాజిక అస్తిత్వం కాదు. ఆత్మాశ్రయమైన అస్తిత్వం. తన మీదుగా కాలాన్నీ, ప్రకృతినీ, జీవితాన్నీ అన్నిటినీ వ్యాఖ్యానించే ఒక లక్షణం. ఈ విషయంలో యాకూబ్ అభివ్యక్తిలో చెప్పుకోదగిన ఎన్నో కోణాలున్నాయి.

వేదనని వ్యక్తీకరించడంలో యాకూబ్‌కి ప్రత్యేకత ఉంది. ఈ భావధారలోని కవులలో అస్పష్టత, వినిర్మాణాది అవాంఛనీయ లక్షణాలుండడం సహజం. యాకూబ్ 'మబ్బు'లాటి కవితల్లో కొంత అస్పష్టత ఉన్నా, మొత్తం మీద చాలా తక్కువ. చాలా స్ఫూర్తిమంతమైన భావచిత్రాలతో, ప్రతీకాది సామగ్రితో, జీవన మౌలికతత్వ అన్వేషణతో యాకూబ్ కవితలు కొనసాగుతాయి.

'బహుశా మనిషెప్పుడూ ధారగా కురుస్తున్న వర్షం
రాత్రులకూ పగళ్ళకూ మధ్య సంచరిస్తూ
అన్నీ కోల్పోయిన నెత్తుటి గుడ్డు
ఎదురు చూస్తుంటాం
దేహాలు కుబుసాలు విడిచి చుట్టూ మూగుతాయి...
చివరికి అనుభవాల విత్తనంలోంచి
మళ్ళీ మళ్ళీ మొలకెత్తుతూనే ఉంటాయి'

అనుబంధాల్ని, అనుభూతుల్ని చెప్పడంలో మొదట్నించీ యాకూబ్‌కి తన ప్రత్యేక శైలి తనకుంది. ఆర్ద్రత, వాస్తవికత, తాత్వికత – మొదలైనవన్నీ సమ్మిళితమై పాఠకుణ్ణి కదిలించగలదు. తాను దూరంగా ఉన్నప్పుడు తల్లిపడే వేదన గూర్చిన 'ఇటీవలి బాధ'లో ఈ లక్షణాలు గమనించవచ్చు.

'దొరక్కుండా
పిలిస్తే పలకకుండా ఇంత దూరాన దాక్కున్నాననే కదూ
నే కలిసినప్పుడల్లా తన కొడుకుని
నాలో కాక నా కొడుకులో వెతుక్కుంటుంది!
మనం మనలోగాక
ఇతరుల్లోనే ఎక్కువగా దొరికిపోతాంగదూ!'

తాత్వికమైన అనేక నిర్వచనాలు, సంక్షిప్తంగా చెప్పబడిన విస్తృత భావాలు అడుగడుగునా యాకూబ్ కవితల్లో మనల్ని ఆలోచింపజేస్తాయి.

'ఈ కాలానికి చిరునామాలేదు
ఇది ప్రశ్నల్లోంచి ప్రశ్నల్లోకే పయనిస్తున్నది'
'క్రిక్కిరిసిన రైలు డబ్బాలో కూచునేచోటుకోసం
వెతుక్కున్నట్లు
జీవించాల్సిన జీవితం కోసం ఓపిగ్గా వెతుక్కోవాలి'

III

సమకాలీన సామాజిక అస్తిత్వ వైరుధ్యాల్ని కూడా యాకూబ్ ఈ సంకలనంలో ఎక్కువగానే స్వీకరించాడు. కులం, మతం, లైంగికత్వం, ప్రాంతీయత మొదలైన అంశాలన్నీ ఈ సంపుటిలో ఉన్నాయి. ఆత్మాశ్రయ, సామాజిక అస్తిత్వాలు రెండూ మిళితమైన కవితా సంపుటుల్ని, ఒకప్పుడు ఊహించగలిగే వాళ్ళంకాదు. ఈ రోజుల్లో ఇలాటివి చాలా వస్తున్నాయి. ఇలాటి కవితల్లో యాకూబ్ అభివ్యక్తి భిన్నంగా ఉండడం, వస్తువుకి తగిన సమకాలీన శైలిని అనుసరించడం, సంతోషం కలిగించే అంశమే.

వివిధ సామాజిక శ్రేణులు, తమ అణిచివేతను ప్రతిఘటించడం ప్రారంభమైన తర్వాత, సమష్టిగా జరిగిన పోరాటాల నుండి, అంతర్భేదాల గూర్చిన సమస్యలూ, తిరుగుబాట్లు కూడా క్రమంగా స్పష్టపడ్డాయి. ముస్లిం సంస్కృతి అంతా ఒకటే అనుకునే భావంలోని అసమంజసత్వాన్ని గూర్చిన ఒక సాంస్కృతిక సమస్యను గూర్చి, ఈ సంకలనంలోని మొదటి కవిత 'అవ్వల్ కలిమ' వాస్తవికతను, ఆవేదననూ, ఆగ్రహాన్నీ కలబోసి రాసిన ఉత్తమ కవిత. వృత్తిని కులమై కరచిన మైనార్టీల్లోని ఒక విభాగానికి ప్రతినిధిగా యాకూబ్ ఇలా ప్రశ్నవేస్తాడు.

'మీరన్నట్లు అందరమూ' ముసల్మానులమే
కాదనం–కానీ ఈ వివక్షసంగతేమిటి?...
మీరు మనదనే భాష మాకు రాదు
చివరికిలా మాతృభాషలేని సంకటంలో పడ్డాం
తెలుగులో మాట్లాడి వెలివేయబడ్డాం.

తాము సమగ్ర ముస్లింలుగా ఎదగలేకపోవడానికి కారణం చెప్తూ కవితను ముగించినప్పుడు, అనివార్యంగా వర్గస్పృహ వచ్చింది.

'ఆత్మగౌరవం అందరి ముందు పరచిన దస్తర్‌ఖాన్
అది అయినింటి వాళ్ళు మాత్రమే అనుభవించే హక్కుకాదు'

ఏ సాంస్కృతిక దోపిడీలోనైనా, ఎన్ని అంశాలు ప్రధానంగా ఉన్నా, వర్గస్పృహ మౌలికంగా ఉంటుంది. వర్గస్పృహ ప్రధానమైన మార్క్సిస్టు అవగాహనతో చూడకపోతే, ఎన్నో సమస్యలకు సమాధానాలు రావు. సామ్రాజ్యవాదం చేసే దోపిడి, ముందు ఆర్థికమై, తర్వాత జాతులు వాటి స్వయం వ్యక్తిత్వాల వినాశనం అవుతోంది. గతితార్కికమైన అవగాహన లేకపోతే, కవిత్వంలో వాస్తవికత వక్రమయ్యే అవకాశాలు ఎక్కువ. యాకూబ్‌లో కూడా ఈ దోషం కొన్ని కవితల్లో ఉంది. 'పెంజీకటి' అనే కవితలో సామ్రాజ్యవాద సాంస్కృతిక దోపిడిని గూర్చి, గ్లోబలైజేషన్ దుష్ప్రభావాన్ని గూర్చి అద్భుతంగా చెప్పాడు. అయితే, 'స్థలం : మెలోడీ' అనే కవితలో మెహదీహసన్, గులాం అలీల్ని గూర్చి చెప్తూ

'నాలోపల దాగిన సంగీతజ్ఞానమంతా
నా ఎదుట సాక్షాత్కరిస్తున్న సందర్భం'

అని పరవశిస్తాడు. అదే 'రహమాన్' గురించి అంతకంటే గొప్ప కవితానుభూతిపరమైన కవిత రాస్తాడు. మెహదీహసన్, గులామలీ – భారతీయ సంగీత మాధుర్యాన్ని 'లాజవాబ్'గా ప్రపంచమంతా నింపుతున్న వాళ్ళు. ఎంత సంగీత శాస్త్రజ్ఞుడైనా, పాప్‌లోకీ, హాలీవుడ్‌లోకీ చేతులు చాచే వ్యక్తి రహమాన్. గొప్పతనాన్ని చెప్పినా, సామ్రాజ్యవాద అవగాహనను కూడా ప్రతిఫలింపజేయాలి. 'కామసూత్ర' లాటి వాటిని ప్రత్యేకించి అనుభూతితో కవిత్వం రాయడమెందుకు? అవన్నీ మొత్తం మన సమాజాన్ని దురాక్రమించబోతున్న పాశ్చాత్యలైంగిక ధోరణుల ప్రతిరూపాలు. అనుభూతి, సొంతదనం అవగాహనకి అడ్డురాకూడదు. అలాగే దీపా మెహతా నేపథ్యంలోని విషయాల్ని కూడా చూడాలి.

ఆత్మాశ్రయ అస్తిత్వవేదనను చెప్పినా, సామాజిక అస్తిత్వ వేదనను చెప్పినా, యాకూబ్ కవితాభివ్యక్తి ప్రత్యేకమైంది. 'సరిహద్దురేఖ' ఇటీవల వచ్చిన కవితా సంకలనాల్లో మొదటి వరసలో నిలుస్తుంది.

**జి. వి**




## గ్రామీణ సంక్షోభానికి సజీవ దర్పణం

ఇటీవలి కాలంలో ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల ఫలితంగా ప్రజల స్థితిగతులు అతివేగంగా దిగజారిపోతున్నాయి. అట్టడుగు వర్గాల బ్రతుకులు మరీ దుర్భరమవుతున్నాయి. ఈ పరిణామం పట్టణ ప్రాంతాల్లో ఒక రకంగా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో మరోరకంగా ఉంటున్నది. ప్రాంతాలతో కూడ దీనికి నిమిత్తం లేదు. చిన్న చిన్న తేడాలుండవచ్చు, తీవ్రతలో మార్పులుండవచ్చు. కానీ ఈ పరిణామం స్వభావం అంతా ఒక్కటే. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందే క్రమంలో చేతివృత్తులకు కాలం చెల్లిపోయింది. రైతులు దివాళా తీసి భూములు కోల్పోయి కూలీలుగా మారిపోతుంటే, భూస్వాములు తమ భూములు మరింతగా పెంచుకుంటున్నారు. ఇప్పుడు కొత్తగా కార్పొరేట్ వ్యవసాయం, కాంట్రాక్టువ్యవసాయం రంగప్రవేశం చేస్తున్నాయి. గతంలో ఫ్యూడల్ పెత్తందార్ల జులుం కొనసాగితే ఇప్పుడు మారిన పరిస్థితుల్లో రూపాంతరం చెందిన గ్రామీణ పెత్తందార్లు మరో రూపంలో అంతకన్న తీవ్రంగా దాన్ని అమలు జరుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో బడుగుజనం బ్రతుకుబండి ఈడ్వడం దుస్సాధ్యమై పోయింది. ఈ పరిణామాలను "ఊటబాయి" కథాసంకలనంలో పెద్దింటి అశోక్ కుమార్ కడు హృద్యంగా వివరించారు. రచయితకు గ్రామీణ జీవితంతో ప్రత్యక్ష పరిచయం ఉంది. కథలన్నీ తెలంగాణా ప్రాంతానికి చెందినవి కాబట్టి ఆ మాండలికాన్ని వాడటం సహజత్వాన్ని సమకూర్చింది.

పెట్టుబడులు భారీగా పెరిగిపోయి, ప్రభుత్వసాయం తగ్గిపోయి వ్యవసాయం ఏ మాత్రం గిట్టుబాటుకాక రైతు తేరుకోలేని అప్పుల పాలయితే, ఆ పైన వరుస కరువులు వచ్చిపడితే పరిస్థితి ఎలా ఉంటుందో తేలిగ్గానే ఊహించుకోవచ్చు. ఈ పరిణామం ఆర్థిక పరిస్థితి పైనే కాకుండా, మానవ సంబంధాలపై కూడ తీవ్రమైన ప్రభావం చూపుతుంది. ఈ

పరిణామానికి దర్పణం "తండ్లాట" కథ. ప్రధాన పాత్ర ధారి రాములు ఇలా వాపోతాడు, "పైస పాదుగాను, చూసినావు. పాణమంటి సుట్టాన్ని వగచేత్తది. అట్టనా ఇట్టనా అంటలేదు సూడు. బాకీ ఎగవెదుతననుకుందా...? ఇద్దరు ఒకటే తల్లికి పుట్టిరి. ఒకటే జాగల పెరిగిరి. ఇప్పుడు చూడు. పద్మ కిస్మత్ ఎట్లుంది. మా కిస్మత్ ఎట్లుంది. దేనికైనా బాకీ కావాలె..." రైతుల పరిస్థితి ఇదయితే, గొర్రె కాపర్ల దయనీయ పరిస్థితిని "ఇగురం" కథ గుండెల్ని పిండేసేలా వివరిస్తుంది. "ఊరికి అడివికి మధ్య మంద. మందలో గొర్రెలా... మేకలా... ముడుచుకున్న గొల్ల.అటు అడివి జంతువుల కండ్లు, ఇటు ఊరి దొరల దొంగల కండ్లు మందమీదనే. తోడేలు తప్పితే దొంగలు, దొంగలు తప్పితే గోండ్రుగాడు. ఇవి తప్పితే అప్పుసప్పు ఇచ్చి ఆదుకున్న దొరలు. పైగా వచ్చే రోగాలు." చేతివృత్తి దారుల పరిస్థితికి దర్పణం "కాగుబొత్త" కథ. కుమ్మరి చేసే కుండలకు గిరాకీ లేకపోయినా, దేవుడి ఉత్సవంలో జనానికి నీళ్ళు పోయడానికి పెద్ద సంఖ్యలో భారీ కుండలు అవసరమని పెత్తందార్లు చెప్పిన మాటలు నమ్మి ప్రాణాలు బిగపట్టుకొని కుండలు తయారు చేస్తాడు వయసు మీరిన లింగం. తీరా అన్నీ పూర్తయ్యాక పెత్తందారు దగ్గరి కెళితే "అరే...ఆముచ్చట నీకు మొన్ననే చెబుదామకొని మర్చిపోయిన. ఈ జాతర చెయ్యవట్టి ఆగమాగమయింది. కాగులు కొంటే నాలుగయిదు వేలయితది. దాంట్లో నీల్లు తెచ్చి నింపుడుకు టాక్టరు కిరాయి గావాలె. మొత్తం ఏడనిమిది వెయిల కర్చు. అయితమాయె పెదుదామనుకున్నం. మొన్ననే నీ కొడుకు వచ్చి అక్కడ నీళ్ల ప్యాకెట్లు అమ్ముకుంటనన్నడు. అమ్ముకున్నందుకు మాకే రెండువెయిలు ఇస్తన్నడు. అదే నయమనుకొని కమిటీ మెంబర్లు ఒప్పుకుప్పరు." అంటూ చావుకబురు చల్లగా చెబుతాడు. కూలినాలి చేసుకునేవారి పరిస్థితి మరీ దారుణంగా మారింది. యాంత్రీకరణ ఉపాధిని హరించివేసింది. రైతుల కల్లాలనుండి ధాన్యాన్ని గాడిదలమీద చేరవేసే సాయిలు ట్రాక్టర్ల రాకతో ఉపాధి కోల్పోవడాన్ని "వలస పక్షులు" కథ వివరిస్తుంది. ఉత్పత్తిలో పాలుపంచుకునేవారి పరిస్థితే ఇలా ఉంటే, వారిపై ఆధారపడి బ్రతికేవారి పరిస్థితి మరెంతో హీనంగా మారింది. వారి గురించిన కథలు కూడ ఈ సంకలనంలో ఉన్నాయి.

కార్పొరేట్ వ్యవసాయం, కాంట్రాక్టు వ్యవసాయం దుష్ఫలితాల గురించి వివరించడానికి "కీలుబొమ్మలు" కథలో రచయిత ప్రయత్నం చేస్తాడు. పురుగుమందులు విపరీతంగా వాడటం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో కొంచెం విపరీతమయిన రీతిలోనే రచయిత వర్ణిస్తాడు. వూళ్లో నీళ్ల లేకుండాచేసేలా వాగులో ఇసుకను దబ్బులకాశపడి కంట్రాక్టుకివ్వడాన్ని ఆపడానికి, తరతరాలుగా ఆవూరి బాగుకోసం పాటుపడుతున్న కుటుంబానికి చెందిన ఓ పెద్దమనిషి చేసే విఫలయత్నం గురించి "పేగుముడి" కథ వివరిస్తుంది. ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా ఆశతో ముందుకు సాగాలనే ఆశాజీవి ముత్తయ్య కథ "ఊటబాయి". పెత్తందార్ల దాష్టీకాన్ని, దౌర్జన్యాన్ని ధైర్యంగా ఎదుర్కొంటుంది "సివంగి" కథలో పోసి. మొత్తంగా ఈ సంకలనంలోని కథలన్నీ తిరుగుబాటుతత్వాన్ని, పరిస్థితులకెదురొడ్డి నిలబడాలన్న ధైర్యాన్ని నూరిపోస్తాయి. అయితే రచయిత చెప్పినంత తేలిగ్గా ఇది సాధ్యమవుతుందా అన్న సందేహం మాత్రం కలుగుతుంది. ఏదేమయినప్పటికీ గ్రామీణజీవితంలో వస్తున్న తాజా మార్పులను, వాటి పర్యవసానాలను రచయిత సమర్థవంతంగా చిత్రించారనడంలో మాత్రం సందేహం లేదు.

(ఊటబాయి, కథలు, కచయిత పెద్దింటి అశోక్ కుమార్, నయనం ప్రచురణలు, సిరిసిల్ల-505301. పేజీలు 180, వెల రు. 100. ప్రతులకు అన్ని ప్రముఖ పుస్తకాలయాలు)

**కె.పి. అశోక్‌కుమార్**

---



## మానసిక విశ్లేషణతో "మనోజ్‌దాస్ కథలు"

సాహిత్య అకాడమీ అవార్డులందుకున్న మొదటి ఒరియా కథకుడు. పద్మశ్రీ మనోజ్‌దాస్. ఒరియా భాషా సాహిత్యంలో ఆయన చేపట్టని ప్రక్రియంటూ ఏదీ లేదు. మాతృభాష ఒరియాలోనూ, ఆంగ్లంలోనూ రాసిన కథల నుండి పద్నాలుగింటిని ఎన్నుకొని ఉపద్రష్ట అనురాధ తెలుగులోకి అనువదించారు.

మనోజ్‌దాస్‌గారి కథలు పాత్రల మానసిక ప్రవృత్తిని విశ్లేషించడంలో ఒక ప్రత్యేకతను నిలుపుకుంటాయి. వృత్తిపరంగా, వయసు పరంగా ఆయా సంఘటనల్లో పాత్రలు ఎలా ప్రవర్తిస్తాయో వాటిని చిత్రీకరించిన తీరు అబ్బురమనిపిస్తుంది. ముఖ్యంగా కళాకారులను పట్టి పీడించే గుర్తింపు చైతన్యం, వృద్ధాప్యంలో చోటు చేసుకునే ఒంటరితనం, కొందరిలో కనిపించే ఎగ్జిబిషనిజం, హిపోక్రసీలతోపాటు మన మెంటాలిటిని కూడా అద్భుతంగా చిత్రీకరించారు.

కళాతృష్ణలో జీవితాన్ని హరింప చేసుకున్న కళాకారుడు ఒకవైపు, పూర్వ వైభవం అంతరించి దారిద్ర్యంలో మగ్గుతున్న జమిందారు ఇంకోవైపు. క్షీణిస్తున్న ఆశ్రిత-పోషక సంబంధాలకు అతీతంగా కథ "బంగారు పతకం", వివిధ రంగాల్లో ఒకప్పుడు ప్రఖ్యాతులైనవారు కాలక్రమంలో తెరమరుగైనప్పుడు పొందే అస్తిత్వ వేదనకు 'విగ్రహం' ఒక ప్రతీక. వృద్ధుల జీవితాల్ని, వారి శారీరక అశక్తతలను చక్కగా వివరిస్తూ, ఒక సంతృప్తికరమైన విషయాన్ని తెలుసుకుని కన్నుమూసిన వృద్ధుడ్ని "వెన్నెల్లో వంతెనలో చూడవచ్చు. బుద్ధిమంతులుగా, ఆదర్శంగాచూపించిన రాయ్‌సాహెబ్, వాళ్ళ పిల్లలు సగటు మనుషులేనని తెలుసుకోవడం-సరిహద్దులను అతిక్రమించడం కంటే బంధాలను అతిక్రమించడమే క్షమించరానిదని తెలుసుకున్న రాయసాహెబ్ కథ "అతిక్రమణ" మనిషిలో ఒకసారి జొరబడిన అకారణ భయం వాళ్ళను ఎంతటి అశాంతికి గురి చేస్తుందో, నుయ్యి' కథలో వివరించారు.. తనసెంతో అశాంతికి గురి చేసిన ఆ నూతిలోనే నిద్రపోయే అలవాటు చేసుకున్న సదానంద, చివరికి పొద్దునే పూడ్చివేసిన ఆ నూతిలో సజీవ సమాధి అయివుంటాడా? అన్న ప్రశ్నను పాఠకుడికే వదిలివేసిన తీరు బాగుంది. వృద్ధాప్యంలో ఒంటరితనం, నిర్లక్ష్యం ఎంత భయంకరంగా వుంటాయో "మన మోబెర్లీ" తెలియజేయగా, ముసలివాళ్ళ చాదస్తాలను "సూర్యుడు అస్తమించాక"లో తెలుసుకుంటాం. ఆఫీసర్లను వెర్రివాళ్ళను చేసి ఒక ఆటాడించిన జనరల్ 'మనవరాలు' కథ ఎంత సరదాగా వుందో, ఒక బక్క ప్రాణి సాహసాలను చిత్రీకరించిన పుష్యరాజు గుర్రం అంత సరదాగానే వుంటుంది. భక్తి పేరుతో పారవశ్యంలో కనిపించిన వాడ్ని దేవుడిగా పూజించే "బ్రజగోపాల" భక్తుడా? మానసిక రోగా? అన్న విషయం పాఠకులే తేల్చుకోవాలి. గీత అనే చిత్రకారిణి అకస్మిక మరణంతో ఆమె మీద పరిశోధన చేస్తున్న గౌతమ్, ఆమెకు ఎందరు అభిమానులు వున్నా, ఆమె ఎవర్ని ప్రేమించలేదని తెలుసుకుంటాడు. ఆమె రాసిన 'ప్రేమలేఖ' కంటబడిందనే ఒక అబద్ధం చెప్పగా, ఆమెతో పరిచయమున్న నల్గురు వ్యక్తులు అది తమకే రాసిందన్న భ్రమతో దాన్ని కావాలని అడుగుతారు. చివరకు గౌతమ్ కూడా ఆ ప్రేమలేఖ తనకే రాసిందని బుకాయిద్దామనుకొని, చివరకు తన ప్రవర్తనకు సిగ్గుపడతాడు. అందం, ఆకర్షణల చుట్టూ తిరిగే పురుషాధిక్యపు ధోరణి ఈ కథలు ప్రస్ఫుటమయింది. చేయని నేరానికి 'హంతకుడి'గా ముద్రపడ్డ

వ్యక్తి ప్రజల దృష్టిలో హీరోగా గుర్తింపబడి చివరకు నిజం తెలిసి నవ్వులపాలు అవుతారు. ఇద్దరు అవకాశవాదులకు రాజకీయ సన్యాసం ఇప్పించిన "టోప్" కథ హాస్యంతో ఆకట్టుకుంటుంది. ఈ సంపుటాల్లోకెల్లా విశిష్టమైన కథ "ఓ దొంగతనపు కథ". కరవు బారినపడి తినడానికి తిండిలేక మాడుతున్న దశలో అనుకోకుండా తండ్రికి ఇరవై శేర్ల బియ్యం దొరుకుతాయి. తిండికి కరువై ఇంటికొచ్చిన కూతురికి కొన్ని బియ్యం ఇచ్చి పంపిస్తాడు. మిగిలిన బియ్యాన్ని ఎవరో ఎత్తుకుపోతుంటే గ్రామస్థులు తరమగా ఆ దొంగను పట్టుకున్న తండ్రి, ఆ దొంగతన కూతురేనని తెలుసుకొని అనుభవించిన హృదయక్షోభను చిత్రీకరించిన "ఓ దొంగతనపు కథ మన మన మనసులను కదిలిస్తుంది. కథలను హాస్య, వ్యంగ్యాత్మకంగా తీర్చిదిద్దడంలో ఆయన చూపిన నేర్పు ప్రశంసనీయం. చివర్లో కథలకిచ్చిన ట్విస్టు, కొన్ని కథల ముగింపును పాఠకులకే వదిలేయడంలో రచయిత తనదైన ముద్రను సాధించగలిగాడు. వీరి కథల్లో గ్రామీణ వాతావరణం, స్వాతంత్ర్యం ముందు–తర్వాత చోటు చేసుకున్న పరిణామాలను, ఒరిస్సాను కల్లోలం చేసే కరువు పరిస్థితులను, పల్లె రాజకీయాలను, జమీందారీ వ్యవస్థను వాళ్ళకు కట్టినట్లుగా చిత్రీకరించారు. స్వతంత్ర కథలనిపించే విధంగా ఈ కథలను అనువదించిన ఉపద్రష్ట అనురాధగారి కృషి ప్రశంసనీయం.

**– కె.పి. అశోక్‌కుమార్**

("మనోజ్‌దాస్ కథలు" అనువాదం ఉపద్రష్ట అనురాధ, ప్రచురణ మరియు ప్రతులకు : యు. బాల త్రిపుర సుందరి, ధర్డ్‌స్ట్రీట్, బద్రిరాజ్‌నగర్, గుసాణినురా గావ బదంపుడు, ఒరిస్సా, వెల రు.60, పేజీలు 118)

---

**మల్లంపల్లి విజయకుమార్**



## ఈశ్వరుడి సీమ కన్నీరు

ఆధునిక కవిత్వంలో వ్యక్తిత్వ సమస్యలతో రాసిన కవిత్వమంతా ఎక్కువగా నగరవాతావరణం చుట్టూ ఏకీకృతమైంది. ఇటువంటి స్థితిలో పల్లెసీమ నేపథ్యం నుండి వచ్చిన డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి రాసిన కవితా సంపుటి 'కన్నీటిసీమ'.

ఈనాటి కవి చేస్తోంది అస్తిత్వ పోరాటం. తన ఉనికిని కనుక్కొనే అంతర్ముఖత్వ వైఖరే బాహ్యం దాకా విస్తరించి కవి చేత సత్యవివేచనను చేయిస్తుంది.

"చావుకీ–బ్రతుకీ మధ్య
రూపాయి నాణెం చివరి అంచుగా మారినచోట
చెమట విలువ శూన్యంలోకి జారిపోయింది
యాంత్రిక వ్యవస్థకు సామాన్యుడు వెగ్గటైపోయాడు"
ప్రాంతీయ వాస్తవికతల్ని మన ముందుంచుతూ

"... మా కళ్ళలో వుబికే అన్ని నీళ్ళు
మా ఊరి బావుల్లో ఊరితే
ఆశలొదిలేసిన ఎముకల గూళ్ళలో
మృత్యువు సాలెగూళ్ళు కట్టేది కాదు"

అంటూ విషాదపూరిత జీవన వాస్తవికతను కళ్ళ ముందుంచుతాడు.

రాయలసీమపై అల్లిన రత్నభేషజాల్ని తునాతునకలు చేస్తాడు.

'నా కొక పల్లె కావాలి' అన్న దీర్ఘ కవితలో నిష్కల్మష గ్రామీణ జీవితాన్ని ఆహ్వానిస్తాడు. ఈ కవిత మూడు విభాగాల్ని పోషించింది. 1. నగరీకరణపట్ల అసహ్యం. 2. రాయలసీమ గ్రామీణ జీవనం, 3. పల్లెలోని ప్రకృతి అందం. నగర అహంకారాన్ని, కలుషిత వాయుగుండాల్ని, అలగాజనం దూషణాన్ని, అవసరాలకోసం అతికించుకునే దొంగనవ్వుల్ని ఎండగడుతూ మొదటి విభాగం సాగిపోతుంది. రెండో విభాగంలో వీధి అరుగుల ఆప్యాయతలు, ముత్తాతలా నిలబడి ఆహ్వానించే మర్రిచెట్లు, ఆత్మబంధువుల్లా పలకరించే పల్లె పిల్లలు, కరువు గడ్డకు రాతి కండనిచ్చిన రాగి సంగటి, ఇంటి గడపల ముందు నాట్యం చేసే కంచి వరద రాజుల గొబ్బిపాటలు, ఆకలి పొద్దుల్ని చవి చూడని బిక్షగాడి విలాపం, మొదలైన అంశాలు మనసును పెనవేసుకుంటాయి. మూడో విభాగంలో పల్లెలోని ప్రకృతి అందాల్ని దర్శించవచ్చు.

పల్లె సంస్కృతి ఛిద్రం కావటాన్ని కవి జీర్ణించుకోలేకపోతాడు. వినాశక హేతువుల్ని చూపిస్తూ

"ఊరిలో తలదూర్చిన టెలివిజన్
కేబుల్ తోకతో ఊరిని పట్టి బిగించి
పల్లె కళను ఊరవతలకు కక్కించింది" అంటాడు. పల్లెతల్లిని

కాటేసిన విష సంస్కృతిపై నిరసన వ్యక్తం చేస్తాడు. 'నీళ్ళింకి పోయి పగుళ్ళు పడ్డ ఊరి చెరువు'ను చూపించి పల్లె కూలి పోవడానికి కారణం కరువా? నగరీకరణమా? అనే సందిగ్ధానికి లోను చేస్తాడు. చివరకు రాజకీయ నక్కలు ఎక్కడానిక్కూడా వీలుపడని ఉన్నతమైన పల్లెకావాలని కోరుకుంటాడు.

పంటల సీమంతం, ఎక్కిళ్ళ నిప్పులు, అక్రమదారాలు, పైరు చీర వంటి పదబంధాల్లో కొత్తదనం కనిపిస్తుంది. ఆస్తుల కట్టలు, కాంక్రీటు అడవి, మతగిరులు, చీకటి దివాణం వంటివి వైరి సమాసాల్తో కూడుకన్న పదబంధాలు. 'ఏనుగులా పడుకొన్న సిద్ధప్పకొండ', 'నోటి ఆశను పాశంతో కట్టిపడేసి' వంటి ఉత్ప్రేక్షలు బాగున్నాయి. గాలి తువాలు, లంచం పడగ, వెన్నెల వెన్న, పాటల కుచ్చిళ్ళు, ఉద్యోగ అరుంధతీ వంటి పదాల్లోని ప్రతీకలు బాగా అతికిపోయాయి.

మొత్తం మీద ఈ సంపుటిలో పల్లె వాతావరణం ప్రధాన పాయలా చొచ్చుకు పోయింది. మధ్యమధ్యలో సూడాన్, గురువు, నందిని వంటి కవితలు భిన్నకోణాలకు రూపాలుగా కనిపిస్తాయి. సమకాలీన సామాజిక నడతకు అద్దం పట్టిన ఈ కృతి విద్వాన్ విశ్వం రాసిన సీమ కవిత్వానికి కొనసాగింపుగా ఉంది.

---

**తిరునగరి శ్రీనివాస్**



## వైరుధ్య భావాలను ఎండగట్టిన 'మత్తడి'

భిన్న, విభిన్న అభివ్యక్తిగల కవుల కొరత తెలంగాణా ప్రాంతంలో లేదని నిరూపిస్తూ బలమైన కవి గళాన్ని విన్పించింది 'మత్తడి'. బహుముఖ విస్తరణ కలిగిన తెలంగాణకయిత వాడి, వేడి, శాశ్వతత్వాన్ని పట్టిచూపే ఎవితలెన్నో ఈ సంకలనంలో చోటు చేసుకున్నాయి. తెలంగాణా కవులు ప్రాచుర్యంలోకి రాని పరిస్థితిని మత్తడి గుర్తు చేసి సాహిత్య సాంస్కృతిక రంగాలలో ఆధిపత్యధోరణి చెల్లుబాటును నిరసించింది. సుంకిరెడ్డి నారాయణరెడ్డి, అంబటి సురేంద్రరాజు సంపాదకత్వంలో తెలంగాణా సాంస్కృతిక వేదిక ప్రచురించిన మత్తడి సంకలనంలో 258

మంది కవుల కవితలు చోటు చేసుకున్నాయి. 'ఈ సంకలనం నిండా తెలంగాణా కవిత్వం మాత్రమే వుంది, తెలంగాణా వాద కవిత్వం లేదు' అని సంపాదకులు స్పష్టం చేస్తూ రాజకీయ ఆర్థిక భావజాలం తాత్విక దృక్కోణంగా రెంటి మధ్య వైరుధ్యం చూడడం సబబు కాదన్నారు. తెలంగాణా కవిత్వం అంటే 'కేవలం' తెలంగాణ కవిత్వాన్ని కోరుతున్న వారు చెబుతున్న తెలంగాణ వాద కవిత్వం కూడా అంటూ రెంటి మధ్య కృత్రిమ గీత కవులను స్వయం ప్రతిపత్తిలేని పరాధీనులను చేయడానికే తోడ్పడుతుందని సంపాదకులు తమ మాటలో చెప్పారు. ఈ సంకలనంలో గప్పుడు (1917–1952), గానడుమ (1952–1998), గిప్పుడు (1995–2002) అన్న విభాగాలలో కవులను చేర్చి వారి కవితలను ప్రచురించారు. 'గప్పుడు'లో బూర్గుల రామకృష్ణారావు మొదలుకొని సిరిప్రెగడ భార్గవరావు వరకు 56 మంది కవులు, 'గానడుమ'లో దాశరథి, కాళోజీ, డాక్టర్ నారాయణరెడ్డి నుండి సీతారాం వరకు 77 మంది కవులు, 'గిప్పుడు'లో కొంపెల్లి వెంకట్ నుండి పుప్పాల మట్టయ్య వరకు 125 మంది కవుల కవితలు కవిత్వంతో తెలంగాణా ప్రాంతానికి అనాది నుంచి పెనవేసుకున్న పేగుబంధాన్ని వ్యక్తీకరించాయి. ఈ సంకలనంలోని ఆధునిక కవుల కలాలన్నీ అన్యాయంపై ఆగ్రహ జ్వాలలన్ని కక్కాయి. ఆధిక్యతా భావాన్ని ప్రశ్నించాయి. అభివ్యక్తిలోనూ, దృష్టి కోణంలోనూ ప్రతికవితలో సృజనశీలతతో కూడిన విశిష్టత కన్పించింది. ఎన్నో కవితలలో తెలంగాణ మాండలికం, పలుకుబడి సహజంగా వ్యక్తమైంది. వీరతెలంగాణా విశిష్టతను తెలిపే కవితలతోపాటు కొన్ని పాటలు కూడా సంకలనంలో చోటు చేసుకున్నాయి. 'గిప్పుడు' విభాగంలో 1995 నుండి 2002 వచ్చిన కవితలు వస్తువైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ తెలంగాణా వెతల్ని, అన్యాయాల్ని చెబుతూ ఆర్ద్రమైన రీతిలో చిత్రించి అనాగరక వాతావరణాన్ని ఎండగట్టాయి. ముస్తాదులు కదులుతున్నాయి. అన్‌ఫర్టిలైజ్డ్ ఓవమ్, మామట్టి మీద నిలబడి, బేతతొక్కుడే, కోటి గాయాలనేల, పల్లెకన్నీరు, తెలంగాణలొల్లి, విరలేశ్వరా, హోళీల రంగహోళీ, ఘల్లు ఘల్లు, పురుగు ముట్టిన భూమి, నీటి పిట్ట, పోగులగూడు, అందాలమ్మపానం, నేను గిట్లనే మాట్లాడుతూ ఆదుకృతక భాషంటడు, దాలి, గుక్క, ఇగురెయ్యని మోదు, వేలవడగండ్ల వాన నా తెలంగాణ, మంగులం, బ్లోఔట్, దేవులాట, కోటొక్కచేతుల కొట్లాట, బతుకమ్మ బతుకు వంటి ఎన్నెన్నో కవితల్లో తెలంగాణ బతుకు చిత్రంలోని అనుభూతులు, ఆర్ద్రతలు, ఆవేదనలు, ఆగ్రహాలు బలంగా విన్పిస్తాయి. ఆధునిక కాలంలో వచ్చిన తెలంగాణ కవిత్వాన్ని సమగ్రంగా సంకలనంగా తేవడానికి సంపాదకులు చేసిన ప్రయత్నం 'మత్తడి'. వైవిధ్యం, నిర్దిష్టత, వైశాల్యం నిలువెత్తున తెలంగాణ కవిత్వంలో ఉందని నిరూపించేందుకు 'మత్తడి'ని ఉదాహరించవచ్చు. ఇంకా దృష్టికి రాని కవితలు, దొరకని కవితలు సేకరించి సర్వసమగ్ర సంకలనంగా రెండో ముద్రణలో మత్తడిని రూపొందిస్తే బాగుంటుంది.

('మత్తడి'–తెలంగాణకయిత, సంపాదకులు :సుంకిరెడ్డి నారాయణరెడ్డి, అంబటి సురేంద్రరాజు, వెల–మేలుప్రతి రు.300, సాదా ప్రతి రు.125, పుటలు : 579, ప్రతులకు సహచర బుక్ హౌస్, హైదరాబాద్ లేదా సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ప్లాట్ నెం.69, సాయినగర్, డి.వి.కె. రోడ్, నల్గొండ.)

**కె.పి.**




## ఎందుకీ "పనిపిల్ల"?

**1994లో** తుమ్మేటి రఘోత్తమరెడ్డి రాసిన "పనిపిల్ల" కథ, పి.రామకృష్ణారెడ్డి లేవనెత్తిన ప్రశ్నలతో తదనంతరకాలంలో బోలెడంత చర్చను సృష్టించింది. ఆ కథను, దాని మీద వచ్చిన పూర్తి చర్చను కలిపి పుస్తకంగా వెలువరించడం మంచి ప్రయత్నమే కానీ, దాన్ని ఇంత అలస్యంగా వేయడంలో సాధించదల్చుకున్న ప్రయోజనమేమిటో అంతుపట్టదు. ఈ చర్చనంతా ఒక దగ్గర రికార్డు చేయాలన్న తాపత్రయంలో, ఇవాళ్టి పరిస్థితులలో ఈ చర్చంతా అవుట్‌డేటెడ్‌గా మారిపోయిందనే సత్యాన్ని గుర్తించకపోవడం ఆశ్చర్యమే.

నిజానికి పనిపిల్ల కథ కుటుంబ సంబంధాలు, భూస్వామ్య దోపిడి, గిరిజనుల తిరుగుబాటు అనే మూడు కోణాల నుండి చిత్రీకరింపబడింది. అయితే మొత్తం చర్చంతా కుటుంబ సంబంధాల చుట్టే తిరిగింది. కుటుంబంలో భార్యను వర్గ శత్రువుగా చిత్రీకరించిన భర్త మహేంద్రపాత్ర, అతని ప్రవర్తన పాఠకుల సానుభూతిని చూరగొనలేక పోయింది. కాబట్టే అది ఇంతటి చర్చను లేవనెత్తింది. ఈ చర్చ మార్క్సిస్టు, స్త్రీవాద దృక్పథాల్లోంచి సాగడంవల్ల ఎవరికి వారే తమ వాదనలకు అనువైన ఉదాహరణలిచ్చుకుంటూ ఈ కథను ఖండించడమో, సమర్థించడమో చేశారు. మహేంద్ర ఆలోచనల క్రమంగా కొనసాగిన ఈ కథలు మహేంద్ర పాత్రలోని ఎగ్జిబిషనిజం, హిపోక్రసీ, ఆధిక్యతా ధోరణులను పసిగట్టారు. గనుకే మహేంద్ర నిజాయితీని, అతని భావజాలాన్ని ప్రశ్నిస్తూ విమర్శించడం జరిగింది. రచయిత తరపున కథను విశ్లేషిస్తూ అల్లం రాజయ్య సమాధానమివ్వడానికి ప్రయత్నించారే తప్ప కథకుడు ఎక్కడా జోక్యం చేసుకోలేదు. ఈ చర్చ చివరన కథకుడిగా తన అభిప్రాయాలను కూడా చేర్చి ముగిస్తే బాగుండేదేమో! తమ వివరణ లేకపోతే మళ్ళీ చర్చను కొనసాగించే అవకాశముందని భావించారో, ఏమో తెలీదు. మొత్తానికి వర్గం, జెండర్‌కు సంబంధించి బోలెడంత సమాచారాన్ని ఈ చర్చ మనముందుకు తెచ్చింది.తెలుగు కథానికా సాహిత్యంలో "యజ్ఞం" కథ తర్వాత అంత విస్తృతమైన స్థాయిలో చర్చకు కారణమైన ఘనత మాత్రం నిస్సందేహంగా "పనిపిల్ల"దే.

("ఎవరీ పనిపిల్ల?" తుమ్మేటి రఘోత్తమరెడ్డి 'పనిపిల్ల కథపై చర్చ సంపాదకుడు ఠాకూర్ రాంసింగ్, మట్టి ముద్రణలు : అలగడప, నల్గొండ, వెల రు.45, పేజీలు 133. ప్రతులకు నవోదయ మరియు దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్)

**యాకూబ్**

## 'శేఫాలిక' - మానవతా విహారం




ప్రకృతిలో రచయిత ఒక భాగమై, వేదనై, రోదనై, నిరంతర సత్యాన్వేషకుడై, అంతర్ముఖీనుడై, ఆలోచనా మగ్నుడై జీవన పథనిర్దేశకుడై, నిష్కలంకమైన ఆత్మతో, అక్షరాల పలకరింపుతో కథల్ని మోసుకొచ్చిన 'బోయీ' దాసరి అమరేంద్ర.

సున్నితమైన మనస్సు, ప్రకృతి ప్రియత్వం, జీవితంలోని అన్ని పార్శ్వాల్నీ, ఆలోచనలనీ ఎలా అర్థం చేసుకోవాలీ, ఎలా జీవించగలగాలి? జీవితం అంటే ఏమిటి? ఏది నిజమైన జీవితం? ఆర్థిక సంబంధాల

కంటే ఆత్మీయానురాగాల ప్రాధాన్యత ఎందుకు? తృప్తంటే ఏమిటి? ఏది నిజమైన చదువు? చదువుకు కొలమానాలేమిటి? భద్రత అంటే ఏమిటి? సంతృప్తి అంటే ఏమిటి? జీవిత లక్ష్యం ఏమిటి? జీవన మార్గం ఏమిటి? ఇలా అనేకానేక ప్రశ్నలన్నింటినీ తనకుతాను వేసుకొని, పాత్రల నోట పలికించి, చర్చించీ, విమర్శించీ, విపులీకరించి, విశ్లేషించే ధోరణి ఈ కథల నిండా వుంది.

ఈ రచయితకు జీవితమంటే చాలా మమకారం. నేటి ఈ కాంక్రీటు మహారణ్యం లాంటి సమాజంలో విలువల్ని కోల్పోతున్న వ్యక్తులపట్ల ఆవేదన ఉంది. సాటి మనిషిని ప్రేమించగలిగినవాడు, ప్రకృతి ప్రియత్వంలోకి పయనించగలిగిన వాడు, వ్యక్తుల సంస్కారాల్ని గౌరవించగలిగినవాడు నిజమైన మనిషి అన్న భావ ప్రకటనను అనేక సందర్భాలలో వ్యక్తీకరిస్తూనే వచ్చారు.

మిత్రురాలి ఇంటికి వెళ్ళి లేక వెనుదిరిగి వచ్చేస్తూ, వచ్చేస్తూ పూల పలకరింపుతో ఆగిపోయి, ప్రతి పువ్వుతోనూ, రెమ్మతోనూ, కొమ్మతోనూ ఆ పాత్ర మాట్లాడే తీరును మనోహరంగా 'శేఫాలిక' కథలో చెప్పారు.

ఒక సున్నితమైన ఆలోచనా ధార, ఒక సున్నిత సంస్కారం కథలన్నింటా ప్రతిఫలిస్తూ వుంటుందని శ్రీపతిగారు (ముందుమాట) భావించినట్లుగానే ఈ కథల్లో, పద చిత్రాల్లో, ఊహల కొసమెరుపుల్లో, గులకరాళ్ళ మీద స్వచ్ఛంగా ప్రవహించే నీటి తేట జాడ విన్పిస్తూనే వుంటుంది.

ఈ 'శేఫాలిక'లో మొత్తం 18 కథలున్నాయి. శేఫాలిక, ఉషోదయం, చెదరగూడని స్వప్నాలు, బ్రతకనేర్వని వాడు, చదువు, సెలవుల్లో, జెండా ఉంచారహే హమారా! ఇలా వరసగా చెప్పుకుంటూ పోవడం కంటే, ఆ కథలన్నీ చదువుతూ పోతే ఒక మంచి పుస్తకాన్ని చదివామన్న అనుభూతిని కల్గిస్తుందిది.

ఏ ఇజాలజోలికే వెళ్ళకుండానే బతుకు నిజాల్ని ఒలికించిన 'జీవన్మృణ్మయి' ఈ కథలు. 'బ్రతకనేర్వని' కథలో మాధవుడి పాత్ర ద్వారా రచయిత చూపించిన జీవన విలువలు, ఆదర్శాలు రచయితలోని విలువలను పట్టిస్తాయి. "ఏ మాత్రం అవకాశమున్నా మనుషులు నిచ్చెన ఎక్కేసి అమెరికా చెక్కేసే ఈ రోజుల్లో మావాడు (మాధవుడు) అవకాశాలను వదులుకొని మట్టి పిసికి, చేపలు పట్టడానికి కుగ్రామం పోతున్నాడు. మామూలు మనుషులు సైతం తెలివిగా లకారాలు వెనకేస్తున్న ఈ రోజుల్లో శుభ్రంగా చదువుకుని పైకొచ్చిన కూతుళ్ళకు ఘనంగా ఉన్న ఇంటి కులపు కుర్రాళ్ళని కట్టబెట్టాల్సింది పోయి ఇంకో కులంవాడినీ, ఇంకో రాష్ట్రం వాడినీ, ఇంకో మతం వాడినీ, మరో నిరుద్యోగిని కట్టబెట్టాడు. కనీసం కట్టుకున్నదానినైనా చివరి రోజుల్లో సుఖపెట్టాల్సిందిపోయి మళ్ళీ మతిపోయే పల్లెటూళ్ళలోకి లాక్కుపోతున్నాడు.

బతకడానికి తెలివి ఉండక్కర్లేదు. వేపకాయంత వెర్రిబుర్రలో లేకుంటే అదే చాలు! కానీ ఓ నిజం చెప్పనా?! మా వాడిని చూస్తుంటే 'ఆకాశంబున నుండి... ' అన్న భర్తృహరితోపాటు 'ఇంతింతై వటుడింతయై....' అన్న పోతన్న కూడా ఎంచేతో గుర్తొస్తున్నాడు. ఎందుకో ఎంత ఆలోచించినా అర్థం కాదు!" అని ఈ కథను ముగిస్తాడు. నిజానికి రచయిత కథన నైపుణ్యం గురించి, అందులోని లోటుపాట్లను, గొప్పతనాన్ని ప్రత్యేకంగా వివరించకపోకపోయినా రచయిత ఎంచుకున్న వస్తువు, ఆ వస్తువులోని ఆదర్శం, ఆ ఆదర్శంలోని ఔన్నత్యం, ఆ ఔన్నత్యం సమాజానికి ఉపకరించే తీరు... ఈ అంశాలు కథను గొప్ప కథగా నిలబెడతాయి. అటువంటి గొప్ప కథలుగా చెప్పాల్సిన కథలు ఈ సంపుటంలో సగానికిపైగానే ఉన్నాయి. స్త్రీ పాత్రలపట్ల, స్త్రీ అభ్యుదయ దృక్పథంపట్ల రచయితకు ఈ పై ధోరణే ఉంది. ముందుమాటలో శ్రీపతి గుర్తించినట్లు విజయ, రాజేశ్వరి, జ్యోతి, సుజాత వంటి పాత్రలు స్త్రీచైతన్యానికి అద్దంపట్టిన పాత్రలుగా దర్శనమిస్తాయి. ఈ పాత్రలద్వారా రచయిత ఈపాటికే స్థిరపరిచిన లేదా స్థిరపడుతున్న స్త్రీ సంబంధిత విలువల్ని తన పాత్రలద్వారా బలోపేతం చేసేందుకు ప్రయత్నించారు.

'సారా జహాసే అచ్చా' కథా వస్తువును రచయితకు తన సహోద్యోగి చెప్పాడు. ఆ వస్తువులను అమరేంద్ర కథగా మలిచిన తీరు పాఠకుడిని కదిలిస్తుంది. దేశ విభజనలో జరిగిన క్రౌర్యాల్ని, దుర్మార్గాల్ని, రాజకీయ మూర్ఖత్వాల్ని మాత్రమే చరిత్రగా చెప్పుకుంటున్న వారికి ఈ కథలోని మానవత్వం వాస్తవాన్ని కళ్ళముందుంచుతుంది. జలంధర్ నుంచి ఫైజలాబాద్ చేరిన జలాలుద్దీన్, ఫైజలాబాద్‌లో మతమౌఢ్యం కోరలలో చిక్కుకోబోతున్న ఓంప్రకాష్ అగర్వాల్ కుటుంబాల్ని ఆదుకున్న తీరును కథకుడు అపూర్వంగా చిత్రించాడు. మతం కన్నా మానవత్వం, మనిషిలోని ఉన్నతత్వం గొప్పవనే సత్యాన్ని రచయిత చెప్పిన తీరు అమోఘం.

దాసరి అమరేంద్ర కథన శైలి ఆత్మీయమైంది. అంతకు మించి ఆయన ఎంచుకునే వస్తువులలోని అంశాలు సార్వకాలీన లక్షణాన్ని కల్గినటువంటివి. అందుచేత ఆయన సృష్టించే పాత్రలు సహజంగా కన్పిస్తూ, మన ఎదుట మాట్లాడుతున్నట్లుంటాయి. ఇదే రచయిత విజయం. ఇదే 'శేఫాలిక' గొప్పతనం కూడా.

**-యాకూబ్**

**(దాసరి అమరేంద్ర కథల సంపుటి : శేఫాలిక, మార్చి 2003, ప్రతులకు విశాలాంధ్ర, నవోదయ బుక్ హౌస్, దిశపుస్తక కేంద్రం,వెల :రు. 75/-)**

# సెల్సియస్

**అరుణ్‌సాగర్**

పరవశం
జ్వరమొక అనుభవం
మండిపోతున్న యవ్వనం
జ్వరం ముట్టించే అద్దం
రగుల్కొన్న జరరిక
చిన్నప్పుడు నీకు ఎర్రరిబ్బన్ కొనిపెట్టాను గుర్తుందా

జ్ఞాపకం
జ్వరమొక వాహకం
పాట వంటి సంతోషం
కాలిపోడంలో ఎంత అందం ఆనందం

హృదయం స్రవించిన రక్తం
జ్వరంతో తుళ్లితుళ్లిపడేంత చక్కిలిగింత గుర్తుందా

సూది మొన కింద పడినా వినిపిస్తుంది
నా పంచేంద్రియాలు వినడానికే వినియోగిస్తున్నాను

తొలిపాట దహించివేసింది
ఈ కవిత ఉష్ణమానిని
నిన్న సాయంత్రం కూడా వానలో తడిశాను
వేడివేడివాన

జ్వరమెంత ఆహ్లాదం
జ్వరపీడితుడి ప్రేలాపన
ఒక తత్వశాస్త్రం

# Dr. B.R. AMBEDKAR OPEN UNIVERSITY

**Prof. G. Ram Reddy Marg, Road No.46, Jubilee Hills,**
**Hyderabad-500 033**

Dr. B.R. Ambedkar Open University, the first of its kind in the country was established by an Act of the A.P. Legislature in 1982, has made higher education accessible to everyone in A.P., irrespective of age, geographical location, domestic or work responsibilities. **"Learning while Earning"** is made possible with the University's motto **"Education at Your Doorstep"**. The University has a network of 144 Study Centres throughout the State of Andhra Pradesh.

## PROGRAMMES OFFERED

1. **Bachelor of Arts (B.A) - 3 Years**
2. **Bachelor of Commerce (B.Com) - 3 Years**
3. **Bachelor of Science (B.Sc) - 3 Years**
4. **M.A. (History) - 2 Years**
5. **M.A. (Economics) - 2 Years**
6. **M.A. (Political Science) - 2 Years**
7. **M.A. (Public Administration) - 2 Years**
8. **M.Sc. (Mathematics) - 2 Years**
9. **Ph.D. in Development Studies***
10. **M.Phil. in Development Studies***
    **(* Offered in collaboration with CESS)**
11. **Bachelor Degree in Public Relations (BPR) - 1 Year**
12. **Bachelor Degree in Library & Information Science (BLISc) - 1 Year**
13. **Master's Degree in Library & Information (MLISc) - 1 Year**
14. **Master's Degree in Business Administration (MBA) - 3 Years**
15. **Certificate Programme in Food & Nutrition (CPFN) - 6 Months**
16. **Certificate in Computing (CIC) - 6 Months**
17. **P.G. Diploma in Marketing Management (PGDMM) - 1 Year**
18. **P.G. Diploma in Business Finance (PGDBF) - 1Year**
19. **P.G. Diploma in Environmental Studies (PGDES) - 1 Year**
20. **P.G. Diploma in Writing for Mass Media In Telugu (PGDWMM) - 1 Year**
21. **P.G. Diploma in Human Rights (PGDHR) - 1 Year**
22. **P.G. Diploma in Women Studies (PGDWS) - 1 Year**
23. **M.A. (English)•**
24. **M.Com•**
    **(• To be introduce during 2003-04)**

The University has carved a niche for itself in the field of open learning by :-

- Providing access to a large number of heterogeneous learners cutting across the differences in age, gender, location, and choice of courses.
- Innovatively designing the undergraduate curriculum as Foundation Courses, Core courses and Application-oriented courses.
- Creating a wide network of learner support systems.
- Reaching out to the unreached through multiple media including broadcast and telecast modes.
- Enhancing the interactivity of instruction through live phone-in and teleconferencing.
- Offering courses in three mediums of instruction-English, Telugu and Urdu.
- Giving hands-on training in laboratory practice for Science and Technology Courses.
- Widening access to Research, Post-graduate, P.G. Diploma, Undergraduate, Certificate and professional programs through the distance mode.

**Sd/- REGISTRAR I/c**

advt.No.125/Dr.BRAOU/PR/2003

**The University puts the Learner first.**

## కథ

జాతశ్రీ



# విధ్వంసం

***"నే...న్నడ్వ, గాడిద నెక్కుత." పొద్దుననంగ కాలాడిస్తే జంగిలి గొడ్లు అడవికి పొయ్యే వేళయినా ఊరు చేరనందుకు మారాము స్వరంతో అన్నాడు కొండాలు. వాడి వయసు పది దాటి రెండేళ్ళయినా పదికి రెండు తక్కువలా కన్పిస్తాడు. పిర్రలు పూరా బయట పడిన చినుగుల లుడుగు లాగులో వాడు దూరాన్నుంచి చూస్తే బొగ్గు రంగేసిన దిష్టిబొమ్మలా, దగ్గర నుంచి చూస్తే దరిద్రానికి దిష్టి తీసి పారేసిన పంగల కర్రలా అన్పిస్తాడు.***

తలపై తట్టెడు బరువుతో నడిచే దొమ్మరిపోశం–తన చంకనున్న పాము బుట్టను చంక మార్చుకుంటూ, కొడుక్కేసి దీనంగా చూసి, "కొండిగా, కుంటోడి కయ్యదాటినం గాదుర... .యింగేంది. గా ఎర్రసెలక ఎనకనే... అగ్గో, ఊరు. అన్నారు. గాడిద వీపు మీద బరువుకు తోడు వాడు కూడా ఎక్కితే, అది మర్లబడుద్దే తప్ప అడుగు ముందు కేయదనే ఆలోచనతోపాటు, కాదు.. కూడదంటే వాడు తన భుజం ఎక్కుతనంటాడేమోననే భయం కూడా అతనికి కాలే కడుపుతో నడకే భారంగా ఉన్నతనికి కొడుకు మారాము–చిరాకు కలిగిస్తుంది.

కొండాలు ఎండపొడకు చేతినడ్డం పెట్టుకొని, ఎర్రచెలక మీదుగా చూశాడు. వాడి కంటికి చెట్లు కనిపించాయి. "అదేనా ఊరు?" అన్నాడు.

"అదేరా..."

"ఊర్లె బువ్వ దొరుకుద్దా?"

దొరుకుద్దని సిన్నగంటవేందిరా... నువ్ మింగినంత దొరుకుద్ది. సల్లని తల్లులున్న ఊరుగాదురా... మా రాజుల పోతుగడ్డ." పోశం కొడుకులో ఉషారు నింపడం కోసం అన్నాడేగాని, అతని గుండె లోతుల్లో గుబులుగానే ఉంది.

చూస్తచూస్తనే నాలుగయిదు ఏళ్ళ నుంచి ఊళ్ళల్లో మంచీ మప్పితం కుంచించుకపోతున్నట్టు తెలుస్తానే ఉందతనికి. పాటగాళ్ళనీ, ఆటగాళ్ళనీ ఆదరించి, దయగల మారాజులనిపించుకొన్న వాళ్ళే మొహాలు చాటేసుక దాటి పోతున్నారు. పిల్చి మరీ ఇంటి ముంగిట దొమ్మరాట ఆడించిన దొరలే ఉండీ–లేడని చెప్పిస్తున్నారు. ఊరంతా తిరిగినా ఓ మనిషి బువ్వ జోలెలో పడటం లేదు. పంటలు పండక బతుకులు వెనుకటిలా లేని మాట నిజమైనా, ఉన్నదాంట్లోనే పేదోడికి పిడికెడు పెట్టే బుద్ధులుగల ఊళ్లిలా... ఎలా మారిపోయాయో, ఎందుకు మారిపోయాయో... అతని బుర్రకందడంలేదు.

కొండాలు తండ్రి కేసి గుడ్లురుముతూ చూసి, "మీయ్యవ్వ.... నీకు ఊర్లన్నీ పోతుగడ్డలే.. ఎక్కడ జూడు సల్లని తల్లులే... నిన్న సీపురంల, మొన్న లకారంల, అదే కూత కూసినవ్, తీరా జూస్తే.... నీయ్యక్క, ఇల్లిల్లు గోసపెట్టినా గుక్కెడు బువ్వ దొరకలె" అన్నాడు

"దొరక లేదంటే, మారాజుల ననొద్దురా... కాలవే కత్తిగట్టింది. సినుకుబడక బూదేవమ్మ బుగ్గయి పోతుండాది గదరా..... ఎవురేం జేస్తరు. లేకుంటెనా... సందమామ తల్లులు

గాదురా... పిల్సి, పీటేసి కడుపు నింపి నోళ్ళురా ... తాత ముత్తాతల్నుంచి ఈ విద్దెల మీదనే బతికినం గాదురా... బలవంతులు సుత గట్టి నోళ్లున్నరంటే... ఆ సీతమ్మ తల్లులు అర్సుకోబట్టే గద!" అన్నాడు పోశం.

వెనుకగా, కొంచెం దూరంలో తల్లితోపాటు నడిచే పోలి, తండ్రి మాటలకు వచ్చే నవ్వు నాపుకుంటూ, "అమ్మో.... అయ్య అసిద్దాలాట్టం సురువు జేసిండు" అంది నెమ్మదిగా

కర్రపోటుతో కుంటుతూ నడుస్తుంది గురవ్వ. నిన్న శ్రీపురంల-ఆటలో పిల్లి మొగ్గలేస్తుంటే కాలు పడతపడి వాపొచ్చింది. కోమటాయన దగ్గర చిటికెడు ఆముదం అడుక్కొచ్చి తోమింది. వాయిలాకు కాపడం పెట్టి, కట్టేసినా వాపు తగ్గలేదు. పైగా - ఆరు కోసులకు పైగా నడవడంతో తీపూ సురువయింది. అయినా ఓపికను కాళ్లకు కట్టుకొని నెమ్మదిగా నడుస్తుంది.

బిడ్డకేసి అదోలా, బాధగా చూసి, గురవ్వ, "అవ్ బిడ్డా. దొమ్మరోళ్లు దొమ్మరాటలు ఆట్టం మానేసి అసిద్దాలు ఆడే రోజుల్ల బడ్డం గాదూ!.... నా సిన్నతనాన దొమ్మరోడొస్తే - ఊర్లల్ల పోటీలు పడి ఎవురింటి ముంగిట వాళ్ళు ఆట బెట్టిచ్చేటోళ్ళుగాదూ... దొర మారాజులు సల్లగుండ, ఆటకో రెండు కుండల గింజలూ, పూటకు సరిపడా బువ్వా పెట్టేటోళ్ళు ఉన్న సాములయితే, పాతకోకలూ, మియ్యకి పంచెలూ దానం జేసేటోళ్ళు. అంతెంతుకు... నా మనువయిన కొత్తల, మీ తాత మిసాల్తో గుండు రాయెత్తితే పెద్దపటేల్ దొర ఐదు నూర్లు యినా మిచ్చిండు గాదూ.... బుజం మీద చెయ్యి సుత ఏసి," సెబాస్రా దొమ్మరెంకా..." అనే సరికి, మీ తాతకి కళ్ల నీళ్లు తిరిగి పటేల్ దొర కాళ్ల మీద బడ్డదు. పొయనయ్ బిడ్డా... ఆ రోజులిగరానట్టే... ఇయ్యాల్రేపూ ఆట జూసేటోడే కరువయిండు. యిగ కడుపెవుడు జూస్తడు?" అంటుంటే, వేడి నిట్టూర్పు ఆమె గుండెల్ని ఎగదన్నుతూ గొంతు దాటింది.



నీరసంతో ఆమె హం-కళా విహీనంగా ధ్వయమయిన బాగ్దాద్‌లా ఉంది.

పోలి అడుగుల్లోనూ ఉషారేం లేదు. మూడు రోజులుగా కడుపు నొప్పి. ప్రతి నెలా ఉండేదే. పెళ్లి జేస్తే కడుపునొప్పి పోతుందని ఒకరిద్దరమ్మలు చెప్పిన్నాట నుంచి - సుమారు ఏడాదిగా పోశం బిడ్డకు యీడైన పోరడి కోసం గాలమేసిందుగాని, కాస్త కంటికి నదురైన విద్దెలొచ్చిన వాడెవడూ తగల్లేదు. పోరగాళ్ళు విద్దెలు నేర్వటంలె. విద్దెలు అడుగంటిపోతున్నాయి. కుల విద్దెలొదిలేసి కూల్నాలికి ఎగబడుతున్రు. పందుల్ని సాకుతున్రు. దొంగతనాలు మరిగిన్రు. సంబారాలు మానేసి ఏదో వొకూరు నికరం జేసుకొంటున్నారు. ఆడోళ్లు 'ఎంకటసానులై' పోతున్రు... ఎందునా సుకంలేక ముసలీ ముతకా ఆకలికి నవిసీ, నవిసీ చచ్చేళ్లు చస్తున్రు... ఏవో అంతా మాయపొరగమ్మినట్టుంది. కొటిపాపలు కంటికి కనపట్టంలె పకీర్లూ, పడిగెలోళ్లూ, బాగోతులు, బాల సంతులూ, సాధనాలాడే మాష్టీనోళ్లు, ఒగ్గు కతలు జెప్పేటోళ్లు, పిచ్చకుంట్లోళ్లు, బుర్రకతలు జెప్పే శారదలు, బుడబుక్కలోళ్లు, దిమ్మరోళ్లు.... ఏవయిన్రో... ఆ ఆటలూ, పాటలూ ఎవయిన యో.... ఎనకటి యాపారమేదీ మిగలడంలేదు.

మనసు ఎక్కడెక్కడికో పరుగులు తీస్తుంటే పోశం బాధగా నిట్టూర్చుతూ, ముందు నడిపే గాడిదను చేతిలోని తంగెడు పుల్లతో అదిలించాడు. అయినా అది ఉలకలేదు. బెబెకా కాలాడించలేదు.

గాడిద వీపు మీ 'గాడిదబరువు'ంది. దొమ్మరాటకు అవసరమైన వెదురుగడలు, యినుప-తీగెలు, చువ్వలు, రింగులు, కడ్డీలు, గడ్డ పలుగు, సుత్తె, రోలు రాయి, డోలు వగైరా తాడుతో కదలకుండా కట్టి, పైగా నులకమంచం, మంచం మీద బొంతలో కట్టిన పెద్ద బట్టల మూటా, రెండు బస్తాల్లో చిల్లరమల్లర సామాన్లు.... మంచం కోడుకు తగిలించిన బోనులో నున్న ముంగిస ఎలక్కాయ కొరుక్కుతింటుంది. బట్టల మూట మీద కూచున్న కోతిపిల్ల మొహాన ఎండకాస్తూ 'ఎందుకీ బానిస బతుకన్నట్టు' స్మశానవైరాగ్యం వొలికిస్తుంది.

పోశం నాలుగు నెలల క్రిందటే నాలుగు నూర్లు పోసి ఆ గాడిదను చాకలి బీరాలు దగ్గర కొన్నాడు.

అంతకు ముందు అతనికి ఆవు పెయ్యి ఉండేది. సంచారంలో బరువులు మొయ్యడానికీ, ఎప్పుడైనా పిట్టకూర తినాలనిపించినప్పుడు దాని మాటున ఉచ్చులేసి పిట్టలు పట్టడానికి పనికొచ్చేది. చివరకా వేటలోనే పొలాల్లో తిరుగుతుంటే నీటి పింజరకాటేసి, పెద్ద పుండయింది. ఎన్ని పసర్లు పోసినా, జీడిపెట్టినా, ఆఖరికి కర్రువాత లేసినా పుండు రోజురోజుకూ రెచ్చిందే తప్ప మానుడు చూపలేదు. సులుకూ, పోటుతో అది గోగు పెడుతుంటే తన కంటికి కునుకే కరువయింది. చివరకు మనసుగ్గబట్టుకొని కటికోడికి తోలక తప్పలేదు. అతనిచ్చిన ఐదు నూర్లతో మరో ఆవుపెయ్యను కొనాలనుకొన్నా, కుదిరి చావలేదు. చివరకు - పిట్టల వేటకు లేకున్నా, బరువులు మొయ్యడానికయినా ఉంటుందని గాడిదను కొన్నాడు.

కుక్కలు మూడూ - రోడ్డుకు అడ్డదిడ్డంగా పరిగెడుతూ, అక్కడక్కడా వాసన చూస్తూ, వొకటికి పోస్తూ, అనుసరిస్తున్నాయి. వాటి మెడలకు సీలలు దించిన తోలు పట్టీలున్నాయి.

గతంలో పోశం ఆ కుక్కల్ని వెంటేసుకొని అడవికి కుందేళ్ళవేటకు పోయాడంటే, గుడిసె దగ్గర గురవ్వకారం నూరాల్సిందే. ముళ్ళపొదల్ని గాలించి, కుందేళ్ళను లేపి వాటి వెంటబడి నోట బట్టేంతవరకు ఆగేవి కావు. ఇప్పుడా రోజులు మరుగున పడ్డాయి.

'నీకే తిండి కరువు. ఈ కుక్కల్నెందుకురా సాకటం?' అని ఎవరైనా అంటే పోశానికి పౌరుషం ముంచుకొస్తుంది.

అయినా పౌరుషాన్ని ఉగ్గబట్టుకొని, "మా జాతిల కుక్కలే ఆస్తి మారాజా... మా జాతిల మనువు కోసం బోతే ఎన్ని కుక్కలున్నయో చూశాక గాని మనువాడరు. పిల్లోల్లయితే కుక్కల్నే సాకలేనోడివి పెళ్ళాన్నేం సాకుతవనీ... అదే పిల్లగాడోళ్లయితే - కుక్కలే లేనోడివి నువ్వేం యాటాడ్తవ్.... ఇంటి కొచ్చిన అల్లుడికి సియ్యల కూరేం బెడ్తవు? అని వెటకారం జేస్తరు" అంటూ చెప్పుకొస్తాడు.

పోశం గాడిదను ఊరి మొగదలలో ఉన్న బుగ్గలవాగు ఒడ్డున కానుగ చెట్టు నీడలోనిలిపాడు. కొండాలు బుర్రకాయలో నీళ్లు తాగి కూలబడ్డాడు. గాడిద వీపు మీదున్న కోతిపిల్ల చెంగున దూకి కొండాలు దగ్గరగా చేరింది.

పోలీ, ఆ వెనుక గురవ్వ నెమ్మదిగా చెట్టు నీడకు చేరారు. కాలు నొప్పి వున్నా, కూచోవాలనిపించినా కూచోకుండా గురవ్వ, "ఏందయ్యో.... ఈ దాపినవ్... కడుపు నకనకలాడ్తంది. ఊళ్లెకి బాయి నాలుగు పిల్లిమొగ్గలేసి బుక్కెడు బువ్వ అడుక్కుందాం పద" అంది.

పోశాలు మాట్లాడలేదు. ఎండ తీవ్రంగా ఉంది. బువ్వలేకున్నా గుక్కెడు నీళ్లు తాగి, చెట్టునీడన వొరగాలనిపించింది." ఏమేవ్, పొద్దు జూడు, నడినెత్తి నుంది. యిప్పుడడుక్కోటానికి బోతే పయిటేశగాడంటరు గాని, దొమ్మరోడనరు. అయినా యీ ఏళప్పుడు జెనం యిండ్లల్ల ఉంటరానె?" అన్నాడు.

"ఉండక... యాడబోతరేంది?"

"పొలాలెంట పోతరు గదనె."

"పొలాల... ఆరుకోసులు నడ్సినం. యాడనన్న పంట పొలం కంటబడ్డదా? మన్సికనబడ్డడా?... పిలగాడి ముడ్డి కడగటానికి యాడనన్న సెంబెడు నీళ్లొలికినయా?" అంది గురవ్వ.

"ఊ... సర్లే. ఊళ్లెకి పోదాంలే తియ్" అంటూ గాడిదను ఊరికేసి మళ్ళించాడు పోశం.

"ఆవ్, ఎన్నాళ్లీ ఊర్రాక?"

ఐదారు పంటలు గడ్సినయ్ గాదె. అప్పుడెప్పుడో గోదారి వరదల ముందొచ్చినం. ఉప్పెనొచ్చింది గాదూ?..." అన్నాడు పోశం.

గాడిద ననుసరించి, అందరూ... కోతిపిల్లా, కుక్కలతో సహా ఊరి మధ్యలో నున్న బడి పక్కన చింతచెట్టు నీడకు చేరారు.

గురవ్వ చుట్టూ చూసింది. ఇళ్ళలో జనం ఉన్నారు. ఆమెకు కాస్త గుండె ధైర్యం వచ్చింది. బడి యింకా వదల్లేదు. ఏదో పద్యం గొంతుచించుక వల్లిస్తున్నారు-బడి పిల్లలు.

పోలి తండ్రికి ఆసరాగా గాడిద మీది వస్తువులన్నీ తీసి ఓ పక్కగా ఉంచింది.

ఆట ఆడే వోపిక ఎవరిలోనూ లేదు. నిన్నంతా కటిక ఉపాసం వల్ల అందరి మోహాలూ దీనంగా ఉన్నాయి. అయినా ఆకలి తీరాలంటే ఆడక తప్పదన్నట్టుగా ఎవరి పనులు వారందుకొన్నారు.



పోశం వెదురుగడలు నిలబెట్టి తీగలు కడుతున్నాడు. కొండాలు కోతిపిల్లకి లాగులడాయి తొడిగి సింగారిస్తున్నాడు. పోలి తను ఆడాల్సిన ఆటలకు కావలసినవి తీసి ప్రక్కగా పెట్టుకొంటుంది.

గురవ్వ డోలందుకొని, ఓ ప్రక్కగా కూచొని వాయించసాగింది. రండి, బాబూ... రండి... దొమ్మరాట, దొరలు మెచ్చిన ఆట... రండి బాబూ... దాతలు, దొరలు, దొరసాన్లు, మారాజులు, అందరూ రండి బాబూ, రండి.... కోతి మొగ్గలు పాముతో ముంగీస కుస్తీ.... రండి... రండి బాబూ... రండి దొరలు మెచ్చాల, యీ కడుపు జూసి దానం జెయ్యాలి." అంటూ ఫెడేల్న కడుపు మీద కొట్టుకుంది గురవ్వ.

కొండాలు పాటెత్తుకున్నాడు. పోలి లంగా బిగించి గోచి పెట్టుకుంది. పైనున్న పావడా లాటి గుడ్డ తీసి నడుం కట్టేసుకొని, ఆట ఆడేందుకు సిద్ధంగా ఉంది.

కాని జనం లేరు. అరగంటపైగా గురవ్వ డోలు మోతలో ఊరంతా మార్మోగుతున్నా జనం రాలేదు. ఎక్కడ పనులక్కడ వదిలేసి, చంటి పిల్లల్ని చంకేవేసుకొని వచ్చిన జనమే - కంటికి కనిపించడం లేదు. ఐదారుగురు పెద్దోళ్లు, ఓ పదికి పైగా పిల్లలూ వచ్చి నిలుచున్నారు.

గురవ్వకు కడుపులో ఎలకలు పరిగెడుతున్నాయి. ఆ చికాకుతో డోలు పగిలేలా వాయిస్తుంది. గొంతు గీరబోయేలా అరుస్తూంది. చుట్టు ప్రక్కల జనం కోసం... జనమొస్తే ఆట జూస్తరు. ఆట జూస్తే జాలిపడతరు. జాలి పడితే బువ్వేస్తరు.

కాని ఏరీ జనం?...

పోశం గురవ్వ మొహం కేసి దీనంగా చూశాడు. గట్టిగా ఈలవేశాడు. ఒకటీ, రెండూ... ఎన్ని ఈల లేసినా, పాటలు పాడినా, జనం గుమికూడలేదు.

కొండాలుకు వొళ్లు మండిపోతుంది. కోపంగా ఉంది. కోపంలో ఏడుపు కూడా వస్తూంది.

బడి వదిలారు. పిల్లలు గుంపులు గుంపులుగా వస్తుంటే పోశం దిగ్గున లేచి, గట్టిగా ఈల వేసి పాటందుకొన్నాడు.

గురవ్వ ఓపిక లేకున్నా డోలు వాయించసాగింది. కొండాలు పిల్లిమొగ్గలతో పిల్లల్ని ఆకట్టుకునేందుకు ప్రయత్నించాడు.

"రండి బాబూ, రండి, విద్దెలు చూపిస్తాం.... కోతి పిల్ల నాడిస్తాం. పాముల్ని చూపిస్తాం... రండి బాబూ, రండి."

పరుగు పరుగున పిల్లలొచ్చి చప్పట్లు కొడతారనుకొన్న పోశం-ఆశల్ని నీరుగారుస్తూ - పిల్లలు యిళ్లకేసి వెళ్లిపోతుంటే గురవ్వకు ఏడుపొచ్చింది. తమ కేసి చూసిన పిల్లోడే లేనందుకు పోలి తెల్లబోతూ తల్లికేసి గుర్రుగా చూసింది.

"నిన్న, మొన్న లానే యియ్యాల గూడ..." ఏడుపూ, వెక్కిరింతా కలగలిసిన స్వరంతో అన్నాడు కొండాలు.

పోలికి అయోమయంగా ఉంది. ఆమె గుండెల్లో పోటెత్తుతున్న సముద్రాలున్నాయి గాని, గొంతు పెగిల్చి ఏమీ అనలేకపోతుంది. దీనంగా చూస్తుంది.

గురవ్వ బాధగా భర్తకేసి చూసి, "ఎందుకయ్యా... యీ బువ్వ దొరకని బాడుకావు పస్లు. ఆట జూసేటోడే కరువైెందు. యిగ కడుపు జూస్తరా..." అంది.

పోశానికి చిరాగ్గా వుంది. మనసు గజిబిజిగా ఉంది. "జన వేవయిన్రు... కళకళలాడి నూరు... కష్టాల గడ్డ తీర్న మారిందేంది? అంతా మాయగుంది." అనుకున్నాడు పోశం.

"ఏవంటవు... ఆట సురువు జేద్దావా?.." అంది గురవ్వ.

"నువ్ తాలసె." చిరాగ్గా గురవ్వని కసిరి, దూరంగా నిలుచున్న పెద్ద మనిషికి దండం పెడుతూ, దగ్గరగా వచ్చి, "ఏంది పెద్దయ్యా.... జనాలేరి, రాటం లేదేం... పిలగాళ్లు సుత నిల్వకుండా పోబట్టే. యిగ మేం బతికేదెట్ల?" అన్నాడు పోశం.

"ఇక బతుకులేందిరా... బాడుకావు బతుకులు తప్ప బలాదూర్ బతుకు బతికే రోజులు పొయినయ్, అంతా మాయదారి కాలవయింది. ఇక మీ ఆట లెవడు జూస్తడు. పంటల్లేక తిండికి కరువొచ్చిందేవోగాని, టి.వి.లకి గిరాకి తగ్గలె. ఈ టి.వి.ల మాయల్లో జనానికి పని సోయి కూడా ఉండటంలే. చదువుకునే పోరగాళ్ళు సుత అంతే! టి.వి. ఉంటే చాలు, తిండి లేకున్నా గడిచి పోతుందీ రోజుల్లో పక్కింటోళ్లని పలకరించే తీరుబడే ఉండటంలే..." నవ్వుతూ అన్నాడా పెద్ద మనిషి. ఆ నవ్వు వెనకాల గుండెలు పిండే బాధా వుంది.

పోశం తెల్లబోయాడు. నోటమాట పడిపోయినట్లుగా చూడసాగాడు. కొండాలు, ఒక్క ఉదుటున లేచాడు. వాని మొహం కందగడ్డలా ఉంది. నిలబెట్టిన గడల్ని తన్ని పడేస్తూ, "ఛూ.... నీ తల్లి, దొమ్మ రాటంట... దొమ్మరాటలు. బతకటానికి దొమ్మరాటలే ఆడాలాన... అక్కో ఈ ఆటలాడే బదులు అడ్విల పళ్లేరు గాయలేరుకున్నా మా రాజుల బతుకుతం. పద," అంటూ పోలీ చెయ్యి పట్టుకొని కదిలాడు కొండాలు.

V

## డైరీ

# యుద్ధవ్యతిరేక కవితా గోష్ఠులు, ఆవిష్కరణలు... సాహిత్య సభలు

ఇరాక్‌పై అత్యంత అమానుషమైన దురాక్రమణ సాగించిన అమెరికా సామ్రాజ్య వాదంపై తెలుగు సాహిత్యకారులు తీవ్ర నిరసన ప్రకటించారు. ఆగ్రహావేశాలనే రగిలించడం యాదృచ్ఛికం కాదు. యుద్ధం మొదలవక ముందు నుంచి సాహిత్య కారులు నిరసన గళం వినిపిస్తూనే వున్నారు. వైట్‌హౌస్‌కు పెద్ద ప్రదర్శన జరిపి కవితాత్మక నిరసన ప్రకటించడం ఈ క్రమంలో ఒక ముఖ్య ఘట్టం. వారిచ్చిన పిలుపుపైనే మార్చి 5న ప్రపంచ వ్యాపితంగా యుద్ధ వ్యతిరేక కవితాది నోత్సవంగా పాటించారు.

F మార్చి 5న విజయవాడ ఠాగూరు స్మారక గ్రంధాలయంలో జనసాహితీ సాంస్కృతిక సమాఖ్య వారు గోష్టి జరిపారు. కొత్తపల్లి రవిబాబు అద్యక్షత వహించగా కవి స్మైల్ ప్రసంగించారు. ఆ రోజున పలువురు యువకవులతో పాటు పాఠశాల బాలబాలికలు కూడా కవితలు చదవడం విశేషం.

F హైదరాబాదులో యుద్ధ వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో మార్చి 21న టాంక్‌బండ్‌పై మగ్దుం విగ్రహం దగ్గర ప్రతిజ్ఞ స్వీకరించారు. ఆ తర్వాత భగత్ సింగ్ బలిదానపు రోజైన మార్చి 23న సుందరయ్య విజ్ఞాన కేంద్రం దగ్గర కవితా గోష్టి, ప్రసంగాలు సాగాయి. కె. శివారెడ్డి అద్యక్షత వహించగా వివిధ సంఘాల నాయకులు ప్రసంగిస్తూ సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

F సాహితీ స్రవంతి పిలుపు మేరకు ఏప్రిల్ 2 ఉగాది రోజున హైదరాబాదు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉగాది శాంతి వాణి కార్యక్రమం జయప్రదంగా జరిగింది. సీఫెల్ ప్రొఫెసర్ సోనియా గుప్తా ప్రారంభోపన్యాసం చేస్తూ ప్రపంచానికి ప్రమాదంగా తయారైన అమెరికా సామ్రాజ్య వాద అమానుషత్వాన్ని ఎండగట్టారు. ఇరాక్ ప్రజలకు ముఖ్యంగా ఎంతో పురోగమించిన అక్కడి మహిళలకు ఈ దురాక్రమణవల్ల ఏర్పడ్డ భయానక పరిస్థితిని విశదీకరించి సభికులను ఆకట్టుకున్నారు. చిలీకవి ప్లాబో నెరూడా స్పానిష్ భాషలో ఫాసిజానికి వ్యతిరేకంగా రాసిన కవిత అనువాదాన్ని ఆమె చదివి వినిపించారు. సభకు అద్యక్షత వహించిన ప్రస్థానం సంపాదకులు తెలకపల్లి రవి తొలి కవితతో గోష్టిని ప్రారంభించారు. సీనియర్ కవులు జ్వాలాముఖి, నగ్నముని ప్రసంగించారు. జిలుకర శ్రీనివాస్, కంభాల పల్లి కృష్ణ, తూములూరి వెంకటేశ్వరరావు కవితాగోష్టిని నిర్వహించారు. దాదాపు 70 మంది సీనియర్ కవులు, ఔత్సాహికులు పాల్గొని తమ కవితలతో సభను అలరించారు.

F ఉగాది శాంతివాణి సందర్భంగా రచయిత వేముల ఎల్లయ్య అద్యక్షతన ఏప్రిల్ 6న సాహితీ స్రవంతి ఆధ్వర్వంలో కవితాగోష్టి జరిగింది. ప్రజాశక్తి న్యూస్ ఎడిటర్ ఎన్. వినయకుమార్ హాజరై సందేశమిచ్చారు. అనంతరం కవితా పఠనం కొనసాగింది. పలువురు యువకవులు ఉత్సాహంగా తమ కవితలు వినిపించారు. 50 మందికి పైగా కవులతో సహా 170 మంది పాల్గొన్నారు.



**నల్గొండలో ప్రసంగిస్తున్న వినయకుమార్**

కళాకారులు గీతాలు ఆలపించారు.

F సాహితీ స్రవంతి ఆధ్వర్యాన అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో ఏప్రిల్ 17న కవి సమ్మేళనం జరిగింది. డా. మోక్ష ప్రసూన అధ్యక్షత వహించగా పలువులు కవితలు వినిపించారు. కవయిత్రి కల్పనా రెంటాల వాటిపై సమీక్ష చేశారు. కన్వీనర్ కుమార స్వామి స్వాగతం పలకగా, రంగారెడ్డి వందన సమర్పణ చేశారు.

F కర్నూలులో ఏప్రిల్ 6న కవితాగోష్టి జరిగింది. యాభై మందికి పైగా పాల్గొనగా 10 మంది కవితలు వినిపించారు. మహబూబ్‌నగర్‌లో ఏప్రిల్ 10న కవితాగోష్టి జరిగింది. కరీంనగర్‌లోనూ కవితాగోష్టి జయప్రదంగా జరిగింది. కడప పట్టణంలో ఏప్రిల్ 10 న సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జరిగిన కవితాగోష్టిలో పలువురు కవులు పాల్గొని సామ్రాజ్య వాదంపై నిప్పులు చెరుగుతూ కవితలు వినిపించడం అందరినీ ఉత్సాహ పరచింది.

F జిలుకర శ్రీనివాస్ కవితా సంపుటి "కలల గొలుసు" ఏప్రిల్ 27న వరంగల్‌లో కాత్యాయని విద్మహే ఆవిష్కరించారు. విద్యుత్ ఉద్యమ అమరులకు అంకితమిచ్చిన ఈ పుస్తకాన్ని బి.వి. రాఘవులు స్వీకరించారు. వరంగల్ సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు డా. పి. రాములు అధ్యక్షత వహించగా, సీతారాం, తెలకపల్లి రవి పరిచయం చేశారు.

F ఏప్రిల్11,12 తేదీలలో హైదరాబాదులో అభ్యుదయ రచయిత సంఘం అఖిలభారత మహాసభలు జరిగాయి. ఈ సభలు సామ్రాజ్యవాద వ్యతిరేకతను, మతోన్మాదంపై నిరసనను ప్రతిధ్వనించాయి. మొదటిరోజు సాయంత్రం జరిగిన ప్రారంభ సభలో వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు వరవరరావు, తెలకపల్లిరవి, గద్దర్, నిర్మలానంద తదితరులు పాల్గొని ఐక్యకృషి ఆవశ్యకతను నొక్కి చెప్పారు. సభను ప్రారంభించిన హిందీ రచయిత కమలాసింగ్ కాషాయ కూటమి మతోన్మాద విధానాలను నిశితంగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక సలహా దారు డాక్టర్ సి.నారాయణ రెడ్డి సామ్రాజ్య వాదాన్ని విమర్శించగా అద్యక్షత వహించిన నామవరసింగ్ తర్వాత మాట్లాడుతూ మతోన్మాదాన్ని కూడా

ప్రతిఘటించాల్సిన అవసరాన్ని విశదీకరించారు. ఎస్వీసత్యనారాయణ సభలకు సంధాన కర్తగా వ్యవహరించారు. ఆ మరుసటి రోజున నగర కేంద్ర గ్రంధాలయంలో అరసం నిర్వహించిన కవితాగోష్ఠిలోనూ సామ్రాజ్య వాద వ్యతిరేకతే ప్రధానాంశమైంది.

F విజయవాడ ఫిబ్రవరి 23న ప్రస్థానం మలిసంచికను సీనియర్ రచయిత భమిడిపాటి జగన్నాధరావు ఆవిష్కరించారు. తెలకపల్లి రవి అధ్యక్షత వహించగా అద్దేపల్లి రామమోహన్‌రావు ప్రపంచీకరణ-సాహిత్యంపై ప్రధానోపన్యాసం చేశారు. కె. ఆనందాచారి సంచికను పరిచయం చేయగా కె. లక్ష్మయ్య వందన సమర్పణ చేశారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యాన జరిగిన ఈ సభకు ఎం.వి. ఆంజనేయులు స్వాగతం పలికారు.

F సాహితీ స్రవంతి ఆధ్వర్యాన తిరుపతిలో ఏప్రిల్ 16న కందుకూరి వీరేశలింగం వర్ధంతి సభ జరిగింది. సాకం నాగరాజు అధ్యక్షత వహించగా తెలకపల్లి రవి ప్రధాన ప్రసంగం చేశారు.

F ప్రజాశక్తి బుక్‌హౌస్‌కు కరీంనగర్‌లో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆ సందర్భంలో సాహితీ వేత్తలను, పాఠకులను పుస్తక ప్రదర్శనలో అనుసంధించడానికి ప్రదర్శనా ప్రాంగణంలో సమావేశాన్ని సాహితీ స్రవంతి నిర్వహించింది. ఫిబ్రవరి 16న నాడు జరిగిన ఈ సమావేశానికి బహుభాషావేత్త డా॥ నలిమెల భాస్కర్ ముఖ్య అతిథిగా పుస్తక పఠనం యొక్క ఆవశ్యకతపై కవితాత్మకంగా ప్రముఖ కవి డా॥ జి. లక్ష్మణరావు నేటి కవిత్వము-తీరుతెన్నులు పై ప్రసంగించారు. సభాధ్యక్షులుగా వేణుశ్రీగారు వ్యవహరించారు.

F కరీంనగర్‌కు చెందిన సాహితీ వ్యవసాయ డా॥ జి. లక్ష్మణరావుగారి "ముగ్గ" పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని సమైక్య సాహితీ సంస్థ తోడ్పాటులో సాహితీ స్రవంతి దిగ్విజయంగా నిర్వహించింది. మార్చి 19న జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ విమర్శకులు డా॥కోవెల సంపత్కుమారాచార్యులు పుస్తకావిష్కరణ చేశారు. డా॥ నలిమెల భాస్కర్ అధ్యక్షత వహించారు. ప్రముఖ కవులు దర్భశయనం శ్రీనివాసాచార్య, నందిని సిద్ధారెడ్డి పుస్తక సమీక్ష చేశారు. కరీంనగర్‌లోని సాహితీ ప్రముఖులు వారాల ఆనంద్, డా॥ డి. నరహరి ఆచారి, వేణుశ్రీ తదితరులు అభినందనలు తెలియజేశారు. బి.వి.ఎన్.స్వామి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. అశోక్, రమణ తదితరుల ప్రముఖుల తోడ్పాటుతో సాహితీ స్రవంతి కార్యక్రమాలు కొనసాగుతున్నవి.

F ఒరిస్సా రాష్ట్రం రాయగడ్‌లో జిల్లా తెలుగు సమాఖ్య ఉగాది కార్యక్రమం నిర్వహించింది. సాహితీ సాంస్కృతిక సంస్థ "స్పందన" ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో పశ్చిమబెంగాల్ ఖరాగ్‌పూర్‌కు చెందిన మాధవి సనరా హైకుల సంపుటి "హైకుదీవి"ని జిల్లా కలెక్టర్ డా॥ ప్రమోద్ డామీర్ మహర్షి ఆవిష్కరించి రచయితను సన్మానించారు. స్పందన అధ్యక్షులు కె. ఆనందరావు డామిందన్ అధ్యక్షత వహించార. మాధవిసనరా మినీ కవితపై మాట్లాడారు.

F ఏప్రిల్ 1న ఉగాది సందర్భంగా మెదక్ జిల్లా సంగారెడ్డిలోని సాహితీ జూనియర్ కళాశాలలో ఇరాక్‌పై అమెరికా దాడిని వ్యతిరేకిస్తూ కవి సమ్మేళనం జరిగింది. 13 మంది పాల్గొన్నారు. త్రివిక్రమరావును కన్వీనర్‌గా వ్యవహరించారు.

F సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఏప్రిల్ నెల 6వ తేదీన ఇరాక్‌పై అమెరికా దాడిని ఖండిస్తూ కర్నూలు కోల్స్ కాలేజీలో కవి సమ్మేళం జరిగింది. 50 మంది హాజరైనారు. ఇందులో 10 మంది తమ కవితలను చదివి వినిపించారు. ప్రత్యేక ఆకర్షణీయంగా ఉర్దూ, లంబాడీ భాషల్లో కవితలను చదివి శ్రోతలను ఉర్రూతలూగించారు.

F ఖమ్మం జిల్లా భద్రాచలం గోదా వరి బ్రిడ్జికి ఆవల నున్న సారపాక గ్రామంలో ఏప్రిల్ 11వ తేదీన శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సాహితీ స్రవంతి సారపాక శాఖ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. సాహితీ స్రవంతి డివిజన్ సలహాదారులు ఎన్.సి.హెచ్. చక్రవర్తి అధ్యక్షత వహించగా, డివిజన్ స్రవంతి అధ్యక్షులు మాల్యశ్రీ సమన్వయ కర్తగా వ్యవహరించగా, ప్రగతి విద్యా సంస్థల అధిపతి ఎస్. బ్రహ్మారెడ్డి, భద్రాచలం లయన్స్‌క్లబ్ అధ్యక్షులు ఎం. బాలనర్సారెడ్డి గౌరవ అతిధులుగా విచ్చేశారు. పురజనులు, సాహిత్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్న ఈ సభకు సారపాక సాహితీ స్రవంతి బాధ్యులు బసువుల భానుచంద్ర స్వాగతం పలుకగా, సీరాల అప్పారావు వందన సమర్పణగా వించారు. భద్రాచలం శ్రీ వాణీ జూనియర్ అండ్ డిగ్రీ కాలేజీ యాజమాన్యం వారు కవులకు జ్ఞాపికలు బహూకరించారు. భద్రాచలం సిటీ కేబుల్ వారు ఈ కార్యక్రమాన్ని అదే రోజ రాత్రి ప్రసారం చేసి ప్రాముఖ్యత కల్పించారు.



**వైట్ హౌస్ ముందు కవులు**

యుద్ధ వ్యతిరేక కవితా వేదిక ఆధ్వర్యంలో ప్రపంచమంతటా కవులు నిరసన తెలిపారు. అమెరికాలో 17 వేల కవితలు సమర్పించారు. కెనడాలో, ఆస్ట్రేలియాలో, ఇతర చోట్ల కూడా ఇలాటి కార్యక్రమాలు జరిగాయి. "అనధికార శాసనకర్తలు"గా పిలవబడే కవులు అధికార శాసనకర్తలైన ఎంపిలకు తమ కవితలు అందజేశారు. వారు వాటిని పార్లమెంటుకు సమర్పిస్తామని హామీ ఇచ్చారు.

క్యూబా రాజధాని హవానాలో దేశాధ్యక్షుడు ఫైడెల్ కాస్ట్రో అధ్యక్షతన క్యూబా కవులు, కళాకారుల సమ్మేళనం జరిగింది. రెండు రోజుల సమావేశం అనంతరం సంఘం ఒక ప్రకటన చేస్తూ నేటి పరిస్థితి 1930లలో నాజీల ఫాసిజం ముంచుకొచ్చిన నాటి పరిస్థితిలా వుందని పేర్కొంది. ఇరాక్‌పై దురాక్రమణను ఖండించింది.



**కెనడాలో ఎంపిలకు కవితల సమర్పణ**